సండే వైభవ్ - గత జ్ఞాపకాలకు నిలువుటద్దం

ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

విజయవాడ

fb.com/vaartha Digital

Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

1-4-2025 మంగళవారం సంపుటి: 31 సంచిక: 59 పేజీలు: 12 వెల: 6.50

మూడోసారి కూడా 'కుర్చీ' నాదే: ట్రంప్

30 లక్షల మంది అఫ్ఘాన్‌లపై పాక్ బహిష్కరణ వేటు

9లో


# వడివడిగా 'పోలవరం'

## తొమ్మిది నెలల్లోనే 6.11 శాతం పనులు పూర్తి

### అంతకు ముందు ఐదేళ్లలో సాగిన పనులు 11.58 శాతమే

### 2026 డిసెంబర్‌లోగా నిర్వాశితులకు పునరావాసం

### ప్రాజెక్టు అధికారులతో సమీక్షలో సిఎం చంద్రబాబు



**విజయవాడ,మార్చి31,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపికి జీవనాడి పోలవరం ప్రాజెక్టును డిసెంబర్ 2027 నాటికి ఎట్టి పరిస్థితుల్లోను పూర్తి చేసి తీరుతామని సిఎం చంద్రబాబు అన్నారు. దానికంటే ముందే ప్రాజెక్టుకోసం సర్వం త్యాగం చేసిన నిర్వాసితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. 2026 నాటికి పునరావాసం పూర్తి చేయాలని సంకల్పంతో ముందుకెళ్తున్నామని వెల్లడించారు. పోలవరం ప్రాజెక్టు నుంచి నీళ్లు వదలకముందే నిర్వాసితులందరికీ పునరావాసం పూర్తి చేస్తామని తెలిపారు. పోలవరం అంశంపై ఇరిగేషన్ ఉన్నతాధికారులతో ఆయన వర్చువల్‌గా మాట్లాడారు. 2027 డిసెంబర్ నాటికి ప్రాజెక్టును పూర్తి చేసి, 2026 డిసెంబర్‌కే పునరావాసం కల్పించే అంశంపై దృష్టి పెట్టాలని సీఎం అధికారులను ఆదేశించారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం కూటమి ప్రభుత్వం వచ్చాక పరుగులుపెడుతోంది. సవాళ్లను దాటుకొని ముందడుగు వేస్తోంది. 9నెలల కాలంలోనే ప్రాజెక్టు మొత్తం మీద 6.11 శాతం పనులు జరిగాయి. జగన్ హయాం ఐదేళ్లలో మాత్రం 11.58 శాతం పనులు మాత్రమే చేశారు.

కూటమి ప్రభుత్వంలో 9 నెలల్లోనే అందులో సగంపనులు పూర్తి చేసింది. ప్రధాన డ్యాంలో 3.80 శాతం భూసేకరణ, పునరావాసానికి సంబంధించి 2.56 శాతం మేర పురోగతి కనిప్స్తోంది. కూటమిప్రభుత్వవచ్చాక పోలవరం ప్రాజెక్టు సమస్యలకు పరిష్కారాలు దొరుకుతున్నాయి. కేంద్ర జల్‌శక్తి, కేంద్ర జలసంఘం కలిపి విదేశీ నిపుణుల కమిటీని నియమించగా, దేశ, విదేశాలకు చెందిన నిపుణులు వచ్చి ప్రాజెక్టును సందర్శించారు. మేధోమథనం చేసి, ఎలా ముందుకు వెళ్లాలన్నఅంశాలను కొలిక్కితీసుకొచ్చారు. ఈ క్రమంలో కొత్తగా డయాఫ్రం వాల్ నిర్మాణం ప్రారంభమైంది. ఈ ఏడాది జనవరిలో డీ వాల్ నిర్మాణం ప్రారంభించారు. మొత్తం 13 వందల 96 మీటర్లమేర దీన్ని నిర్మించాల్సి ఉంది. ఇంత >>2

## రెండు రోజులు ఉష్ణోగ్రతలు తగ్గుదల!



**విజయవాడ,మార్చి31.ప్రభాతవార్తప్రతినిధి:** వేసవి ఎండలతో ఇబ్బంది పడుతున్న ఎపి ప్రజలకు మంగళ, బుధవారాల్లో కొంత ఊరట కలగనుంది. మంగళ, బుధవారాల్లో ఉష్ణోగ్రతలు తగ్గి, చెదురుమదురు వర్షాలు కురిసే అవకాశం ఉంది. భారత వాతావరణ శాఖ తెలిపింది. రానున్న రెండు రోజులు తక్కువ ఉష్ణోగ్రతలు నమోదు కావడంతో పాటు ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం కూడా ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు భారత వాతావరణశాఖ తెలిపిన సమాచారాన్ని అనుసరించి. దక్షిణ ఛత్తీస్‌గఢ్ నుండి దక్షిణ తమిళ నాడు వరకు ఉన్న ద్రోణి సోమవారం దక్షిణ ఛత్తీస్‌గఢ్ నుండి మధ్య మహారాష్ట్ర, అంతర్గత విదర్భ మీదుగా మరట్వాడ ప్రాంతంపై నున్న ఉపరితల ఆవర్తనం వరకు సగటు సముద్ర మట్టానికి 0.9 కి.మీ ఎత్తులో విస్తరించి కొనసాగుతోంది. ఉత్తర దక్షిణ ద్రోణి మరట్వాడ ప్రాంతముపై నున్న ఉపరితల ఆవర్తనంనుండి ఉత్తర తమిళనాడు వరకు సగటు సముద్ర మట్టానికి 0.9 నుండి 1.5 కి.మీ ఎత్తులో విస్తరించిఉన్నది. ఆగ్నేయ బంగాళా ఖాతంలో నున్న ఉపరితల ఆవర్తనం ఈరోజు నైరుతి బంగాళాఖాతంలో సగటు సముద్ర మట్టానికి 3.1 కి.మీ ఎత్తులో విస్తరించి ఉన్నది నిన్నటి దక్షిణ తమిళనాడు పరిసరాల్లో ఉన్న ఈరోజు తక్కువగా గుర్తించబడినది.

ఈ కారణంగా రాష్ట్రంలో రాగల మూడు రోజుల వరకు వాతావరణ సూచనలు ఉత్తర కోస్తా ఆంధ్రప్రదేశ్. సమీపంలోని యానాంలో ఈరోజు సోమవారం తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు ఉరుములతో కూడిన జల్లులు పడ్డాయి. ఒకటి లేదా రెండు చోట్ల ఇదే పరిస్థితి ఏర్పడింది. రాత్రికి ఉరుములతో కూడిన మెరుపులు బలమైన ఈదురు గాలులు గంటకు 30- 40 కి.మీ. వేగంతో వీచే అవకాశం ఉంది. ఈ రోజు నిన్నటితో మంగళవారం తేలికపాటి నుండి ఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో >>2

## కాకాణి అరెస్టుకు అంతా సిద్ధం

### వైఎస్సార్సీ శ్రేణుల్లో ఉత్కంఠ



**పొదలకూరు (నెల్లూరు), మార్చి 31, ప్రభాతవార్త :** నెల్లూరు జిల్లా వైఎస్సార్సీ అధ్యక్షుడు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డిని ఎట్టకేలకు అరెస్టు చేసేందుకు రంగం సిద్ధమైనట్టు విశ్వసనీయంగా అందుతున్న సమచారం. గత వారం రోజులనుంచి కాకాణి అరెస్టుకు పుకార్లు, షికార్లు చేశాయి. ఈ నేపథ్యంలో వైసిపి శ్రేణులు కాకాణి నివాసం వద్దకు భారీ ఎత్తున చేరుకుని కాకాణి నివాసం చుట్టూ మొహరించారు. విషయం పసిగట్టిన కాకాణి ముందస్తు బెయిల్ కోసం కోర్టును ఆశ్రయించారు. బెయిల్ విచారణ వాయిదా పడడంతో ఈ సమయంలో కాకాణి అరెస్టుచేయాలని పోలీసు యంత్రాంగం యుద్ధ ప్రాతిపదికన రంగం సిద్ధం చేసింది. గత రెండు రోజుల క్రితం కాకాణి గోవర్ధన్ రెడ్డి హైదరాబాద్‌కు తన కుటుంబ సభ్యులను కలిసేందుకు వెళ్లి ఉగాది పర్వదినాన్ని ఆయన నివాసంలో చేసుకుంటూ అందుకు సంబంధించిన ఫోటోలు, వీడియోలు >>2

# వైజాగ్ 'ఉక్కు' బలోపేతం


### కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమగ్ర కార్యాచరణ

### సిఎం చంద్రబాబుతో చర్చలు జరిపిన కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ

### ఎస్‌పిఎఫ్‌తో స్టీల్ ప్లాంట్‌కు ప్రత్యేక భద్రత

**విజయవాడ, మార్చి 31.ప్రభాతవార్తప్రతినిధి:** వైజాగ్ స్టీల్ ప్లాంట్ బలోపేతానికి కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు సమగ్ర కార్యాచరణ రూపొందిస్తున్నాయి. ఈ మేరకు భారత ప్రభుత్వ ఉక్కు మంత్రిత్వ శాఖ ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి చంద్రబాబుతో సోమవారం ఉండవల్లిలోని ముఖ్యమంత్రి నివాసంలో చర్చలు జరిపింది. కేంద్రంలోని ఎన్డీఎ ప్రభుత్వం వైజాగ్ స్టీల్ ప్లాంట్ బలోపేతానికి ప్యాకేజీని మంజూరు చేసిన తర్వాత తదనంతర పరిణామాలపైనా, తీసుకోవాల్సిన చర్యలపైనా ప్రధానంగా చర్చజరిగింది. సమావేశంలో పాల్గొన్న కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, రాష్ట్ర ప్రత్యేక రక్షణదళం (ఎస్పీఎఫ్)తో ప్లాంట్‌కు భద్రత కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం ముందుకొచ్చినందుకు ఆయన ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. మరోవైపు స్టీల్ ప్లాంట్ పురోగతిని క్రమంతప్పకుండా సమీక్షించడం, ప్రస్తుతం పనిచేస్తున్న 2 బ్లాస్ట్ ఫర్నేసులతో పాటు, 3వ ఫర్నేస్‌ను కూడా తిరిగి ప్రారంభించడం వంటి అంశాలను ప్రతినిధి బృందంతో ముఖ్యమంత్రి చర్చించారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్‌తో తమ రాష్ట్రానికి భావోద్వేగ అనుబంధం ఉందని, దీనిని పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి అన్నారు. స్టీల్ ప్లాంట్ బలోపేతం చేసేందుకు తమ అభ్యర్థనను పరిగణనలోకి తీసుకుని, ఆర్థిక సాయం ప్రకటించినందుకు ప్రధాని నరేంద్రమోడీకి, కేంద్రానికి ముఖ్యమంత్రి ధన్యవాదాలు తెలిపారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్ పునరుద్ధరణకు కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు రెండూ సమన్వయంతో కలిసి పనిచేయాలని, ఉక్కు కర్మాగారానికి తిరిగి పూర్వ వైభవం తీసుకురావాలని చెప్పారు.

ఇందుకు అవసరమైన సాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తూనే ఉంటుందని హామీ ఇచ్చారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్ నిర్వహణ వ్యయం తగ్గించుకోవడంతో సమర్థత, సామర్థ్యం పెంచుకోకపోతే ఆశించిన ఫలితాలురావని అధికారులతో ముఖ్యమంత్రి అన్నారు. ఈ సమావేశంలో ఉక్కు మంత్రిత్వ శాఖ కార్యదర్శి సందీప్ పౌండ్రిక్, జాయింట్ సెక్రటరీ అభిజిత్ నరేంద్ర, ఎన్ఎండీ సిఎండీ అమితవముఖర్జీ, ఆర్ఐఎన్ఎల్ ఇన్చార్జ్ సిఎండీ అజిత్ కుమార్ సక్సేనా, మెకాన్ సీఎండీ ఎస్కె వర్మ, ఎంఎస్‌టిసి లిమిటెడ్ సిఎండీ మనోబేంద్ర ఘోషల్ పాల్గొన్నారు.



సోమవారం కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మతో చర్చలు జరుపుతున్న సిఎం చంద్రబాబు

## ఆరు జిల్లాలలో 51 కరవు మండలాలు - ప్రభుత్వం వెల్లడి

**విజయవాడ,మార్చి31,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కరువు ప్రభావిత మండలాలను ప్రకటించింది. ఈ మేరకు అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది.రాష్ట్ర వ్యాప్తంగా 6 జిల్లాల పరిధిలో 51 కరువు ప్రభావిత మండలాలు గుర్తించామని రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా ఈ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

కర్నూలు, నంద్యాల, అనంతపురం, సత్యసాయి, ప్రకాశం, వైఎస్సార్ కడప జిల్లాల్లో ఈ 51 కరువు ప్రభావిత మండలాలను ఉన్నట్టు పేర్కొన్నారు.. డ్రౌట్ మేనేజ్మెంట్ మాన్యువల్ ప్రకారం, రైతులకు అవసరమైన సహాయాన్ని అందించేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందన్నారు.

ప్రభుత్వం వేసవి తీవ్రతను క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తోందని, అవసరమైన నిధులు, సబ్సిడీలు, సహాయక కార్యక్రమాలను అందించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వెల్లడించారు.

## సిఎం చంద్రబాబు ఆలోచనలు అద్భుతం - ఆనంద్ మహీంద్ర



**విజయవాడ మార్చి 31 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఆలోచనలు అద్భుతంగా ఉంటాయని ప్రముఖ పారిశ్రామికవేత్త ఆనంద్ మహీంద్ర అన్నారు. ఈమేరకు ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు. అరకు కేఫ్‌లు విస్తరిస్తున్న తీరును చూసి ఆయన సంతోషిస్తారని పేర్కొన్నారు. పారిస్ కేఫ్‌ల్లోని ఎలక్ట్రానిక్ స్క్రీన్లపై అరకులోని గిరిజనుల జీవనశైలికి సంబంధించిన చిత్రాలు, వీడియోలు ప్రదర్శించనున్నట్లు తెలిపారు. ఇక్కడి కాఫీ ప్యాకేజింగ్ గిరిజనుల వేషధారణ, భారతదేశం >>2

# మరో భారీ ఎన్‌కౌంటర్

### దండకారణ్య సబ్ జోనల్ కమిటీ సభ్యురాలు రేణుక మృతి

### ఈమెపై 45 లక్షల రివార్డు, స్వస్థలం తెలంగాణలోని కడవెండి గ్రామం



రేణుక (ఫైల్)

**చర్ల, మార్చి 31, ప్రభాతవార్త:** ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో మావోయిస్టులపై భద్రతా బలగాలు విరుచుకు పడుతున్నాయి. భద్రాతా బలగాలు మావో అగ్ర నేతలే లక్ష్యంగా చేసుకొని విస్తృత కూబింబ్ చేపడుతున్నాయి.ఈ క్రమంలో వరస ఎన్ కౌంటర్లు జరుగుతున్నాయి. ఈ ఎన్ కౌంటర్లలో మావోయిస్టు అగ్రనేతలు ఒక్కొక్కరుగా నేలకొరుగుతున్నారు..గడిచిన మూడు నెలల వ్యవధిలో కేంద్ర కమిటీ సభ్యులు రాష్ట్ర కమిటీ సభ్యులతోపాటు డివిజన్ కమిటీ సభ్యులు మృత్యువాత పడ్డారు.అబూజ్ మఢ్ దండకారణ్య లక్ష్యంగా చేసుకొని భద్రతా బలగాలు ముందుకు సాగుతుండటంలో ఆ ప్రాంతం యుద్ధవాతావరణాన్ని తలపిస్తుంది. భద్రతా బలగాలు దూకుడుకు మావోలు ఏం చెయ్యాలో పాలుపోని స్థితిలో సేఫ్‌గా తలదాకుకోవడానికి చేస్తున్న ప్రయత్నాలను నిఘా వర్గాలు పసిగట్టి అదిశగా అడుగులు వేస్తుండటంలో ఎన్‌కౌంటర్లు చోటుచేసుకుంటున్నారు. తాజాగా మావోయిస్టు అగ్రనాయకురాలు రేణుక మృతిచెందడం పార్టీ మరో అగ్రనాయకురాలిని కోల్పోయింది. దంతెవాడ బీజాపూర్ సరిహద్దులోని గీదం భైరంఘడ్ పోలీస్ స్టేషన్ల పరిధిలోని నెల్గోడ ఆకేలి బెల్నార్ అటవి ప్రాంతంలో మావోయిస్టు అగ్రనేతలు ఉన్నారని నీఘా వర్గాల సమాచారం మేరకు డిఆర్జీ సిఆర్పీఎఫ్ సోమవారం బలగాలు సెర్చ్ ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలో మావోలస్థావరాన్ని గుర్తించిన భద్రతా బలగాలు కాల్పులు జరపారు. భద్రతా బలగాల కాల్పులనుండి తేరుకున్నమావోలు విధిగా కాల్పులు జరపడంతో ఇరువురి మధ్య ఎదురుకాల్పులు పెద్ద ఎత్తున జరిగాయి. ఈ ఎదురు కాల్పుల్లో మావోయిస్టు అగ్ర నాయకురాలు దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యురాలు రేణుక >>2

### విజయవాడ -హైదరాబాద్ 65వ జాతీయ రహదారిపై

# టోల్ టాక్స్ తగ్గింపు

## నేటినుంచి అమలు



**విజయవాడ,మార్చి31,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడ -హైదరాబాద్ మార్గంలోని 65 జాతీయ రహదారిపై ప్రయాణించే వాహనాలకు టోల్ ట్యాక్స్ తగ్గిస్తూ ఎన్‌హెచ్‌ఎఐ నిర్ణయం తీసుకుంది. తగ్గిన టోల్‌ట్యాక్స్ ఏప్రిల్ 1 నుంచి అమలులోకి వస్తుంది. హైదరాబాద్-విజయవాడ మార్గానికి సంబంధించి తెలంగాణలోని చౌటుప్పల్ మండలం పంతంగి, కేతేపల్లి మండలం కొర్లపహాడ్, ఆంధ్రప్రదేశ్‌లోని నందిగామ సమీపంలోని చిల్లకల్లు టోల్ ప్లాజాల ద్వారా ప్రస్తుతం టోల్ ట్యాక్స్ వసూలు చేస్తు >>2

## కొడాలి నాని ముంబయికి తరలింపు

### మెరుగైన చికిత్స అందించేందుకు ఏర్పాట్లు



**విజయవాడ, మార్చి 31. పభాత వార్త ప్రతినిధి:** మాజీ మంత్రి, వైఎస్సార్సీ నేత కొడాలి నానిని మెరుగైన చికిత్స కోసం ముంబైకి తరలించారు. కొద్దిరోజుల క్రితం కొడాలి నాని తీవ్ర అనారోగ్యానికి గురైన విషయం తెలిసిందే. గత ఐదు రోజులుగా హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో ఆయన చికిత్స పొందుతు >>2

## పులిగడ్డ వారధివద్ద కారు, లారీ ఢీ

### ముగ్గురు మృతి, మరో ముగ్గురికి తీవ్ర గాయాలు

**విజయవాడ,మార్చి31,ప్రభాతవార్తప్రతినిధి:** కృష్ణా జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. అవనిగడ్డ మండలం పులిగడ్డ పెనుమూడి వారధి సమీపంలో ఎదురువస్తున్న లారీని కారు ఢీ కొట్టింది. ఈ ఘటనలో పసికందు సహా ముగ్గురు అక్కడిక్కడే మృతి చెందారు. మరో ముగ్గురికి గాయాలయ్యాయి. దీనిపై స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు సహాయక చర్యలు చేపట్టారు. మృతుల్లో ఒకరు తెనాలికి చెందిన జీఆర్ మోహన్ బాబుగా పోలీసులు గుర్తించారు. క్షతగాత్రులను అవనిగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి వారిని మెరుగైన వైద్య కోసం మచిలీపట్నం తరలించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

### శ్రీవారి ఆలయంలో కుర్చీలు వదలని

# అన్యమతస్థులు

### ఇంకా అదే స్థానాల్లో కొనసాగింపు!

### టిటిడిలో సిఎం ఆదేశాలు అమలయ్యేదెన్నడో?



**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** హిందూ ధార్మిక సంస్థ తిరుమల తిరుపతి దేవస్థానంతోబాటు తిరుమల శ్రీవారి ఆలయంలో హిందూ ఉద్యోగులు మాత్రమే ఉండాలని, ఇతర మతస్థులు ఉండటానికి వీలులేదని స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటన చేసి పదిరోజులు కావస్తున్నా ఆ దిశగా తీసుకున్న చర్యలు మచ్చుకైనా లేదని ఉద్యోగులు బహిరంగ విమర్శలు చేస్తున్నారు. ఇతర మతస్థులు టిటిడిలో ఉద్యోగులుగా ఉండటానికి వీలులేదని, అలాంటి వ్యవస్థ కొనసాగడానికి అవకాశం ఉండదని సూచించారు. అన్యమతస్థులను గుర్తించి వారిని ఇతర శాఖలకు బదిలీ చేయడమో. లేక విఆర్ఎస్ ఇవ్వడమా అనేది చూడాలని సిఎం ఆదేశించినా టిటిడి అధికారులు ఆచరణలో పెట్టలేదనేది హిందూ ఉద్యోగుల వాదన. ఇప్పటికీ అన్యమతస్థులుగా ముద్రపడిన అధికారులు, ఉద్యోగులు యధాతథంగా ఆయా కుర్చీల్లోనే కొనసాగుతున్నారని చెబుతున్నారు. గతనెల 21వతేదీ తిరుమల పర్యటనలో ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా క్రైస్తవులు, ముస్లింలు ఆయా సంస్థల్లో,ఆయా మతాలకు సంబంధించిన కార్యాలయాల్లో వారే పని చేస్తున్నారని, ఇతర మతస్థులను అనుమతించరనేది వివరించారు. మరీ అలాంటిది ప్రపంచ ప్రసిద్ధి చెందిన హిందూ పుణ్యక్షేత్రం తిరుమల తిరుపతి దేవస్థానంలో అన్యమతస్థులు వివిధ కేడర్‌లలో ఇంకా పనిచేస్తున్నారు.వారి సేవలను టిటిడి వినియోగించుకొంటుండటం కొసమెరుపు.

ఏడుకొండలవెంకన్న చెంత కొలువులో ఉంటూ భక్తులు సమర్పించే కానుకలతో గోవిందుని సేవ చేయాల్సిన ఉద్యోగులు ఇతర మతాల ఆచారాలు పాటిస్తూ లక్షలాదిరూపాయలు వేతనాలు తీసుకుంటుండటం విశేషం.దీనిపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తంచేసిన టిటిడి పాలకమండలి రాష్ట్ర దేవాదాయ శాఖ చట్టం 1060, 24-10-1989 ప్రకారం హిందుమత సాంప్రదాయాన్ని అనుసరిస్తామని ప్రమాణం చేసి టిటిడిలో ఉద్యోగం పొందిన తరువాత కూడా నిబంధనలకు విరుద్ధంగా, దేవుని పవిత్రతను దెబ్బతీస్తున్న కొందరు ఉద్యోగులను గుర్తించి, అలాంటి అన్యమతస్థులు వారికి ఇష్టమైన మతాన్ని, ఆ దేవుడ్ని ప్రార్థించడం ఏంటనేది తిరుపతిలో గుప్పుమంటున్న విషయం.

ఈ అంశంపై టిటిడి పాలకమండలి ఛైర్మన్ బిఆర్ నాయుడు తొలిరోజునుండే తీవ్రంగా పరిగణించి వారిని సాగనంపుతామని ప్రకటించారు. ఐదు నెలలు పాలకమండలి పదవీకాలం పూర్తయినా అన్యమతస్థులపై చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. టిటిడిలో ప్రస్తుతం 6,800పైచిలుకు వరకు శాశ్వతఉద్యోగులుమాత్రమే కొనసాగు >>2



సోమవారం హిస్సార్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు స్వాగతం పలుకుతున్న హర్యానా సిఎం నయాబ్‌సింగ్ సూనీ

# భారత్‌పై నోరుపారేసుకున్న బంగ్లా చీఫ్ యూనస్!

**బీజింగ్, మార్చి 31:** బంగ్లాదేశ్ తాత్కాలిక పాలకుడు మహమ్మద్ యూనస్ చైనా పర్యటనలో భారత్‌పై నోరుపారేసుకున్నారు. ఈశాన్య భారతదేశంలోని ఏడు రాష్ట్రాలు భూపరివేష్టిత ప్రాంతాలని, బంగ్లాదేశ్ మాత్రమే సముద్రానికి సంరక్షకురాలు అని పేర్కొంటూ, తమ ప్రాంతంలో పెట్టుబడులు పెట్టాలని చైనాను ఆహ్వానించారు. యూనస్ వ్యాఖ్యలు భారత రాజకీయ, రక్షణ వర్గాల్లో తీవ్ర కలకలం రేపుతున్నాయి. యూనస్ మాట్లాడుతూ, "భారతదేశంలోని ఈశాన్యంలో ఉన్న ఏడు రాష్ట్రాలకు సముద్ర మార్గం లేదు. ఈ ప్రాంతానికి బంగ్లాదేశ్ మాత్రమే సముద్ర సంరక్షకురాలు. కాబట్టి ఇది చైనా ఆర్థిక వ్యవస్థకు విస్తరణగా ఉపయోగపడుతుంది. ఇక్కడ వస్తువులు తయారు చేసి, చైనాకు తరలించవచ్చు. ప్రపంచంలోని ఇతర ప్రాంతాలకు కూడా ఎగుమతి చేయవచ్చు అని అన్నారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆర్థిక సలహా మండలి సభ్యుడు సంజీవ్ సన్యాల్ యూనస్ వ్యాఖ్యలపై ఆశ్చర్యం వ్యక్తం చేశారు. చైనా పర్యటనలో యూనస్ అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో సమావేశమయ్యారు. తీస్తా నదీజలాల నిర్వహణతో సహా నదీ జలాల నిర్వహణ కోసం 50 సంవత్సరాల మాస్టర్ ప్లాన్‌ను రూపొందించాలని చైనాను కోరారు. బంగ్లాదేశ్, చైనా, యార్లంగ్ జాంగ్బో జమునా నదిపై జల సమాచార మార్పిడికి సంబంధించిన అవగాహన ఒప్పందంపై చర్చలు జరిపాయి. మొంగ్లా పోర్ట్ ఫెసిలిటీస్ మోడరనైజేషన్ అండ్ ఎక్స్‌పాన్షన్ ప్రాజెక్ట్‌లో పాల్గొనడానికి చైనా కంపెనీలను బంగ్లాదేశ్ ఆహ్వానించింది. చిట్టగాంగ్‌లోని చైనా ఎకనామిక్ అండ్ ఇండస్ట్రియల్ జోన్‌ను అభివృద్ధి చేయడానికి చైనాతో కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలిపింది.

## నేపాల్‌లో రాజరిక వ్యవస్థకోసం తీవ్రస్థాయి ఉద్యమం!

**ఖాట్మండు, మార్చి 31:** హిమాలయదేశంలో రాచరిక వ్యవస్థనుప్రవేశపెట్టాలనే డిమాండ్ రోజురోజుకూ పెరుగుతోంది. ఈ క్రమంలోనే ఆందోళనలు కూడా రానురాను హింసాత్మకంగా మారుతున్నాయి. హోంమంత్రిత్వశాఖ భద్రతా అధికారులతో అత్యవసర సమావేశం ఏర్పాటుచేసి ఈ హింసాత్మక వాతావరణానికి నేపాల్‌మాజీ రాజు జ్ఞానేంద్ర షాయేకారణమని ఆరోపిస్తూ ఆయన్ను అరెస్టుచేసేందుకు ప్రభుత్వ యాంత్రాంగాన్ని సిద్ధంచేసారు. అంతేకాకుండా నేపాల్ రాజుకు భారీ జరిమానా కూడా విధించారు. ఖాట్మండులోని పలుప్రాంతాల్లో రాచరిక మద్దతుదారులుభద్రతా దళాల మధ్య హింసాత్మక ఘర్షణలు జరిగాయి. నిరసనకారులు బారికేడ్లను బద్దలుకొట్టేందుకు యత్నించారు. దీనితో భద్రతా దళాలు టియర్‌గ్యాస్‌ప్రయోగించాయి.

ఆందోళన కారులు వాణిజ్య సముదాయం, రాజకీయ పార్టీ కేంద్ర కార్యాలయం, ఒక మీడియా హౌస్‌భవనానికి నిప్పుఉపెట్టారు. ఈ ఘటనల్లో 12 మందిపోలీసులు కూడా గాయపడ్డారు. నేపాల్‌ప్రధాని కెపిశర్మ ఓలి నిర్వహించిన అత్యవసర సమీక్షలో మాజీరాజు జ్ఞానేంద్రషాను బాధ్యుడని తేల్చి ఆయన్ను అరెస్టుచేయాలన్న నిర్ణయానికి వచ్చారు. ఖాట్మండులో జరిగిన హింసాయుత ఘటనల కారణంగా త్రిభువన్ అంతర్జాతీయ విమానాశ్రయాన్ని కూడా మూసివేసారు. రానురాను ఈ ఉద్రిక్తతలుపెరిగిపోయాయి. ఈ ఘర్షణల్లోనే 112 మంది గాయపడ్డారు. 2008లో రాచరిక వ్యవస్థను రద్దుచేసి నేపాల్‌లో లౌకిక సమాఖ్య ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యాన్ని స్థాపించారు. ఇటీవలికాలంలో రాచరిక పునరుద్ధరణ డిమాండ్‌పెరుగుతూ వస్తోంది. అవినీతి, ఆర్థిక అస్థిరత, తరచూ ప్రభుత్వాలు మారడంపై ప్రజల్లో ఆగ్రహం పెరుగుతోంది. ఫిబ్రవరి 19న ప్రజా స్వామ్య దినోత్సవం సందర్భంగా మాజీరాజు జ్ఞానేంద్రషా తన ప్రసంగంలో దేశప్రజలనుంచి మద్దతును కోరినప్పటినుంచి ఈ అల్లర్లుపెరిగాయి. ఉద్యమం మరింత తీవ్రరూపం దాల్చింది. అయితే 2008 నుంచి రాజరికం రద్దయిన తర్వాతనేపాల్‌లో 13 ప్రభుత్వాలు మారినా రాజకీయ స్థిరత్వం రాలేదు.

## ఐదేళ్ల వైఎస్సార్సీ పాలనలో రామరాజ్యం..
# నేడు రాష్ట్రంలో రావణకాష్టం

### - మాజీ ఎంపి గోరంట్ల మాధవ్ విమర్శ

**అనంతపురం, మార్చి 31 ప్రభాతవార్త బ్యూరో:** రాష్ట్రంలో ఐదేళ్ల వైఎస్సార్సీ పాలనలో నాటి ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రామరాజ్యంగా రాష్ట్రాన్ని పాలిస్తే నేడు కూటమి పాలనలో రాష్ట్రాన్ని రావణ కాష్టంగా మార్చారని, మాజీ ఎంపి, వైసిపి రాష్ట్ర అధికార ప్రతినిధి గోరంట్ల మాధవ్ విమర్శించారు. రాప్తాడు నియోజకవర్గంలో హత్యకు గురైన కురుబ లింగమయ్య మృతదేహాన్ని నివాళులు అర్పించి బాధితులను పరామర్శించేందుకు వెళ్తున్న మాజీ ఎంపి గోరంట్ల మాధవ్‌ను పోలీసులు అడ్డుకున్నారు. సిఐలు రాజేంద్రనాథ్ యాదవ్, సాయినాథ్‌ల ఆధ్వర్యంలో పోలీసులు సోమవారం గోరంట్ల మాధవ్ నివాసానికి చేరుకుని ఆయనను హౌస్ అరెస్ట్ చేశారు. కురుబ లింగమయ్య, మృతదేహం వద్దకు వెళ్తే శాంతిభద్రతల సమస్య తలెత్తుతుందని సహకరించాలని పోలీసులు మాజీ ఎంపి గోరంట్ల మాధవ్‌ను కోరారు. అయితే తమ కులస్తుడు, పార్టీ నాయకుడు కురుబ లింగమయ్య మృతదేహాన్ని చూసేందుకు అవకాశం ఇవ్వాలని మీతోపాటు తీసుకెళ్లి పూలమాల వేసి వస్తానని పోలీసులను మాజీ ఎంపి గోరంట్ల మాధవ్ కోరినప్పటికీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అనుమతించడం లేదని పోలీసులు పేర్కొనడంతో ఒకానొక దశలో గోడ దూకి వెళ్లేందుకు గోరంట్ల మాధవ్ ప్రయత్నించగా పోలీసులు ఆయనను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా గోరంట్ల మాధవ్ విలేకర్లతో మాట్లాడుతూ.. కురుబ లింగమయ్యను దారుణంగా హత్య చేశారని, మృతదేహాన్ని చూసి పూలమాలలు వేయడానికి కూడా వెళ్లనీయకుండా పోలీసులు అడ్డుకోవడం దుర్మార్గమన్నారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం లేదని, దోపిడీలు, దౌర్జన్యాలు అధికమయ్యాయన్నారు. హత్యలు, మానభంగాలు, దౌర్జన్యాలు, దాడులు నిత్యకృత్య మయ్యాయని, ఆరోపించారు. ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్ ఆధ్వర్యంలో రాప్తాడు నియోజకవర్గంలో బిసిలే లక్ష్యంగా దాడులు, దౌర్జన్యాలు, హత్యలు అధికమయ్యాయని విమర్శించారు. ఆత్మకూరు మండలంలో కురుబ బాలన్నపై సునీత బంధువులు దాడి చేశారని, రామగిరిలో లాయర్ నాగిరెడ్డిపై దాడి చేశారని, కురుబ లింగమయ్యను హత్య చేశారన్నారు. రాప్తాడు నియోజకవర్గంలో గతంలో మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి శాంతి భద్రతలను కాపాడారన్నారు. రాజ్యాంగాన్ని పరిరక్షించాలని రెడ్ బుక్ రాజ్యాంగంతో పరిపాలన కొనసాగిస్తే రానున్న రోజుల్లో వడ్డీతో సహా చెల్లిస్తామని హెచ్చరించారు. కేంద్రంలో భాగస్వామిగా ఉన్న కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అభివృద్ధిని గాలికొదిలేశారని విమర్శించారు. పోలీసులు కూడా చట్టవిరుద్ధంగా వ్యవహరించ వద్దని సూచించారు.

# టోల్ ట్యాక్స్ తగ్గింపు

>> న్నారు. వీటిల్లో అత్యధికంగా పంతంగి టోల్ ప్లాజా వద్ద కార్లు, జీపులు, వ్యాన్‌లకు ఒక వైపు ప్రయాణానికి రూ.15, ఇరువైపులా కలిపి రూ.30, తేలికపాటి ట్రాన్స్‌పోర్టు వాహనాలకు అయితే ఒక వైపు ప్రయాణానికి రూ.25, ఇరువైపులా కలిపి రూ.40, బస్సు, ట్రక్కులకు ఒక వైపు ప్రయాణానికి రూ.50, ఇరువైపులా కలిపి రూ.75 వరకు తగ్గించినట్లు ఎన్‌హెచ్‌ఏఐ పేర్కొంది. అటు ఆంధ్రప్రదేశ్‌లోని చిల్లకల్లు టోల్‌ప్లాజా వద్ద అన్ని వాహనాలకు కలిపి ఒక వైపునకు రూ.5, ఇరువైపులా కలిపి రూ.10 చొప్పున మాత్రమే తగ్గించారు. 24 గంటలలోపు తిరుగు ప్రయాణం చేస్తే అన్ని రకాల వాహనాలకు టోల్ రుసుములో 25 శాతం మినహాయింపు లభిస్తుందని ఎన్‌హెచ్‌ఏ ప్రకటించింది. తగ్గించిన టోల్ ట్యాక్స్‌లు ఏడాది పాటు అనగా.. 2026 మార్చి 31 వరకు అమల్లో ఉంటాయి. టోల్ వసూలు చేపడుతోంది. గతేడాది జులై 1 నుంచి టోల్ వసూళ్లు ఎన్‌హెచ్‌ఏఐ చేతికి వెళ్లాయి. అంతకుముదు వరకు కూడా జీఎమ్మార్ సంస్థ టోల్ వసూలు చేసేది. 2024, జులై 1 నుంచి ఈ బాధ్యతను ఎన్‌హెచ్‌ఏఐ తీసుకుని..ఏజెన్సీల ద్వారా గతంలో జీఎమ్మార్ సంస్థ ఉన్నప్పుడు ఏడాదికోసారి టోల్ ట్యాక్స్‌లను పెంచుకునేందుకు ఒప్పందం ఉండేది. ఇప్పుడు టోల్ ట్యాక్స్ వసూలు బాధ్యత ఎన్‌హెచ్‌ఏఐ చేతికి రావడంతో.. ఆ సంస్థ టోల్ రుసుములను తగ్గిస్తూ నిర్ణయం తీసుకుంది.

# వడివడిగా 'పోలవరం'

>> వరకు 158.20 మీటర్ల మేర పనులు చేపట్టారు. పోలవరంలో ఎగువ, దిగువ కాఫర్ డ్యాంలు నిర్మించినా వాటి సీపేజీ వల్ల ప్రధాన డ్యాం ప్రాంతంలో నీరు నిండిపోతోంది. ఈ సమస్యతో పనులు చేయడం సవాల్‌గా మారింది. వర్షాలకు ముందు ఏప్రిల్, మే, జూన్ నెలల వరకు ప్రాజెక్టు పనులు వేగంగా చేసేందుకు ఆస్కారం ఉంటుంది. జులై నుంచి గోదావరిలో వరదలు ప్రారంభమవుతాయి. దీంతో ఎగువ కాఫర్ డ్యాం సీపేజీని నియంత్రించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. అందుకే కొత్తగా బట్రస్ డ్యాం నిర్మాణాన్ని ప్రారంభించారు. దాదాపు 82 కోట్ల విలువతో ఈ పనులు చేపట్టారు. వర్షాకాలంలోపు ఈ కట్టడాన్ని పూర్తిచేయాలి. బట్రస్ డ్యాం నిర్మిస్తే ఎగువ కాఫర్ డ్యాం పునాదుల నుంచి వచ్చే సీపేజిని నియంత్రించొచ్చనేది వ్యూహం. డయాఫ్రం వాల్ నిర్మాణానికి సీపేజి జలాలు ఆటంకం కలగకుండా ప్లాట్‌ఫాం నిర్మిస్తున్నారు. ఆ ప్లాట్‌ఫాంపై మిషనరీ ఉంచి పనులను కొనసాగిస్తారు. వరదల సమయంలోనూ పనులు కొనసాగిస్తూ ఈ ఏడాది డిసెంబరు నాటికి డయాఫ్రం వాల్ పూర్తి చేయాలనేది లక్ష్యంగా పెట్టుకున్నారు.

**వచ్చే యేడాది జూన్ నాటికి పూర్తి చేసేలా లక్ష్యం:**

డయాఫ్రం వాల్ పూర్తయిన తర్వాత ప్రధాన రాతి, మట్టికట్ట నిర్మించాల్సి ఉంటుంది. డీ వాల్ నిర్మాణం కొంత పూర్తయిన వెంటనే గ్యాప్2 ప్రధాన డ్యాం నిర్మించాలని ప్లాన్ చేస్తున్నారు. ప్రస్తుతం గ్యాప్1 ప్రధాన డ్యాం నిర్మాణ ఆకృతులను సమర్పిస్తున్నారు. దీనికి అవసరమైన మట్టి, రాతి మెటీరియల్ సిద్ధం చేశారు. ఏప్రిల్ రెండో వారంలోనే మొదటి గ్యాప్ ప్రధాన డ్యాం పనులు ప్రారంభించి, 2026 మార్చికి పూర్తి చేయాలనేది లక్ష్యం. గ్యాప్2 ప్రధాన డ్యాం నిర్మాణం డీ వాల్ నిర్మాణంపై ఆధారపడి ఉండటంతో, ప్రధాన డ్యాం పనులు 2025 నవంబరు నుంచి ప్రారంభించడానికి సిద్ధమవుతున్నారు. అందుకు తగిన పరీక్షలు, విశ్లేషణలు పూర్తి చేస్తున్నారు. వీటితోపాటు కుడి, ఎడమ కాలువల అనుసంధాన పనులూ పట్టాలకెక్కించారు. వీటిని వచ్చే ఏడాది జూన్ నాటికి పూర్తి చేసేలా లక్ష్యం నిర్దేశించారు.

గోదావరి పుష్కరాల కన్నా ముందే పోలవరం ప్రాజెక్టు పూర్తి చేసి, జాతికి అంకితం చేస్తాం. ఎపికి జీవనాడి పోలవరం ప్రాజెక్టును డిసెంబర్ 2019లోనూ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి వచ్చి ఉంటే 2020కి ప్రాజెక్టు పూర్తయ్యేదని అన్నారు. ఆలస్యం చేయడం వల్ల ఖర్చు భారీగా పెరిగిపోయిందనీ స్పష్టం చేశారు. రూ.400 కోట్లతో కట్టిన డయాఫ్రం వాల్ వైఎస్సార్సీ నిర్లక్ష్యం వల్ల కొట్టుకు పోయిందని అన్నారు. ఇప్పుడు మళ్లీ రూ.990 కోట్లతో కొత్త డయాఫ్రంవాల్ నిర్మిస్తున్నామని అన్నారు. ప్రజాధనాన్ని విచ్చలవిడిగా వృథా చేశారని సిఎం ఆక్షేపించారు. మొదటి దశ లో 41.15 కాంటూరు వరకూ నిర్వాసితుల పరిహారం, కాలనీల నిర్మాణం కోసం రూ.6270 కోట్ల మేర వ్యయం అవుతుందని అన్నారు. రెండో దశ 45.72 మీటర్ల ఎత్తు వరకు నిర్వాసితులను కూడా గుర్తించే ప్రక్రియ కూడా పారదర్శకంగా నిర్వహిస్తామని తెలిపారు. పోలవరం ప్రాజెక్టు 41.15 కాంటూరు పరిధిలోని నిర్వాసితులకు కూటమి సర్కారు 900 కోట్లకు పైగా పరిహారం చెల్లించి, తమకున్న చిత్తశుద్ధిని నిరూపించుకుందన్నారు.. పునరావాస కాలనీలను నిర్మించే కాంట్రాక్టర్లుకు కూ. 216 కోట్ల నిధులు మంజూరు చేసింది. దీంతో కాలనీల నిర్మాణ పనులు, 45.72 కాంటూరు పరిధిలోని నిర్వాసితుల పరిహారం అందిస్తోందన్నారు.గత ప్రభుత్వ హయాంలో పోలవరం విధ్వంసం జరిగినా కేంద్ర సహకారంతో దీనిని పూర్తి చేస్తామని విశ్వాసం కలిగిందని సీఎం అన్నారు. 2019లో అధికారం మారి పోయి ప్రాజెక్టు నిర్మాణం కొనసాగించే అవకాశం పోయిందని అన్నారు. ఇప్పుడు ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు పూర్తి చేసే అవకాశం తనకే వచ్చిందని సీఎం వ్యాఖ్యానించారు. ఏటా సముద్రంలోకి వృధాగా పోతున్న 2 వేల టీఎంసీల నీటిలో 400 టీఎంసీల ను వాడుకున్నా రాష్ట్రం సస్యశ్యామలం అవుతుందని సీఎం అన్నారు. వైఎస్సార్సీ హయాంలో జరిగిన విధ్వంసం క్షమించరాని నేరమని అన్నారు. జాతీయ ప్రాజెక్టుగా ప్రజల ఆస్తిని నష్టపరిచే హక్కు ఎవరికీ లేదని అన్నారు.

## తీరప్రాంతంలో ఆఫ్‌షోర్ మైనింగ్
# పర్యావరణ విఘాతమే

### ప్రధానిమోడీకి రాహుల్‌గాంధీ లేఖ

**న్యూఢిల్లీ, మార్చి 31:** దేశంలోని కేరళ, గుజరాత్, అండమాన్ నికోబార్ దీవుల తీరప్రాంంలో ఆఫ్‌షోర్ మైనింగ్‌కు అనుమతి ఇచ్చే టెండర్లను రద్దుచేయాలనికోరుతూ లోక్‌సభలోప్రతిపక్ష నాయకుడు రాహుల్‌గాంధీప్రధాని నరేంద్రమోడీకి లేఖరాసారు. సముద్రజీవులకు ముప్పు ఏర్పడుతుందని పేర్కొంటూ ఈప్రభావాన్ని పూర్తిగా అంచనావేయకుండాప్రైవేటు ఏజెన్సీలకు ఆఫ్‌షోర్‌మైనింగ్ బ్లాక్‌లు ఇవ్వడం ఆందోళన కరమని అన్నారు. కేరళ, గుజరాత్ అండమాన్ నికోబార్‌తీరప్రాంతాల్లో ఆఫ్‌షోర్‌మైనింగ్‌కు అనుమతులు ఇవ్వాలన్న కేంద్రప్రభుత్వ నిర్ణయం తీవ్రంగా ఖండిస్తున్నట్లు రాహుల్ తన లేఖలో వివరించారు. పర్యావరణ ప్రభావాన్ని అంచనావేయకుండా ఆఫ్‌షోర్ మైనింగ్ టైండర్లు కోరిన విధానం పునరాలోచన చేయాలని, లక్షలాదిమంది మత్స్యకారులు, తమ జీవనోపాధి, జీవన విదానంపై దాని ప్రభావం గురించి ఇపుడు ఆందోళనలో పడ్డారని రాహుల్ అన్నారు.

పర్యావరణ అధ్యయనం లేకుండా ఇలా అనుమతిలివ్వడం చట్టాలను ఉల్లంఘించడమేనన్నారు. తీరప్రాంతంలో మైనింగ్‌కు ఇస్తే సముద్రతీరాలు మొత్తంకోతకు గురవుతాయని, పర్యావరణానికి నష్టం కలిగి అంతులేని నష్టం కలుగుతుందని రాహుల్ వివరించారు. శాస్త్రీయ అధ్యయనం అంచనాలు లేకుండా ఇలాంటి కార్యకలాపాలకు అనుమతినివ్వడం ఎంతమాత్రం తగదని వెంటనే ఆ టెండర్లను రద్దుచేయాలని ఆయన తన లేఖలో కోరారు. ఆఫ్‌షోర్‌మైనింగ్‌వల్ల కలిగే అనర్థాలపై అంచనావేసేందుకు కఠినమైన శాస్త్రీయ అధ్యయనాలు నిర్వహించాలనిపిలుపునిచ్చారు. తీరప్రాంత మత్స్యకారుల జీవితాలు మహాసముద్రాలతో ముడిపడి ఉన్నాయని, అందరికీ స్థిరమైన భవిష్యత్తును అందించేందుకు సమిష్టిగా పనిచేసేందుకు ముందుకురావాలని రాహుల్ ప్రధానికి రాసిన లేఖలో విజ్ఞప్తిచేసారు.

## సిఎం చంద్రబాబు ఆలోచనలు అద్భుతం

>> లోని వైవిధ్యమైన రంగుల స్ఫూర్తితో రూపొందించినట్లు వివరించారు. మరోవైపు ఈ నెల 29న కూడా ఆనంద్ మహీంద్రా ఎక్స్‌లో ఆసక్తికర పోస్టు పెట్టారు. పారిస్‌లో మా రెండో అరకు కాఫీ స్టాల్ అంటూ వీడియో పెట్టారు. దీనిపై సిఎం చంద్రబాబు స్పందించారు. పచ్చని అరకులోయ నుంచి పారిస్ నడిబొడ్డుకు మేడ ఇన్ ఎపి ఉత్పత్తి చేరడం, ప్రపంచవ్యాప్తంగా తగిన గుర్తింపు లభించడం స్ఫూర్తిదాయకమని సిఎం పేర్కొన్నారు.

## ఉష్ణోగ్రతలు తగ్గుదల!

>> కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశముంది. ఉరుములతో కూడిన మెరుపులు ఒకటి లేదా రెండు చోట్ల సంభవించే అవకాశముంది.ఉరుముతో కూడిన మెరుపులు మరియు బలమైన ఈదురు గాలులు గంటకు 3040 కి.మీ. వేగం తో వీచే అవకాశం ఉంది. గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదు 2 నుండి 3 డిగ్రీల సెంటీగ్రేడ్ తగ్గే అవకాశముంది. బుధవారం రోజున తేలికపాటి నుండిఒక మోస్తరు వర్షాలు లేదా ఉరుములతో కూడిన జల్లులు ఒకటి లేదా రెండు చోట్ల కురిసే అవకాశ ముంది.

## నోబెల్ శాంతి బహుమతికి ఇమ్రాన్ నామినేట్

**ఇస్లామాబాద్, మార్చి 31:** ప్రతిష్టాత్మక నోబెల్ శాంతిబహుమతికి పాకిస్థాన్ మాజీ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ నామినేట్ అయ్యారు. మానవ హక్కులు, ప్రజాస్వామ్యంకోసం చేసిన కృషికి గాను ఆయనకు ఈ నామినేషన్ లభించింది. నార్వేలోని రాజకీయ పార్టీపార్టియట్ సెంట్రం సభ్యులు, పాకిస్థాన్ వరల్డ్ అలయెన్స్ అనే సంస్థతో కలిసి ఈ నామినేషన్‌వేసారు. ఇమ్రాన్‌ఖాన్‌ను నోబెల్‌శాంతిబహుమతికి నామినేట్‌చేయడం గర్వంగా ఉందని పార్టియట్ సెంట్రం సోషల్‌మీడియా ఎక్స్‌లో ప్రకటించింది. దక్షిణాసియాలో శాంతికిచేసిన కృషికిగాను 2019లోనూ నోబెల్ శాంతిబహుమతికి ఇమ్రాన్ నామినేట్ అయ్యారు. నార్వే నోబెల్ కమిటీకి ఏటా వేలాది నామినేషన్లు వసానతయని, ఎనిమిదినెలలసుదీర్ఘ ప్రక్రియ అనంతరం విజేతను కమిటీ ఎంపికచేస్తుందని దిఎక్స్‌ప్రెస్ ట్రిబ్యూన్ కథనం రాసింది.

## వారం - వర్జ్యం

తేది : 01-04-2025, మంగళవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
చైత్రమాసం, ఉత్తరాయణం,
వసంత ఋతువు, శుక్లపక్షం,
శుక్ల చవితి రా.2.34
భరణి ఉ.11.09
వర్జ్యం రా.10.00-11.27
దు.ఉ.8.31-9.20, 2) రా.11.15-12.05
శుభసమయం : ఉ.6.30-7.10
రాహుకాలం - మ.3.00-4.30

## వార్తాఫలం

**మేషం :** రుణాలు తీరుస్తారు. ఆకస్మిక ధన, వస్తులాభాలు పొందుతారు. దూర ప్రయాణాలలో నూతన పరిచయాలు పెరుగుతాయి.

**వృషభం :** కొత్త కార్యక్రమాలు చేపడతారు. కుటుంబ సమస్యల నుండి బయట పడతారు. ధనవ్యయం.

**మిథునం:** బంధువులతో ఏర్పడిన వివాదాలు పరిష్కారించుకుంటారు. వృత్తి, వ్యాపారాలలో ఆటంకాలు ఎదురైన అధిగమిస్తారు.

**కర్కాటకం:** మిత్రుల నుండి శుభవార్తలు అందుకుంటారు. ఆర్థిక ఒడిదుడుకులు అధిగమిస్తారు.

**సింహం:** భూ వివాదాలు తీరి నూతన ఒప్పందాలు కుదురుతాయి. పుణ్యక్షేత్రాల సందర్శనం.

**కన్య :** ముఖ్యమైన పనులు సకాలంలో పూర్తిచేస్తారు. బంధువులను కలిసి ఆనందంగా గడుపుతారు.

**తుల :** దూరప్రాంతాల నుండి శుభ వార్తలు వింటారు. సంఘంలో గౌరవం పొందుతారు. ఆధ్యాత్మిక చింతన.

**వృశ్చికం:** సన్నిహితులతో ఏర్పడిన వివాదాలు పరిష్కారించుకుంటారు. ఆరోగ్య సమస్యల నుండి బయట పడతారు.

**ధనుస్సు:** కుటుంబంలో చికాకులు ఏర్పడిన అధిగమిస్తారు. ఆర్థిక ఇబ్బందులు ఎదురైన పట్టుదలతో ముందుకు సాగుతారు.

**మకరం:** ప్రయాణాలలో ఆటంకాలు ఎదురైన అధిగమిస్తారు. మిత్రులతో ఏర్పడిన వివాదాలు పరిష్కారించు కుంటారు.

**కుంభం:** రుణబాధలు ఎదురై చికాకులు పెడతాయి. నూతన ప్రయత్నాలలో ఆటంకాలు ఎదురైనా అధిగమిస్తారు.

**మీనం :** సోదరులతో ఏర్పడిన వివాదాలు పరిష్కరించుకుంటారు. అనారోగ్యం, ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రమే.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్



రంజాన్ సందర్భంగా సోమవారం కోల్‌కతాలో ముస్లిం సోదరునుద్దేశించి ప్రసంగిస్తున్న సిఎం మమతా బెనర్జీ

## పాక్‌లో ఉగ్రవాదులను ఏరివేస్తున్న అజ్ఞాత శక్తులు!

**కరాచి, మార్చి 31:** పాకిస్తాన్‌లో ఉగ్రవాదుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. అక్కడి ఉగ్రవాదులను గుర్తుతెలియని వ్యక్తులు వరుసగా కాల్చివేస్తున్నారు. భారత వ్యతిరేక ఉగ్రవాదులను లక్ష్యంగా చేసుకుని ఈ దాడులు చేస్తున్నారు. ఎప్పుడు ఎవరు వచ్చి కాల్చి చంపుతారో తెలియక భారత్‌ను వ్యతిరేకించే ఉగ్రవాదులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. వారు బయటికి రావాలంటేనే హడలిపోతున్న పరిస్థితి కనిపిస్తోంది. తాజాగా కరాచీలో లష్కరే తోయిబా(ఎల్‌ఈటీ) సంస్థకు ఫైనాన్షియర్‌గా వ్యవహరిస్తున్న ఖాద్రి అబ్దు రెహమాన్‌ను గుర్తుతెలియని వ్యక్తి కాల్చి చంపాడు.ఈ ఘటన పాక్ వాణిజ్య నగరమైన కరాచీలో జరిగింది. రంజాన్ రోజునే జరిగిన ఈ దాడికి సంబంధించిన వీడియో వైరల్ అవుతోంది. బైక్‌పై వచ్చిన దుండగుడు రెహమాన్ ఒక దుకాణంలో నిలబడి ఉండగా కాల్పులు జరిపి అక్కడి నుంచి పరారయ్యాడు. అబ్దుల్ రెహమాన్ 26/11 ఉగ్రదాడి సూత్రధారి హాఫీస్ సయీద్‌కు సన్నిహితుడు.రెహమాన్ లష్కరే తోయిబా సంస్థకు ఆర్థికంగా వెన్నుదన్నుగా ఉంటూ కీలక పాత్ర పోషిస్తున్నట్టు గుర్తించారు. పాకిస్తాన్, భారత్‌లో ఎన్నో దాడులకు ఈ సంస్థ కారణం. కరాచీలో ఉంటూ నిధులు సేకరించే బాధ్యతను రెహమాన్ చూసుకునేవాడు. ఇదిలా ఉండగా, లష్కరే తోయిబా ఉగ్రవాది అబూ ఖతల్ కూడా గుర్తుతెలియని వ్యక్తుల చేతిలో హతమయ్యాడు. అబూ ఖతల్ 2017 రియాసి బాంబు పేలుడు, 2023 జమ్మూ కాశ్మీర్ యాత్రికుల బస్సుపై దాడి ఘటనలో ప్రధాన సూత్రధారిగా ఉన్నాడు.

# మరో భారీ ఎన్‌కౌంటర్

>> ఆలియాస్ సరస్వతి మృతిచెందినట్లు దంతెవాడ ఎస్పీ గౌరవ్ రాయ్ తెలిపారు.ఎన్ కౌంటర్ ప్రాంతంలో ఇన్సాస్ రైఫిల్ తోపాటు ఇతర ఆయుధ మందుగుండి సామాగ్రిని స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు.2025 మార్చి 31 వరకు 119 మంది మావోయిస్టులు మృతిచెందారని పదుల సంఖ్యలో లొంగుబాట్లు జరిగాయని తెలిపారు.రేణుక ప్రస్థానం..దండకారణ్యంలోని అడవి ప్రాంతంలో సోమవారం జరిగిన ఎన్ కౌంటర్ లో మావోయిస్టు అగ్రనేత దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యురాలు గుమ్మడివెల్లి రేణుక ఆలియాస్ సరస్వతి ఆలియాస్ భాను మృతిచెందింది.ఆమె తండ్రి స్వస్థలం వరంగల్ ప్రస్తుత (జనగామ) జిల్లా దేవరుప్పల్ మండలం కడవెండి గ్రామానికి చెందిన గుమ్మడివెల్లి సమ్మయ్య వృత్తిరిత్యా ఉపాధ్యాయిడు ఆయనకు ముగ్గరు కుమార్తెలు ఒక కుమారుడు ఉన్నాడు.సోదరుడు రాజశేఖర్ న్యాయవాదిగా పనిచేస్తూ ఓ స్వచ్ఛంద సంస్ధకు లీగల్ అడ్వైజర్ గా పని చేసి ప్రస్తుతం డిల్లీలోని బిబిసి ( తెలుగు )లో జర్నలీస్టుగా పనిచేస్తున్నట్లు సమాచారం.ముగ్గరిలో రేణుక కూడా ఎల్ ఎల్ బి పూర్తిచేసి ( తిరుపతి )లో న్యాయవాది వృత్తి చేస్తూ మగిళా సంఘాంలో పనిచేస్తూ ఉద్యమం పట్ల ఆకర్షితురాలై అప్పటి ఇప్పటి ఆంధ్ర ప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పై అలిపిరి ఘటన అనంతరం పూర్తిస్థాయిలో ఉద్యమంలోకి వెళ్లింది.1996 లో పార్టీలో చేరిన ఆమె కొంతకాలం మావోయిస్టు స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు కృష్ణతో పనిచేసింది. 2003 డివిజన్ కమిటీ సభ్యురాలిగా 2006 సౌత్ బస్తర్ దిదిలీ దుల్లా దాదా ఆలియాస్ ఆనంద్ తో కొంతకాలం పనిచేసి 2013 లో మాఢ్ ఏరియాకు వచ్చి మావో అగ్రనేత రామన్నతో పనిచేసింది. 2020లో కరోనా కారణంగా రామన్న మృతిచెందటంతో దీరీలీట్రీలీ సెంట్రల్ రీజనల్ బ్యూరో ( సిఆర్ బి) ప్రెస్ టీం ఇంచార్జ్‌గా నియమితురాలైంది. నక్సల్స్ సంస్థ తరుపున ప్రకటనలు జారీచేస్తూ ప్రభాత్ పీపుల్స్ మార్చ్ మహిళా మార్గం అవామి పోడియారో పోల్లో ఝుంకార్ సంఘర్షర్ మహిళా పితూరి మిడంగూర్ భూమ్కర్ సందేశ్ వంటి వివిధ పత్రికలను ముద్రించి ప్రచురించింది. ఉద్యమంలో ఉండగా మావోయిస్టు నేత ఎర్రం రెడ్డి సంతోష్ రెడ్డిని వివాహం చేసుకుంది.సంతోష్ రెడ్డి ఎన్ కౌంటర్ లో చనిపోయిన తర్వాత 2005 లో సెంట్రల్ కమిటీ సభ్యుడు శాఖమూరి అప్పారావు ఆలియాస్ రవి రెండవ వివాహం చేసుకుంది.అతను 2010 లో నల్లమల జరిగిన ఎన్ కౌంటర్ లో మృతిచెందాడు. మావోయిస్టు ఉద్యమంలో 35 సంవత్సరాల పాటు వివిధ హోదాల్లో పనిచేసిన రేణుక తాజా ఎన్ కౌంటర్ లో మృతిచెందడం మావోయిస్టు పార్టీకి తీరనిలోటనే చెప్పాలి.సోదరుడు జివికె ప్రసాద్ ఆలియాస్ సుఖదేవ్ ( గుడ్సా ఉసెండి ) 2014 లొంగిపోయాడు. కడవెండి గ్రామం అంటేనే రజకార్లకు పెత్తందార్లకు సైతం గుండెల్లో వణుకు పుట్టేది.విప్లవాల ఖల్లా గా ఉన్న గ్రామం రేణుక మృతితో విషాధ ఛాయలు అలుముకున్నాయి.రేణుక తల్లిదండ్రులు ప్రస్తుతం హైదరాబాద్ లోని నాగారంలో ఉంటున్నట్లు తెలిసింది.కూతురు మరణవార్త విన్న తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగిపోయారు.మృతదేహాన్ని తీసుకువచ్చేందుకు చత్తీస్‌గఢ్ బయలుదేరినట్లు తెలిసింది.మావోయిస్టు ఉద్యమంలో సుదీర్ఘకాలం పనిచేసిన రేణుక మృతిచెందటంతో ఉద్యమ ప్రస్థానానికి నేటితో తెరపడింది.

# కుర్చీలు వదలని అన్యమతస్థులు

>> తున్నారు. వీరిలో 300మంది వరకు అన్యమత ఉద్యోగులు ఉన్నట్లు నివేదికలు అందినా తొలుత 18మంది ఉద్యోగులపై బదిలీ వేటువేస్తున్నట్లు వెల్లడించారు. అయితే చాలావరకు అలాగే కుర్చీల్లోనే కొనసాగుతున్నారనేది ఉద్యోగుల ఆవేదన. తిరుమల హిందూ పుణ్యక్షేత్రం,టిటిడి హిందూ ధార్మికసంస్థ కావడంతో ఇందులో హిందూ మతస్థులైన ఉద్యోగులే ఉండాలనేది ప్రభుత్వం కూడా నిర్ణయించింది. టిటిడిలో అన్యమత ఉద్యోగులపై బదిలీ వేటువేశామని రెండునెలల క్రిందటే తెలిపారు. తిరుమల పవిత్రతకు భంగం కలిగిస్తున్న వారిని గుర్తించి 69మందితో ఓ జాబితాను కూడా రూపొందించింది. అయినా బదిలీ చేశామని చెబుతున్న టిటిడి అధికారులు వారిని ఎక్కడకు పంపారు అనేది ఇప్పటికీ తెలియని సమాచారం. బదిలీ చేశామని చెప్పిన అధికారులు మార్చి 24న తిరుమలలో జరిగిన పాలకమండలి సమావేశానికి ఓ అన్యమత అధికారి హాజరుకావడం కొసమెరుపు. మరీ ఇలాంటి వారిని సాగనంపడానికి ఇకనైనా కఠినంగా వ్యవహరించాలనేది టిటిడి ఉద్యోగులు కోరుతున్నారు.

# కాకాణి అరెస్టుకు అంతా సిద్ధం

>> వైసిపి సోషియల్ మీడియాలో విడుదల చేశారు. కానీ కాకాణి పరారయ్యారని వార్తల్ని కొన్ని ఛానల్‌లో వదంతులు సృష్టించాయి. ఇదిలా ఉంటే హైదరాబాదులోనైనా ఖచ్చితంగా అరెస్టు చేయాలనే దృఢసంకల్పంతో పోలీసులు ఇందుకు సంబంధించి అన్ని అనుమతులను పొంది కాకాణి అరెస్టు కోసం ప్రయాణమై హైదరాబాద్ చేరినట్టుగా సమాచారం. ఇందుకోసం ముందుగానే కాకాణి నివాసం వద్ద పోలీసులు సోమవారం పోలీస్ విచారణకు హాజరు కావాలని గోడలకు నోటీసులు అంటించారు. ఇదిలా ఉంటే సోమవారం అర్ధరాత్రిలోపు కాకాణిని అరెస్టు చేయాలనే తెలుగుదేశం పార్టీ హై కమాండ్ పట్టుపట్టినట్లు ఈ మేరకు విస్తృతంగా గాలింపులు చేస్తున్నట్లు తెలుస్తుంది. పొదలకూరు మండలం ఇరువురు గ్రామ సమీపంలో రుస్తుం మైన్స్‌లో అక్రమంగా క్వారీ తరలించారని నిబంధనలకు విరుద్ధంగా త్రవ్వకాలు చేపట్టారని అనుమతులు లేకుండా బ్లాస్టింగ్ సామాన్లు భారీగా లభించడంతో ఈ కేసు నమోదైంది. ప్రస్తుతం సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి గతంలో మంత్రిగా కాకాణి ఉన్న సమయంలోనే భారీ అవినీతి దోపిడి జరుగుతుందని గగ్గోలు పెట్టారు. తదుపరి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కాకాణిని ఈ కేసులో ముద్దాయిగా చేర్చారు. ఈ విషయమై ఇటీవల జిల్లా అంతటా చర్చనీయాంసంగా మారింది. ఏది ఏమైనప్పటికి కాకాణి అరెస్టు కాయమని తెలుస్తుంది.

# కొడాలి నాని ముంబయికి తరలింపు

>> న్నారు. గుండెకు సంబంధించిన సమస్యతో మాజీ మంత్రి బాధపడుతున్నారు. ఈ క్రమంలో మెరుగైన వైద్యం కోసం కుటుంబసభ్యులు ఆయనను తీసుకుని ప్రత్యేక విమానంలో ముంబైకు బయలుదేరి వెళ్లారు. మెరుగైన చికిత్స కోసం ముంబైకి తరలించినట్లు చెబుతున్నప్పటికీ గుండె సంబంధిత వ్యాధితో పాటు ఇతర డిజీస్‌లు కూడా ఆయనకు సోనినట్లు సమాచారం.

హైదరాబాద్‌లోని కార్పొరేట్ ఆస్పత్రిలో జీర్ణకోస సంబంధిత వ్యాధితో అడ్మిట్ అయ్యారు మాజీ మంత్రి. అయితే ఆయనకు గుండె సంబంధిత వ్యాధి ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు. గుండెకు సంబంధించి మూడు వాల్వ్‌ పూడుకుపోయినట్లు తెలుస్తోంది. మాజీ సిఎం జగన్.. హైదరాబాద్‌లోని ఆస్పత్రి వైద్యులతో మాట్లాడిన సమయంలో ఈ విషయాన్ని తెలియజేశారు. దీనిపై హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో ప్రయత్నాలు చేసినప్పటికీ సఫలీకృతం కాకపోవడంతో ఆయనను వెంటనే ఎయిర్ అంబులెన్స్‌లో ముగ్గురు డాక్టర్ల పర్యవేక్షణలో హైదరాబాద్ నుంచి ముంబైకి తరలించారు.

ఇటీవల వల్లభనేని వంశీని అరెస్ట్ చేసిన సమయంలో విజయవాడ జిల్లా జైలు దగ్గరకు కొడాలి నాని వచ్చారు. ఆరోజు చాలా యాక్టివ్‌గా ఉన్న నాని.. ఆ తరువాత జీర్ణకోస సంబంధిత వ్యాధి ఉందంటూ హైదరాబాద్‌లోని ఆస్పత్రిలో జాయిన్ అయ్యారు. అయితే కొడాలి నానిని పూర్తిగా పరీక్షించిన వైద్యులు.. ఆయన గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నట్లు గుర్తించారు. వెంటనే సర్జరీ చేయాలని భావించారు వైద్యులు. అయితే సర్జరీ క్రిటికల్‌గా మారడంతో మెరుగైన చికిత్స నిమిత్తం ముంబైకి తరలించాలని వైద్యులు సూచించారు. దీంతో ఆయనను ప్రత్యేక ఎయిర్ అంబులెన్స్‌లో ముంబైకి తరలించారు. ముంబైలో ఎలాంటి చికిత్స అందజేస్తారనే దానిపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



సీతారాముల కళ్యాణ వేదిక వద్ద చర్చిస్తున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, జెఇఒ వీరబ్రహ్మం,ఎస్పి అశోక్ కుమార్, తదితరులు

# శ్రీరామ బ్రహ్మోత్సవాలకు భారీ ఏర్పాట్లు

## ఒంటిమిట్టలో 11న సీతారామకల్యాణం
## నేడు కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం

**రాజంపేట అర్బన్, మార్చి 31 ప్రభాతవార్త** రాష్ట్ర ప్రభుత్వ పండుగ ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయంలో జరిగే శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను పక్కా ప్రణాళికతో చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి, టిటిడి జేఈవో వీరబ్రహ్మం వెల్లడించారు. నేడు రామాలయంలో కోయిల్ అల్వార్ తిరుమంజనం జరగనున్న నేపథ్యం, ఈనెల 11న సీతారాముల కళ్యాణం కార్యక్రమం, 5 తేదీ నుంచి ప్రారంభమయ్యే శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలకు సంబంధించి ఏర్పాట్లను జిల్లా అధికారులు టిటిడి అధికారులు సంయుక్తంగా సోమవారం పరిశీలించారు. శ్రీ సీతారాముల కళ్యాణానికి ఎలాంటి లోటుపాట్లు లేకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... ఏప్రిల్ 5వ వ తేదీ నుండి ఏప్రిల్ 15వ తేదీ వరకు శ్రీ కోదండరామస్వామివారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగనున్నాయన్నారు. అందులో భాగంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు, అసౌకర్యం లేకుండా జిల్లా అధికారులు, టీటీడీ అధికారులు సంయుక్తంగా, సమన్వయంతో పనిచేసి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలన్నారు. ముఖ్యంగా ఎప్రిల్ 11వ తేదీన జరిగే సీతారాములవారి కళ్యాణోత్సవానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వచ్చే అవకాశం ఉన్నందున.. పెద్ద సంఖ్యలో భక్తులతో పాటు ప్రముఖులు, అత్యంత ప్రముఖులు రావచ్చనే అంచనాతో అన్ని రకాల ఏర్పాట్లకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ఆ మేరకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా జిల్లా, టీటీడీ, పోలీస్ అధికారులు సంయుక్తంగా, నిర్దిష్ట ప్రణాళికలతో విధులను నిర్వర్తించాలన్నారు. రాములవారి కళ్యాణోత్సవాన్ని తిలకించేందుకు కళ్యాణవేదిక ముందు ఏర్పాటు చేసిన ఒక్కో గ్యాలరీకి ఒకరిని ఇంఛార్జిగా నియమిస్తామన్నారు. ఎక్కడా కూడా జనం తొక్కిసలాట జరుగకుండా అధికారులు, పోలీస్ తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా ప్రసాదం కౌంటర్ల వద్ద ఎలాంటి అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రతిఒక్కరికీ తాగునీరు, అన్న ప్రసాదం కొరత లేకుండా అందేలా చూడాలన్నారు. కళ్యాణవేదిక వద్దకు భక్తులను తీసుకువచ్చేందుకు ఉచిత బస్సులను ఏర్పాటు చేయాలని టిటిడి జెఈవో కు తెలిపారు. రాత్రి వేళలో కల్యాణోత్సవం చేస్తున్నందున విద్యుత్ దీపాలంకరణ తో పాటు.. అత్యంత పటిష్ట చర్యలను కూడా పాటించాల్సిన అవసరం ఉందన్నారు. భక్తులను విశేషంగా ఆకట్టుకునేలా విద్యుదీకరణ, తోరణాలు, పుష్పాలంకరణ, స్వాగత ఆర్చిలు, ఎల్ఇడి బోర్డులు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ.. టిటిడి అధికారులు, జిల్లా యంత్రాంగం, పోలీసులు సమిష్టి కృషి చేసి ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామివారి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రతి గ్యాలరీ వద్ద గట్టి భద్రతా చర్యలు చేపడతామన్నారు. గతంలో నిర్వహించిన శ్రీ కోదండరామస్వామి బ్రహ్మోత్సవాలు, కళ్యాణోత్సవాల అనుభవాలను గుర్తుంచుకొని.. ఎక్కడా, ఎలాంటి చిన్న పొరపాటుకు కూడా అవకాశం లేకుండా 2000 మందితో బందోబస్తు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ ఏడాది కూడా బ్రహ్మోత్సవాలను విజయవంతం చేసేందుకు టిటిడి విజిలెన్స్, సెక్యూరిటీ అధికారులు సంపూర్ణ సహకారాలు అందించాలన్నారు. ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా.. ప్రత్యేక టీములను ఏర్పాటు చేశామన్నారు. అన్ని పార్కింగ్ ప్రదేశాల వద్ద ప్రత్యేక పోలీసు భద్రతా సిబ్బందిని నియమిస్తున్నామన్నారు. వాహనల ద్వారా వచ్చే భక్తులకు, బస్సుల ద్వారా వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా చర్యలు చేపట్టామన్నారు.

## రాష్ట్రమంతటా ఘనంగా రంజాన్ వేడుకలు



**విజయవాడ,మార్చి31,ప్రభాతవార్తప్రతినిధి:** పవిత్ర రంజాన్ పర్వదినాన్ని రాష్ట్ర వ్యాప్తంగా ముస్లిం సోదరులు ఘనంగా జరుపుకున్నారు. ఒకరికొకరు ఆలింగం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ముస్లిం పర్సనల్ లా బోర్డు పిలుపు మేరకు వక్ఫ్ సవరణ బిల్లు 2024 కి వ్యతిరేకంగా దేశవ్యాప్త నిరసనలో భాగంగా అనేక ప్రాంతాల్లో నల్ల రిబ్బన్లు కట్టుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలు ప్రజా సంఘాల నాయకులు, కార్యకర్తలు ఈద్గాల వద్దకు చేరుకొని ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. వారికి మజ్జిగ పంపిణి చేశారు. మతసామరస్యం వర్ధిల్లాలని, వక్స్ సవరణ బిల్లు 2024ని వ్యతిరేకించాలని, పాలస్తీనాలో గాజాపై యుద్ధాన్ని ఆపాలని నినాదాలు చేశారు. పలువురు ముస్లిం పెద్దలు మాట్లాడుతూ ప్రేమ, సోదరభావం, శాంతికి చిహ్నామే రంజాన్ పర్వదినమన్నారు. ప్రతి ఏడాది హిందూ, ముస్లిం సోదరులు కలిసి ఇక్కడ రంజాన్ పర్వదినాన్ని జరుపుకొని మతసామరస్యాన్ని చాటుకోవడం స్ఫూర్తిదాయకమన్నారు. 30 రోజులపాటు కఠోర ఉపవాస దీక్షలు ఉంటారని తెలిపారు. చక్కగా వర్షాలు కురిసి, పంటలు సమృద్ధిగా పండి ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని వారు ఆకాంక్షించారు.

## పాపాల నిష్కృతికి శరణుజొచ్చే అవకాశం ఈదుల్ ఫితర్ :ముఫ్తి నయిం సాహెబ్



జామియా మస్‌జిద్‌లో ప్రార్ధనలు జరుపుతున్న దృశ్యం

**శ్రీకాళహస్తి,మార్చి 31 ప్రభాతవార్త** ఈదుల్ ఫితర్ నమాజు అంటే ముస్లిం సోదరులకు పండగ. ఆ రోజు ఊరవతల ఈద్‌గాహ్‌లలో వేలాది మంది సోమవారం భక్తి శ్రద్దలతో ప్రార్ధనలు జరుపుకున్నారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంలో శ్రీకాళహస్తి పట్టణంలో రెండు, రేణిగుంట మండలంలో ఒకటి, ఏర్పేడుమండలంలోని పాపానాయుడుపేటలో ఒక ఈద్‌గాహ్‌లు ఉన్నాయి. శ్రీకాళహస్తిలోని రెండు ఈద్‌గాహ్‌లకు వేలాది మంది హాజరై ఈదుల్ ఫితర్ ప్రార్ధనలు జరుపుకున్నారు. ఈద్‌గాహ్‌లు కళ కళ లాడాయి. నాయకుల పలకరింపులతో పులకరించారు. కన్నీరుమున్నీరుగా ' కష్టాల నుంచి కాపాడు అల్లాహ్ అంటూ వేడుకున్నారు. ఈ సందర్భంగా జామియా మస్‌జిద్ కు సంబంధించి ఈదుల గుంట ఈద్‌గాహ్‌లో ముఫ్తినయిం సాహెబ్ మాట్లాడుతూ మనిషి తప్పుల చేసే ఓ బొమ్మ అన్నారు. అయితే చేసిన తప్పులను క్షమించి స్వర్గస్తుల్ని చేసే దయాళువు అల్లాహ్ అన్నారు. అందుకు రంజాన్ మాసం ఓ వేదికగా ఏర్పాటు చేసారన్నారు. రంజాన్ మాసాన్ని మూడు భాగాలుగా విభజించి మొదటి పది రోజులు మనకు సిరి సంపదలుప్రసాదించాలని అలాగేమరో పది రోజులు మన తప్పిదాలను క్షమించమని చివరి పది రోజులు నరకూపం నుంచి కాపాడమని ప్రార్థించుటకు 'దివ్యఖుర్ ఆన్‌ను ప్రతి ఒక్కరు అధ్యయనం చేయాలని ప్రతి ఇంటా చిన్నా పెద్దా, ముసలి ముతక, ఆడ,మగ తేడా లేకుండా అధ్యయనం చేసి సమాజంలో శాంతి సౌభాతృత్వాన్ని నెలకొల్పాలని మత గురువులు రంజాన్ సందర్భంగా పిలుపు నిచ్చారు. ముఖ్యంగా ఐకమత్యం, మహిళలను గౌరవిస్తూ జీవనం గడపాలని కోరారు. తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి పట్టణంలోని పలు ఈద్‌గాహ్‌లు శనివారం ముస్లింలు పవిత్రంగా భావించే రంజాన్ సందర్భంగా ఈదుల్ ఫితర్ ప్రార్ధనలు. ఇక్కడ ఈదుల్ ఫితర్ ప్రార్ధనల్ని ముఫ్తి నయిం సాహెబ్ చదివించారు. ఏర్పాట్లను మసీదు కమిటి అధ్యక్షులు అక్రం సాహెబ్,శ్రీకాళహస్తి ఖాజీ మున్నా (ఫరీఫ్) ఖలీలుల్లా,అంజద్ సాహెబ్,ఉమర్, ఖాజీ మొహిద్దీన్, జామియా మస్‌జిద్ కమిటి సభ్యులు పర్యవేక్షించారు. వేలాది మంది ముస్లిం సోదరులు ఇక్కడ నమాజ్‌ను ఆచరించారు.



జాతీయ యూత్ పార్లమెంటుకు రాష్ట్రం నుంచి ఎంపికైన ఎ.జ్యోత్స్న, లాస్య, శివాని

## జాతీయ యూత్ పార్లమెంటుకు రాష్ట్రం నుంచి ముగ్గురు అమ్మాయిలు ఎంపిక

**విజయవాడ,మార్చి31.ప్రభాతవార్త ప్రతినిధి:** జాతీయ యువ పార్లమెంటుకు ఏపీ నుంచి ముగ్గురు బాలికలు ఎంపికయ్యారు. ఏప్రిల్ నెలలో ఇవి జరుగనున్నాయి. ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో యువజన సర్వీసులు నెహ్రూ యువ కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన వికసిత్ భారత్ కార్యక్రమంలో విశాఖపట్నం నోడెల్ ఏజెన్సీకి చెందిన ఎ. జ్యోత్స్న, లాస్య, శివాని ఎంపికయ్యారు. వీరు ఢిల్లీలో జరగ నున్న జాతీయ స్థాయి యూత్ పార్లమెంటుకు హాజర య్యేందుకు అర్హత సాధించారు. నెహ్రూ యువ కేంద్ర యువ అధికారి జి. మహేశ్వరరావు మాట్లాడుతూ.. విజయనగరం నోడల్ ప్రాంతం నుంచి ముగ్గురు విద్యార్థులు జాతీయ యువ పార్లమెంట్‌కు ఎంపికయ్యారని తెలిపారు. మార్చి 28న గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీలలో దాదాపు 90 మంది విద్యార్థులు పాల్గొన్నారు. జాతీయ స్థాయి పోటీలో ఈ ముగ్గురు విద్యార్థులు పాల్గొంటారనీ, వారందరూ విశాఖపట్నం నుంచి ఎంపికయ్యారని మహేశ్వరరావు పేర్కొన్నారు.

## మార్చినెలలోనూ తగ్గని శ్రీవారి భక్తులు

### - రూ.117కోట్లు చేకూరిన హుండీ ఆదాయం

**తిరుమల,మార్చి 31ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి దర్శనానికి భక్తుల సంఖ్య ఏమాత్రం తగ్గడం లేదు. ప్రతినెలా సరాసరి 23 లక్షలమంది వరకు భక్తులు తిరుమలకు చేరుకుని ఇష్టదైవాన్ని దర్శించుకుంటున్నారు. మార్చినెలలో సరాసరి 21.10లక్షలమందికిపైగా భక్తులు వేంకటేశ్వరస్వామిని దర్శనం చేసుకున్నట్లు తెలుస్తోంది. భక్తులు తమ మొక్కుబడుల్లో భాగంగా కానుకల రూపంలో హుండీకి సమర్పించిన ఆదాయం కూడా 117కోట్ల రూపాయల వరకు చేకూరినట్లు సమాచారం. సోమవారం సాయంత్రం వరకు నెలరోజులలో 20,57,236 మంది భక్తులు దర్శనం చేసుకోగా, హుండీ ఆదాయం 113.92కోట్లు రూపాయలు వసూలైంది. వడ్డీకాసుల వేంకటేశ్వర స్వామిని సంతృప్తికరంగా దర్శించు కుంటున్న భక్తుల సంఖ్యకు రెట్టింపుగా, స్వామివారికి కానుకలు రూపంలో హుండీ ఆదాయం అంత కంతకూ రికార్డు సృష్టిస్తోంది. 2025 నూతన ఆంగ్ల సంవత్సరం ప్రారంభంనుండి 110కోట్ల రూపాయలు హుండీ ఆదాయం వస్తోంది. టిటిడి చరిత్రలో నెలనెలకో ప్రత్యేకత సంతరించుకుంటోంది. కోట్లాదిమంది హిందు భక్తులు దేశవి దేశాల్లో స్థిరపడి వున్నవాళ్ళంతా ఏడు కొండలకు చేరుకుని తమ ఇష్టదైవాన్ని, కులదైవాన్ని దర్శించుకోవడం జరుగు తోంది. మార్చి నెలకు సంబంధించి హుండీ ఆదాయం గణాంకాలు పరిశీలిస్తే మార్చి 18వతేదీ హుండీ ఆదాయం 4.75కోట్లు రూపాయలు, 16వతేదీ హుండీ ద్వారా 4.46కోట్లు రూపాయలు, 10వతేదీ 4.27కోట్లు రూపాయలు, 9న 4.05కోట్లు, 27న 4.36కోట్లు,28న 4.15కోట్లు రూపా యలు వరకు ఆదాయం లభించింది.ఇక మిగిలిన రోజుల్లో వరుసగా సరాసరి 3.65కోట్ల రూపాయల వరకు ఆదాయం చేకూరింది. నెలవారీగా ఏడుకొండలకు చేరుకుంటున్న భక్తుల సంఖ్య సరాసరి 23 లక్షలమంది వరకు ఉంటుండగా,ఆ భక్తులు సమర్పించు కుంటున్న మొక్కుల ద్వారా వడ్డీ కాసులవాడి ఖజానాకు కాసుల వరద వెల్లువెత్తుతోంది. ఇక రానున్న వేసవి సెలవుల్లో ఏప్రిల్,మే, జూన్ మూడు నెలల వరకు భక్తులు తిరుమలకు భారీగా చేరుకునే అవకాశం వుంది. హుండీ కానుకలు మరింత రెట్టింపయ్యే అవకాశం ఉందని టిటిడి వర్గాలు అంచనావేస్తున్నాయి. కలియుగ ప్రత్యక్షదైవమ్,కోట్లాదిమంది భక్తుల ఇలవేల్పుగా కీర్తింపబడుతున్న ఏడు కొండల శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకుని, తమ మొక్కులు తీర్చు కునేందుకు తిరుమలకు సరాసరి నెలవారీగా 23లక్షలమందివరకు భక్తులు వస్తున్నారు. రోజురోజుకూ భక్తుల సంఖ్య రెట్టింపవుతూ దాని ప్రభావం హుండీపై కూడా గణనీయంగా చూపు తోంది. సాధారణరోజులు, వారాంతపు తేడా లేకుండా సరాసరి 70వేల మందిపైగా భక్తులు తిరుమలకు వస్తు న్నారు. రోజువారీగా భక్తుల సంఖ్యను గమనిస్తే మార్చి 23వతేదీ 84,198 మంది భక్తులు, 16న 82,721మంది భక్తులు, 15వతేదీ 82,580మందికి భక్తులకు వెంకన్న దర్శనం చేయించారు. మార్చినెల 9న 79,478మందికి, 22న 75,428 మందికి, 29వతేదీ 76,005 మంది భక్తులకు, 23వతేదీ 84, 198మంది భక్తులకు మహాలఘులో దర్శనం చేయించారు. మిగిలిన రోజుల్లో 65 వేలమందిపైగా చేసుకున్నారు.

## రాష్ట్ర అర్చక సంఘం అధ్యక్షుడిగా నరసింహమూర్తి

**శ్రీకాళహస్తి,మార్చి 31 ప్రభాతవార్త** రాష్ట్ర అర్చక సంఘాధ్యక్షుడుగా శ్రీకాళహస్తికి చెందిన పాలూరు నరసింహామూర్తిని ఎంపిక చేస్తూ రాష్ట్ర బ్రాహ్మణ సేవా సమాఖ్య అధ్యక్షుడు కోనూరు సతీష్ శర్మ ఉత్తర్వులు జారి చేసారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో అర్చకుడుగా పని చేస్తున్న నరసింహామూర్తి స్థానిక ఉద్యోగ సంఘాధ్యక్షుడుగా పనిని చేసారు. ఇక్కడ ఉద్యోగులు ఎదుర్కొంటున్న ఎన్నో సమస్యలపై స్పందించారు. ఆందోళనలు చేసారు. ముక్కుసూటిగా వ్యవహారించే నరసింహామూర్తి సేవలు గుర్తించిన బ్రాహ్మణ సేవా సమాఖ్య రాష్ట్ర అర్చక సంఘాధ్యక్షుడుగా నియమించారు. ఆయనకు శ్రీకాళహస్తిలోని పలువురు అభినందించారు.

## ప్రపంచస్థాయి ఆన్‌లైన్ ముగ్గుల పోటీల్లో జగ్గయ్యపేట యువతి మామిడి హర్షిత విజయభేరి

### - రన్నర్‌గా రూ.15 లక్షల నగదు బహుమతి - వెల్లువెత్తిన ప్రశంసలు, అభినందనలు



**జగ్గయ్యపేట, మార్చి 31, ప్రభాతవార్త :** ఆంధ్రప్రదేశ్ అమెరికన్ అసోసియేషన్ ప్రపంచస్థాయి ఆన్‌లైన్ ముగ్గుల పోటీల్లో పాల్గొన్న ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట పట్టణానికి చెందిన యువతి మామిడి హర్షిత రన్నర్‌గా రూ.15 లక్షల నగదు బహుమతిని సాధించుకున్నారు. ఉగాది పర్వదినం సందర్భంగా అమెరికాలో జరిగిన ఒక వేడుకల్లో ఆంధ్రప్రదేశ్ అమెరికన్ అసోసియేషన్ ప్రతినిధులు విజేతల వివరాలను ప్రకటించారు. జగ్గయ్యపేట పట్టణంలోని బంగారం కొట్ల కూడలిలోగల తన నివాసంలో మామిడి హర్షిత గత జనవరి నెలలో దాదాపు ఏడు రోజులు శ్రమించి పలు రంగుల సమ్మేళనంతో శ్రీనివాసుని కళ్యాణ ఘట్టాన్ని అత్యద్భుతంగా ఆవిష్కరించారు. ఐదు నెలల క్రితమే వివాహం కాగా తెలంగాణా నుండి ఆంధ్రా కోడలిగా జగ్గయ్యపేటలో అడుగు పెట్టిన హర్షిత అత్తగారింట తన హాబీకి ఆమోదం లభించటంతో అంతర్జాతీయ పోటీలకు ఈరంగవల్లిని ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. స్థానిక ఎంఎల్ఏ, టిడిపి జాతీయ కోశాధికారి శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, జెఆర్‌సి విద్యాసంస్థల ప్రెసిడెంట్ రంగాపురం నరసింహారావు-రుక్మిణి దంపతులు, పలువురు కౌన్సిలర్లు తదితరులు జనవరిలో ప్రాణం పోసుకుంటున్న ఈరంగవల్లిని సందర్శించారు. ఎంఎల్ఏ రాజగోపాల్, చైర్మన్ రావేంద్ర రంగవల్లిని చూసిన తోడనే మంత్రముగ్ధులయ్యారు. చూడగానే ఇది రంగవల్లిలా అనిపించలేదని, ఒక కళాఖండాన్ని తివాచీపై ముద్రించి రీతిలో ఉన్నదనే భావన కలుగుతోందని వారు అభిప్రాయం వ్యక్తంచేస్తూ హర్షితను అభినందించారు.

## రాజకీయ దుమారాన్ని రేపుతున్న వైఎస్సార్సీ కార్యకర్త లింగమయ్య హత్య

### - మాజీ ఎంపి గోరంట్ల మాధవ్ హౌస్ అరెస్ట్
### - ఇది ముమ్మాటికి రాజకీయ హత్య అంటున్న మాజీ ఎంపి గోరంట్ల మాధవ్
### - ఇది రాజకీయ హత్య కాదంటున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

**అనంతపురం, మార్చి 31 ప్రభాతవార్త బ్యూరో** శ్రీ సత్యసాయి జిల్లా రామగిరి మండలం పాపిరెడ్డిపల్లిలో వైసిపి కార్యకర్త లింగమయ్య(60) హత్య సంఘటన రాజకీయ దుమారాన్ని లేపుతోంది. టిడిపి నాయకుడు రమేష్ కుమారుడు



దాడి గురైన లింగమయ్య కుమారుడు శ్రీనివాసులు

ఆదర్శనాయుడు ఆధ్వర్యంలో టిడిపి కార్యకర్తలు లింగ మయ్యను హత మార్చినట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. లింగమయ్య భార్య రామాంజి నమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆదర్శ నాయుడుపై రామగిరి పోలీసులు కేసులు నమోదు చేశారు. ఆదివారం రామగిరి మండలం పాపిరెడ్డిపల్లిలో వైసిపి కార్యకర్త లింగమయ్య ఆయన కుమారుడు శ్రీనివాసులుపై రాళ్ళు, కర్రలతో దాడి చేశారు. ఈ సంఘటనలో తీవ్రంగా గాయపడిన లింగమయ్యను ధర్మవరం ఆసుపత్రికి తీసుకొచ్చి అక్కడి నుంచి అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకొచ్చారు. తీవ్రంగా గాయపడిన లింగమయ్య ఆదివారం రాత్రి పొద్దుపోయిన తర్వాత చనిపోయాడు. సోమవారం ఉదయం అనంతపురంలోని ప్రభుత్వ ఆసుపత్రికి లింగమయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తీసుకొచ్చారు. ఈ నేపథ్యంలో భారీ పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. మాజీ ఎంపి గోరంట్ల మాధవ్, మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిలను హౌస్ అరెస్టు చేశారు. అనంతపురంలో తన నివాసం వద్ద నుంచి మాజీ ఎంపి గోరంట్ల మాధవ్ లింగమయ్య మృతదేహాన్ని చూసేందుకు అవకాశం కల్పించాలని గట్టిగా ప్రయత్నం చేశారు. అయితే పోలీసులు పలు మార్లు అడ్డుకున్నారు. తాను మాజీ పోలీసు అధికారిని, కేవలం పరామర్శించడానికి వెళ్తానని మాజీ ఎంపి అడిగినప్పటికీ పోలీసులు అవకాశం కల్పించలేదు. ఈ నేపథ్యంలో వైసిపి కార్యకర్త లింగమయ్య మృతదేహానికి అనంతపురం పోస్టు మార్టంలో నిర్వహించిన తర్వాత రామగిరి మండలం పాపిరెడ్డిపల్లిలో అంత్యక్రియలు నిర్వహించారు. ఇదిలా ఉండగా ఇటీవల రామగిరి మండల ఎంపిపి స్థానానికి ఎన్నికలు జరిగాయి. ఇందుకు సంబంధించి వైసిపి ఎంపిటిసిలను క్యాంపుకు తీసుకెళ్లే విషయంలో రామగిరి మండలం పాపిరెడ్డిపల్లికి చెందిన వైఎస్ఆర్‌సిపి నాయకుడు జయచంద్రారెడ్డి కీలక పాత్ర వహించారు. రామగిరి ఎంపిపి ఎన్నికలు గతంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఆ ఎన్నికల కోరం లేకపోవడంతో వాయిదా పడ్డాయి. జయచంద్రారెడ్డి ఊరిలో లేనప్పుడు ఎమ్మెల్యే పరిటాల సునీత సమీప బంధువైన రమేష్, ఆదర్శనాయుడు దాడులు చేశారన్నారు.

## ఎసిబికి చిక్కిన బిఐఎస్ జాయింట్ డైరెక్టర్ రమాకాంత్ సాగర్

**విజయవాడ,మార్చి31.ప్రభాతవార్త ప్రతినిధి:** బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) జాయింట్ డైరెక్టర్ రమాకాంత్ సాగర్ రూ.70వేలు లంచం తీసుకుంటూ ఏపీలో ఎసీబీకి చిక్కారు. సిలిండర్ కి బీఐఎస్ మార్క్ కోసం ఒతయారీ కంపెనీ దరఖాస్తు చేసుకోంది. అయితే అందుకు ఆయన అంగీకరించలేదు. లక్ష్మీనారాయణరెడ్డిఅనే వ్యక్తి ద్వారా రమాకాంత్ అరీదారును లంచం కోసం డిమాండ్ చేశారు. దీంతో కంపెనీ ప్రతినిధులు అతడిపై సీబీఐ అధికారులకు ఫిర్యాదు చేశారు. విచారణానంతరం రమాకాంత్ సాగర్‌ను సీబీఐ అధికారులు పట్టుకున్నారు. కసుతో సంబంధం ఉన్న లక్ష్మీనారాయణరెడ్డి అనే మరోవ్యక్తిని కూడా అరెస్టు చేశారు. ఘటనకు సంబంధించివివరాలను సీబీఐ అధికారులు విడుదల చేయాల్సి వుంది.

## పాస్టర్ ప్రవీణ్ కుమార్ తన ప్రయాణంలో విజయవాడలో ఎక్కడ ఉన్నారన్న అంశంపై వీడిన మిస్టరీ



**విజయవాడ,మార్చి31 ,ప్రభాతవార్తప్రతినిది**, రాజమహేంద్రవరం లో ఇటీవల అనుమానస్పద పరిస్దితుల్లో మృతి చెందిన పాస్టర్ ప్రవీణ్ కుమార్ తన ప్రయాణంలో విజయవాడలో మూడు గంటల పాటు ఎక్కడ ఉన్నారన్న అంశంపై మిస్టరీ వీడింది. ప్రవీణ్ అలసిపోయి తన ద్విచక్ర వాహనాన్ని రామవరప్పాడు రింగ్‌కు 50 మీటర్లు ముందుగా జాతీయ రహదారిపై ఆపి పక్కన కూర్చున్నట్లు పోలీసులు గుర్తించారు. విజయవాడ రాకముందే రోడ్డు ప్రమాదంలో బుల్లెట్ బండి పాక్షికంగా ధ్వంసమైనట్లు పోలీసులు నిర్ధారించారు. హైదరాబాద్ నుంచి బుల్లెట్ బైక్‌పై బయలుదేరిన పాస్టర్ ప్రవీణ్ పగడాల ఈనెల 24న విజయవాడ మీదుగా రాజమహేంద్రవరం చేరుకున్నారు. పోలీసుల దర్యాప్తులో విజయవాడలో మూడు గంటల పాటు ఆయన ఆచూకీ దొరకలేదు. విజయవాడకు ఆరోజు సాయంత్రం 5 గంటలకే చేరుకున్న ఆయన రాత్రి 8:45కి ఎనికేపాడు దాటినట్లు సీసీ కెమెరాల్లో నమోదైంది. ఆ మూడు గంటల పాటు ప్రవీణ్ ఎక్కడికి వెళ్లారనేది పసిగట్టడం పోలీసులకు సవాలుగా మారింది. గత రెండు రోజులుగా మహానాడు జంక్షన్ నుంచి ఎనికేపాడు వరకు సుమారు 200 కెమెరాలను పోలీసులు జల్లెడ పట్టారు. విజయవాడలోకి ప్రవేశించే ముందే గొల్లపూడి వద్ద ఉన్న సీసీ కెమెరాల్లో నమోదైన దృశ్యాల్లో బుల్లెట్ బైక్ పాక్షికంగా దెబ్బతిన్నట్లు గుర్తించారు. హైదరాబాద్ నుంచి బుల్లెట్ బైక్‌పై బయలుదేరిన పాస్టర్ ప్రవీణ్ పగడాల ఈనెల 24న విజయవాడ మీదుగా రాజమహేంద్రవరం చేరుకున్నారు. పోలీసుల దర్యాప్తులో విజయవాడలో మూడు గంటల పాటు ఆయన ఆచూకీ దొరకలేదు.

విజయవాడకు ఆరోజు సాయంత్రం 5 గంటలకే చేరుకున్న ఆయన రాత్రి 8:45కి ఎనికేపాడు దాటినట్లు సీసీ కెమెరాల్లో నమోదైంది. ఆ మూడు గంటల పాటు ప్రవీణ్ ఎక్కడికి వెళ్లారనేది పసిగట్టడం పోలీసులకు సవాలుగా మారింది.

## వక్ఫ్‌బిల్లులపై సర్వత్రా నిరసనలు మద్దతు ఇవ్వవద్దని సిఎంకు వినతులు

### నల్ల బ్యాడ్జిలతో ఈదుల్ ఫితర్ ప్రార్ధనలు

**శ్రీకాళహస్తి,మార్చి 31 ప్రభాతవార్త** కేంద్ర ప్రభుత్వం రూపొందించిన వక్ఫ్ బిల్లుపై శ్రీకాళహస్తిలోని మైనారిటీలు ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నారు. ఈ నేపథ్యంలో సోమవారం శ్రీకాళహస్తిలోని ఈదుల గుంట, అయ్యలనాడు చెరువు, రాజీవ్‌నగర్ ఈద్‌గాహ్, మసీదే తఖ్వా, మహమ్మదీయ మస్‌జిద్‌లలో మైనారిటి ముస్లింలు నల్లబ్యాడ్జిలు ధరించి ఈదుల్ ఫితర్ ప్రార్ధనలు జరిపారు. అల్లాహ్ నువ్వే కాపాడాలని మొరబెట్టుకున్నారు. అంతేకాక ఈ బిల్లుకు రాష్ట్రంలోని చంద్రబాబునాయుడు మద్దతు ఇవ్వరాదని వినతి పత్రాలను స్థానిక నాయకులకు అందజేసారు. ఈదుల గుంటలోని శ్రీకాళహస్తి నియోజకవర్గానికి సంబంధించిన ఈద్‌గాహ్‌లో జమియతుల్ ఉలమ అధ్యక్షులు ముఫ్తినయిం సాహెబ్ సారధ్యంలో తెలుగుదేశం శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి ప్రతి నిధి పట్టణ పార్టీ అధ్యక్షుడు జి.విజయకుమార్‌కు వినతి పత్రం



టిడిపి నేతకు వినతిపత్రం అందిస్తున్న ముస్లిం నేతలు

అందించారు. ఈ సందర్భంగా హాఫీజే ఖుర్ ఆన్ రేహన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం రూపొందించిన వక్ఫ్ సవరణ బిల్లు మైనారిటి ముస్లింల హక్కులను హరించేదిగా ఉందని వివరించారు. ఇది ముస్లిం షరియత్‌కు విరుద్ధంగా రూపొందించారన్నారు.

14 సవరణలతో రూపొందించిన ఈ బిల్లు అమలు జరిగితే మసీదులు,మదరాసాలు,ఖాన్‌ఖాలు,శ్మశానాలు అన్ని ప్రభుత్వ అధీనంలోకి వెళతాయని వివరించారు.

## పేదరిక నిర్మూలనకు కేంద్రం కట్టుబడి ఉంది: బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి

**విజయవాడ,మార్చి31,ప్రభాతవార్తప్రతినిధి:** పేదరిన నిర్మూలనకు కేంద్ర కట్టుబడి ఉందని,ఆ దిశలో రాష్ట్రానికి సహకరిస్తోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి తెలిపారు. దేశంలోని టాప్ 500 కంపెనీలు ఓ కోటి మంది నిరుద్యోగులకు ఉపాధి చూపాలని ప్రధాని నరేంద్ర మోదీ కోరారని ఆ స్ఫూర్తితో రాష్ట్రంలోని పేదలకు ధనవంతులు చేయూత ఇవ్వాలని సీఎం చంద్రబాబు పిలుపునిచ్చారని అన్నారు. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం సమాంతరంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో ముందుకు వెళ్తున్నాయని తెలిపారు. వైఎస్సార్సీపీ పాలనలో విద్వేషం ఎక్కువై నోరు మెదిపిన వారిపై అక్రమంగా అట్రాసిటీ కేసులను నమోదు చేశారని ప్రజావేదిక కూల్చివేతతో వైఎస్సార్సీపీ తమ విధ్వంస, విద్వేష పాలన ప్రారంభించిందన్నారు. ఒక్క కొత్తపెట్టుబడి కూడా రాష్ట్రానికి రానీయలేదని, బిడ్డలకు ఉపాధి దూరం చేశారని, మద్యం మాఫియాతో వైఎస్సార్సీపీ నేతలు భారీగా డబ్బులు చేసుకున్నారని ఇసుక, మట్టిలోనూ అడ్డగోలుగా వ్యవహరించారని, బీజేపీ ఈ అంశాలపై గళం వినిపించిందన్నారు. లేవనెత్తిన అంశాలపై ఇప్పుడు కేసులు నమోదువుతున్నాయని, తమ వాదన నిజం అని నిరూపితమవుతోందని తెలిపారు. ఎన్నికలకు ముందు మెరుగైన పాలన సాధ్యమని ప్రకటనలను ఆచరణలో సాధ్యం చేస్తున్నామన్నారు.

వార్త

మెదడుకు మంచి, చెడు తెలీదు. అన్ని రకాల ఆలోచనల్నీ అది ఇస్తుంది. అందులోంచి ఎంచుకునే విజ్ఞత నీది.

-గోథే

# సాగుకు మహిళా సాయం

వ్యవసాయం కొత్త పుంతలు తొక్కుతోంది. పొద్దస్తమానం చేలో ఉండి అలసట చెందినభర్తకు వేళకింత భోజనం అందజేయడానికి వెళ్లే గ్రామీణ మహిళలు వ్యవసాయ పనులు చక్కపెట్టడంఆధునిక మహిళాతత్వం. విదేశాల్లో స్త్రీలు వ్యవసాయ పనులను పర్యవేక్షించేందుకు వెళ్ళే ఆనవాయితీ ఉన్నా భారతీయ మహిళలు ఇప్పుడిప్పుడే వ్యవసాయ క్షేత్రాలకు వెళ్లి పనులు మెరుగుపరుస్తున్నారు. ఖాళీ సమయాల్లో భర్తలతో పాటే స్వక్షేత్రాలలో పొలం పనులు చక్కపెట్టేందుకుభార్యలు చేదోడువాదోడుగా పాల్గొంటున్నారు.ఇలాంటిసంస్కృతి నానాటికీ పెరుగుతోంది. దేశీయ వ్యవసాయ రంగంలో మహిళల పాత్ర తక్కువేమీకాదు. సాగుసర్వం మహిళామయమే. గ్రామీణ మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వంఎన్నో విధాలుగా సౌకర్యాలు కల్పిస్తోంది. అంతరిక్షంలో అడుగెట్టక ముందే పంటచేలో పనులకు దిగేవారు. రానురాను వాళ్లే మహిళా రైతులుగా రాణించారు. అతివలు అన్ని రంగాలలో తామే ముందున్నామన్న స్థాయికి ఎదిగారు. పంట చేలో కలుపు తీయడమేకాదు, మాసూళ్ళు, కళ్ళాల్లో ధాన్యం ఎగరబోత, సంచుల్లోకి ఎత్తివేత వంటి అన్ని వ్యవసాయ కార్యకలాపాలకూ అలవాటుపడ్డారు. ఇప్పుడు వ్యవసాయ రంగంలో కూడా మహిళలు తమకు తామే సాటి అనిపించుకున్నారు. వ్యవసాయ రంగంలో గ్రామీణ మహిళను సాధికారికవైపు నడిపించాలని ప్రభుత్వం సంకల్పించింది. వ్యవసాయ యాంత్రీకరణకు అనుబంధంగా, కేంద్ర ప్రభుత్వం మహిళలకు డ్రోన్‌ల నిర్వహణలో ప్రత్యేక శిక్షణనిస్తోంది. తాజాగా డ్రోన్‌ల నిర్వహణలో తర్ఫీదు పొంది డ్రోన్ దీదీలనిపించుకున్నారు. సాగురంగంలో 80 శాతం మంది గ్రామీణ మహిళలు ఉపాధిపొందుతున్నారు. వీరిలో నిరక్షరాస్యత వల్లనే సరైన వేతనాలు అందుకోలేక పోతున్నారనే అపవాదు కూడా ఉంది. ఆర్థిక స్వావలంబన సాధించాలంటే మహిళా సాధికారత అత్యవసరమని ప్రభుత్వాలు గుర్తించాయి. మహిళలకు వ్యవసాయ అనుబంధ రంగాలలో ఉపాధి కార్యక్రమాలు చేపడుతున్నాయి. ఏనాటి నుంచో కాఫీ, టీ తోటల్లో మహిళా కార్మికులు పనిచేస్తున్నారన్న విషయం మనకు తెలిసిందే. వ్యవసాయంలో మహిళా భాగస్వామ్యంపై 2020 మే నాటి అగ్రికల్చరల్ వేజెస్ ఇన్ ఇండియా(ఏడబ్ల్యూఐ) నివేదిక పేర్కొంది. వ్యవసాయ యాజమాన్యంలోకి ఇంతవరకు కేవలం 1.9 శాతం మంది ఉండగా, వ్యవసాయ కూలీలుగా పనుల్లోకి వస్తున్న మహిళలు 64శాతం మంది ఉన్నట్లు ఇటీవల కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి. ఇప్పుడు సాధారణ సాగు రంగంలో కూడా మహిళలు అసాధారణ ప్రజ్ఞ కనబరుస్తున్నారు. రోజువారీ వ్యవసాయ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. నేరుగా రైతులు గానే మహిళలు స్వయం సమృద్ధి సాధించారు. ఆర్థిక అభివృద్ధిలో వారికి వారే సాటిని అనిపించుకున్నారు. సన్న చిన్నకారు రైతుల కమతాల్లో మహిళలే వ్యవసాయ కార్యకలాపాలు సొంతంగా నిర్వహిస్తున్నారు. భర్తలు వ్యవసాయ కూలీలుగా ఇతర పొలాల్లో పనులకు వెళ్తుంటే భార్యలు మాత్రం తమ చేలను శుభ్రపరుచుకోవడం దగ్గర నుంచి దున్నడం, విత్తు నుంచి ఉత్పత్తివరకు జరిగే అన్నికార్యక్రమాల్లో వారే పాల్గొంటున్నారు. ఇప్పుడు వారికి జీవనోపాధి కల్పిస్తోంది. దేశంలో ఎన్నో రాష్ట్రాల్లో మహిళా కార్మికులు ఉన్నప్పటికీ ఇటీవల కాలంలో తెలుగురాష్ట్రాల్లో మహిళల వ్యవసాయ కార్యకలాపాలు బాగా పెరిగిపోయాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో 30లక్షల కమతాలను మహిళలే స్వయంగా సాగు చేస్తున్నారని వ్యవసాయ గణాంకాలు చెబుతున్నాయి. 2024నాటికి దాదాపు 46లక్షల వ్యవసాయ కమతాల్లో మహిళలు పంటల సాగు చేస్తున్నారని అంచనా. మహిళా యజమాన్యంలోనూ వ్యవసాయం పరిఢవిల్లుతోందన్న మాట. ఈ కాలంలో అధికశాతం మహిళా సాగుదారులే తారసపడుతున్నారు. ఆదాయం పెద్దదా, చిన్నదా అని కాకుండా రైతుకు చేదోడు వాదోడుగా ఉంటున్నారు. కుటుంబ సాగుభూముల భారంలో అత్యధిక భాగాన్ని మోస్తూవారు భారతదేశపు అగ్రి ఎకానమీలో గుర్తింపు పొందారు. దేశంలో కీలకమైన వ్యవసాయరంగం దశాబ్దకాలంగా ఆధునికతను జోడించుకోవడంతో పెద్ద పెద్ద చదువులు చదివిన మహిళలు సైతం సేంద్రియ వ్యవసాయం స్వయంగా చేప డుతున్నారు. సాగు బాట గణనీయంగా వృద్ధి చెందింది. సాగు రంగానికి దేశ జీడీపీలో సుమారు 20శాతం వాటా ఉంది. దేశీయంగా పనిచేస్తున్నవారిలో దాదాపు45శాతం మందికి ఉపాధికల్పిస్తోంది. ఇందులో దాదాపుసగంమంది మహిళలే ఉంటారు. దాదాపు 79 శాతం మంది మహిళలు వ్యవసాయంలోనే ఉంటున్నారు. కుటుంబపు ఆదాయాలను మెరుగుపర్చుకోవడంతో పాటు ఈ మహిళలకు ఇంటి పనులను నిర్వర్తించాల్సి న బాధ్యతలు కూడా ఉంటాయి. ఎంతో కీలక మైన పాత్ర పోషిస్తున్నప్పటికీ లింగపరమైన చిన్నచూపు, సామాజిక ఆంక్షలు, సాంప్రదాయకంగా పోషించాల్సి న బాధ్యతల భారాలు మొదలైనవాటి కారణంగా వ్యవసాయపరిజ్ఞానం, సాంకేతికత మహిళలకు అంతగా అందుబాటులో ఉండ టం లేదు. దీంతో ఉత్పాదకత తక్కువగా ఉం టోంది. 2023-24 పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే (పీ ఎల్ ఎఫ్ఎస్) ప్రకారం 7ఏళ్ల పైబడిన గ్రామీణ ఆడవారిలో అక్షరాస్యత రేటు 70.4 శాతంగా ఉండగా, గ్రామీణ పురు షుల్లో 84.7 శాతం. పట్టణ ప్రాంత మహిళల్లో 84.9 శాతంగాఉంది. వ్యవసాయమే కాదు వ్యవసాయ సంబం ధిత అనుబంధ ఉత్పత్తులు సాధించడంలోనూ మహిళల పాత్ర తక్కువేమీ కాదు. దేశ ఆర్థికవ్యవస్థను పటిష్టపరిచే మహిళా వ్యవసాయాన్ని పెంపొందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఇంకొన్ని పథకాలను ప్రవేశపెట్టడం అవసరం.

సాధన లేకుండా విజయాన్ని ఆశించడం ఎడారిలో మంచినీళ్ల కోసం వెతకడం వంటిది.



విశ్వేశ్వరయ్య

మనుషులందరూ వృద్ధులుగా మారతారు. కానీ మంచివారుగా మారటం అరుదు.



స్వీడెన్‌బర్గ్

## ప్రజావాక్కు



### ఛార్జీల పెంపును ఉపసంహరించండి

ఈ ఏడాది మే నెల 1వ తేదీ నుండి సామాన్యులు తమకు డబ్బు అవసరమైనప్పుడు దగ్గరలో కనిపించిన ఏటీఎంకి వెళ్లి డబ్బులు విత్‌డ్రా చేయడం అందరికీ భారంగా ఉండవచ్చు. ఇటీవల నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ప్రతిపాదన, వైట్‌లేబుల్ ఏటీఎం ఆపరేటర్ల ఒత్తిడి మేరకు మే నెల 1వ తేదీ నుంచి ఏటీఎం ఇంటర్ చేంజ్ ఫీజుల పెంపునకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆమోద ముద్ర వేసినట్లుగా పత్రికల్లో కథనాలు వస్తున్నాయి. దీంతో ఇతర బ్యాంకు ఏటీఎంలను ఉపయోగించే కస్టమర్లు నగదును ఉపసంహరించుకోవడం లేదా నగదును చెక్‌చేసుకోవడం వంటి పనులు ఇప్పుడు మరి కొంచెం ఖరీదవుతుంది. అలాగే ప్రస్తుతం అన్నిబ్యాంకుల ఏటీఎంలలో 500 రూపాయల నోట్లు మాత్రమే ఉంటున్నాయి. చిల్లరనోట్లు లభించడం గగనంగా మారింది.

-దాసం వెంకటరెడ్డి, పశ్చిమ గోదావరి జిల్లా

### పాత పద్ధతులే మేలు

ప్రైవేట్, కార్పొరేట్ టీచర్ల కంటే ప్రతిభ ఎక్కువ నైపుణ్యాలున్న ప్రభుత్వపాఠశాల టీచర్లుతెలుగు మీడియం ప్రోత్సహించడందురదృష్టకరం. ప్రపంచం ఎలాపరుగులు పెడితే మనం అలా పరుగులు పెట్టాల్సిందే. ఆ రోజుల్లో కూడా స్కూల్ అవర్స్ అయిపోయిన తర్వాతవిద్యార్థినివిద్యార్థులు ఉపాధ్యాయుల ఇల్లలోనే ఉండేవారు. ప్రైవేట్ చెప్పడానికి టీచర్లు గ్రామాల్లోఉండేవారు. విద్యార్థినీ విద్యార్థులు రాత్రి పడుకోవడానికి మాత్రమే గ్రామాల్లో ఇళ్లకు చేరుకునేవారు. ప్రతి సబ్జెక్టు వంద మార్కులకు ఉండాలి.

-వీరగంట భాస్కర్ రావు, హైదరాబాద్

### ఉద్యోగాల భర్తీ వేగంగా జరగాలి

రాష్ట్ర ప్రభుత్వ అత్యున్నత స్థాయి సర్వీస్ అయినటువంటి గ్రూప్1తో సహా దాదాపు అన్ని పోటీపరీక్షల్లో వివాదాలు, ఆందోళనలు, వాయిదాలు ఇటీవల సహజమైపోయాయి. దీనివల్ల ఉద్యోగార్థులు తమవిలువైన సమయం, ధనం కోల్పోవల్సి వస్తుంది. నోటిఫికేషన్ సమయంలోనే అన్ని న్యాయపరమైన సలహాలను తీసుకొని రాజ్యాంగ బద్ధ సంస్థ టిజిపిఎస్‌సితో సమన్వయం చేసుకుంటూ ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ నుంచైనా వివాదాలు తలెత్తకుండా ఉద్యోగాల భర్తీ వేగంగా జరగాలి.

-ముత్యంరెడ్డి, సిద్దిపేటజిల్లా

### హాస్యం ఆరోగ్యం

ఈ మధ్య కునాల్ క్రమా అనీ స్టేజీ హాస్యనటుడు తాను నిర్వహించే ఒసన్నివేశంలో మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి గారిమీద ఓ అసంబద్ధపు వ్యాఖ్యానం చేసాడని దేశమంతా రచ్చరచ్చ అయింది. మనిషికి గౌరవాన్ని తెచ్చేదితోలగించేది వాక్కు మాత్రమే నని ప్రతిపౌరుడు గుర్తెరగాలి. ఈ సత్యాన్ని విస్మరిస్తే అపవాదులను ఎదుర్కొనవలసి వస్తుంది. ముఖ్యంగా సమాజంలో పేరున్న వారు వినయాన్ని అన్నివేళలా పాటించాలి. కునాల్ క్రమా చేసిన తప్పిదం సంచలనం సృష్టించింది. అయినా ఇటువంటి వ్యాఖ్యలకు ప్రాముఖ్యం ఇవ్వకూడదు. సినిమాల్లో రాజకీయ నాయకులమీద, పోలీసులమీద అనేక సెటైర్లు చూస్తున్నాము. వాస్తవమున్నా ఎవరూ వీటిని సీరియస్‌గా తీసుకోవడం లేదు. తనమీద వచ్చిన కార్టూన్లను చూసి ముసిముసిగా నవ్వుకునేవారట జవహర్ లాల్ నెహ్రూ గారు. కునాల్ క్రమా కోర్టు కేసులను ఎదుర్కొనే పరిస్థితి వచ్చింది. హాస్యం ఆరోగ్యకరం.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

### టాటూలు వద్దు

టాటూలు వేసుకోవడం ఈ రోజుల్లో యువతకు పెద్ద ఫ్యాషన్‌గా మారింది. ఒకర్ని చూసి మరొకరు ఇష్టం వచ్చిన చోట టాటూలు వేయించుకుంటున్నారు. అయితే ఇది ఆరోగ్యానికి హానికరం అంటున్నారు నిపుణులు. టాటూ వల్ల క్యాన్సర్ వచ్చే ప్రమాదంఉందని అధ్యయనాలు చెబుతున్నాయి. కాబట్టి టాటూలు జోలికి వెళ్లకుండా ఉండాలి.

- మా.శ్రీ.రాజు, పాల్వంచ

### వికలాంగులకు రాత్రి డ్యూటీలు వద్దు

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కాలంలో గురుకులాలలో 9210 పోస్టులను భర్తీ చేయడం జరిగింది. అందులో వికలాంగుల కోటాలో సెలెక్ట్ అయిన టీచర్స్, లెక్చరర్స్ కు రాత్రి పూట డ్యూటీలు వేయడం వలన చాలా ఇబ్బందులు పడుతున్నారు. తెలంగాణ రాష్ట్రప్రభుత్వం వికలాంగులకు గురుకులాలలో రాత్రిపూట డ్యూటీలు స్టడీ అవర్ నుండి మినహాయింపు ఇవ్వాలి. అందుకోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలోని వివిధ సొసైటీలలో పరిధిలో ఉన్న ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ గురుకులాలకు వికలాంగులను నైట్ డ్యూటీ నుండి మినహాయిస్తున్నట్లుగా వికలాంగులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించాలి. వికలాంగులకు ఉదయం సమయంలో డ్యూటీలు మాత్రమే వారికి ఇవ్వాలి. మరొకరి సహాయంతో వారు డ్యూటీలు చేస్తారు.

-రాపాక రవీందర్, జనగాం

మన వి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpagevaarta@gmail.com)

# సంపద కేంద్రీకృతంతో ఆకలి కేకలు!

**ప్రపంచవ్యాప్త కోటీశ్వరుల్లో దాదాపు 40 శాతం మంది అమెరికాలోనే ఉన్నారు. చైనాలో 20 శాతం మంది, జపాన్‌లో ఐదు శాతంమంది ఉన్నారు. ఇలా ప్రపం చంలో మన దేశంలో సామాజిక, ఆర్థిక, అసమానతలతో ఆకలి కేకలు మరోవైపు సంపన్నుల కుబేరుల సంఖ్య పెరు గుతున్న తీరుతో ఆ రుగ్మతను కట్టడి చేయలేని పాలకుల విధానాలతో పేదరికంలో అభాగ్యుల జీవితాల్లోచీకట్లు కమ్ము కున్నాయి. ఈ ఆర్థిక అసమానతలు, ఆకలికేకలు పెరిగిపో తున్నాయి. జరిగిన ఇన్నాళ్ల నిర్లక్ష్యాన్ని ఐక్యరాజ్యసమితి యుద్ధ వాతావరణాన్ని, నివారించడానికి వెంటనే అంతర్జాతీ య స్థాయిలో పరిష్కారానికి పూనుకోవాలి. ప్రస్తుత పరిస్థి తుల తీవ్రత దృష్ట్యా పాలకులు విధానాలు మార్చుకొని ఆకలి కేకలు లేని సమసమాజ స్థాపనకు పూనుకోవాలి.**

మేకిరి దామోదర్

ప్రపంచంలోని అనేక దేశాల్లో ఘర్షణలు, యుద్ధాలు జరుగుతున్న విషయం తెలిసిందే. వీటి కారణంగా అక్కడ నివసిస్తున్న ప్రజానీకానికి తినడానికి సరైన తిండి లభించడం లేదు. వారి ఆకలి కేకలను పట్టించుకునే నాధుడే కనిపించడం లేదు. అంతర్జాతీయ సంస్థలు మానవతా సహాయాన్ని పంపుతున్నప్పటికీ అవి బాధితులకు చేరడంలో ఎన్నో అవరోధాలు ఏర్పడుతున్నాయి. కయ్యానికి కాలు దువ్వుతున్న పక్షాలు బయట నుంచి వస్తున్న సాయాన్ని అడ్డుకుంటున్నాయని ఆక్స్‌ఫామ్ నివేదిక తెలిపింది. ఘర్షణలు చెలరేగిన దేశాల్లో ప్రతిరోజూ ఆకలికి తాళలేక పట్టెడు అన్నం కోసం 7వేలనుంచి 21 వేల మంది వరకు ప్రాణాలు కోల్పోతున్నారంటూ ఈనివేదిక చేదునిజాన్ని బయట పెట్టింది. మరోవైపు దుర్భర దారిద్ర్యంలో 110 కోట్లమంది నెట్టివేయబడుతున్నారు. ఇందులో యుద్ధాలు, దాడులు, ఘర్షణలు నెలకొన్న దేశాల్లోనే సగం మందితోపాటు, భారత్లో అత్యధికంగానే ఉన్నారు. యుద్ధాలు జరుగుతున్న దేశాలు బహుముఖ దారిద్ర్యాన్ని సంబంధించిన అన్ని సూచికల్లోనూ అధిక శాతం లేమిని ఎదుర్కొంటున్నాయని ఐక్యరాజ్య సమితి అభివృద్ధి కార్యక్రమం యూఎన్డీపీ ప్రచురించిన సూచీలు పేర్కొంది. 112 దేశాల వ్యాప్తంగా 630కోట్ల మంది ప్రజలపై జరిగిన పరిశోధనలో ఈ విషయాలు వెల్లడయ్యాయి. 110 కోట్ల మంది ప్రజలు అత్యంత దారుణమైన రీతిలో దారిద్ర్యాన్ని అనుభవిస్తున్నారని పేర్కొంది. వీరిలో 45.5 కోట్ల మంది ప్రజలు ఘర్షణల నీడలో జీవిస్తున్నారని మల్టీ డైమెన్షన్ పావర్టీ ఇండెక్స్ పేర్కొంది. ఈ ఆహార సంక్షోభాలు మానవులు సృష్టించినవే. ఘర్షణలో అట్టుడికిపోతున్న గాజా సూడాన్‌లో, రష్యా, ఉక్రెయిన్ లక్షల మందికి ఆహారం అందని దారుణ పరిస్థితులు. ప్రపంచంలో ఏదో మూల యుద్ధ వాతావరణం, ఘర్షణ వాతావరణం నెలకొంది. దీనికి ప్రపంచ ఆధిపత్యం, సామ్రాజ్యవాదం, కార్పొరేటీకరణ మూలంగా మానవీయ కోణం కనుమరుగవుతుంది. శాంతితోనే పేదరిక నిర్మూలనని ఐక్యరాజ్య సమితి వెల్లడించినప్పటికీ సంపన్న దేశాలు అభివృద్ధి చెందుతున్న, పేద దేశాల మధ్య ఆర్థిక, రాజకీయ, సామ్రాజ్య కాంక్షల వైరుధ్యాల ఫలితంగానే ఈ పరిస్థితి. 2030 నాటికి ప్రపంచంలో ఆకలి అనేది లేకుండా చేయాలన్న లక్ష్యాన్ని సాధించడం ఈ పరిణామాల దృష్ట్యా అసంభవం అవుతుందని ఆక్స్‌ఫామ్ హెచ్చరించింది. అంతర్జాతీయ చట్టం ప్రకారం, ఆకలి నేరాలకు కారకులైన వారిని గుర్తించి బాధ్యులను చేయాలని ఐరాస భద్రతా మండలి సహా అంతర్జాతీయ సమాజాన్ని కోరింది. ఆహార భద్రత ఘర్షణలకు అడ్డుకట్ట వేయాలంటే ప్రపంచ నేతలు ఘర్షణలకు మూల కారణాలైన వలసవాద వారసత్వాలు, అసమానతలు మానవ హక్కులు ఉల్లంఘన, ఆధిపత్యం, సామ్రాజ్యవాదం లాంటి వాటిపై పోరాడాలని ఫార్ సూచించారు. మన భారతావనిలో ఆకలికేకల, సూచికలో దిగజారుతున్న స్థానం. ప్రపంచ ఆకలి సూచిక(జీహెచ్ఐ)లో మన స్థానం నానాటికి దిగజారిపోతుంది. 2024న సంవత్సరానికి సంబంధించిన విడుదలైన 19వ జీహెచ్ఐలో భారత్ 105వ స్థానంలో (మొత్తం 127 దేశాలు) నిలిచింది. పొరుగున ఉన్న నేపాల్, శ్రీలంక, మయన్మార్, పాకిస్థాన్, ఆఫ్ఘానిస్థాన్ కంటే వెనుకబడి పోయింది. ప్రపంచ దేశాలలో ఆకలిని తగ్గించే విషయంలో 2016 నుండి పురోగతి లేదని నివేదిక పేర్కొంది. 2030 నాటికి ఆకలిని పూర్తిగా నిర్మించాలన్న లక్ష్యాన్ని చేరుకోవడం సాధ్యం కాకపోవచ్చు అని స్పష్టం చేసింది. ఎందుకంటే ఆకలిపై 127 దేశాలలో అధ్యయనం జరుపగా 42 దేశాలు నేటికీ 'తీవ్రత/ఆందోళనకర' స్థాయిలో ఉన్నాయి. ప్రపంచ ఆకలి సూచీలో గతపదేండ్లుగా మన దేశ ర్యాంకు అధోపాతాళానికి పడిపోతున్నది. వజ్రోత్సవాలు జరుపుకున్న స్వతంత్ర భారతదేశంలో ప్రజల పరిస్థితి "అన్న వస్త్రాలు అడిగితే ఉన్నవస్త్రాలు ఊడిపోయినట్లు' గా



మారిపోయింది. 2014లో ఆకలి సూచిలో 55వ స్థానంలో ఉన్న మన దేశం 2024లో 105వ స్థానానికి దిగజారడం విడ్డూరమే. అందునా దక్షిణాసియా దేశాలన్నింటిలోకెల్లా చివరి నిలవడం ఈ దేశ దినస్థితికి పరాకాష్ట. మనం మనకు ఉన్న ప్రకృతి మానవ వనరులను సరిగ్గా ఉపయోగించుకోలేని దుస్థితిలోఉన్నాం. అందుకే నేటికీ దేశంలో ఆకలి మంటలు రగులుతున్నాయి. ప్రపంచంలో తీవ్రమైన 31ఆకలి రాజ్యాలలో భారత్ కూడా ఉండటం కడువిషాదం. ఒకవైపు భగ్గుమంటున్న నిత్యవసరాల ధరలు సెగలకు అసంఖ్యాకులైన సామాన్యులు విలవిలలాడుతున్నారు. ఇలా పట్టెడు అన్నంకోసం పరితపించే అభాగ్యుల సంఖ్య ప్రపంచమంతా పెరిగిపోవడం నేటి విషాదం. అదే సమయంలో రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రం ఆర్టికల్ 39(ఏ) ప్రకారం దేశంలోని పౌరులందరికీ తగిన జీవన సదుపాయాలు కల్పించాలి. దేశంలోని ప్రతిపౌరునికి నాణ్యమైన ఆహారం అందించాల్సి న కనీస బాధ్యత ప్రభుత్వాలపై ఉంది. దేశంలో ఆహారాన్ని కొరత లేకపోయి ఉంటే ఆకలి చావుల సంఖ్య శూన్యంగా ఉండాలి కదా!. కానీ నేటికీ దేశంలో ఆకలి చావులు లేని రోజు లేదంటే అతిశయోక్తికాదు. దేశంలో ప్రతిరోజు దాదాపు 19 కోట్ల మంది ఆకలి కడుపుతో నిద్రిస్తున్నారని జాతీయ ఆరోగ్య నివేదిక తెలిపింది. ఇలా ఆకలి చావులు ఎందుకు పెరుగుతున్నాయి అన్న దానికి సమాధానం లేదు?. అది ప్రశ్నగానే మిగిలిపోతుంది. దేశంలో పరిస్థితి అలాగే కొనసాగితే 2025 నాటికి ఐక్యరాజ్యసమితి విధించిన ప్రపంచ పౌష్టికాహార లక్ష్యాన్నిగాని, 2030 నాటికి రెండవ సుస్థిరాభివృద్ధి లక్ష్యమైన 'జీరో హంగర్న్'గాని చేరుకోవడం భారత దేశానికి పెను సవాలే!. ఇప్పటికైనా ప్రభుత్వాలు మేలుకొని వ్యవసాయం, ఆహార భద్రత పౌష్టికాహార పంపిణీపై దృష్టి సారించాల్సి న అవసరం ఉంది. ప్రపంచంలో మనదేశంలో ఇప్పటివరకు మనం పరిశీలించింది ఒకవైపే. మరోవైపు సంపద సంపన్నుల చేతిలో కేంద్రీకృతం అయిపోతుందో పరిశీలిద్దాం. 2024లో నైట్ ఫ్రాంక్ అంతర్జాతీయ స్థిరాస్తి కన్సల్టెంట్ సంస్థ నివేదిక మేరకు, 2023లో అధిక సంపద కలిగిన కుబేరులు, కోటీశ్వరులు సంఖ్య (హెచ్‌డబ్ల్యు ఐ) 80,686 మంది ఉంటే 2024లో ఈ సంఖ్య 85,698కు చేరింది. 2028 నాటికి ఈ సంఖ్య 93,7503 చేరొచ్చని అంచనా వేసింది. అధిక సంపద కలిగిన వ్యక్తుల సంఖ్యాపరంగా భారత్ 85,698తో నాలుగో స్థానంలో ఉండగా, అమెరికా 9,05,413 మంది, చైనా 4,71,634 మందితో, జపాన్ 1,22,119 మందితో మూడు స్థానాల్లో ఉన్నాయి. భారత్ 85.698 మందితో నాలుగో, జర్మనీ 69.796 మందితో ఐదో స్థానం, కెనడా 64,982 మందితో ఆరో స్థానం, బ్రిటన్ 55,667తో ఏడో స్థానంలో, ఫ్రాన్సు 51,254తో ఎనిమిదో స్థానంలో, ఆస్ట్రేలియా 42,789తో తొమ్మిదో స్థానంలో, హాంకాంగ్ 42.715 మందితో పదో స్థానంలో ఉన్నాయి. ప్రపంచ వాటాగా గుర్తించింది. 10 మిలియన్ డాలర్ల (రూ 87 కోట్లకు) మించి ఆస్తులు కలిగి ఉన్న వారిని అధిక సంపద కలిగిన వ్యక్తులు, కోటీశ్వరులుగా నివేదిక పరిగణించింది. భారత్లోనూ కుబేరుల బిలియనీర్ కనీసం రూ. 8700కోట్ల సంపద కలిగిఉన్న వ్యక్తుల సంఖ్య కూడా గత ఏడాది పెరిగింది. ప్రస్తుతం 191మంది కుబేర్లకు భారత్ నివాసంగాఉంది. గత ఏడాది 26మంది ఈజాబితాలో చేరారు. 2019లో ఏడుగురే జత చేరారు. దేశంలోని కుబేరులందరి మొత్తం సంపద 950 బిలియన్ డాలర్లు. సుమారు రూ.82.65 లక్షల కోట్లుగా ఉండొచ్చని నివేదిక అంచనా వేసింది. అంతేకాదు భారత్లో అధిక సంపదకలిగిన వ్యక్తుల సంఖ్య అనూహ్యంగా పెరగడానికి దోహదం చేస్తుందని నైట్ ఫ్రాంక్ ఇండియా తెలిపింది. అలాగే 2024లో ప్రపంచవ్యాప్తంగా కోటీశ్వరుల సంఖ్య 4.4శాతం పెరిగి23 లక్షలకు చేరింది. ప్రపంచవ్యాప్త కోటీశ్వరుల్లో దాదాపు 40 శాతం మంది అమెరికాలోనే ఉన్నారు. చైనాలో 20 శాతం మంది, జపాన్‌లో ఐదు శాతంమంది ఉన్నారు. ఇలా ప్రపంచంలో మన దేశంలో సామాజిక, ఆర్థిక, అసమానతలతో ఆకలి కేకలు మరోవైపు సంపన్నుల కుబేరుల సంఖ్య పెరుగుతున్న తీరుతో ఆ రుగ్మతను కట్టడి చేయలేని పాలకుల విధానాలతో పేదరికంలో అభాగ్యుల జీవితాల్లోచీకట్లు కమ్ముకున్నాయి. ఈ ఆర్థిక అసమానతలు, ఆకలికేకలు పెరిగిపోతున్నాయి. జరిగిన ఇన్నాళ్ల నిర్లక్ష్యాన్ని ఐక్యరాజ్యసమితి యుద్ధ వాతావరణాన్ని, నివారించడానికి వెంటనే అంతర్జాతీయ స్థాయిలో పరిష్కారానికి పూనుకోవాలి. ప్రస్తుత పరిస్థితుల తీవ్రత దృష్ట్యా పాలకులు విధానాలు మార్చుకొని ఆకలి కేకలు లేని సమసమాజ స్థాపనకు పూనుకోవాలి. ●

# ఆందోళన కలిగిస్తున్న భూకంపాలు!

తోట యోగేందర్

ఇటీవల మార్చి 28, 2025న బంగ్లాదేశ్ సరిహద్దుకు సమీపంలో మయన్మార్‌లో 7.7 తీవ్రతతో భూకంపం సంభవించింది , దీని వలన పొరుగున ఉన్న థాయిలాండ్‌లో తీవ్ర నష్టం సంభవించింది. థాయిలాండ్‌లో ఆ దేశ ప్రధాని అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. నిజానికి ఈ దేశంలో పర్యాటక రంగం ప్రధానమైంది. వారానికి 2 లక్షల మంది పర్యాటకులు ఆ దేశానికి వస్తారు. ఆ దేశానికి వచ్చే ఆదాయం కేవలం టూరిజం మీదనే. మయన్మార్‌లో రెండవ అతి పెద్ద నగరం మాండలేలో బహుళ అంతస్తుల భవనం ఒక్క సారిగా కుప్ప కూలిపోయింది. అందులో 43మంది నిర్మాణ కార్మికులు గల్లంతయ్యారు. మొత్తం మీద భూవిలయం జనజీవనాన్ని అతలాకుతలం చేసింది. అదే విధంగా భారత దేశంలో ఢిల్లీవంటి పట్టణాల్లో కూడా కొన్ని ప్రకంపనాలు సంభవించాయి. మయన్మార్‌లో తీవ్ర ఆస్తి ప్రాణ నష్టం సంభవించింది. ఈ పరిస్థితుల్లో భూకంపాల గురించి సరైన అవగాహన ప్రజల్లో కలిగించడం అవసరం. భూకంపం అనేది భూమి పొరల్లో శక్తి విడుదల అవడం వల్ల జరిగే ప్రకృతి వైపరీత్యం. భూకంపం సుమారు 4000 సంవత్స రాల నుండి మనుషులపై ప్రభావం చూపుతుంది. దాని మూలాలు భూమి లోతైన పొరలలో పటకాలు బలం గా ఉన్న చోట ఉంటుంది. ఈ పటకాలు నిరంతరం కదలి కలతో, ఒకదాని పైన రెండవది కదిలి శక్తి విడుదల అవు తుంది, అదే సమయంలో భూమిపై భూకంపం ఏర్పడు తుంది. భూకంపం ప్రధాన కారణం భూమి లోతైన పొరలలో పటకాలు ఒకదానిపై మరొకటి




పయనం చేయడం. ఈ కదలిక వల్ల భూమి ఉపరితలం పై కదలికలు, కంపనాలు ఏర్పడతాయి. ఇవి తీవ్రమైన విధ్వంసం, ఆస్తి ప్రాణ నష్టం కలిగిస్తాయి. భూకంపం ఏర్పడడానికి మరొక కారణం అగ్నిపర్వతాలు బద్దలవ్వడం, చెలరేగటం కూడా. ఈ ఘటన వల్ల భూమి పైపొరలలో శక్తి విడుదల అవుతుంది. ఆ శక్తి భూకంపంగా మారుతుంది. భూకంపాల చరిత్ర పూర్వకాలంలోనే ప్రారంభం కావడం కనిపిస్తుంది. 2000 సంవత్సరాల క్రితం మొదటి భూకంపం శాస్త్రీయంగా నమోదైంది. 1000 సంవత్సరాల క్రితం, ప్రాచీన గ్రీక్ రోమన్లు భూకంపాలు సంభవించే విషయాలను అవగతం చేసుకున్నారు. రోమన్ సామ్రాజ్యంలో సంభవించిన భూకంపాలు అనేక శాశ్వత ధ్వంసాలకు కారణమయ్యాయి. ప్రకృతి విపత్తులు నియంత్రించలేనివి కావడంతో, భూకంపాల ప్రభావం అనేక విపత్కర పరిణామాలకు కారణమవుతుంది. అయితే సమకాలీన శాస్త్రీయ పరిశోధనలు భూకంపాల రాకను ముందుగానే అంచనా వేసే పరిజ్ఞానం కలిగి ఉన్నాయి. భూకంపాల గురించి చదివే శాస్త్రం సిస్మాలజీ. శాస్త్రవేత్తలు భూమి కంపనాలను గుర్తించడానికి కొలవడానికి సీస్మోమీటర్లను ఉపయోగిస్తారు. భూకంపాలుఎంత స్థాయిలో సంభవించాయో రిక్టర్ స్కేల్‌పై రీడింగ్ ఆధారంగా శాస్త్రవేత్తలు తెలుపుతారు. భూకంపాల నివారణకు, అర్థం చేసుకోవడం, భవన నిర్మాణాలలో తగిన మార్పులు చేయడం, నూతన మార్గాలను అవలంబించడం శాస్త్రవేత్తలతక్షణ కర్తవ్యం. ప్రభుత్వాలు కూడా ప్రభావిత ప్రాంతాలకు సహాయం అందించాలి. భూకంపం వచ్చే సమయంలో ప్రజలు తీసుకోవాల్సి న జాగ్రత్తలపై అవగాహన కలిగించాలి. ●

# 'స్వర్ణాంధ్ర విజన్'తోనే దశ,దిశ మార్పు!

ఎస్. సీతారామయ్య

ప్రపంచంలోనే తెలుగుజాతిని నంబర్ 1గా, దేశంలోనే ఏపీని అగ్రగామిగా నిలపడానికి శ్రమిస్తున్న కూటమి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌ను 2047 నాటికి నెంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో రూపొందించబడినది. వికసిత ఆంధ్రప్రదేశ్‌ను నిర్మించేందుకు రాష్ట్రం తన విజన్ 2047ను సిద్ధంచేస్తోందని రాష్ట్రం తిరిగి పూర్వవైభవాన్ని సంతరించుకోవటానికి ఏపీబ్రాండ్‌ను నిర్మించేందుకు సరళమైన ప్రభుత్వం, సమర్థవంతమైన పాలన ఈప్రభుత్వ ప్రధానధ్యేయం పేదరికంలేని సమాజం, ఉపాధి కల్పన, నైపుణ్యం మానవ వనరుల అభివృద్ధి, నీటి భద్రత, వ్యవసాయ సాంకేతికత, ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు, సమర్థవంతమైన ఇంధన వనరుల వినియోగం, నాణ్యమైన ఉత్పత్తులు బ్రాండింగ్‌తోపాటు ప్రజలతో సంప్రదింపుల ఆధారంగా, దృష్టిని ముందుకు నడపడానికి ప్రభుత్వం పదిసూత్రాలు ' మార్గదర్శక సూత్రాలను తీసుకుని వచ్చింది. నీతిఆయోగ్‌తోసహా ప్రతిష్టాత్మక సంస్థల సహకారంతో ఈపత్రం అభివృద్ధి చేయబడుతోంది. రాష్ట్రం మొత్తానికి మాత్రమే కాకుండా జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల అభివృద్ధికి కూడా సిద్ధమవుతోంది. ప్రజలతో సంప్రదింపుల ఆధారంగా, దృష్టిని ముందుకు నడపడానికి ప్రభుత్వం 'పదిసూత్రాలు' లేదా 10 మార్గదర్శక సూత్రాలను అభివృద్ధి చేసింది. సాధారణంగా అభివృద్ధిని అంకెల్లో కొలుస్తారు. సాధించిన ప్రగతిని సగటుల్లో చూస్తారు. కానీ, అభివృద్ధిని ఆరోగ్యం, సంతోషం సంపదతో బేరీజు వేస్తూ ఆంధ్రప్రదేశ్‌ను స్వర్ణాంధ్ర 2047గా రూపాంతరం చెందించడానికి కూటమి ప్రభుత్వం దృఢసంకల్పంతో అడుగులు వేస్తున్నది. అభివృద్ధి అనేది రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్టీపీ) పెరుగుదలలో కనిపిస్తుంది. అప్పుడువిద్య ఆరోగ్యం, పోషకాహారం, గృహవసతి, పారిశుద్ధ్య సౌకర్యాల పరంగా ప్రజల స్థితిగతులు మెరుగవుతాయి. సంక్షేమం అంటే, ప్రజలకు సబ్సిడీల రూపంలో సాయపడటం. నేరుగా నగదు బదిలీచేయడం వీటివల్ల తాత్కాలిక ప్రయోజనమే కలుగుతుంది. సమర్థపాలన ద్వారా అభివృద్ధి సాధిస్తే దీర్ఘకాలిక ప్రయోజనాలు సిద్ధిస్తాయి. 2014లో ఆంధ్రప్రదేశ్ విభజన తరవాత రాజధాని అవసరం ఏర్పడింది. పాత నగరాల్లో ఏదో ఒకదాన్ని రాజధానిగా చేయడానికి బదులు, పూర్తిగా కొత్త రాజధానిని నిర్మిస్తే ఎంతో మేలు జరుగుతుంది. అందుకే అమరావతిని ఎంచుకున్నారు. ఇక్కడ సిద్ధించే అభివృద్ధి ఫలాలు ఇతర ప్రాంతాలకు చేరతాయి. ప్రగతిలో అసమానతలు సమసిపోతాయి. అమరావతి నిర్మాణంతో కూడా ఇతర ప్రాంతాలు అభివృద్ధిలో ముందుకు వెళ్లగలుగుతాయి. 'పేదరిక నిర్మూలన, సమ్మిళిత వృద్ధి, ఉపాధి కల్పన వీటి ప్రధాన లక్ష్యం సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనకు




పేదరిక నిర్మూలన, ఉపాధి కల్పన, నైపుణ్యాలతో పాటు మానవ వనరుల అభివృద్ధి, నీటి సంరక్షణ, వ్యవసాయం స్వచ్ఛాంధ్రలో సాంకేతికతను ప్రవేశ పెట్టడం వారి విలువైన సూచనలను పరిగణనలోకి తీసుకుని 17లక్షల మంది భాగస్వాములను చేయడం. పట్టణ ప్రాంతాలలో వృద్ధిని మాత్రమే కాకుండా, రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాలను సమానంగా అభివృద్ధిచేయడమే. ఆర్థికవృద్ధి ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు అనువదించే సమ్మిళిత పర్యావరణ వ్యవస్థను రూపొందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. 2047 నాటికి సున్నా పేదరికాన్ని సాధించడం మొదటి లక్ష్యం, విజన్ డాక్యుమెంట్‌లో ఉపాధి అవకాశాల కల్పన, మానవ వనరుల నైపుణ్యం తదుపరి దృష్టి కేంద్రాలు, రాష్ట్రంలో అందుబాటులో ఉన్ననీటి వనరులను సమర్థవంతంగా వినియోగించుకునేందుకు రాష్ట్రంలోని అన్ని ప్రాజెక్టులను పూర్తిచేయడం ద్వారా నీటిభద్రతను సాధించాలన్నది నిర్దేశిత లక్ష్యం. వ్యవసాయంలో సాంకేతికతను అనుసంధానంచేయడం, నీటి భద్రతను నిర్ధారించడం ద్వారా రైతుల ఉత్పాదకత, లాభదాయకత పెరుగుతుంది. ప్రస్తుతం రూ.3,200గా ఉన్న రాష్ట్ర ప్రజల తలసరి ఆదాయాన్ని 2047కల్లా రూ.43వేలకు పెంచాలని ఏపీ భావిస్తోంది. అది సిద్ధించాలంటే సంక్షేమం, అభివృద్ధి మధ్య సమతూకంసాధించాలి. పేదలకు సంక్షేమం, సబ్సిడీలు అందించాల్సిందేకానీ, వాటిని పెద్దఎత్తున ఇచ్చే ఆర్థికవెసులుబాటు లేదు. 2025-26 రాష్ట్రబడ్జెట్లో కేవలం పాతరుణాలపై వడ్డీ చెల్లించడానికి రూ.30 వేలకోట్లు కేటాయించారు. అది రాష్ట్ర పన్ను వసూళ్లలో 32శాతానికి సమానం. ఉచిత పథకాలు రాష్ట్రాన్ని అభివృద్ధి పథకంలో ఉరకలెత్తించడానికి అడ్డుపడతాయి. వెనకా ముందూ చూసుకోకుండా నిధులు ఖర్చు పెట్టేస్తే రుణాలు, వడ్డీభారం, బడ్జెట్‌లోటు అలవికాని రీతిలో పెరిగిపోతాయి. వడ్డీలు కట్టడానికే కొత్త అప్పులు చేయాల్సి వస్తుంది. ఉచితాలపై మితిమీరిన ఖర్చు, విద్యావైద్యాలకు, మౌలిక వసతులకు నిధులు దొరకని పరిస్థితిని కల్పిస్తుంది. అందుకని అభివృద్ధి, సంక్షేమాల మధ్య సమతౌల్యం పాటించాలి. పథకాల అమలులో సమర్థంగా వ్యవహరించడం ద్వారా ఖర్చును తగ్గించవచ్చు. పన్నులు, పన్నేతర ఆదాయాలను పెంచుకోవాలి. పెట్టుబడి వ్యయం, మౌలిక వసతుల ప్రాజెక్టుల నిర్మాణంలో ప్రైవేటు రంగానికి భాగస్వామ్యం కల్పించాలి. దిగువ, మధ్యతరగతి వారి ఆదాయాలను పెంచినప్పుడు వారు వస్తుసేవలను ఎక్కువగా వినియోగించగలుగుతారు. ఆ వినియోగమే ఉత్పత్తికి, ఉపాధిఅవకాశాల వృద్ధికి ఉత్ప్రేరకంగామారుతుంది. విజన్ ప్రణాళికలో అందరూ భాగస్వాములుకావాలి. ప్రతి ఒక్కరిలో చైతన్యం రావాలి. రేపటి నుంచి ఆంధ్రావ్యాలీ ఓ సక్సెస్ స్టోరీ అవ్వాలని ఆశిద్దాం. సమ్మిళిత, సుస్థిర అభివృద్ధి సాధన నేటి తారక మంత్రం అన్నసంగతి అందరూ గుర్తుంచుకుద్దాం. ప్రజల తలరాతను, భావితరాల భవిష్యత్తును విజన్ డాక్యుమెంట్‌తో మర్చాడానికి కృషిచేస్తున్న కూటమి ప్రభుత్వానికి తమ వంతుసాయం అందిస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అభివృద్ధికి కార్యసాధకులు అవుద్దాం. ●

# విద్యాదానం మహాదానం

## -మంత్రి సత్యకుమార్ యాదవ్

**రేపల్లె(నిజాంపట్నం), మార్చి 31, ప్రభాతవార్త :** విద్యాదానం మహాదానమని గుర్తించి విద్యాభివృద్ధికి కృషి చేసిన దాతల సేవలను ఎన్నటికీ ప్రజలు మరువరని మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. సోమవారం మండలంలోని చాట్రగడ్డలో రూ.కోట్లతో నిర్మించనున్న సనాతన వేదాంత నిష్కామ శ్రీ సరస్వతి విద్యామందిర్ పాఠశాల నూతన భవనాల నిర్మాణానికి శంకుస్థాపన శిలాఫలకాన్ని రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, ఏపీఎస్ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ, అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌తో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 100 సంవత్సరాల క్రితం నిర్మించి ఈ పాఠశాలలో చదువుకుని ఎందరో ఉన్నత విద్యావంతులయ్యారని ఆయన తెలిపారు. దేశ విదేశాలలో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. పాఠశాలఏర్పాటుకు భూమిని ఇవ్వటంతో పాటు విరాళాలు సేకరణకు నేతృత్వం వహించిన దాతలు వీరమాచినేని ఆంజనేయశాస్త్రి, మైనేని రాజగోపాలరావు, వెలగపూడి రామకృష్ణ, మైనేని సీతారామయ్యల సేవలను ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, కూటమి నాయకులు, స్థానిక ప్రజలు, పాఠశాల కమిటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి

## -గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్

**గుంటూరు తూర్పు,మార్చి31,ప్రభాతవార్త :** అల్లాహ్ ఆశీర్వాదంతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవించాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్ ఆకాంక్షించారు. సోమవారం రంజాన్ పర్వదినం సందర్భంగా గుంటూరులోని ఉర్దూ ముస్లిం హైస్కూల్, ముస్లిం కాలేజీల్లోని ఈద్గాలలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనల్లో కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తో కలిసి పాల్గొన్నారు. తొలుత వీరికి ముస్లిం మత పెద్దలు ఘన స్వాగతం పలికి ఆశీర్వదించారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ క్రమశిక్షణ, దానధర్మాలు, కఠోర దీక్షతో నెల రోజులపాటు ఉపవాస దీక్షలు ఆచరించారని, దీని ద్వారా మనిషి జీవితాన్ని సక్రమ మార్గంలో ఎలా నడుపుకోవాలో బోధపడుతుందని చెప్పారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ముస్లిం మైనారిటీలకు మంచి రోజులొచ్చాయని పేర్కొన్నారు. గతంలో ముస్లిం మైనారిటీలపై దాడులు జరిగేవని, ఇప్పుడు మైనారిటీలకు ప్రభుత్వం రక్షణగా నిలుస్తోందని చెప్పారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో మోజన్లు, ఇమామ్ లకు గౌరవ వేతనం విడుదల చేసి వారి ఆత్మ గౌరవాన్ని మరింత పెంచారని తెలిపారు.






# శివాలయంట్రస్టు బోర్డు ఛైర్మన్‌గా భోగి కోటేశ్వరరావు

## -ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం -డైరెక్టర్లుగా 8మంది నియామకం

**మంగళగిరి,మార్చి 31,ప్రభాతవార్త :** ఎంతోకాలంగా పార్టీని నమ్ముకొని,పార్టీ అభివృద్ధికి కృషిచేస్తూ,సేవలందిస్తున్న వారికి నామినెటెడ్ పదవుల పంపకంలో ప్రాధాన్యతను కలిప్తున్నారు.మంగళగిరిలోని శ్రీ గంగా భ్రమరాంభ సమేత మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం (శివాలయం) ట్రస్ట్ బోర్డు ఛైర్మన్‌గా భోగి కోటేశ్వరరావును నియమిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆయనతోపాటు 8మందిని ట్రస్ట్‌బోర్డు డైరెక్టర్లుగా నియమిస్తూ నిర్ణయం తీసుకుంది.భోగి కోటేశ్వరరావు కొద్ది కాలంగా తెలుగుదేశం పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తూ వస్తున్నారు.ఆయన సేవలను గుర్తించిన కూటమి ప్రభుత్వం ఆయనకు శివాలయం ట్రస్ట్ బోర్డు పగ్గాలను అప్పగించింది. తనకు పదవి కేటాయించిన స్థానిక ఎమ్మెల్యే, టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి,రాష్ట్ర మంత్రి నారా లోకేష్‌కు సహకరించిన స్థానిక నాయకులకు భోగి కోటేశ్వరరావు కృతజ్ఞతలు తెలియజేశారు.



**డైరెక్టర్లు వీరే :** శివాలయం ట్రస్ట్‌బోర్డు కి 8మందిని డైరెక్టర్లుగా నియమించారు.సుఖమంచి గిరిబాబు,ఏ.కరుణ,జంజనం వెంకట సుబ్బారావు, బాపనపల్లి వాసు,చిలకా బసవమ్మ,ఉడత లావణ్య,శంకర్ నారాయణ, తిరుమలశెట్టి మురళీకృష్ణలను శివాలయం ట్రస్ట్‌బోర్డు కు డైరెక్టర్లుగా నియమించారు.నూతనంగా పదవులు పొందిన వారందరికీ పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఈద్గాలో రంజాన్ ప్రత్యేక ప్రార్థనలు

**పెదకాకాని,మార్చి31,ప్రభాతవార్త:** ఈద్-ఉల్-ఫితర్ పర్వదినాన్ని పురస్కరించుకొని అంజుమన్-యి-హిమాయితుల్ ఇస్లాం ఈద్గాలో ప్రత్యేక ప్రార్ధనలు చేశారు.పెదకాకానిలోని



ప్రముఖులు ముస్లిం సోదరులకు రంజాన్‌శుభాకాంక్షాలు తెలియజేశారు.క్రమశిక్షణ,దాతృత్వం,ధార్మిక చింతనల కలయికే రంజాన్ పర్వదినాలు,దివ్యఖురాన్ ఆవిర్భవించింది ఈమాసంలోనే మహ్మద్ ప్రవక్తలా ఇల్లాహ ఇల్లాల్ల అనే సూత్రం ప్రకారం మానవులను కష్టాలనుంచి కాపాడేది రంజాన్‌మాసం ప్రత్యేకించి ముస్లింస్ అందరూ ఎంతో ఉత్సాహంగా భక్తిశ్రద్దలతో ఈ రంజాన్ పండుగను పెదకాకానిలో ఘనంగా జరుపుకున్నారు.ఈకార్యక్రమంలో టిడిపిరాష్ట్ర మైనార్టీ అధికార ప్రతినిధిమహమ్మద్ మోసిన్,జిల్లా మైనార్టీ సెల్ ఆధికార ప్రతినిధి షేక్.అల్లావుద్దీన్,షేక్.ఆజీజ్,షేక్. ఆహ్మద్,సోడలబాబు, సీలార్,ఆరిఫ్, షేక్.నజీర్,షేక్.జాకిర్,పఠాన్ మస్తాన్‌ఖాన్,శ్రీఅమ్మజానమ్మ దర్గా ధర్మకర్త ఆషారిపునిష తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా రంజాన్ వేడుకలు

**ఎ కొండూరు, మార్చి 31, ప్రభాతవార్త :** ఎ కొండూరు మండలంలో రంజాన్ (ఈద్ ఉల్ ఫితర్) పర్వదినాన్ని ముస్లీం సోదరులు సోమవారం అత్యంత భక్తిశ్రద్ధలతో ఆనందోత్సాహాలతో ఘనంగా జరిపారు. మండలంలోని చీమలపాడు కంభంపాడు కృష్ణారావుపాలెం తదితర గ్రామాల్లో ముస్లీంలు మత గురువుల ఆధ్యంలో ప్రత్యేక ఈద్ నమాజ్ నిర్వహించారు. చీమలపాడు ఈద్గా ప్రార్ధన వద్ద తిరువూరు సిఐ ఎ కొండూరు ఎస్సై ఆధ్వర్యంలో ప్రార్ధనలు జరిపారు. అనంతరం ముస్లీం సోదరులు ఈద్గాల వద్ద ఒకరినొకరు ఈద్ ముబారక్ రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకుంటూ ఆలింగనం చేసుకున్నారు. ఈ సందర్భంగా అతావుల్లా బాబా దర్బార్‌లో సోమవారం మధ్యాహ్నం పోలీస్ శాఖ అధికారులకు లంచ్ ఏర్పాట్లను బాబా ఆధ్యాత్మిక వారసుడు ఎండి ఖాజా మొహియుద్దీన్ తాజ్ ఖాదర్ బాబు బొగ్దాది దగ్గర ఉండి ప్రసాద వితరణ గావించారు.



# కవితల పోటీలో రేపాక రఘునందన్‌కు అవార్డు

**తిరువూరు, మార్చి 31, ప్రభాతవార్త :** పాల్వంచ కళా పరిషత్ ఇరు తెలుగు రాష్ట్రాల స్థాయిలో ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్ అనే అంశంపై నిర్వహించిన కవితల పోటీలో తిరువూరు రచయితల సంఘ ప్రధాన కార్యదర్శి రేపాక రఘునందన్ రచించిన మణిషి మరణించాడోచ్ అనే కవితకు ప్రోత్సాహక బహుమతి లభించినట్లు ఏప్రిల్ 1 సాయంత్రం పాల్వంచలో జరిగే ఉగాది ఉత్సవాల ముగింపు సభలో నగదు అవార్డుతో పాటు సత్కార కార్యక్రమం నిర్వహిస్తారని కళా పరిషత్ వేముల కొండలరావు ఆహ్వానం పంపినట్లు రఘునందర్ సోమవారం తెలిపారు. బహుమతి రావడం పట్ల తిరువూరు రచయితల సంఘం అధ్యక్షురాలు ఉయ్యూరు అనసూయ కార్యవర్గ సభ్యులు సాహితీ మిత్రులు రఘునందన్‌కు అభినందనలు తెలిపారు.



# అమరావతి వార్త

# ప్రజా రవాణాకు, భద్రతకు ప్రాధాన్యత

## - మంత్రి సత్యకుమార్ యాదవ్

**రేపల్లె(నిజాంపట్నం), మార్చి 31, ప్రభాతవార్త :** ప్రజా రవాణాకు, భద్రతకు అధిక ప్రాధాన్యతను కూటమి ప్రభుత్వం ఇస్తున్నదని మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. సోమవారం స్థానిక ఎపిఎస్ఆర్‌టిసి డిపోకు నూతనంగా మంజూరైన 10 బస్సులను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. తిరుపతికి నూతన బస్ సర్వీసును ఆయన ప్రారంభించి మాట్లాడుతూ ప్రజలు ఎక్కడికైనా త్వరగా వెళ్ళాలంటే రవాణా ఎంతో ముఖ్యమన్నారు. ఎపిఎస్ ఆర్‌టిసి ఛైర్మన్ కొనకళ్ళ నారాయణ మాట్లాడుతూ తీర ప్రాంతంలో ప్రజలు ఒక చోట నుంచి మరో చోటుకు వెళ్ళాలంటే అనేక ఇబ్బందులు పడుతున్నారని, సరైన రవాణా సౌకర్యంలేదన్నారు. ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని రేపల్లె డిపోకు 10 బస్సులను కేటాయించామనా న్నరు. మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ రహదారులకు మరమ్మతులు చేయిస్తున్నామనా న్నరు. త్వరలోనే అన్ని ప్రాంతాలలోని రోడ్లు మరమ్మతులు పూర్తి చేసుకుని ప్రజలు ఒక చోట నుంచి ఇంకొక చోటుకు వెళ్ళేందుకు వ్యయప్రయాసలు పడాల్సిన అవసరం ఉండదనా న్నరు. ఈ కార్యక్రమంలో అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఎపిఎస్ఆర్‌టిసి ప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# యువత భరోసా కోసం 20 లక్షల ఉద్యోగ అవకాశాల కల్పన

## - మంత్రి కొలుసు పార్థసారథి

**బాపట్ల,మార్చి31,ప్రభాతవార్త:** యువత భరోసా కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు 20 లక్షల ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నారని రాష్ట్ర సమాచార పౌరసంబంధాల,గృహ నిర్మాణ శాఖ మంత్రి మరియుజిల్లా ఇన్‌చార్జి మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా సోమవారం చిన్నగంజాం మండలం కొత్తగొల్ల పాలెం గ్రామం లో ఏర్పాట్లను రాష్ట్ర సమాచార పౌర సంబంధాల,గృహ నిర్మాణశాఖ మంత్రి గొలుసుపార్థ సారథి, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ , రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సమాచార పౌర సంబంధాల, గృహ నిర్మాణశాఖ మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను ప్రభుత్వం బాధ్యతతో పంపిణీ చేస్తుందని ఆయన అన్నారు. రాష్ట్రంలో 64లక్షల పెన్షన్లను ప్రతినెల 1వ తేదీన ప్రభుత్వ ఉద్యోగులు బాధ్యతతో పంపిణీ చేస్తున్నారని ఆయన అన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పెన్షన్లు 3వేల నుంచి4వేల రూపాయలకు ప్రభుత్వ వచ్చిన నెలలోనే పెంచడం జరిగిందని ఆయన అన్నారు. గత ప్రభుత్వం పేదల పెన్షన్లు వెయ్యి రూపాయలు పెంచడానికి 5 సంవత్సరాలు పట్టిందని ఆయన సందర్భంగా అన్నారు. రాష్ట్రంలో ప్రతి వ్యక్తి తలసరి ఆదాయం పెంచడానికి ముఖ్యమంత్రి చర్యలు తీసుకుంటున్నాం న్నారు. ప్రతి ఇంటిలో ఒక వ్యాపారవేత్తను తయారు చేయడానికి ముఖ్యమంత్రి చర్యలు తీసుకుంటున్నార న్నారు. గత ప్రభుత్వాలు అప్పులు చేసినప్పటికీ తమ ప్రభుత్వం వచ్చినాక అభివృద్ధి సంక్షేమ సంక్షేమ పథకాలు ఎక్కడా ఆగ కుండా సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తున్నామని ఆయన చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని ఆయన సందర్భంగా చెప్పారు. ఈ కార్యక్రమంలో పర్చూరు శాసనసభ్యులు ఏలూరు సాంబశివరావు, చీరాల శాసనసభ్యులు ఎం. ఎం. కొండయ్య, బాపట్ల శాసన సభ్యులువేగేశన నరేంద్రవర్మ, జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి,జిల్లా ఎస్పీ తుషార్ డూడి, జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్ తదితరులు పాల్గొన్నారు.



# రంజాన్ పర్వదిన వేడుకల్లో ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

**మాచర్ల, మార్చి 31 ప్రభాతవార్త:** రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి పట్టణంలోని పాతూరు ఈద్గా ప్రాంగణంలో వేలాది ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం మసిద్ అభివృద్ధికి రంజాన్ కానుకగా తనవంతు రూ.లక్ష నగదును విరాళంగా అందజేశారు. జెండాచెట్టు జజారుతో జూలకంటి కుటుంబానికి విడదీయరాని బంధం ఉందని గుర్తు చేసుకున్నారు. నూర్ మసీద్, షీదీఖానా, కబరస్థాన్ నిర్మాణాలకు ఆనాటి ఎమ్మెల్యేగా ఉన్న జూలకంటి దుర్గాంబ ఎంతో కృషి చేశారని వివరించారు.ఈ సందర్భంగా ముస్లిం సోదరులు తమకున్న సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. జమ్మలమడక, మండాది రోడ్డులో ఎస్‌కేబీఆర్ కళాశాల వద్ద ఉన్న మసిద్ స్థలాలు అన్యాక్రాంతం అయ్యాయని, వాటిని పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ ఆ స్థలాలను రీసర్వే చేయిస్తామని పేర్కొన్నారు. అలాగే ఖబరస్తాన్ చుట్టూ ప్రహరీ నిర్మాణానికి నిధులు కేటాయించి, తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామన్నారు. పట్టణంలో ముస్లింలు అంతిమయాత్రకు కిలోమీటర్ల దూరం ఖబరస్థాన్‌కు వాహనాలపై పార్థివ దేహాలను తీసుకు రావాలంటే ఆర్థికంగా భారంగా ఉంటుందని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. సెప్టెంబరు నాటికి జనాజాకు ప్రత్యేక వాహనం అందిస్తానని హామీ ఇచ్చారు. రంజాన్ ప్రత్యేక ప్రార్థన కార్యక్రమంలో ముస్లిం మతపెద్దలు, మాచర్ల పట్టణ తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఆకుల ఉమా జయసత్య దంపతులను పరామర్శించిన మంత్రి నారాయణ

**మంగళగిరి,మార్చి31,ప్రభాతవ** యర్రబాలెం మాజీ ఎంపీటీసీ సభ్యులు, సీనియర్ టీడీపీ నాయకులు ఆకుల ఉమా మహేశ్వరరావు, మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు, టీడీపీ రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి ఆకుల జయసత్య దంపతులను మున్సిపల్ పరిపాలన, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి పి.నారాయణ పరామర్శించారు.ఆకుల ఉమా మహేశ్వరరావు మాతృమూర్తి, జయసత్య అత్త గారైన ఆకుల మాణిక్యం ఈనెల 24వ తేదీన ఆకస్మికంగా మృతి చెందిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో సోమవారం మంత్రి నారాయణ యర్రబాలెం లోని ఉమా జయసత్య దంపతుల నివాసానికి చేరుకుని మాణిక్యం చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించారు. టీటీడీ బోర్డ్ సభ్యురాలు తమ్మిశెట్టి జానకీ దేవి, టీడీపీ నాయకులు నీలం అంకారావు, గడదాసు రంగారావు, ఫిరోజ్ ఖాన్, కర్నాటి శివ సత్యనారాయణ, సాలి నరేష్, యలమంచిలి పద్మజ, తదితరులు ఉమా జయసత్య దంపతులను పరామర్శించిన వారిలో ఉన్నారు.



# రోడ్డు ప్రమాదంలో గాయపడిన తెదేపా మహిళా నేతను పరామర్శించిన ఎమ్మెల్యే

**మాచర్ల, మార్చి 31 ప్రభాతవార్త:** మాచర్ల పట్టణంలో 23వ వార్డులో తెదేపా మహిళా నేత, మాజీ కౌన్సిలర్ వీర్ల పాపమ్మ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి, అనారోగ్యంతో బాధపడు తున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆమె ఇంటికి వెళ్లి పరామర్శించారు. యోగాక్షేమాలను అడిగి, అందుతున్న వైద్యపరమైన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఏమీ అధైర్యపడొద్దని, అండగా ఉంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట తెదేపా యాదవ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# శుభకార్యాల నిర్వహణకు కల్యాణ మండపం ఎంతో ఉపయోగం : మంత్రి అనగాని

**రేపల్లె(నిజాంపట్నం), మార్చి 31, ప్రభాతవార్త:** గ్రామాలలో శుభకార్యాలు నిర్వహించుకునేందుకు కల్యాణ మండపాలు ఎంతో అవసరమని రాష్ట్ర రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ అన్నారు. సోమవారం మండలంలోని మోర్లవారి పాలెంలో నూతనంగా నిర్మించిన రాములవారి కల్యాణ మండపాన్ని ఆయన గ్రామస్థులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో వర్షాకాలంలో శుభకార్యాలు చేసుకునేందుకు ఇబ్బందిగా ఉంటుందని అటువంటి ప్రాంతాలలో కల్యాణ మండపాల అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# సిఎం పర్యటనకు పటిష్ట బందోబస్తు : బాపట్లజిల్లా ఎస్పీ

**బావట్ల, మార్చి31, ప్రభాతవార్త:** పేదల సేవలో కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులకు పెన్షన్లు పంపిణీ చేసేందుకు నేడు ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిన్నగంజాం మండలం పెదగంజాం పంచాయతీ పరిధిలోని కొత్త గొల్లపాలెం గ్రామంకు విచ్చేయనున్నారని జిల్లా ఎస్పీ తుషార్ డూడి తెలిపారు. జిల్లా ఎస్పీ సోమవారం చిన్నగంజాం మండలం కొత్తగొల్లపాలెం గ్రామంలో బందోబస్తు విధులు నిర్వహించడానికి వచ్చిన పోలీసులకు బ్రీఫింగ్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జిల్లా పర్యటన సందర్భంగా మొత్తం 904 మంది పోలీసులతో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. వీరిలో ఒకరు అడిషనల్ ఎస్పి, ఏడుగురు డిఎస్పీలు 27 మంది సిఐలు 67 మంది ఎస్సైలు ఉన్నారన్నారు. మొత్తం బందోబస్తు ను 11 సెక్టర్లుగా విభజించడం జరిగిందన్నారు. బందోబస్తు విధులు పాల్గొనే పోలీస్ అధికారులు, సిబ్బంది వారికి కేటాయించిన ప్రదేశాలలో అప్రమత్తంగా వ్యవహరిస్తూ సమర్ధవంతంగా విధులు నిర్వహించాలన్నారు. సమయపాలన పాటిస్తూ నిర్దేశించిన సమయానికి విధులకు హాజరుగా ఉండాలన్నారు. హెలిప్యాడ్ వద్ద ప్రజా ప్రతినిధులను కలుస్తారని, అనంతరం లబ్ధిదారుల గృహాలకు వెళ్లి పెన్షన్లు పంపిణీ చేస్తారన్నారు. స్థానికంగా ఉన్న దేవాలయానికి వెళ్లి పూజా కార్యక్రమంలో పాల్గొని ప్రజా వేదిక వద్దకు వస్తారని తెలిపారు. ఆ ప్రదేశాలలో విధులు నిర్వహించే పోలీసులు కాన్వాయ్ వచ్చే సమయంలో ఎంతో అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. హెలిప్యాడ్, సభా వేదిక వద్ద, పార్కింగ్ ప్రదేశాలలో, ట్రాఫిక్ దారి మళ్లించే ప్రదేశాలలో, ఇతర ముఖ్యమైన విధులు నిర్వహించే సంబంధిత అధికారులకు భద్రతాపరమైన అంశాలపై పలు సూచనలు తెలియజేశారు. రోప్ పార్టీ, రూఫ్ టాప్, ట్రాఫిక్ విధులు చాల కీలకమని ప్రతి క్షణం అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. ప్రవేశ మార్గాలలో ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా తనిఖీ చేసి పంపాలన్నారు. సాధారణ ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్నందున ప్రజలకు సమయానికి నీరు, ఆహారం అందేవిధంగా చూసుకోవాలన్నారు. పోలీసు సిబ్బందికి వాటర్ బాటిళ్లు లేదా ప్యాకెట్లు అందించాలని పోలీసు అధికారులకు సూచించారు. ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలన్నారు.బందోబస్తు విధులకు హాజరైన పోలీస్ అధికారులకు, సిబ్బందికి ఏవైనా సమస్యలు, ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. విధులలో అలసత్వం వహిస్తే ఉపేక్షించబోమని శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్, బాపట్ల, చీరాల, రేపల్లె, సీసీఎస్ డిఎస్పీ లు రామాంజనేయులు, మోయిన్, శ్రీనివాసరావు, జగదీష్ నాయక్‌లు, ఎస్.బి ఇన్స్పెక్టర్ నారాయణ, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



# 202425 ఆర్థిక సంవత్సరానికి రూ.152 కోట్లు ఆస్తి పన్ను వసూలు : కమిషనరు

**గుంటూరు కార్పొరేషన్,మార్చి31,ప్రభాతవార్త :** 202425 ఆర్థిక సంవత్సరానికి రూ. 152 కోట్లు ఆస్తి పన్నువసూళ్ళు చేయుట ద్వారా గత ఏడాది కంటే రూ.32 కోట్లు అధికంగా వసూలు చేయుట జరిగిందని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఐఏఎస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ఆస్తి పన్ను వడ్డీ పై రాష్ట్ర ప్రభుత్వం మార్చ్ 25న ప్రకటించిన 50 శాతం రాయితీని వినియోగించుకొని గుంటూరు నగరంలో చివరి రోజైన సోమవారం రూ.6.10 కోట్లతో కలిపి మొత్తం రూ. 26.10 కోట్లు పన్ను నగర ప్రజలు చెల్లించారన్నారు. పన్నులు సకాలంలో చెల్లించుట ద్వారా నగర ప్రజలు నగర అభివృద్ధిలో భాగస్వాములయ్యారన్నారు. పన్ను వసూళ్ళలో కృషి చేసిన అడ్మిన్ కార్యదర్శులు, రెవిన్యూ ఇన్స్పెక్టర్లు, అధికారులు, డిప్యూటీ కమీషనర్లు ప్రణాళికాబద్ధంగా జరిగేలా పర్యవేక్షణ చేసిన అదనపు కమీషనర్ చల్లా ఓబులేసు కు ప్రత్యేక అభినందనలు తెలుపుతున్నామన్నారు.



# డాక్టర్ జంధ్యాల రామలింగేశ్వరశాస్త్రికి ప్రతిష్టాత్మక ఉగాది పురస్కారం

**గుంటూరు కల్చరల్,మార్చి 31,ప్రభాతవార్త :** జ్యోతిష్య,వాస్తు రంగాల్లో విశిష్ట సేవలందిస్తూ విశేష ప్రతిభ కనబరిచిన ప్రముఖవాస్తు సిద్దాంతి డాక్టర్ జంధ్యాల వేంకట రామలింగేశ్వర శాస్త్రికి ప్రతిష్టాత్మక ఉగాది పురస్కారం లభించింది. తెలుగు సంవత్సరాది ఉగాది పండుగను పురస్కరించుకొని స్థానిక గుంటూరు శ్రీ వేంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పర్యాటక,సాంస్కృతిక శాఖ మరియు దేవాదాయశాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిష్టాత్మక శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది పురస్కారాల ప్రధానం జరిగింది.ఈ సందర్భంగా డాక్టర్ జంధ్యాలకు నిర్వాహకులు ఉగాది పురస్కారం అందించి దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో గుంటూరు పశ్చిమ,తూర్పు, ప్రత్తిపాడు శాసనసభ్యులు గళ్ళా మాధవి,మహ్మద్ నసీర్,బూర్ల రామాంజనేయులు,గుంటూరు నగర పాలక కమీషనర్ పులి శ్రీనివాసులు,దేవాదాయ ఉప కమీషనర్ కె.బి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# అక్కినేని అనిల్‌కుమార్‌కు ఉగాది పురస్కారం

**మాచర్ల, మార్చి 31 ప్రభాతవార్త:** మాచర్లకు చెందిన సాయి ఎడ్యుకేషనల్ సొసైటీ సెక్రటరీ అక్కినేని అనిల్‌కుమార్‌కు ఉగాది సందర్భంగా ఉత్తమ పురస్కారం అందుకున్నారు. విజయవాడలో జరిగిన విశ్వావసు నామ సంవత్సర ఉగాది సందర్భంగా దీపం ఉగాది పురస్కారాల కార్యక్రమం జరిగింది. పురస్కారాల్లో భాగంగా విద్యా రంగంలో భారతీయ సంస్కృతి రంగంలో చేసిన కృషికి అభినందిస్తూ ఈ పురస్కారం అనిల్‌కుమార్‌కు దక్కింది. సందర్భంగా ఫొటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా, జీఆర్‌కే పోలవరపు సాంస్కృతిక సమితి, సుమతి అంతర్జాల మాసపత్రిక నిర్వాహకులు మాట్లాడుతూ మాచర్లలో పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఉచిత ఇంగ్లీషు మీడియం విద్యను అందిస్తున్న సత్యసాయి విద్యావిహార్ సేవలు ఎనలేనివన్నారు. అవార్డు గ్రహీత అక్కినేని అనిల్‌కుమార్ మాట్లాడుతూ దీపం విశ్వావసు నామ సంవత్సర ఉగాది ఉరస్కారానికి తనను ఎంపిక చేసిన నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఉత్తమ పురస్కారం అందుకున్న అనిల్‌కు పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు.



# ఘనంగా రంజాన్ వేడుకలు

**వినుకొండ,మార్చి31,ప్రభాతవార్త:** పవిత్ర రంజాన్ పండుగ పర్వదినాన్ని ముస్లిం సోదరులు ఆనందంగా జరుపుకున్నారు. తిమ్మాయిపాలెం రోడ్డులోని ఈద్గా ప్రాంగణంలో ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. ముస్లిం సాంప్రదాయ వస్త్రాలు ధరించి చిన్న, పెద్ద ఒకరినొకరు ఆప్యాయంగా ఆలింగనం చేసుకొని ఈద్ ముబారక్ అంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. రంజాన్ పండగ విశిష్టతను మత పెద్దలు వివరించారు. శాంతి, స్నేహం, ప్రేమ, త్యాగానికి ప్రతీక రంజాన్ పండగ అని చెప్పారు. మహ్మద్ ప్రవక్త బోధనలు, పవిత్ర గ్రంధం ఖురాన్‌ను అనుసరించి ప్రతి ముస్లిం జీవనశైలి ఉండాలని పేర్కొన్నారు. పట్టణంతో పాటు నూజెండ్ల, శావల్యాపురం, ఈపూరు, బొల్లాపల్లి మండలాల్లో ముస్లింలు ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు.



**ముస్లిం మైనార్టీల అభివృద్ధికి కృషి.....జీ.వీ**

ముస్లిం మైనార్టీల అభివృద్ధికి సీఎం చంద్రబాబునాయుడు ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నారని ఏపీ ప్రభుత్వ చీఫ్ విప్, స్థానిక ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు అన్నారు. రంజాన్ పండగ సందర్భంగా తిమ్మాయిపాలెం రోడ్డులోని ఈద్గా ప్రాంగణంలో జరిగిన ప్రత్యేక మత ప్రార్ధనల్లో జీ.వీ, మాజీ ఎమ్మెల్యే మక్కెనలు పాల్గొన్నారు. ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా కౌగిలించుకొని రంజాన్ పండగ శుభాకాంక్షలు తెలిపారు. పవిత్రతకు, దాతృత్వానికి, మత సామరస్యానికి ప్రతీక రంజాన్ పండగ అని ప్రతి ఒక్క ముస్లిం ఇతరులకు ఆదర్శంగా నిలవాలన్నారు. తనపై నమ్మకం ఉంచి ముస్లిం సామాజిక వర్గం తమకు అండగా ఉంటున్నారని వారికి ఎల్లప్పుడు రుణపడి ఉంటామని చెప్పారు. శివశక్తి ఫౌండేషన్ ద్వారా పేద ముస్లిం విద్యార్థుల ఉన్నత చదువులకు ఉపకార వేతనాలు అందిస్తామని జీ.వీ ఈ సందర్భంగా ప్రకటించారు. అలాగే ఈద్గా, మర్కజ్ మసీదు అభివృద్ధికి రూ. 40 లక్షలు కావాలని కమిటీ వారు కోరడం జరిగిందని మున్సిపాలిటీ తీర్మానం మేరకు త్వరితగతిన నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు. తనపై చూపిస్తున్న ప్రేమ, ఆదరణ మరువలేనివని కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో పలువురు ముస్లిం మైనార్టీ నేతలు, నాయకులు పాల్గొన్నారు.

# ప్రత్యేక ప్రార్థనలలో పాల్గొన్న ఎమ్మెల్యే చదలవాడ

**నరసరావుపేట , మార్చి 31 ప్రభాతవార్త :** శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవిందబాబు సోమవారం స్థానిక ప్రకాష్‌నగర్‌లోని ఈద్గా మైదనంలో నిర్వహించిన రంజాన్ ప్రత్యేక ప్రార్ధనాలలో పాల్గొన్నారు. మైనార్టీ కుటుంబ సభ్యులకు ప్రత్యేక శుభకాంక్షలు తెలిపారు. ముస్లిం సోదరులతో కలిసి అల్లాను ప్రార్థించారు. మత పెద్దల రంజాన్ పర్వదిన విశిష్ఠత సందేశాన్ని ఈ సందర్భంగా మైనార్టీ సోదరులతో కలిసి శ్రద్ధగా



విన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ముస్లిం సోదరులు జరుపుకునే అతి పెద్ద పండుగా రంజాన్‌గా తెలిపారు. ప్రేమను, శాంతిని పంచి ఇవ్వాలని రంజాన్ చెపుతుందన్నారు. కుల,మతాలకు ఆతీతంగా ఈ పండుగను నరసరావుపేట నియోజకవర్గంలో జరుపుకోవటం అనవాయితీగా వస్తుందన్నారు. ముస్లిం సోదరుల కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేస్తున్న అనేక కార్యక్రమాలను వివరించారు. స్థానికంగా మైనార్టీలు తన వెంట నడుస్తున్నారని వారికి అవసరమైన సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని ఎమ్మెల్యే డా.చదలవాడ అరవిందబాబు తెలిపారు. వారి వెంట పార్టీ నాయకులు , ముస్లిం పెద్దలు ఉన్నారు.

# భక్తి శ్రద్ధలతో రంజాన్ సామూహిక నమాజ్‌లు

**యడ్లపాడు, మే 31, ప్రభాతవార్త :** మండల పరిధిలోని అన్ని గ్రామాలలో రంజాన్ పర్వదినాన్ని సోమవారం ముస్లింలు ఎంతో భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు. ఆదివారం రాత్రి నెలవంక



కనిపించిందంటూ దేశరాజధాని నుంచి అన్ని మసీదులకు ఫోన్లద్వారా సమాచారం అందడంతో వాడవాడలా రంజాన్ పండుగ హడావిడి అంతటా మొదలయ్యింది. యడ్లపాడు, కారుచోల, బోయపాలెం, కొండవీడు గ్రామల్లోని ఈద్గాల వద్ద సామూహిక ఈదుల్‌ఫితార్ నమాజ్‌ను నిర్వహించారు. ముందురోజు రాత్రే రంజాన్ పండుగ నమాజ్‌ను ఉదయం9.30గంటల సమయంలో నిర్వహిస్తున్నట్లు మతపెద్దలు మసీదుల్లో ప్రచారం చేశారు. నెలరోజుల పాటు ఎంతో కఠిన ఉపవాసదీక్షలు చేసిన ముస్లింలు నమాజ్‌తో పండుగను అనందంగా జరుపుకున్నారు.

# అగ్ని ప్రమాద బాధితులకు శివశక్తి ఫౌండేషన్ ఆర్థిక సాయం

**వినుకొండ,మార్చి31,ప్రభాతవార్త:** నియోజకవర్గంలోని బొల్లాపల్లి మండలం గరికపాడు, వినుకొండ మండలం పెదకంచర్లలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదాల్లో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబాలకు శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందజేశారు. కొత్తపేటలోని తెదేపా కార్యాలయంలో ఏపీ ప్రభుత్వ చీఫ్‌విప్ జీ.వీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మల్లికార్జునరావుతో కలసి బాధిత కుటుంబాలు పెదకంచర్లకు చెందిన ఒంటేరు బాలకోటేశ్వరరావు, గరికపాడుకు చెందిన కొక్కర వీరాంజీలకు రూ. 5వేలు ఆర్థిక సాయం, వంటసామాన్లు, బియ్యం, నిత్యవసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెదేపా నాయకులు మాదాల చిరంజీవి, రామినేని ఆంజనేయులు, ముత్తినేని హనుమంతరావు, దొడ్ల నాగరాజు, ముక్కంటి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.



# పి-4 విధానానికి శ్రీకారం పేద కుటుంబాలకు వరం

## -ఎమ్మెల్యే ప్రత్తిపాటిప్రత్తిపాటి



**చిలకలూరిపేట,మార్చి31,ప్రభాతవార్త:** తెలుగు సంవత్సరాది ఉగాదినాడు ముఖ్యమంత్రి చంద్రబాబు పి4 విధానానికి శ్రీకారం చుట్టడం రాష్ట్రంలోని పేద కుటుంబాలకు వరమనే చెప్పాలని మాజీమంత్రి, నియోజకవర్గ శాసనసభ్యుడు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. సోమవారం ప్రత్తిపాటి నివాసంలో విలేకరులతో మాట్లాడుతూ ఇలాంటి విభిన్నమైన పథకాలు, కార్యక్రమాలను ప్రజలకు అందించడంలో చంద్రబాబు తనకు తానే సాటిగా నిలుస్తారని అన్నారు.1999లో సమైఖ్య రాష్ట్రం సిఎంయగా ఆయన ప్రకటించిన జన్మభూమి2014లో గ్రామాల దత్తత స్వీకారం కార్యక్రమాలు విజయవంతంగా అమలయ్యాయని తెలిపారు. జన్మభూమి పథకం ప్రజల్లోకి బాగా చొచ్చుకెళ్లిందని, తమ జీవితాలను బాగుచేసిన గ్రామాలు, ప్రాంతాల రుణాలు తీర్చుకోవడానికి ప్రవాసాంధ్రులు, పారిశ్రామికవేత్తలు,ఎంతోమంది ధనవంతులు ఉత్సాహంగా జన్మభూమిలో ఆనాడు బాగస్వామ్యులయ్యా రని తెలిపారు ఆనాటి జన్మభూమి పథకమే అప్‌డేటెడ్ వెర్షన్ పి4 అన్నారు. గతంలో జన్మభూమి పథకంలో గ్రామాలు కొత్తరూపురేఖలు సంతరించుకున్నాయన్నారు. ప్రభుత్వ తోడ్పాటు, దాతల సహకారంతో మంచినీటి కేంద్రాలు, పాఠశాలలు, కమ్యూనిటి భవనాలు, రోడ్లు,డ్రైనేజీలు, ఓవర్‌హెడ్ ట్యాంక్‌లు, అంగన్‌వాడీ కేంద్రాలు, వీధిదీపాల ఏర్పాటువంటి వాటితో పల్లెల్లో అభివృద్ధి పరుగులు పెట్టిందన్నారు.గ్రామాల దత్తత కార్యక్రమం కూడా ప్రజల మనసులు గెలుచుకుందని, తాను ప్రకటించిన పథకంలోనే భాగస్వామిగా మారి నాటి సియం హోదాలో చంద్రబాబు విశాఖ జిల్లాలోని ఏజెన్సి గ్రామం పెదలబుడును దత్తత తీసుకున్నారన్నారు. ఆయన సతీమణి ఎన్టీఆర్ ట్రస్ట్ చైర్మన్ భువనేశ్వరి తన తల్లి స్వగ్రామం కొమరవోలును, నారా లోకేష్ ఎన్టీఆర్ స్వగ్రామమైన నిమ్మకూరును దత్తత తీసుకున్నారన్నారు. వారి బాటలో ఎంతోమంది ప్రముఖులు, రాజకీయ నాయకులు తమకు నచ్చిన గ్రామాల పురోభివృద్ధికి కృషి చేశారని ప్రత్తిపాటి తెలిపారు. పేర్లు,డబ్బు పిచ్చితో గత ప్రభుత్వం పల్లెల్లో అభివృద్ధి ఆనవాళ్లే లేకుండా చేసిందని తాజాగా చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ప్రకటించిన పి4 ఆ పథకాలకు నూతన రూపమనేనని అన్నారు. టిడిపి ప్రభుత్వంలో గ్రామాల్లో జరిగిన అభివృద్ధిని వైసిపి ప్రభుత్వ నిర్వీర్యం చేసిందన్నారు. రాష్ట్ర నాయకత్వం బాటలోనే నడిచిన గ్రామ, మండల వైసిపి నేతలు తమ స్వార్ధ ప్రయోజనాలకోసం పల్లెలలో అభివృద్ధి ఆనవాళ్లే లేకుండా చేశారన్నారు. ప్రజలకు ఉపయోగపడే భవనాలు,వ్యవస్థలను పూర్తిగా నీరుగార్చారని, అనాలోచిత విధానలతో కళతప్పిన గ్రామాలను బీదరికంతో మగ్గుతున్న కుటుంబాలను తిరిగి గాడిలో పెట్టాలన్న సదాశయంతో చంద్రబాబు పి4 ప్రకటించారని ప్రత్తిపాటి వివరించారు. సంపన్నుల సాయం, ఔదార్యంతో పేద కుటుంబాల్లో కొత్త వెలుగులు రానున్నాయని అన్నారు. అమరావతి వేదికగా ముఖ్యమంత్రి పి4కు కార్యరూపం ఇవ్వడం,లబ్ది పొందే పేదలు కుటుంబాలను బంగారు కుటుంబాలని, సేవకులు, దాతలను మార్గదర్శకులని చెప్పడం ద్వారా తన ఆలోచన ఏమిటో, దాని ఫలితాలు ఎలా ఉంటాయో స్పష్టంగా వెల్లడించారని అన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో40లక్షల కుటుంబాలను ప్రభుత్వం పేద కుటుంబాలుగా గుర్తించిందన్నారు. పి4 విధానం విజయవంతమైతే ఓట్లు రావని గ్రహించే వైసిపి విమర్శలు చేస్తుందని ప్రత్తిపాటి మండిపడ్డారు. పి4 విధానం విజయవంతమవుతుంది ఆపై పేద కుటుంబాలు తాము విసిరే ఓట్ల వలలో చిక్కుకోరనే భయంతో జగన్ అండ్‌కో తమ నోటికి పని చెప్పారన్నారు. ప్రపంచం మొత్తం అభిమానించే నాయకత్వ లక్షణాలు, దూరదృష్టి ఉన్న నాయకుడిని, ఆయన ఆలోచనలను తప్పు పట్టడం తప్ప వైసిపి నేతలకు మరేమి తెలియదని ప్రజలకు కూడా అర్ధమైందని ప్రత్తిపాటి తెలిపారు. వైసిపి విమర్శలు ఒక రకంగా పేదల జీవితాలు మార్చే పి4 విధానానికి తగిన ప్రచారం కల్పిస్తాయని ప్రత్తిపాటి వివరించారు.

# కామమ్మ తల్లి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన మర్రి రాజశేఖర్

**చిలకలూరిపేట, మార్చి31, ప్రభాతవార్త:** పట్టణంలోని శ్రీ కామమ్మతల్లి,మారయ్యస్వామి వార్ల దేవాలయ వార్షికోత్సవం సందర్భంగా జరిగిన ప్రత్యేక పూజా కార్యక్రమాలలో మర్రి రాజశేఖర్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తీర్ధప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయకమిటి వారి కోరిక మేరకు వారి ఆచారం మేరకు సరదాగా కర్రసాము మరియు కత్తిసాము చేసి అందరిని ఉత్సాహ పరిచారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త సాప వీరరాఘవులు, చిలకలూరిపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సాప అదినారాయణ, న్యాయవాది తోట శ్రీనివాసరావు, మల్లెల నాగేశ్వరరావు, సాప లక్ష్మీనారాయణ, ఇమ్మడి సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.



# ఉచిత మంచినీటి ప్లాంట్‌ను ప్రారంభించిన జీవీ,మక్కెన

**వినుకొండ,మార్చి31,ప్రభాతవార్త:** స్థానిక నర్సరావుపేట రోడ్డులోని ఐరిష్ రెసిడెన్సి కన్వెన్షన్ హాలు, ఉచిత మంచినీటి ప్లాంట్ ప్రారంభోత్సవ కార్యక్రమం సోమవారం ఘనంగా జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏపీ ప్రభుత్వ చీఫ్‌విప్, స్థానిక ఎమ్మెల్యే జీ.వీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావులు పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో తాళ్లూరి కాంతారావు, జనసేన నాయకులు నిశ్శంకరావు శ్రీనివాసరావు, నాగశ్రీనురాయల్, పులిపాటి రామారావు, పువ్వాడ కృష్ణ, పి.వి సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



# భక్తి శ్రద్ధలతో రంజాన్ వేడుకలు

**కొల్లూరు, మార్చి 31 (ప్రభాతవార్త) :** పవిత్ర రంజాన్‌ను ముస్లిం సోదరులు కొల్లూరు మండలంలో ఘనంగా నిర్వహించారు. సోమవారం కొల్లూరులోని ఈద్గా వద్ద ప్రార్ధనలు నిర్వహించారు. గ్రామం నుండి ఈద్గా వరకు ర్యాలీగా వెళ్లారు. ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. మత పెద్దలు ఖురాన్ సారాంశాన్ని రంజాన్ పర్వదిన విశిష్టతను తెలియజేశారు. ముస్లింలు అందరూ ఐక్యంగా ఉండి పేదవారికి తమకు చేతనైన సహాయం చేయాలని అన్నారు.



# పేదల ఆకలి తీర్చే పండుగ రంజాన్

## -రాష్ట్ర మైనార్టీ కమీషన్ సభ్యుడు షేక్ సైఫుల్లా

**పొన్నూరు, మార్చి 31,ప్రభాతవార్త:** పవిత్ర ఖురాన్ బోధించిన జకాత్, ఫిత్రా వంటి విలువైన సేవా నియమాలు పాటిస్తూ, దానధర్మాలు చేస్తూ....పేదల ఆకలి తీర్చే పండుగ రంజాన్ అని రాష్ట్ర మైనార్టీ కమిషన్ సభ్యుడు షేక్ సైఫుల్లా అన్నారు. పవిత్ర రంజాన్ పండుగను పురస్కరించుకొని స్థానిక ఐలాండ్ సెంటర్‌లోని యాసిన్ ప్లాజా వద్ద మాషా అల్లా గ్రూప్ సభ్యులు, ఎంఎం యూత్ సబ్యులు ఆధ్వర్యంలో అనాథలకు, నిరుపేదలకు రంజాన్ పండుగ విశిష్టతను విరించారు. ఈ పండుగ ఉద్దేశం పేదల ఆకలి తీర్చడమేనన్నారు. అన్ని దానముల కన్న అన్నదానమె మిన్న అన్న సూక్తిని అనుసరించి ప్రతి ఒక్కరూ సంపాదించిన సొమ్ములో కొంత భాగాన్ని పేదలకు, అనాథలకు, అభ్యాగతులకు ఖర్చు చేయాలని సూచించారు. సుమారు



700మందికి అన్న సంతర్పణ చేశారు. ఈ కార్యక్రమంలో అంజుమన్ కమిటి గౌరవాధ్యక్షుడు షేక్ మహమ్మద్(మాము), ఉపాధ్యక్షుడు మొల్లా నసీరుద్దీన్ బాష, వైఎస్సార్‌కాంగ్రెస్‌పార్టీ పట్టణాధ్యక్షుడు ఎంఏ మొహమ్మద్, మాషా అల్లా గ్రూప్ సభ్యులు, ఎంఎంయూత్ సభ్యులు పాల్గొన్నారు.

# ఈద్గాలో ఈద్ ఉల్ ఫితర్ ప్రార్థనలు చేసిన ముస్లిం సోదరులు

**బాపట్ల రూరల్,మార్చి31,ప్రభాతవార్త:** బాపట్ల జిల్లాలో ముస్లిం సోదరులు ఘనంగా రంజాన్ వేడుకలు జరుపుకున్నారు.సోమవారం ఈద్గాలలో ముస్లిం సోదరులు ఈద్‌ఉల్‌ఫితర్ ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. బాపట్ల పట్టణంలో ముస్లిం సోదరులకు ఈద్గాలో ఏర్పాటు చేసిన ఈదుల్ ఫితర్ ప్రత్యేక ప్రార్ధనలు ఆచరించారు. ఈ ప్రార్ధనలకు



వేలాదిమంది ముస్లిం సోదరులు హాజరయ్యారు. రంజాన్ పర్వదినం ప్రాముఖ్యత గురించి జామియా మసీదు పెష్ ఇమామ్ముఫ్తి మహమ్మద్ అఫక్ తెలియజేశారు. ముస్లిం సోదరులు సద్భావన, సహృదయంతో ఆలింగనాలు చేసుకుని పరస్పరం రంజాన్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. ఆధ్యాత్మిక చింతనతో జరిగిన ప్రత్యేక ప్రార్థనలు రంజాన్ మాసం విశిష్టతను తెలియజేశాయి. ప్రార్ధనలకు ముందు ఈద్గా వద్ద ఫిత్రా, జకాత్, సదఖా దానధర్మములు చేశారు. దైవభక్తి, క్రమశిక్షణకు, దాతృత్వానికి రంజాన్ ప్రత్యేకంగా నిలుస్తుంది. మహమ్మద్ ప్రవక్త బోధించిన మార్గాన్ని అనుసరించాలని సాగిన ఆధ్యాత్మిక ప్రసంగాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ప్రార్ధనల అనంతరం ముస్లిం సోదరులు బంధుమిత్రులకు రంజాన్ ప్రత్యేక వంటకాలు, సేమియా, కీర్, మిఠాయిలు అందజేశారు. బంధుమిత్రులకు తినిపించి తమ ఆనంద ఉత్సవాలను వ్యక్తం చేశారు. స్థానిక అంజుమన్ కమిటీ ఆధ్వర్యంలో ప్రార్ధనలకు ఈద్గా వద్దకు హాజరైన ముస్లిం సోదరులకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఎలాంటి అసౌకర్యం కలగకుండా అధికార యంత్రాంగం, ముస్లిం మత పెద్దలు బాపట్ల పట్టణ పోలీసుల సమన్వయంతో ఏర్పాట్లను పర్యవేక్షించారు. కాగా పట్టణంలోని జమేదార్ పేట లోని ఈద్గాలో కూడా ముస్లిం సోదరులు ఈద్‌ఉల్‌ఫితర్ ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. బాపట్ల అంజుమన్ కమిటీ అధ్యక్షులు అబ్దుల్ రహీం జానీ రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు.

**- వక్ఫ్ బోర్డు బిల్లు సవరణ పై నల్ల రిబ్బన్లు ధరించి ప్రార్ధనలకు హాజరైన ముస్లిం సోదరులు**

కేంద్ర ప్రభుత్వం వక్ బోర్డు బిల్లు సవరణ చేస్తూ చట్టాన్ని తీసుకురావాలని తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ముస్లిం సోదరులు నల్ల రిబ్బన్లు చేతికి కట్టుకుని రంజాన్ ప్రార్ధనలు చేసి తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అంజుమన్ కమిటీ అధ్యక్షుడు అబ్దుల్ రహీమ్ జానీ మాట్లాడుతూ వక్ఫ్ బోర్డు లో అన్య మతస్తులను నియమించడాన్ని పూర్తిగా వ్యతిరేకిస్తున్నామన పేర్కొన్నారు. ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు జనరల్ సెక్రెటరీ మోలానా ఫజలూర్ రహీం, జమైతుల్ ఉలేమా హింద్, దేవ్ బంద్ సంస్థ చైర్మన్ అర్షద్ మదిని ఇచ్చిన పిలుపుమేరకు ముస్లిం సోదరులు నల్ల రిబ్బన్లు ధరించి నిరసన వ్యక్తం చేశారు.వక్ఫ్ బోర్డు బిల్లు సవరణ పై నల్ల రిబ్బన్లు ధరించి ముస్లిం సోదరులు ప్రార్ధనలకు హాజరయ్యారన్నారు. భారతదేశానికి స్వాతంత్రం తెచ్చేందుకు బ్రిటిష్ పాలకులపై విరోచితంగా పోరాడి వేలాదిమంది ముస్లింలు ప్రాణ త్యాగాలు చేసి వీరమరణం చెందారని ఆయన గుర్తు చేశారు. ముస్లింల పరిరక్షణకు ఎంతోమంది ముస్లిం చక్రవర్తులు ఆస్తులను వక్ఫ్ బోర్డుకు వితరణగా అందజేశారన్నారు. కేంద్ర ప్రభుత్వానికి ముస్లింల వక్ఫ్ ఆస్తులపై కన్ను పడిందన్నారు. బలవంతంగా ఆర్టికల్ 370 , త్రిబుల్ తలాక్ చట్టాన్ని బీజేపీ ప్రభుత్వం అమలుచేసిందని విమర్శించారు.ఈ కార్యక్రమంలో బాపట్ల అంజుమన్ కమిటీ సెక్రటరీ అబ్దుల్ కరీం, ఉపాధ్యక్షులు షేక్ బాజీ ,జాయింట్ సెక్రెటరీ మహమ్మద్ రఫీ,ట్రెజరర్ మీరా సాహెబ్, సభ్యులు ముస్లిం మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా రంజాన్ వేడుకలు

**రేపల్లె(నిజాంపట్నం), మార్చి 31, ప్రభాతవార్తః** రంజాన్ పర్వదినాన్ని రేపల్లె నియోజకవర్గంలోని ముస్లిం సోదరులు ఘనంగా జరుపుకున్నారు. నెల రోజుల ఉపవాసదీక్షల అనంతరం రంజాన్ పండుగను సోమవారం నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా రేపల్లె పట్టణ, రూరల్ మండలం, నగరం మండలం,



నిజాంపట్నం మండలంలోని నిజాంపట్నం, బావాజీపాలెం, కొమరవోలు, అడవులదీవి, కోపూరివారిపాలెం, నగరం మండలంలోని చినమట్లపూడి, సజ్జావారిపాలెం, రేపల్లె మండలంలోని కైతేపల్లి తదితర గ్రామాలలోని ముస్లిం సోదరులు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈద్గాలవద్దకు వెళ్ళి సామూహికంగా ప్రత్యేక ప్రార్ధనలు జరుపుకున్నారు.

# ఆదిత్య బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు

## - పలువురు ప్రముఖులను సత్కరించిన సంఘ నాయకులు

**చిలకలూరిపేట, మార్చి31, ప్రభాతవార్త:** పట్టణంలోని ఓగేరువాగు పక్కన ఉన్న ఆదిత్య బ్రాహ్మణ సంఘం భవనంలో ఆదిత్య బ్రాహ్మణ



సంఘం ఆధ్వర్యంలో ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంఘ అధ్యక్షులు ఏక మారుతి రామశర్మ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ భక్తిగీత కళాకారులు, రేడియో,దూరదర్శన్ కళాకారులైన భాగి కృష్ణమూర్తిని, భరతనాట్య, కూచిపూడి నృత్య కళాకారిణి గాలి రేవతిలను సంఘ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పోలూరి చంద్రమౌళి, మున్సిపల్ ఆర్ఓ పొత్తూరి సుబ్బారావు, సంఘ గౌరవాధ్యక్షులు చల్లా విజయకుమార్, గబ్బిటి వెంకటేశ్వర శాస్త్రి, కోశాధికారిపావులూరి శేషగిరిరావు, ప్రచార కార్యదర్శి ధూళిపాళ్ల శ్రీకాంత్, సంఘ బిల్డింగ్ కమిటి వైస్ చైర్మన్ కోపల్లి తులసీరామ్,చావలి మల్లిఖార్జునావు, గాలి శ్రీనివాసరావు, తూబాటి లక్ష్మీనరసింహమూర్తి, పోలూరి శ్యామ్మోహన్,కోనంకి పవన్, మహిళా కార్యవర్గ సభ్యులు ఏక లలితాకుమారి, ధూళిపాళ్ల పద్మజ తదితర సభ్యులు పాల్గొన్నారు.

# ప్రారంభమైన మహాకుంభాభిషేక మహోత్సవం

**పొన్నూరు, మార్చి 31,ప్రభాతవార్త:** “శ్రీరామ రామ రామేతి రమే రామే మనోరమే-సహస్రనామ తత్తుల్యం రామ నామ వరానమే” అనే రామనామంతో పట్టణంలోని తెలగపాలెం శ్రీ కోదరండ రామాలయం శ్రీ మహాకుంభాభిషేక మహోత్సవం అత్యంత భక్తిశ్రద్ధలతో సోమవారం రాత్రి ప్రారంభించారు. శ్రీనివాసుల శ్రీనివాస దీక్షిత అయ్యంగార్ యాజ్ఞీకత్వంలో, అర్చకస్వామి చిలకపాటి లక్ష్మణ్ రామాచార్యులు నేతృత్వంలో సుమారు 25మంది రుత్విక్కులతో ఈ కారక్రమానికి అంకురారోపణ చేశారు. తొలుత విష్వక్సేనపూజ, పుణ్యాహము, అఖండ దీప స్థాపన, రక్షాబంధనము, ఆచార్య యజమాన దీక్షా స్వీకరణ, మేదినీ పూజ కార్యక్రమాలు నిర్వహించారు. దేవాలయం శాశ్విత ధర్మకర్త ఆకుల వెంకటేశ్వరరావు దంపతులు, కలపాలశ్రీనివాసరావు-విజయలక్ష్మి దంపతులు, నగరం రామకృష్ణ దంపతులు మహాకుంభాభిషేక దీక్షను స్వీకరించి, కంకణధారులయ్యారు. అర్చకస్వాములు అందుకు సంబంధించిన పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. అర్చకస్వాములు వేదపారాయణం నిర్వహించారు. దేవాలయం వద్ద ప్రత్యేకంగా యాగశాలను ఏర్పాటు చేశారు. దేవాలయాన్ని రంగు రంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. భక్తులకు తీర్థప్రసాద వినియోగం జరిగింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా దేవాలయం అధ్యక్షుడు అల్లం సాంబశివరావు,ఉపాధ్యక్షుడు అప్పికట్ల వెంకటేశ్వరరావు, కార్యదర్శి శింగంశెట్టి శివశంకర్ నేతృత్వంలో కార్యవర్గ సభ్యులు ఏర్పాట్లు చేశారు.



## భారత మార్కెట్లో ఒప్పో ఎస్29సిరీస్

**విజయవాడ, మార్చి 31, ప్రభాతవార్త :** భారతదేశం కోసం తయారు చేసిన నిజమైన డ్యూరబుల్ ఛాంపియన్ ఒప్పో ఎస్29సిరీస్ స్మార్ట్‌ఫోన్ మన్నికను భారతదేశంలో పరిక్షించిన ప్రపంచ స్థాయి ఇంజనీరింగ్ మిలటరీ గ్రేడ్ ధృడత్వం అత్యుత్తమ కనెక్టివిటి శక్తివంతమైన బ్యాటరీ పనితీరుతో నెట్‌వర్క్ విశ్వసనీయత కలిగిన సరికొత్త నిర్వచనంతో ఈ నెల 29 సాయంత్రం 6 గంటల నుండి ఒప్పో ఈస్టోర్, ఫ్లిప్‌కార్ట్, అమెజాన్, అన్ని ప్రధాన రిటైల్ అవుట్‌లెట్లలో అందుబాటులో ఉంటాయి.

# మార్కెట్ యార్డ్ నూతన చైర్మన్‌కు ఘనసన్మానం

**పిట్టలవానిపాలెం,మార్చి31,ప్రభాతవార్త:** స్థానిక శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ ఆశీస్సులతో బాపట్ల అగ్రికల్చరల్ మార్కెటింగ్ యార్డ్ నూతనచైర్మన్ గా నియమితులైన కావూరి శ్రీనివాస్ రెడ్డిని పిట్టలవానిపాలెం మండల నాయకులు వెంకటపతి రాజు అధ్వర్యంలో డాక్టర్ గ్లోరీ యానెట్ యువసేన కలసి నియోజకవర్గ పార్టీ కార్యాలయం నందు ఘనంగా సత్కరించారు .ఈ కార్యక్రమంలో బర్మా జాన్ బాబు, బర్మా శామ్యూల్, బర్మా చంటి, బర్మా సుబ్బయ్య, చెరుకూరి యాదయ్య, బర్మా ఫిన్నీ, దేవరకొండ అజయ్, రాఫాయేలు, గురిందపల్లి బాబురావు, చందోలు రవి కుమార్, చందోలు జగజీవన్,మట్లాపూడి నిఖిల్, బర్మా లక్కీ పాల్గొన్నారు.



# సంగం పాల అమ్మకపు ధర పెంపు

## -సంగం డెయిరీ మేనేజింగ్ డైరెక్టర్ గోపాలకృష్ణన్

**పొన్నూరు, మార్చి 31,ప్రభాతవార్త:** పాలసేకరణ ధర, డీజిల్, ప్యాకింగ్ మెటీరియల్ ధరలు, ఇతర వ్యయాలు పెరిగిన నేపథ్యంలో, అనివార్య పరిస్థితుల్లో పాల అమ్మకపు ధరను పెంచుతూ నిర్ణయం తీసుకున్నట్లు సంగం డెయిరీ మేనేజింగ్ డైరెక్టర్ గోపాలకృష్ణన్ తెలిపారు. పాల వినియోగదారులు విషయాన్ని గమనించాలని కోరారు. ఈ సవరించిన ధరలు ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి అమలులోకి వస్తాయన్నారు. గోల్డ్‌ప్లస్, గోల్డ్, టీ స్పెషల్,యస్‌టిఎం, టియమ్, డిటియ్ వంటి అన్ని రకాలపై 500మి.లీ.కు ప్రస్తుత ధరమీద అదనంగా ఒక రూపాయి పెంచినట్లు చెప్పారు. అనివార్య పరిస్థితుల్లో మాత్రమే పాల అమ్మకపు ధరను సవరించినట్లు చెప్పారు. మిగిలిన పాలు, పాల ఉత్పత్తులపై ఎటువంటి మార్పులేదని చెప్పారు.

# పట్టణంలో ఘనంగా రంజాన్ ప్రార్థనలు

**చిలకలూరిపేట, మార్చి31, ప్రభాతవార్త:** పవిత్ర రంజాన్ పండుగ సందర్భంగా పట్టణంలోని అడ్డరోడ్డు సెంటర్‌లో ఉన్న ఈద్గా వద్ద సోమవారం వేలాదిమంది ముస్లిం సోదరులు రంజాన్ ఈద్ నమాజును చదువుకున్నారు.అనంతరం ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలో కబ్రస్తాన్ స్థల కొనుగోలుకు వైసిపి నాయకుడు, జ్ఞానేశ్వర్ ఫౌండేషన్ అధినేత జాన్‌సైదా రూ 10లక్షల చెక్కును అంజుమన్ కమిటి అధ్యక్షుడు జాన్‌పీరాకు అందచేశారు. జాన్ సైదాకు ముస్లిం మత పెద్దలు ధన్యవాదాలు తెలిపారు.



# ముస్లీం సమాజాభివృద్ధికి కృషి చేస్తాం

-ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్

**పొన్నూరు, మార్చి 31,ప్రభాతవార్త:** పవిత్ర రంజాన్ పర్వదినం సందర్భంగా ముస్లీం సోదరులకు ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ శుభాకాంక్షలు తెలిపారు. ఇటికంపాడు రోడ్డులోని ఈద్గా వద్ద జరిగే ప్రత్యేక ప్రార్ధనల్లో ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ పాల్గొని, ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. ఈ సందర్భంగా నరేంద్రకుమార్ మాట్లాడుతూ ముస్లీంల అభ్యున్నతికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. అందులో భాగంగానే పొన్నూరులో షాదీఖానా నిర్మాణానికి, 22(ఎ)కింద ఉన్న భూముల విడుదల, మౌజమ్‌లకు, ఇమాంలకు గౌరవ వేతనాలు వంటివన్నీ చేపట్టామన్నారు.



రానున్న రోజుల్లో కూడా ముస్లీంల అభ్యున్నతికి అల్లా దయతో మరిన్ని కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ సందర్భంగా ముస్లీం సోదరులను ఆలింగనం చేసుకొని శుభాకాంక్షలు తెలిపారు.

# రంజాన్ ప్రార్ధనాలలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి

**నరసరావుపేట , మార్చి 31 ప్రభాతవార్త :** మాజీ శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి సోమవారం స్దానిక ఈద్గా మైదానంలో జరిగినరంజాన్ ప్రత్యేక ప్రార్ధనాలలో పాల్గొన్నారు. పార్టీ మైనార్టీ విభాగం నాయకులతో కలిసి మత పెద్దల పండుగ సందేశాలను విన్నారు. ప్రార్ధనాలు అనంతరం ముస్లిం సోదరులను అలింగనం చేసుకుని శుభకాంక్షలు తెలిపారు. మత పెద్దల అశీస్సులు అందుకున్నారు. అదే విధంగా మాజీ ముఖ్యమంత్రులు వైఎస్ రాజశేఖర్‌రెడ్డి,ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిలు మైనార్టీల కొరకు ప్రవేశపెట్టిన రిజర్వేషన్లు, అనేక పథకాలను గురించి గుర్తు చేసారు. తమ పార్టీకి ఎల్లప్పుడు మైనార్టీలు అండగా నిలిచారని తెలిపారు. తనకు వ్యక్తిగతంగా, రాజకీయంగా ముస్లిం సోదరులతో నియోజకవర్గంలో ఉన్న అనుబంధం గుర్తు చేసారు. వారికి ఎల్లపుడూ తన సహకారం ఉంటుందని మాజీ శాసనసభ్యులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి తెలపారు. వారివెంట పార్టీ నాయకులు, మత పెద్దలు ఉన్నారు.



# చలివేంద్రం ప్రారంభించిన జనసేన నేత సయ్యద్ జిలాని

**నరసరావుపేట , మార్చి 31 ప్రభాతవార్త :** మండలంలోని ములకలూరు గ్రామంలో ఏర్పాటు చేసిన చలివేంద్రంను జనసేన పార్టీ నియోజకవర్గఇన్‌చార్జి సయ్యద్ జిలాని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డొక్కా సీతమ్మ పేరుపై ఈ కార్యక్రమం జరగాటం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి , పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా వేసవి కాలంలో చలివేంద్రాలు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఏర్పాటు చేయటం జరిగిందన్నారు. ఉష్ణోగ్రతలు రికార్డు స్దాయిలో నమోదవుతున్న నేపథ్యంలో మంచినీరుతో పాటుమజ్జిగ ప్రజలకు అందిస్తున్నారని వారికి అభినందనలు తెలిపారు. తమ పార్టీ నాయకులు, కార్యకర్తలు నిర్వహించే సేవ, మంచి కార్యక్రమాలకుతమ వంతు ప్రోత్సాహం ఉంటుందని జనసేన ఇన్‌ఛార్జి సయ్యద్ జలాని తెలిపారు. తొలుత వారు స్దానిక దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వారి వెంట పార్టీ నాయకులు షేక్ అద్రూఫ్, స్దానిక గ్రామ నాయకులు కోటేశ్వరరావు, అశోక్, డేగల బాల, కృష్ణ, శివ, చింత శ్రీను,మిరియాల సోము తదితరులు పాల్గొన్నారు.



# కార్యకర్తలను గుండెల్లో పెట్టి చూసుకుంటాం : ఎమ్మెల్యే చదలవాడ

**రొంపిచర్ల, మార్చి 31 ప్రభాతవార్త :** తెలుగుదేశం పార్టీకి చెందిన ప్రతి ఒక్క కార్యకర్తను తమ గుండెల్లో పెట్టుకుని చూసుకుంటామని శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవిందబాబు మాట్లాడారు. టిడిపికి గత కొన్ని దశబ్దాలుగా పనిచేసే వారిని గుర్తించి తగిన గుర్తింపు ఇస్తామన్నారు. తన విజయంలో పార్టీ కార్యకర్తల కష్టం ఉందన్నారు. ఎప్పుడూ వారిని మరిచిపోమన్నారు. వారికి ఏ సమయంలో అవసరమైన అదుకుంటామన్నారు. ఎన్నో నష్టలను ప్రతిపక్షంలో పార్టీకుటుంబాలు ఎదుర్కోవటం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో అభివృద్ధి జరుగుతున్న సంక్షేమం ప్రతి ఇంటికి వెళ్లాలని అన్నారు. మండల కేంద్రంలో నిర్వహించిన బాల త్రిపుర సుందరిదేవి-శంకరేశ్వర స్వామి తిరుణాలకార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన భారీ విద్యుత్‌ప్రభపై పార్టీ సీనియర్ నాయకులు కొల్లి బ్రహ్మయ్య, వాసిరెడ్డి రవి, మండల పార్టీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే కార్యకర్తలనుద్దేశించి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపే పార్టీకి, తెలిపి అండగా ఉండలని ఎమ్మెల్యే డాక్టర్‌చదలవాడ అరవిందబాబు అన్నారు. తొలుత పార్టీ శ్రేణులు ఎమ్మెల్యేకు ఘనంగా స్వాగతం పలికారు. పార్టీ సీనియర్ నాయకులు కొల్లి బ్రహ్మయ్య, వాసిరెడ్డి రవి తదితరులకు ఘన సన్మానం చేశారు.



# భక్తి శ్రద్ధలతో రంజాన్ నమాజులు

**రెంటచింతల, మార్చి 31 ప్రభాతవార్త:** ఉపవాసాలు, ప్రార్ధనలు, దానధర్మాలతో నెలరోజులపాటు నియమ నిష్టలతో గడిపిన ముస్లిం సోదరులు ఇస్లామిక్ క్యాలెండర్ అయిన షవ్వాల్‌లో కొత్తనెల ప్రారంభాన్ని సూచించే నెలవంక దర్శనంతో పవిత్ర రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం రెంటచింతల మండల ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక నమాజులు జరుపుకున్నారు. భౌతిక త్యాగమే కాకుండా ఆధ్యాత్మిక స్వచ్ఛత, మనో నిబ్బరత, దైవభక్తి, శాంతి, సహనం వంటి విలువలను బలోపేతం చేసే ఉపవాస దీక్షలు చేసిన ముస్లిం సోదరులు ఈద్ ఉల్ ఫితర్ పండుగను చిన్నాపెద్దలు పరస్పరం ఆలింగనం చేసుకుని ఉత్సాహంగా జరుపుకున్నారు. మండలంలోని మల్లవరం, తుమ్మకోట అలంగర్, రెంటచింతలలోని జామియా మసీదుల్లో నూతన వస్త్రాలు ధరించిన ముస్లిం చిన్నాపెద్దా తేడా లేకుండా నమాజులు చేశారు. ఆయా మసీదుల్లో ఇమామ్‌లు రంజాన్ సందేశాన్ని జనులకు వివరించారు. ప్రతి వ్యక్తి దానగుణం కలిగి ఉండాలని, తనకు ఉన్న దాంట్లో దానం చేయడమే గొప్ప లక్ష్యంగా అల్లా పేర్కొన్నారని గుర్తు చేశారు. ప్రతి ఒక్కరూ మహమ్మద్ ప్రవక్త మార్గాన్ని అనుసరించాలని సూచించారు. సంరేకం అనంతరం తుమ్మకోట ఈద్గాలో మౌలి సాబ్ షేక్‌బాబు ఖుద్బా చదివి వినిపించారు. ముస్లిం సోదరీమణులు ఇళ్లల్లో రంజాన్ నమాజులు జరుపుకున్నారు. ఈద్-ఉల్-ఫితర్ నమాజ్ అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



# శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో పంచాంగ శ్రవణం

**పిడుగురాళ్ల, మార్చి 31 ప్రభాతవార్త:** పట్టణంలోని మాచర్ల రోడ్డులో గల శ్రీవీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో ఆదివారం ఏర్పాటు చేసిన పంచాంగ శ్రవణంలో కొమ్మూరి విశ్వరూపాచార్య సిద్ధాంతి పంచాంగాన్ని వివరించారు. ఇప్పటికి సృష్టి ప్రారంభమై 195 కోట్ల 58 లక్షల 88 వేల 126 సంవత్సరాలైందన్నారు. ఈ విశ్వావసు నామ సంవత్సరంలో వర్షాలు బాగా కురిసి పంటలు బాగా పండుతాయన్నారు, పాడి పరిశ్రమ బాగా ఉంటుందన్నారు. భారీ భూకంపాలు, కొన్ని చోట్ల తుఫాన్లు, కొండ చరియలు విరిగిపడతాయని చెప్పారు. రాష్ట్ర పాలకవర్గం కష్టపడి రాష్ట్రాన్ని విజయవంతంగా ముందుకు నడిపిస్తుందని, కేంద్రంలో మంత్రివర్గ మార్పులు ఉన్నాయని చెప్పారు. దేవస్థాన కమిటీ అధ్యక్షుడు గుండా నారాయణరావు, దార్ల ఆంజనేయాచారి, నెమలికొండ శ్రీనివాసచారి, సుతారి మల్లేశ్వరరావు, కోట ప్రసాద్ విశ్వరూపాచార్య సిద్ధాంతిని ఘనంగా సన్మానించారు.



# ఆకట్టుకున్న ఉగాది కవితాగోష్టి

**గుంటూరు కల్చరల్, మార్చి 31,ప్రభాతవార్త :** అవగాహన సంస్థ ఉగాది పండుగరోజు సంస్థ కార్యాలయంలో నిర్వహించిన ఉగాది కవితాగోష్టికిహాజరైన వారందర్ని ఆకట్టుకుంది.కవులు ఆధునిక సమాజంలో ఎదురవుతున్న పెడపోకడలపై మాదకద్రవ్యాలపై స్త్రీలపై జరుగుతున్న అత్యాచారాలపై తమ కవితల్ని ఆలపించారు.ఆరురుచులు,అమ్మసంతకం అనే కవితలు అందర్ని ఆలోచింపచేశాయి.పలువురు కవులు మిని కవితలు ఆలపించారు.ఈ సందర్భంగా కవయిత్రులు ఎ.సుభద్ర,పింగళి భాగ్యలక్ష్మి,కవి జంది జమదగ్నిలను సంస్థ సభ్యులు ఉగాది సందర్భంగా సత్కరించారు.విద్యావేత్త శాంతశ్రీమన్నారాయణ మాట్లాడుతూ కవి కవితలు ద్వారా సమాజానికి ఉగాది పండక్కి అవినాభావ సంబంధం ఉందన్నారు.

# ప్రత్యేక ప్రార్ధనల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ ఆలపాటి

**తెనాలి, మార్చి 31 (ప్రభాతవార్త) :** రంజాన్ సందర్భంగా పట్టణ మరియు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పలు ఈద్గాల్లో ముస్లిమ్ సోదరులతో కలసి ప్రత్యేక ప్రర్ధానల్లో మాజీ మంత్రి, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పాల్గొని రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ముస్లిమ్ సమాజం పవిత్ర ఆత్మతో రంజాన్ పండుగని జరుపుకుంటారని భగవంతుడికి ఆత్మగా కొలుచుకుంటూ దయ, కరుణ, మత సామరస్యాన్ని లౌకిక వాదాన్ని ముస్లిమ్ సమాజం ఉంటుందని తెలియజేశారు. రంజాన్ సందర్భంగా ప్రతి ముస్లిం సంక్షేమాన్నికి, అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని ఆయన తెలిపారు.



# కొల్లిపరలో ఘనంగా రంజాన్ వేడుకలు

**కొల్లివర,మార్చి 31 ప్రభాతవార్త:** మండలంలోని దావులూరు,తూములూరు,మున్నంగి,కొల్లిపర గ్రామాలలో ముస్లిం సోదరులు పవిత్రంగా భావించే రంజాన్ మాసం సందర్భంగా నెల రోజుల పాటు కఠోర ఉపవాస దీక్షల అనంతరం సోమవారం ఘనంగా రంజాన్ పండుగను జరుపుకున్నారు.ముస్లిం సోదరులు తెల్లవారు ఝామున మత పెద్దల సమక్షంలో మసీదుల్లో అల్లాహు అక బ్బర్ అంటూ ఈదర్ ఫితర్ ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు.ఒకరికి ఒకరు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



# వైకాపా అధికారంలోకి వస్తుంది : మాజీ ఎమ్మెల్యే

రొంపిచర్ల , మార్చి 31 ప్రభాతవార్త : రాష్టంలో వైఎస్సార్‌సిపి తిరిగి అధికారంలోకి వస్తుందని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డిఅన్నారు. మండల కేంద్రంలో వైభవంగా జరిగిన శ్రీబాల త్రిపుర సుందరి సమేత శంకరేశ్వర స్వామి తిరుణాల మహోత్సవం కార్యక్రమంలోఆయన పాల్గొన్నారు. శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విద్యుత్ ప్రభపై డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడారు. పార్టీ శ్రేణులకు ఉగాది, రంజాన్ శుభకాంక్షలు తెలిపారు. ఎవరు అధైర్య పడవద్దన్నారు. ఖచ్చితంగా మంచి పాలన చేసిన పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోసం ప్రజలు ఎదురు చూస్తున్నారని, తిరిగి అధికారం వస్తుందన్నారు. ప్రజల కోసం పని చేసి, ఇచ్చిన ప్రతి హామీని నిలుపుకున్న పార్టీ వైఎస్సార్‌సిపి అన్నారు. అక్రమ కేసులకు, బెదిరింపులకు భయపడ వద్దన్నారు. రొంపిచర్ల అంటే వైఎస్సార్‌సిపి అడ్డా అని ఈసందర్భంగా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



# రంజాన్ వేడుకలలో పాల్గొన్న ఎమ్మెల్యే యరపతినేని

**పిడుగురాళ్ల, మార్చి 31 ప్రభాతవార్త:** గత రంజాన్ పండుగకు నమాజ్‌కు వచ్చినప్పుడు నేడు మాజీ శాసనసభ్యుడిని.. మీ అందరి ఆశీస్సులు, అల్లా దయతో ఈ రంజాన్ పండుగకు శాసనసభ్యునిగా మీ ముందుకు వచ్చానని గురజాల ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని యరపతినేని నగర్‌లో గల ఈద్గాలో సోమవారం నిర్వహించిన రంజాన్‌వేడుకల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. పవిత్ర రంజాన్ మాసం ఎంతో నియమ నిష్టలతో నెల రోజులపాటు ఉపవాస దీక్షలు తీసుకొని ఉపవాసాలు ఉండి ఉప వాస దీక్షలు ముగించి ఈదుల్ ఫితర్ నమాజు చదువుకుంటున్న ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ముస్లింలు అష్ట ఐశ్వర్యాల, ఆయురారోగ్యాలతో తులతూగాలని, అన్ని వృత్తులకు సంబంధించిన వారు చేతి నిండా పని ఉండి అందరి కుటుంబాలు ఆనందంగా ఉండాలని అల్లాహ్‌ను వేడుకుంటూ నేను ముస్లిం కుటుంబంలో పుట్టకపోయినా ముస్లింలకు సేవ చేసుకునే భాగ్యం కలిగినందుక ఆనంద పడుతున్నానని ఎమ్మెల్యే యరపతినేని అన్నారు. రాజకీయ జీవితంలో ఉన్నన్నాళ్ళు, తర్వాత కూడా ముస్లింలకు అండగా ఉంటానని, ఇప్పుడు మనందరం నమాజ్ చదువుకుంటున్న ఈద్గాను రెండు రాష్ట్రాల్లో ఎక్కడా లేని విధంగా మూడు ఎకరాల స్థలం మంజూరు చేయించి ముస్లిం సోదరులకు నావంతు సాయంగా నా సొంత డబ్బులతో ఈద్గా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గత పాలకులు ఈద్గాలో ముస్లిం సోదరులకు సౌకర్యాలు ఏర్పాటు చేయడానికి పార్టీల వంకతో ఇక్కడ ఎటువంటి ఏర్పాటు చేయకపోయినా మనమే చేశామన్నారు. మీ అందరి ఆశీస్సులతో ముస్లింల చిరకాల కోరిక అయిన హజ్ యాత్రకు తాను కూడా పాలుపంచుకోవాలనే ఉద్దేశ్యంతో దేశంలోని ఏ ఎమ్మెల్యే చేయనంతగా హజ్‌కు వెళ్లే ముస్లింలకు తలా లక్ష రూపాయలు ఇచ్చి సుమారు 50 మందిని మక్కా యాత్రకు పంపించి ఆ పుణ్యంలో పాలు పంచుకున్నానని చెప్పారు. గురజాల నియోజకవర్గంలో మనం పెట్టిన తరువాతే మొన్న 2024 ఎన్నికల్లో కూటమి అజెండాలో కూడా హజ్ యాత్రకులక్ష ఇస్తామని ప్రకటించడం జరిగిందన్నారు. ఇక నుంచి హజ్‌కు వెళ్లే ముస్లింలకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి రూ. లక్ష ఇచ్చి పంపడం జరుగుతుందన్నారు. పార్టీలకు అతీతంగా ముస్లింలలో ఒకడిగా ఉంటూ మీకు సేవ చేసుకుంటానని, మీరు కూడా మీలో తనను ఒకడిగా ఆదరించాలని ఎమ్మెల్యే యరపతినేని కోరారు. పట్టణంలోని యరపతినేని నగర్‌లో గల ఈద్గా, జానపాడు రోడ్డులోని ఈద్గా వద్ద నమాజ్ చదివే ముస్లింలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకటసుబ్బారావు ఆధ్వర్యాన కూలర్లు, టెంట్లు, షామియానాలు, తాగునీటి సదుపాయం కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో ఖాజీ మౌలానా అబ్దుల్ కరీం నమాజు చదివించారు. జిల్లా మైనార్టీ అధ్యక్షుడు సయ్యద్ అమీర్ అలీ ఆధ్వర్యాన శాసనసభ్యుడు యరపతినేని శ్రీనివాసరావును ముస్లిం సాంప్రదాయ దుస్తులతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ సెల్ నేత షేక్ బాబావలి, పట్టణ మైనార్టీ అధ్యక్షుడు షేక్ మస్తాన్‌వలి, పట్టణ ఉపాధ్యక్షుడు కార్ సైదా, బాషా, ఫరీద్ మేస్త్రి, పెద్ద బుడే, షేక్ ఖాదర్‌వలి, ముజీబ్, సయ్యద్ ఇర్షాద్, డాక్టర్ వలి, డాక్టర్ సర్దార్, వాచర్ బుడే, అబ్దుల్ గని, రజాక్, మోమిన్ గని, ఇమ్రాన్, పఠాన్ ఖాసిం, కొట్టు బాష, ముస్తఫా, నాగూర్, జిలానీ, జమాల్, ఇతియాజ్, షఫి, మున్సిపల్ చైర్మన్ కొత్త వెంకట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.



# బిసి సమాజ అభ్యున్నతికి ఉద్యోగులు కృషి చేయాలి

**మంగళగిరి,మార్చి 31,ప్రభాతవార్త :** బిసి సమాజ అభ్యున్నతికి ఉద్యోగులు కృషి చేయాలని అందుకు "పే బా ్యక్ టు ద సొసైటీ" నియమాన్ని ప్రతి ఒక్కరూ అమలు పరచాలని,ఆంధ్రప్రదేశ్ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు కేశన శంకరరావు ఉద్యోగులకు పిలుపునిచ్చారు.సా ్థనిక మంగళగిరిలోని రాష్ట్ర కార్యాలయంలో ఆ విభాగ రాష్ట్ర అధ్యక్షులు ఎం.వి.వి.ఎస్.మూర్తి నియామకమైన సందర్భంగా అభినందన సభ జరిగింది.సభలో పలువురు బిసి నాయకులు వారిని ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా కేశన శంకరరావు మాట్లాడుతూ నూతన అధ్యక్షులుగా ఎన్నికైన మూర్తి అనేక దశాబ్దాలుగా ఉద్యోగులను ఐక్యపరుస్తూ,వారి సమస్యలపై అనేక ఉద్యమాలు-పోరాటాలు నిర్వహించారన్నారు.ముఖ్యంగా మోస్ట్ బ్యాక్ వర్డ్ క్లాసెస్ ప్రజలు సమస్యలపై సంపూర్ణ అవగాహన ఉన్న వ్యక్తిగా భవిష్యత్తులో ఉదో ్యగ విభాగాన్ని మరింత బలవత్తరం చేస్తారన్నారు.ఈరోజు పేదలు-బడుగులు వారి జీవితాలను వారే మార్చుకోగలిగే స్థితిలో లేరని,వారికి మేధావులైన ,ఆర్థిక వెసులుబాటు కలిగి ఎంతో కొంత సమయం బిసి సమాజం కోసం వెచ్చించగలిగే స్థితిలో ఉన్న ఉద్యోగులు ఆ మేరకు అంకితభావంతో చిత్తశుద్ధితో మనదైన బిసి సమాజ అభ్యున్నతి కోసం కృషి చేయాలని శంకరరావు పిలుపునిచ్చారు.అలాగే ఏప్రిల్ 4న గుంటూరులోని వెంకటేశ్వర విజ్ఞానమందిరం పక్కనున్న టిటిడి కళ్యాణ మండపంలో జరుగు రాష్ట్రస్థాయి విస్తృత సమావేశాన్ని బిసి నాయకులు కార్యకర్తలు అందరూ పాల్గొని జయప్రదం చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి కుమ్మర క్రాంతికుమార్ మాట్లాడుతూ,బిసీల ప్రధాన డిమాండ్లపై ఏప్రిల్ 2న "హలో బిసి -- చలో డిల్లీ" కార్యక్రమం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జరుగు భారీ నిరసన ధర్నాను జయప్రదం చేసేందుకు బిసీలంతా తరలి రావాలి ్సందిగా కోరారు.రాష్ట్ర ఉద్యోగ విభాగ అధ్యక్షునిగా ఎంపికైన మూర్తి మాట్లాడుతూ బిసి సంక్షేమ సంఘం అభివృద్ధికి,ఉద్యోగుల సమస్యల పరిష్కారంతోపాటు సంఘ బలోపేతానికి అంకితభావంతో చిత్తశుద్ధితో కృషి చేస్తానని వాగ్దానం చేశారు.ఈ మీడియా సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు శివరామ్ బాబాజీ,రాష్ట్ర అధికార ప్రతినిధి బాదుగున్నల శ్రీనివాస్,రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ కోలా అశోక్,జిల్లా అధ్యక్షులు పారేపల్లి మహేష్,ఉద్యోగ విభాగ రాష్ట్ర వరి ్కంగ్ ప్రెసిడెంట్ గుంటుపల్లి ఉమామహేశ్వరరావు,రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి కొల్లూరి హనుమంతరావు,జిల్లా ఉపాధ్యక్షులు జంజన వరప్రసాద్,విశ్వేశ్వరరావు,వెంకట్రావు,శ్రీనివాసరావు తదితరులు పాల్గొని ప్రసంగించారు.



# గణపవరంలో ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించిన ముస్లిం సోదరులు

నాదెండ్ల,మార్చి31,ప్రభాతవార్త: పవిత్ర రంజాన్ మాసం పురస్కరించుకొని ఈద్-ఉల్-ఫీతర్ ఉపవాస దీక్షలు ముగించి పండుగ జరుపుకుంటున్న ముస్లిం సోదరులు సోమవారం మండలంలోని గణపవరం ఈద్గా వద్ద వేలాదిగా పాల్గొని రంజాన్ ఈద్ నమాజును చదువుకున్నారు. అనంతరం ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మత పెద్దలు మాట్లాడుతూ రంజాన్ పండుగ నెలరోజులు ముందు నుంచే అల్లాహ్‌పైన భక్తితో ఉపవాస దీక్షలో పాల్గొంటామని, ఆ సమయంలో మస్లిం సోదరులు ఏన్నో దానధర్మాలు(జకాత్) చేపడతామన్నారు. అది వారిలోని దయాగుణానికి ప్రతీక అని, పేదల ఆకలిబాదలు తెలుసుకోవమే ఉపవాస దీక్షల ఉద్దేశమని అన్నారు. రంజాన్ ప్రార్దనలు అల్లాహ్ తప్పకుండా నెరవేరుస్తారని ఖురాన్ చెపుతుందని వారు వెల్లడించారు.



# కారంపూడి మండలంలో ఘనంగా రంజాన్ వేడుకలు

**కారంపూడి, మార్చి 31 ప్రభాతవార్త:** కారంపూడి పట్టణం, మండలంలో పలు గ్రామాల్లో సోమవారం రంజాన్ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ముస్లిం సోదరులు నెల రోజులుగా ఉపవాసం ఉంటూరు ఆదివారం ముగించుకుని సోమవారం ఉదయం రంజాన్ పండుగ సందర్భంగా పట్టణంలోని దాచేపల్లి రోడ్డులోని ఈద్గా, ఆదినారాయణ కాలనీలోని ఈద్గాల వద్దకు చేరుకున్నారు. మౌలానా రంజాన్ పండుగ గురించి ప్రసంగం చేశారు. అనంతరం నమాజు చదివారు. నమాజు ముగించుకుని ముస్లిం సోదరులు ఒకరినొకరు ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పట్టణంలోని ముస్లిం సోదరులు ఉత్సాహంగా పాల్గొన్నారు.



# విద్యార్థినులకు మెంటల్ హెల్త్, కెరీర్ గైడెన్స్‌పై అవగాహన

**కారంపూడి, మార్చి 31 ప్రభాతవార్త:** కారంపూడి మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో మెంటల్ హెల్త్ అండ్ కెరీర్ గైడెన్స్ పై అవగాహన కార్యక్రమం సోమవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన సైకాలజిస్టు, కౌన్సిలర్ ఎ.శాంతివర్ధన్ మాట్లాడుతూ బాలికలకు మానసిక దృఢత్వం వ్యక్తిగత విజయానికి మూలస్తంభం అన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యం అన్నటుఌ మంచి ఆరోగ్యాన్ని కాపాడుకుంటేనే అన్ని లక్ష్యాలను చేరుకోవచ్చని సూచించారు. విద్యార్థినులు ఏ రంగంలో రాణించాలో నిర్ణయం చేసుకుని దృఢ సంకల్పంతో ముందుకు వెళ్లాలని సూచించారు. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని పేర్కొన్నారు. ప్రిన్సిపల్ ఆఫ్రిన్ మాట్లాడుతూ కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో ఇంటర్ మొదటి సంవత్సరం సీఈసీ గ్రూపులో చేరడానికి అడ్మిషన్లు మార్చి 22 నుంచి ఏప్రిల్ 11 వరకు అందుబాటులో ఉన్నాయని అర్హులైన విద్యార్థినులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయినీలు, విద్యార్థులు పాల్గొన్నారు.



# జనసేనలోకి భట్టువారిపల్లె సర్పంచ్

కారంపూడి, మార్చి 31 ప్రభాతవార్త: కారంపూడి మండల పరిధిలోని భట్టువారిపల్లి గ్రామ సర్పంచ్ ఏరువ రమేష్‌బాబు ఆదివారం జనసేనలో చేరారు. మాచర్ల నియోజకవర్గ సమన్వయకర్త బూసా రామాంజనేయులు ఆధ్వర్యంలో పార్టీ కండువా కప్పుకున్నారు. మాచర్ల నియోజకవర్గంలో జనసేన పార్టీ బలోపేతానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. రమేష్‌బాబుతోపాటు ఏరువ శ్రీరాములు, సత్యానందం, నలబోతుల వెంకటేష్, కూరపాటి పాపారావు, తదితరులు చేరారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు కేసనపల్లి కృష్ణ, కామేపల్లి ఏడుకొండలు, సోమయ్య, షేక్ సైదావలి, చిన్నం హేమంత్, తలిశెట్టి మణికంఠ, వీర మహిళలు తదితరులు పాల్గొన్నారు.




# జీవితంలో ప్రతి వ్యక్తికీ ఐడెంటిటీ అనేది చాలా విలువైనది

**పిట్టలవానిపాలెం,మార్చి31,ప్రభాతవార్త:** పిట్టలవానిపాలెం మండలం సంగుపాలెం గ్రామంలో స్థానిక శాసనసభ్యులు వేగేశన నరేంద్ర వర్మ ఆదేశానుసారం సోమవారం నాడు తెలుగుదేశం పార్టీ మెంబర్షిప్ గుర్తింపు కార్డులను మండల తెలుగు మహిళా అధ్యక్షురాలు డాక్టర్ గ్లోరి యానెట్ సొపాటి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ గ్లోరి యానెట్ మాట్లాడుతూ ప్రతి మనిషికి జీవితంలో ఒక గుర్తింపు అనేది చాలా ముఖ్యమైన విషయం అని,పార్టీ గుర్తింపు కార్డులు పంపిణీ చేయడం తనకు పార్టీ కల్పించిన గొప్ప అవకాశంగా తాను భావిస్తున్నాను అన్నారు. ఈ గుర్తింపు కార్డును చాలా మంది ఇన్సూరెన్స్ కోసం అన్న ఉద్దేశంతోనే చూస్తు,చాలామంది ఇతర పార్టీల వారు కూడా ఈ ఉద్దేశంతోనే టి డి పి పార్టీ సభ్యత్వం తీసుకున్నారని అన్నారు. తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులందరూ ఈ గుర్తింపు కార్డును గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఏ పార్టీ కార్యక్రమంలోనైనా నేను తెలుగుదేశం పార్టీ సభ్యుడను అని గర్వంగా తెలుపుకునే విధంగా గుర్తింపు కార్డు తయారు చేయబడిందని, ఈ కార్డును ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త, ప్రతి అభిమాని విధిగా పార్టీ కార్యక్రమాలలో ధరించాలని కోరుకుంటున్నానని అన్నారు. తెలుగుదేశం పార్టీ గుర్తింపు కార్డు పొందిన ప్రతి ఒక్కరికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐ టీడీపీకి చెందిన మాట్లాపూడి నిఖిల్, బర్మా జాన్ బాబు, బర్మా శామ్యూల్, బర్మా చంటి, చందోలు రవికుమార్, గురిందపల్లి బాబురావు, చెరుకూరి యాదయ్య, సంపతి, దేవరకొండ అజయ్, బర్మా పిన్ని, రఫయేలు మరియు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



# 60మందికి ఉగాది క్రీడా పురస్కారాలు అందజేత

**గుంటూరు స్పోర్ట్స్,మార్చి 31,ప్రభాతవార్త :** గ్లోబల్ స్పోర్ట్స్ ఫౌండేషన్,గ్లోబల్ స్పోర్ట్స్ మ్యాగజైన్ ఆధ్వర్యంలో సా ్థనిక జెకెసి కళాశాల రోడ్డులోని వివివి హెల్త్‌హబ్‌లో ఉగాది పండుగ సందర్భంగా 60మంది కి ఉగాది క్రీడా పురస్కారాలు అందజేశారు.కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ నాసా సైంటిస్ట్ చందు సాంబశివరావు పాల్గొని మాట్లాడుతూ బాల్యం నుంచి చిన్నారులకు తల్ల్లిదండ్రులు క్రీడల పట్ల అవగాహన పెంపొ ందించాలని కోరారు.క్రీడల ద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని ఈ సందర్భంగా తెలిపారు.క్రీడలు అనేక రంగాలతో ముడిపడి ఉంటాయని,క్రీడాకారుడు ఎలాంటి సమస్యనైనా చాలా సులువుగా పరిష్కరించుకుంటారని తెలిపారు.క్రీడాకారులు దేశకీర్తి ప్రతిష ్టలను ప్రపంచస్థాయిలో పెంపొందించగలుగుతారని తెలిపారు.జాతీయ అంతర్జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులకు గ్లోబల్ స్పోర్ట్ ్స ఫౌండేషన్ ఉగాది క్రీడా పురస్కారాలు అందజేయడం అభినందనీయమని తెలిపారు.తొలుత ఈ కార్యక్రమానికి గ్లోబల్ స్పోర్ట్స్ ఫౌండేషన్ కార్యదర్శి జివిఎస్ ప్రసాద్ మాట్లాడుతూ తమ ఫౌండేషన్ ద్వారా గత 10సంవత్సరాలుగా గుంటూరులో అవార్డులను క్రీడాకారులకు,శిక్షకులకు,క్రీడా ప్రమోటర్స్,క్రీడా వైద్యులకు,అందజేస్తున్నామని తెలిపారు.రాబోయే రోజుల్లో ఈ కార్యక్రమాన్ని మరింత విస్తరింప చేస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు.కార్యక్రమంలో ప్రముఖ న్యాయాలు చిగురుపాటి రవీంద్రబాబు,ఆంధ్ర క్యారమ్ సంఘం కార్యదర్శి షేక్ అబ్దుల్ జలీల్,కెఎల్‌యు యూనివర్సిటీ డాక్టర్ హరికృష ్ణ,శాయి అథ్లెటిక్స్ కోచ్ సుబ్బారావు,అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా చైర్మన్ జి.శేషయ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు.అనంతరం అవార్డు గ్రహీతలకు ఉగాది క్రీడా పురస్కారాలను అందజేశారు.కార్యక్రమంలో జి.సాంబశివరావు,ఎన్టీఆర్ స్టేడియం కోచ్ బి.కృష్ణారావు,కె.రాజు, పి.ఆనంద్‌కుమార్,కె.అరుణ్‌కుమార్,నాగరాజు,చరణ్ తదితరులు పాల్గొన్నారు.



# మాచర్ల నియోజకవర్గ అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే జూలకంటి

మాచర్ల, మార్చి 31 ప్రభాతవార్త: మాచర్ల నియోజకవర్గ అభివృద్ధిలో ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి మార్క్ చాలా స్పష్టంగా కనిపిస్తుంది. అనునిత్యం నియోజకవర్గ అభివృద్ధిని కాంక్షిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులను ప్రవాహంలా తీసుకొచ్చి నియోజకవర్గం సర్వతోముఖాభివృద్ధి చేసేందుకు దృఢ సంకల్పంతో ఉన్నారు. ఈ నేపథ్యంలో సోమవారం తాజాగా జాతీయ రోడ్డు రవాణా హైవే అథారిటీ మంత్రిత్వ శాఖ నుంచి కేంద్రం 54.09 కోట్ల నిధులను మాచర్ల, రెంటచింతల, గురజాల పట్టణాల ఇన్నర్ రింగురోడ్డు విస్తరణ పను నిమిత్తం మంజూరు చేసింది. మాచర్ల పట్టణంలో పెరుగుతున్న ట్రాఫిక్ రీత్యా టౌన్ ఇన్నర్ రింగురోడ్డును విస్తరణ చేయాలన్నది ప్రజల నుంచి ఎప్పటినుంచో ఉన్న డిమాండ్. ఈ క్రమంలో మాచర్ల పట్టణ ఔటర్ రింగురోడ్డు పనులు దాదాపు పూర్తికానున్న నేపథ్యంలో సిటీలో ఉన్న ఇన్నర్ రింగురోడ్డు విస్తరణ పనులను కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు వేగవంతం చేశాయి. మాచర్ల పట్టణ ఇన్నర్ రింగురోడ్డు పనులు శరవేగంగా జరుగుతున్న నేపథ్యంలో రాయవరం బైపాస్ నుంచి పార్కు సెంటర్, శ్రీశైలం రోడ్డు వరకు ఉన్న రోడ్డు విస్తరణ పను జరగనున్నాయి. మరోవైపు పార్కు సెంటర్ వెనుకవైపు ఉన్న కూరగాయల మార్కెట్ రోడ్డు ను కూడా డివైడర్‌తో సెంట్రల్ లైటింగ్ పనులు జరగనున్నాయి. మాచర్ల పట్టణంలో జరగనున్న దాదాపు 6 కి.మీ ఇన్నర్ రోడ్ల పనులు విషయానికి వస్తే రెండువైపులా 27 అడుగుల వెడల్పుతో రోడ్డు మార్గం, అయిదు అడుగుల వెడల్పుతో సెంటర్ డివైడర్, ఇరువైపులా బార్‌గేట్లు, బార్‌గేట్ల పక్కన అయిదు అడుగుల వెడల్పుతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ సిస్టమ్ వంటివి రానున్నాయి. రోడ్డు సెంటర్ డివైడర్‌పైన సెంట్రల్ లైటింగ్‌ను ఏర్పాటు చేస్తారు. త్వరలో దీనికి సంబంధించి టెండర్ ప్రక్రియను కూడా పూర్తి చేసి పనులు ప్రారంభించేందుకు అడుగులు పడుతున్నాయి. దీంతో మాచర్ల పట్టణ ప్రజల చిరకాల కోరిక నెరవేరడంతోపాటు ట్రాఫిక్ సమస్యకు పూర్తిస్థాయిలో చెక్ పడనుంది. అలానే రోడ్డు విస్తరణతోపాటు



సెంట్రల్ లైటింగ్ కాంతులతో మాచర్ల పట్టణం న్యూలుక్‌లో కనిపించనుంది. రెంటచింతల శివారునున్న బైపాస్ నుంచి పట్టణంలోకి దాదాపు 5 కిలోమీటర్ల ఇన్నర్ రింగురోడ్డు విస్తరణ పనులు ఈ నిధుల నుంచే వెచ్చించనున్నారు. గోలివాగు నుంచి పట్టణంలో ఉన్న ఇన్నర్ రోడ్డును కలుపుకుంటూ గురజాల రోడ్డులో ఉన్న భారత్ పెట్రోల్ బంకు మీదుగా ఇన్నర్ రోడ్డును బైపాస్‌కు కలపనున్నారు. రోడ్డు విస్తరణ, డివైడర్, సెంట్రల్ లైటింగ్‌తో ప్రస్తుతం ఉన్న రోడ్డును ఆధునికీకరించనున్నారు. అలాగే గురజాల గాడిదల వాగు సమీపంలో ఉన్న బైపాస్ నుంచి గురాల పట్టణంలోకి దాదాపు 6 కి.మీ. వరకు ఇదే తరహాలో రోడ్డు విస్తరణ పనులు జరగనున్నాయి. మాచర్ల శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి నేతృత్వంలో నియోజకవర్గానికి తాగు, సాగు నీటి ప్రాజెక్టులకు కేంద్ర జల్ జీవన్ మిషన్ ద్వారా రూ.1200 కోట్లు, అమృత్ స్కీం ద్వారా మాచర్ల పట్టణానికి బుగ్గవాగు నుంచి తీసుకువచ్చే రక్షిత నీటి పథకానికి మర 100 కోట్ల నిధులను సాధించి తీసుకొచ్చారు. ఇంకోవైపు వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులను ఇప్పటికే ప్రణాళికలను సిద్ధం చేసి పంపడం జరిగింది. మరోవైపు పట్టణ సుందరీకరణకు రెండు ఎ కరాల్లో గ్రీన్‌పార్కు, 10 ఎకరాల్లో క్రీడా మైదానం నిర్మాణాలకు సంబంధించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు ప్రణాళిక ప్రతిపాదనలు పంపించడం జరిగింది. నియోజకవర్గం ఇన్నర్ రిండు రోడ్డు పనులకు రూ.54.09 కోట్లు మంజూరు కావడంతో మాచర్ల నియోజకవర్గ అభివృద్ధికి నిధులు సాధించి తీసుకురావడంలో నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి చేస్తున్న కృషిని ప్రజలు, పార్టీలు ప్రశంసిస్తున్నారు.

## శ్రీ సీతారాముల వారి కళ్యాణ మహోత్సవాన్ని తిలకించి ఆశీస్సులు పొందాలి

### -ఆంధ్రప్రదేశ్ పద్మశాలి సేవాసమితి

మంగళగిరి, మార్చి 31 ప్రభాతవార్త : ఒంటిమిట్ట కోదండ రామాలయంలో వేంచేసి ఉన్న సీతారాముల వారి కళ్యాణ మహోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ పద్మశాలి సేవాసమితి ఆధ్వర్యంలో పట్టు వస్త్రాల సమర్పించానున్నారు. ఆదివారం మంగళగిరి పట్టణంలోని స్వర్ణకార సంఘం కార్యాలయంలో మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ పద్మశాలి సేవాసమితి ఆధ్వర్యంలో ఏప్రిల్ నెల 10వ తేదీన గరుడ సేవలో భాగంగా శ్రీ



సీతారాములవారికి పట్టు వస్త్రాలు సమర్పించడం జరుగుతుందని అలాగే రాష్ట్రవ్యాప్తంగా పద్మశాలీలు తరలివచ్చి స్వామివారి కళ్యాణ మహోత్సవాన్ని తిలకించి వారి ఆశీస్సులు తీసుకోవాలని రాష్ట్ర అధ్యక్షులు మాడ జానకి రామయ్య, గుంటూరు జిల్లా స్వర్ణకార సంఘం, బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు పారేపల్లి మహేష్, బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షులు ఉడత శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శి తిరువీధుల కిరణ్ తెలియజేశారు.

## నల్లపాటి రామ తారకం 100వ జన్మదిన వేడుకలు

నరసరావుపేట టౌన్, మార్చి 31 ప్రభాతవార్త : మండలంలోని జొన్నలగడ్డ గ్రామానికి చెందిన నల్లపాటి రామ తారకం 100వ జన్మదినవేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. వారు ప్రముఖ న్యాయవాది నల్లపాటి లక్ష్మీ నారాయణ, జిడిసిసి బ్యాంకు మాజీ ఛైర్మన్‌నల్లపాటి చంద్రశేఖర్‌లకు మాతృమూర్తి .నూరు వసంతలు పూర్తి చేసుకున్న సందర్భంగా గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోనల్లపాటి కుటుంబ సభ్యుల ఆర్థిక సహాయంతో ఏర్పాటు చేసిన కళా వేదికను ప్రారంభించారు. అదే విధంగా కేక్ కట్ చేసి విద్యార్థులకుమిఠాయిలు పంచి పెట్టారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు నల్లపాటి కుటుంబ సభ్యులకు కృతఘ్నతలు తెలిపారు.



## లక్ష్మి నరసింహ స్వామి దేవాలయ రాతి నిర్మాణానికి విరాళం అందజేత

నరసరావుపేట టౌన్, మార్చి 31 ప్రభాతవార్త : పట్టణంలోని కోట సెంటర్‌లోని పులుపుల వారి వీధిలో వేంచేసి యున్న వీరాంజనేయ సహితయోగనంద లక్ష్మి నరసింహ స్వామి



దేవాలయ రాతి నిర్మాణానికి భక్తులు విరాళం అందించారు. పట్టణానికి చెందిన అర్వపల్లి హరి విజయకుమార్, రామ్ ప్రతాప్ కుమార్‌లు తమ తల్లిదండ్రుల జ్ఞాపకార్థం రూ.2,01,116లు దేవస్థాన కమిటీకి అందించారు. అదే విధంగా కన్యకాపరమేశ్వరిమెడికల్స్ యాజమాని కొత్తూరి శ్రీనివాసరావు-సుజాత వారి కుమారుడు శ్రావణ్‌కుమార్-నాగలక్ష్మిలు దేవాలయ నిర్మాణానికి రూ.1,00,116లుకమిటి సభ్యులకు అందించారు. పట్టణానికి చెందిన చలువాది రామకృష్ణ-నాగమణి కుమారుడు వెంకట అయ్యప్ప పృథ్వీరాజ్ గుప్తా -మౌనికలుదేవాలయ రాతి నిర్మాణానికి రూ.51,116లు దేవస్థాన కమిటి కి అందించారు. దాతలు స్వామి దర్శనం అనంతరం వారికి కమిటి సభ్యులుతీర్థ ప్రసాదాలు అందించారు. వారికి స్వామి వారి ఆశీస్సులు ఉండాలని అకాంక్షించారు.

## విజేత స్పోర్ట్స్ క్రీడాకారులకు ఉగాది క్రీడా పురస్కారాలు అందజేత

మంగళగిరి,మార్చి 31,ప్రభాతవార్త : గుంటూరు కు చెందిన గ్లోబల్ స్పోర్ట్స్ ఫౌండేషన్,గ్లోబల్ మంత్లీ మ్యాగజైన్ వారు ఉగాదిని పురస్కరించుకొని ఉగాది క్రీడా పురస్కారాలను జిల్లాకు చెందిన శిక్షకులు సీనియర్ క్రీడాకారులు,క్రీడా ప్రోత్సాహకులకు ఉగాది క్రీడా పురస్కారాలను అందజేశారు.ఈ సందర్భంగా మంగళగిరికి చెందిన విజేత స్పోర్ట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు కోచ్ పివిఎస్‌బి సత్యనారాయణ,సభ్యులు డాక్టర్ కె.శంకర్‌రెడ్డి, కె.రమేష్‌లకు ఉగాది క్రీడా పురస్కారాలు దక్కాయి.కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నాసా సీనియర్ మాజీ సైంటిస్టు చందు సాంబశివరావు విచ్చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా మంగళగిరి క్రీడాకారులకు సత్యనారాయణ చేసిన సేవలను కొనియాడుతూ క్రీడా పురస్కారాన్ని అందజేసినట్లు చెప్పారు.సీనియర్ క్రీడాకారులు కె.శంకర్‌రెడ్డి,కె.రమేష్‌లను కూడా ఘనంగా సత్కరించి అభినందనలు తెలియజేశారు.కార్యక్రమంలో ప్రముఖ సీనియర్ న్యాయవాది చిగురుపాటి రవీంద్రబాబు గ్లోబల్‌స్పోర్ట్స్ ఫౌండేషన్,గ్లోబల్ స్పోర్ట్స్ మ్యాగజైన్ ఫౌండర్ జి.శివప్రసాద్,మోడ్రన్ పెంటాథ్లాన్ చీఫ్ కోచ్ గమిడి సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు,



## క్రీడల వల్ల ఏకాగ్రతతోపాటు, మానసిక ఒత్తిడి దూరం : కుర్రి సాయి

మాచర్ల, మార్చి 31 ప్రభాతవార్త: మాచర్ల పట్టణంలోని చక్రధర్ డిగ్రీ, పీజీ కళాశాలలో చెస్ క్రీడాపోటీలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ కుర్రి సాయిమార్కొండారెడ్డి మాట్లాడుతూ చెస్ వల్ల విద్యార్థుల్లో ఏకాగ్రతతోపాటు, మానసిక ఒత్తిడికి గురి కాకుండా, చురుకుదనం, మెదడుకు పదును పెట్టేందుకు ఎంతో దోహదపడుతుంద న్నారు. పల్నాడు చెక్ అకాడమీ కోచ్ కిరణ్



నేతృత్వంలో నిర్వహించిన జిల్లాస్థాయి టోర్నమెంటులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. చిన్నారులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండి, మెదడుకు మేతనిచ్చే చదరంగాన్ని నేర్పిస్తూ వారిలోని ప్రతిభను వెలికితీసేందుకు క్రీడా పోటీలను నిర్వహిస్తున్న కోచ్ కిరణ్ కృషి అమోఘమని అన్నారు. పల్నాడు ప్రాంతంలో ఇలాంటి క్రీడలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో కుర్రి అంజలి, అధ్యాపకులు ఆవుల ఆంజేయులు, కళాశాల డైరెక్టర్ ఎం.మహేష్‌రెడ్డి, అధ్యాపకురాలు ఎం.కవిత తదితరులు పాల్గొన్నారు.

## నరసరావుపేటలో సందడి చేసిన హిరో నందమూరి కళ్యాణ్‌రామ్

నరసరావుపేట , మార్చి 31 ప్రభాతవార్త : హిరో నందమూరి కళ్యాణ్‌రామ్ సోమవారం జిల్లా కేంద్రామైన నరసరావుపేటలో సందడి చేసారు. అర్జున్ సన్ ఆఫ్ వైజాయింతి సినిమాలోని సాంగ్‌ను స్థానిక రవి కళామందిర్ సినిమా హాల్‌లో హిరో అవిష్కరించారు. సినిమాను ఆదరించి విజయవంతం చేయాలని ఫ్యాన్స్‌ను వారు కోరారు. నరసరావుపేటకు రావటం తనకు ఎంతో సంతోషంగా ఉందన్నారు.



పల్నాడు ప్రాంతంతో తమ కుటుంబానికి ఉన్న అనుబంధం గుర్తు చేసుకున్నారు. ఖచ్చితంగా అర్జున్ సన్ ఆఫ్ వైజాయింతి సినిమా అందరికి నచ్చుతుందన్నారు. అన్ని వర్గాల ప్రేక్షకులకు అవసరమైన పాటలు, డ్యాన్స్‌లు, కథ ఉన్నట్లు హిరో కళ్యాణ్‌రామ్ తెలిపారు. తొలుత వారికి ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ తనయుడు డాక్టర్ ఆదిత్య ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కోటప్పకొండ పై వేంచేసియున్న త్రికోటేశ్వర స్వామి చిత్ర పటాన్ని హిరో కళ్యాణ్‌రామ్‌కు కార్యక్రమంలో డాక్టర్ ఆదిత్య అందించారు. అనంతరం సాంగ్‌ను వారు రిలిజ్ చేసారు.

## మన ప్రతి పండుగ ప్రత్యేకమే

### -వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి

గుంటూరు కల్చరల్,మార్చి 31,ప్రభాతవార్త : మానవ జీవితంలో జరిగే వివిధ అనుభవాలను ఉగాది పచ్చడి ప్రతిభింబిస్తుందని జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అన్నారు.స్థానిక అరండల్‌పేటలోని అవగాహన కార్యాలయంలో వి.వి.రావు అధ్యక్షతన జరిగిన ఉగాది వేడుకలకు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రసంగించారు.లక్ష్మణరెడ్డి తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ భిన్న సంస్కృతులు గల భారతదేశంలో ఒక్కో




పండుగ ఒక్కో విశిష్టతను కలిగి ఉందని,భిన్న మతాల మధ్య సామరస్యంతో పరస్పర సహకారంతోనే మనమంతా ఆనందంగా జీవించగలమన్నారు.మత విద్వేషాలను రెచ్చగొట్టే సంఘ విద్రోహక శక్తుల పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని,సోదర భావంతో కలసిమెలసి జీవించాని హితవు పలికారు.విదేశాల్లో గల భారతీయులు సైతం మన పండుగలు ఘనంగా జరుపుకుంటూ సంస్కృతి సాంప్రదాయాలను గౌరవించడం శుభపరిణామం అని ప్రశంసించారు.అవగాహన సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ తమ సంస్థ ఆధ్వర్యంలో ప్రతిఏటా ఉగాది వేడుకలు నిర్వహిస్తున్నామని ఈ నూతన సంవత్సరం ప్రజల్లో చైతన్యాన్ని నింపి,ఉత్సాహాన్ని కలిగించి మనల్ని విజయ శిఖరాలను చేరుకునేలా చేస్తుందని ఆశాభావాన్ని వ్యక్తంచేశారు.కార్యక్రమంలో వక్కల వేంకటేశ్వరరావు,పింగళి భాగ్యలక్ష్మీ,సుభద్ర కృష్ణ,టి.ధనుంజయరెడ్డి, జమదగ్ని తమ కవితల్ని పఠించి సభికులను అలరించారు.పలువురు గాయనీ గాయకులు ఆలాపించిన సినీ,భక్తి గీతాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.సభానంతరం కవయిత్రులు పింగళి భాగ్యలక్ష్మీ,సుభద్ర కృష్ణ,కవి జమదగ్నిలను ముఖ్యఅతిథి వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి చేతుల మీదుగా ఘనంగా సత్కరించారు.కార్యక్రమంలో శాంత ట్యూటోరియల్స్ వ్యవస్థాపకలు శ్రీమన్నారాయణ,సదాశివన్ తదితర విశ్రాంత ఉద్యోగులు పాల్గొని జయప్రదం చేశారు.

## వక్ఫ్ సవరణ బిల్లు వ్యతిరేకిస్తూ మార్కాపురంలో ముస్లింల నిరసన

మార్కాపురం, మార్చి31, ప్రభాతవార్త : కేంద్రం ప్రవేశపెట్టిన వక్ఫ్ సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ ముస్లిం సోదరులు సోమవారం రంజాన్ ప్రార్థనలకు ముందు నిరసన ప్రదర్శన చేశారు. అనంతరం ఈద్గా మైదానాల వద్ద నల్లబ్యాడ్జీలను ధరించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరుపై అసహనం వ్యక్తం చేస్తూ ఆందోళన చేశారు. ఈ సందర్భంగా మత పెద్దలు మాట్లాడుతూ వక్ఫ్ సవరణ బిల్లు 2024 పార్లమెంటులో ప్రవేశపెడుతున్న నేపథ్యంలో బిల్లును అడ్డుకోవాలని డిమాండ్ చేశారు. బిల్లు ఆమోదం పొందితే ముస్లిం సమాజానికి నష్టం జరుగుతుందని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌లు సవరణ బిల్లును అడ్డుకొని వ్యతిరేకించాలని డిమాండ్ చేశారు. ముస్లిం సంస్థలలో ఇత మతస్తుల ప్రమేయం వక్ఫ్ ఆస్తులపై జిల్లా కలెక్టర్ జోక్యం తదితర అంశాలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## మద్యం మత్తులోనే యువకుడు మృతి

బల్లికురవ, మార్చి31, ప్రభాతవార్త : అమావాస్య వస్తే చాలు పొరుగు రాష్ట్రాల నుంచి వలస వచ్చిన గ్రానైట్ కార్మికులకు పండుగ రోజే గ్రానైట్ ఫ్యాక్టరీలలో ఆ రోజు పనులు పూర్తిగా నిలిపివేస్తుంటారు. ఇక అందులో పని చేసే కార్మికులకు ఉదయం నుండి రాత్రి వరకు పూటుగా మద్యం సేవించటం ఒకటే పని. ఈ క్రమంలో భాగంగా మండలంలోని ఉప్పుమాగులూరు గ్రామంలో 29వ తేదీ రాత్రి చందన గ్రానైట్ ఫ్యాక్టరీలో పని చేస్తున్న జోగిందర్ మహంత్(47) మద్యం అతిగా సేవించి నిద్రలోనే మరణించాడు. ఇతను ఒరిస్సా రాష్ట్రం నుండి బతుకుదెరువు నిమిత్తం వలస వచ్చాడు. బల్లికురవ రైటర్ ఆంజనేయులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్టూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

## ప్రజలకు సేవలను మరింత చేరువ చేసేందుకు తమ కార్యాలయం ఎల్లవేళలా అందుబాటులో ఉంటుంది : ఎమ్మెల్యే నసీర్

గుంటూరు తూర్పు, మార్చి 31 ప్రభాతవార్త : పవిత్ర రంజాన్ పర్వదినాన గుంటూరు తూర్పు నియోజకవర్గ ప్రజలకు మరింత మెరుగైన సేవలందించేందుకుగాను ఎమ్మెల్యే కార్యాలయాన్ని ప్రారంభించడం అభినందనీయమని కేంద్ర సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ అన్నారు. సోమవారం గుంటూరులోని బ్రహ్మానంద రెడ్డి స్టేడియం ఎదురు గుంటూరు తూర్పు ఎమ్మెల్యే కార్యాలయాన్ని ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్ తో కలిసి పెమ్మసాని చంద్రశేఖర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మొహమ్మద్ నసీర్ అహ్మద్ మాట్లాడుతూ గుంటూరు తూర్పు నియోజకవర్గ ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేసేందుకు తమ కార్యాలయం ఎల్లవేళలా అందుబాటులో ఉండేందుకు సిద్ధం చేశామని తెలిపారు. రంజాన్ పర్వదినం రోజున తమ కార్యాలయం ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. గుంటూరు తూర్పు





నియోజకవర్గ ప్రజలకు ఏ చిన్న సమస్య వచ్చినా తమను సంప్రదించాలని సూచించారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని ప్రజలకు ఆ భగవంతుని నిండు దీవెనలు ఉండాలని ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్ అన్నారు. తూర్పు ఎమ్మెల్యే కార్యాలయంలో ఎమ్మెల్యే నసీర్ అహ్మద్ కు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున హాజరై పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారందరినీ ఎమ్మెల్యే ఆప్యాయంగా పలకరిస్తూ... ఈద్ ముబారక్ చెప్పారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో ముస్లిం మైనారిటీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని తెలిపారు. రంజాన్ మాసంలో ముస్లిం ఉద్యోగులు గంట ముందుగానే కార్యాలయాల నుంచి వెళ్లేందుకు అనుమతి ఇచ్చినందుకు ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడుకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులపై ఎంఈవో-2 కక్షసాధింపు చర్యలు మానుకోవాలి

ఎ కొండూరు, మార్చి 31, ప్రభాతవార్త : ఒక గిరిజన మారుమూల తండా గ్రామాల్లో గిరిజన విద్యార్థులకు విద్యా బోధనకు కెజి తండా హెచ్ఎం జాన్ విధి నిర్వాహణలో అంకిత భావంతో పనిచేస్తూ గిరిజన విద్యార్థుల హాజరు శాతం పెంచి ఉత్తీర్ణతతో బాగా రాణించడంతో పాటు పాఠశాలను ఎంతో అభివృద్ధి చేస్తూ గిరిజన విద్యార్థులకు అక్షరాస్యతకు హెచ్ఎం చేస్తున్న నిరంతర కృషి అమోఘమని అటువంటి హెచ్ఎంపై ఎంఈవో-2 ఈఎల్ కేశవరావు కక్షపూరిత వైఖరి ప్రదర్శిస్తూ షోకాజ్ నోటీసులు జారీ చేయడం పట్ల తిరువూరు నియోజకవర్గ టిడిపి ఎస్టీ సెల్ అధ్యక్షుడు భరోతు పీక్లా నాయక్ సోమవారం మీడియాతో మాట్లాడుతూ ఖండించారు. ఎంఈవో-2 తనకు వ్యతిరేకంగా ఉన్న యూనియన్ ఉపాధ్యాయుల పట్ల ఈ విధమైన కక్షసాధింపు షోకాజ్ నోటీసుల పట్ల మండలంలో ముఖ్యంగా గిరిజన తండా గ్రామాల్లో విద్యావిధానం దెబ్బతిని విద్యార్థుల భవిష్యత్ అంధకార బంధురంగా మారే ప్రమాదం ఉన్నదని, ఎంఈవో-2 కక్షసాధింపు చర్యలు వేధింపుల నుండి ఉపాధ్యాయులకు రక్షణ కల్పించి ఆదుకోవాలని పీక్లా నాయక్ జిల్లా కలెక్టర్‌కు జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు.

## రంజాన్ వేడుకల్లో నల్లగట్ల స్వామిదాస్

తిరువూరు, మార్చి 31, ప్రభాతవార్త : ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు ఈద్గాలో సోమవారం రంజాన్ పర్వదిన సందర్భంగా అధిక సంఖ్యలో పాల్గొని ముస్లీంలు చేస్తున్న ప్రత్యేక నమాజ్‌లో వైసిపి నియోజకవర్గ ఇన్‌చార్జ్ నల్లగట్ల స్వామిదాస్ పాల్గొని ముస్లీంలకు రంజాన్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు.



## జాన్ మాస్టారుపై ఎంఈవో-2 షోకాజ్ నోటీసుపై సర్పంచి, ఎస్ఎంసి ఛైర్మనల ఖండన

ఎ కొండూరు, మార్చి 31, ప్రభాతవార్త : ఎన్‌టిఆర్ జిల్లా ఎ కొండూరు మండలం కెజి తండా ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విది నిర్వాహణలో అంకితభావంతో పనిచేస్తూ పాఠశాల అభివృద్ధి విద్యాభివృద్ధికి విద్యార్థుల భవిష్యత్ భావి భారత పౌరులుగా తీర్చిదిద్దుతున్న ప్రధానోపాధ్యాయుడు జాన్ మాష్టార్‌పై ఎంఈవో-2 కేశవరావు విధినిర్వాహణ సరిగా లేదని షోకాజ్ నోటీసు జారీ చేయించడం పట్ల ఎంఈవో-2 చపలచిత్త వైఖరిని సర్పంచ్ జరబల జమలమ్మ పెద్దబాబు, ఎస్ఎంసి ఛైర్మన్ జరబల కోమటి, కృష్ణ (ధరు) సోమవారం మీడియా సమావేశంలో ఆక్షేపించారు. ఈ ప్రధానోపాధ్యాయుడు జాన్ పాఠశాలలో విధులు నిర్వహిస్తున్నప్పటి నుండి విద్యార్థుల శాతం విద్యాభివృద్ధి అలాగే జాతీయ పండుగలు ఆగష్టు 15 నవంబర్ 14 జనవరి 26 లాంటి జాతీయ పండుగలు ఘనంగా నిర్వహిస్తూ జాతి నేతల త్యాగాలను స్మరించుకుంటూ విద్యార్థుల్లో స్ఫూర్తిని నింపడం లాంటి జాతీయ భావన అలాగే పాఠశాల వార్షికోత్సవాలను ప్రతి ఏడాది విద్యార్థుల తల్లిదండ్రుల ఆధ్వర్యంలో కనుల పండువగా నిర్వహిస్తూ ఎక్కడో మారుమూల అటవీ ప్రాంతం గుట్టల మధ్య ఉన్న ఈ కెజి తండా పాఠశాల ఔనత్యాన్ని హెచ్ఎం జాన్ మాష్టార్ చాటి చెబుతూ నిరక్ష్యరాస్యులైన గిరిజనులను విద్యవల్ల లాభాలు ఇంకా ఎన్నో విషయాలను తల్లిదండ్రులకు వివరిస్తూ కెజి తండా ప్రాథమిక పాఠశాల ప్రతిష్టను కాపాడుతున్న జాన్ మాష్టార్‌పై ఎంఈవో-2 కేశవరావు ఉన్నతాధికారులకు అవాస్తవాలను రిపోర్టు చేయడం ఎంఈవో-2 వైఖరిని వీరు తీవ్రంగా ఖండించారు.

## ఘనంగా రంజాన్ వేడుకలు

బల్లికురవ, మార్చి31, ప్రభాతవార్త: రంజాన్ పర్వదిన వేడుకలు మండలంలో ఘనంగా నిర్వహించారు. హిందూ ముస్లింలు పరస్పరం పర్వదిన శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. మండలంలోని బల్లికురవ, కొణిదేన, ఉప్పుమాగులూరు, వైదన, వికొపిరపాడు, కొప్పెరపాలెం, వల్లాపల్లి, కొమ్మినేనివారిపాలెం గ్రామాల్లో ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మసీదుల వద్ద అన్న సంతర్పణ కొనసాగాయి.

## స్నిగ్ధ ఆయుర్వేద వైద్యశాల సిల్వర్ జూబ్లీ వేడుకలు

గుంటూరు విద్య,మార్చి 31,ప్రభాతవార్త : స్నిగ్ధ ఆయుర్వేద వైద్యశాల ప్రాంగణం పుత్తూరు నందు ఫౌండర్ డాక్టర్ కె.శివరామ గోపాలన్ అధ్యక్షతన జరిగిన వైద్యశాల సిల్వర్ జూబ్లి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వైద్యఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ గౌరవాతిథులుగా పత్తిపాడు శాసనసభ్యులు రామాంజనేయులు గుంటూరు తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు నసీర్ అహ్మద్,వల్లూరు జయప్రకాష్ నారాయణ



విచ్చేశారు.ఈ సందర్భంగా నేషనల్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ కింద పంచకర్మ టెక్నీషియన్ కోర్సును ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ప్రారంభించారు.కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు,నజీర్ అహ్మద్,వల్లూరు జయప్రకాష్ నారాయణ,గళ్ళా మాధవి తదితరులు పాల్గొన్నారు.ప్రజలు ఆయుర్వేద వైద్యంపై అవగాహన కల్పించి ప్రజాధరణ పొందటం చాలా కష్టతరమైన పని అని గుర్తుచేసిన స్నిగ్ధా వైద్యశాల అధిపతి డాక్టర్ గోపాలన్ అన్నారు.

మంత్ర సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ...

ఆదాయం వచ్చే వైద్యం వైపు కాకుండా ఆదాయం తక్కువ వచ్చే ఆయుర్వేదం ఆస్పత్రి పెట్టడం దాన్ని ఈ స్థాయికి తేవడం గొప్ప విషయమని ప్రశంసించారు.ఆయుర్వేదం అంటే మనకు కేరళ రాష్ట్రమే గుర్తుకు వస్తుంది,కానీ నేడు మన దగ్గర కూడా అద్భుతమైన చికిత్సలు అందించడం గర్వకారణమని తెలిపారు.వికసిత్ భారత్‌పేరుతో మోడీ చిత్తశుద్ధితో ఉంటే ఏపి అభివృద్ధే ధ్యేయంగా విజనరి లీడర్ చంద్రబాబు నాయుడు ఉండడం గర్వంగా ఉందని వెల్లడించారు. కార్యక్రమంలో బిజేపి రాష్ట్ర అధికార ప్రతినిధి,లైవ్ భారత్ ఫౌండేషన్ ఛైర్మన్ వల్లూరు జయప్రకాష్ నారాయణ,డాక్టర్ ప్రేమానంద్,డాక్టర్ విజయభాస్కర్,డాక్టర్ సాయి సుధాకర్,మన్నవ రాధాకృష్ణమూర్తి,హిమసాగర చంద్రమూర్తి,కెఎస్ఆర్ కుటుంబరావు,సుదర్శన్,స్నిగ్ధ ఆయుర్వేద ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ కె.చైతన్య,బిజెపి జిల్లా అధ్యక్షులు చెరుకూరు తిరుపతిరావు,జనసేన నాయకులు కొర్రపాటి నాగేశ్వరరావు,తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా రంజాన్ వేడుకలు

అమరావతి, మార్చి 31, ప్రభాతవార్త : గుంటూరు జిల్లా వేమూరు నియోజకవర్గం జంపని ఎఎబిఎస్‌టిఎ దర్బార్ ఫౌండర్ అతా ముహమ్మద్ నిజాముద్దీన్ నిజామిషాతాజ్ ఖాదరీ (అతా నిజాంబాబా) ఆధ్వర్యంలో బాబా భక్తులు ఈద్ ఉల్ ఫితర్ (రంజాన్) ప్రత్యేక ప్రార్థనలను ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా అతా నిజాంబాబా మాట్లాడుతూ రంజాన్ పర్వదినం మత సామరస్యానికి



సోదర భావానికి ప్రేమ తత్వానికి ప్రతీక అని తెలిపారు. రంజాన్ నెలలో గత నెల రోజులుగా కఠోర నియమాలతో ఎంతో నిష్టతో పాటించిన రోజా ఉపవాసాలు ఆదివారం షవ్వాల్ నెలవంక దర్శనంతో ఉపవాసాలు ముగించి సోమవారం ఉదయం ప్రత్యేక ఈద్ నమాజ్‌లకు ఈద్గా వద్దకు అతా నిజాంబాబా వెంట భక్తులు తక్‌బీర్ పఠిస్తూ ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థన కోసం నడుచుకుంటూ వెళ్ళారు. అనంతరం ఖబరస్తాన్ (స్మశాన వాటిక) వద్దకు వెళ్లి పితృదేవతల ఆత్మలకు శాంతి చేకూర్చాలని అల్లాకు దువా చేశారు. అనంతరం సోమవారం రాత్రి లంగర్ షరీఫ్ కులమతాలకతీతంగా అతా నిజాంబాబా నిర్వహించి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

## సామరస్యానికి, సమానత్వానికి, కరుణకు, దాతృత్వానికి ప్రతీక రంజాన్

గిద్దలూరు, మార్చి 31 ప్రభాతవార్త : సామరస్యానికి, సమానత్వానికి, కరుణకు, దాతృత్వానికి ప్రతీక రంజాన్ పండుగ అని గిద్దలూరు నగర పంచాయితీ వైసిపి అధ్యక్షులు 13వ వార్డు కౌన్సిలర్ మానం బాలిరెడ్డి అన్నారు. గిద్దలూరు టౌన్ నల్లబండ బజార్‌లో రంజాన్ సందర్భంగా నూర్ ఇచ్చిన విందులో మానం బాలిరెడ్డి పాల్గొన్నారు. గిద్దలూరు నగర పంచాయితీ ముస్లీం మైనార్టీలకు ఆయన రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు శ్రీకాంత్ రెడ్డి, పోలెపల్లి శివ, మత్తయ్య, యర్రం వెంకట రామిరెడ్డి, సునీల్, మిత్ర, దిలీప్, హనుమారెడ్డి, సుబ్బారెడ్డి, నరసింహారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## సీఎం చంద్రబాబు పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన మంత్రులు, ఎమ్మెల్యే

మార్టూరు, మార్చి31, ప్రభాతవార్త : రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఏప్రిల్ 1వ తేదీన పర్చూరు నియోజకవర్గం చిన్నగంజాం మండలం కొత్తగొల్లపాలెం గ్రామంలో పర్యటన సందర్భంగా ఏర్పాట్లను పరిశీలించడానికి రాష్ట్ర సమాచార పౌర సంబంధాల గృహ నిర్మాణ శాఖ మంత్రి, బాపట్ల జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి మంత్రి కొలుసు పార్థసారథి, రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, పర్చూరు శాసనసభ్యులు ఏలూరు సాంబశివరావు, జిల్లా కలెక్టర్ జే.వెంకటమురళి సోమవారం సందర్శించారు.

1-04Pg5.qxd:1-04Pg5.qxd 01/01/01 7:36 AM Page 1



# మూడోసారి కూడా 'కుర్చీ' నాదే

## ధీమా వ్యక్తం చేసిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్



**వాషింగ్టన్, మార్చి 31:** అమెరికా అధ్యక్షుడుగా మూడోసారి ఎన్నిక కావడానికి తనకు అనేక మార్గాలున్నాయని డొనాల్డ్‌ట్రంప్ పేర్కొన్నారు. తాను మూడోసారి బాధ్యతలు చేపట్టడాన్ని ఆయన తోసిపుచ్చలేదు. ఈ విషయంలో తాను జోక్‌చేయడంలేదని స్పష్టంచేసారు. అయితే దీనిపై ఇప్పుడే ఆలోచించడం తొందరపాటు అవుతుందని అన్నారు. ఎన్బీసీ న్యూస్ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ అమెరికా అధ్యక్షుడుగా మూడోసారి ఎన్నికకావడాన్ని రాజ్యాంగంలోని 22వ సవరణ అనుమతించదు. చాలా మంది ప్రజలు మూడోసారి ఎన్నిక కావాలని నన్ను కోరుతున్నారు. అయితే అందుకు ఇంకా చాలా సమయం ఉందని వారికి చెప్పానన్నారు. ఇపుడు ప్రస్తుతపరిస్థితులపైనే తాను దృష్టి సారించినట్లు ట్రంప్ చెప్పారు. మరోసారి అధికారం చేపడతారా అన్న ప్రశ్నకు తనకు పని చేయడం ఇష్టమని తెలిపారు. తొలుత జెడివాన్స్ అధ్యక్షుడిగా బాధ్యతలుచేపట్టి తర్వాత దానిని ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యే మీకు బదిలీచేస్తారా అని ఎన్బీసీ ప్రతినిధిప్రశ్నించారు. అది ఒక పద్ధతి అని ట్రంప్ స్పష్టంచేసారు. దీనితోపాటు ఇతర మార్గాలు ఉన్నాయని వివరించారు. అవేమిటని ప్రశ్నిస్తే ఇప్పటికిప్పుడు చెప్పడం వీలు కాదని ట్రంప్ దాటవేసారు.

రెండుసార్లు కంటే ఒక్కరే అధ్యక్షుడగా పనిచేయాలంటే రాజ్యాంగ సవరణచేయాలి. అదిచాలా కష్టంతో కూడుకున్నది. రాజ్యాంగ సవరణ చేయాలంటే కాంగ్రెస్‌లో మూడింట రెండొంతుల మెజార్టీ ఉండాలి. లేదంటే మూడింట రెండొంతుల రాష్ట్రాలు అంగీకరించాలి. ఈ రెండు మార్గాలను నాలుగింట మూడొంతుల రాష్ట్రాలు ఆమోదించాలి. 2028లోనూ ట్రంప్ అధ్యక్షుడిగా పోటీచేస్తే ఎన్నికవుతారని ఆయన అనుయాయుడు స్టీవ్ బానన్ అన్నారు. దీనికోసం మా ముందు రెండు ప్రత్యామ్నాయాలున్నాయని ఆయన వివరించారు.

**ప్రపంచదేశాలన్నింటిపైనా ట్రేడ్‌వార్: ట్రంప్ హెచ్చరిక**

భారత్ చైనాలపై ప్రతీకార సుంకాలను ఏప్రిల్ 2నుంచి అమలులోకి తెస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్‌ట్రంప్ పలుమార్లు పేర్కొన్న విషయం తెలిసిందే. తాజాగా ఆయన మరో కీలక ప్రకటనచేసారు. వాణిజ్య యుద్ధం కేవలం 10-15 దేశాలకు మాత్రమే పరిమితం కాబోదని ప్రపంచంలోని అన్నిదేశాలపైనా సుంకాలు విధిస్తామని అన్నారు. ఈ విషయంలో ఎలాంటి మార్పు ఉండదన్నారు. అగ్రరాజ్యం తన పూర్వ వైభవాన్ని తిరిగి పొందాలంటే ఈచర్యలు తీసుకోక తప్పదని అన్నారు. చాలా ఏళ్లుగా మేం ప్రపంచ దేశాలతో ఉదారంగా ఉన్నామని కానీ చరిత్రలో ఏదేశాన్ని దోచుకోనివిధంగా అమెరికాను దోచుకున్నాయని, వాణిజ్య పాలసీల పరంగా కొన్నిసార్లు అమెరికా మిత్రదేశాలు శత్రువులకంటే దారుణంగా వ్యవహరించాయని అన్నారు. దశాబ్దాలుగా వారుమనపై విధించిన వివిధ పేర్లతో దోచుకున్న దానికంటే ప్రస్తుతం అగ్రరాజ్యం తర దేశాలపై విధిస్తున్న సుంకాలు చాలా తక్కువ ఉన్నాయన్నారు. కాబటి ప్రత్యక్షంగా పరోక్షంగా మాతో వాణిజ్య సంబంధాలు కొనసాగిస్తున్న ప్రపంచదేశాల న్నింటిపైనా మా వాణిజ్య ట్యారిఫ్‌లు అమలవుతాయని ట్రంప్ అన్నారు. ఏప్రిల్2 నుంచి అమలయ్యే ప్రతీకార సుంకాలను తప్పించుకునేందుకు అమెరికా దిగుమతులపై ట్యారిఫ్ కోతలవైపు భారత్ మొగ్గుచూపుతోంది. ఈ రెండుదేశాల మధ్య మొదలయిన ట్రేడ్‌అండ్ ట్యారిఫ్ చర్చల్లో భారత్ ధృడసంకల్పం ప్రదర్శిస్తోంది. కొన్ని వస్తువులపై ట్యారిఫ్‌కోతలకు అంగీకరించినా దేశప్రయోజనాలకే ప్రాధాన్యం ఇస్తోందని సుకంకాలు తగ్గించినంత మాత్రాన అమెరికా ఒత్తిడికి లొంగిపోయినట్లు కాదని కేంద్ర ప్రభుత్వ ఉన్నతస్థాయి అధికారి అన్నారు.

అమెరికానుంచి భారత్‌కు వస్తున్న ఉత్పత్తులపై ఇక్కడ ఎంతసుంకం విధిస్తే అమెరికాకు చేరుతున్న భారత్ ఉత్పత్తులపైనా సమాన సుంకం వసూలుచేస్తానని ట్రంప్ ప్రకటించిన సంగతి తెలిసిందే. ప్రపంచవాణిజ్యసంస్థ ప్రకారం భారత్ ఉత్పత్తులపై అమెరికా సగటున 2.2శాతం సుంకం విధిస్తుండగా అమెరికా ఉత్పత్తులపై భారత్ సుంకం సగటు 12శాతంగా ఉంది.



## అణు ఒప్పందానికి నిరాకరిస్తే

# ఇరాన్‌పై బాంబుదాడులు

### అమెరికా అధ్యక్షుడి హెచ్చరికలు

### అయితే ఎదురుదాడులు తప్పవన్న ఖమేనీ

**తెహ్రాన్, మార్చి 31:** అణ్వాయుధాల ఒప్పందం అంశంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన హెచ్చరికలపై ఇరాన్ తీవ్రంగా స్పందించింది. ట్రంప్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ మండిపడింది. ఒకవేళ అగ్రరాజ్యం దాడులకు తెగబడితే ఎదురుదాడులు చేసేందుకు వెనుకాడమని ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ స్పష్టం చేశారు. ఈ మేరకు అంతర్జాతీయ కథనాలు పేర్కొన్నాయి. ట్రంప్ వ్యాఖ్యలను ఇరాన్ తీవ్రంగా ఖండిస్తోంది. అణు ఒప్పందానికి నిరాకరిస్తే బాంబు దాడులు చేస్తామని ఆయన బెదిరిస్తున్నారు. ఒకవేళ అమెరికా అదే పని చేస్తే ఇరాన్ నుంచి ఎదురుదాడులు తప్పవు అని హెచ్చరించారు. ట్రంప్ బెదిరింపులతో టెహ్రాన్ అప్రమత్తమైందని మీడియా కథనాలు పేర్కొన్నాయి. ఇరాన్ వ్యాప్తంగా ఉన్న భూగర్భ ప్రయోగ కేంద్రాల వద్ద పెద్ద సంఖ్యలో క్షిపణులను లాంచ్‌ప్యాడ్‌లపై సిద్ధంగా పెట్టినట్లు వెల్లడించాయి. అత్యవసర పరిస్థితుల్లో అమెరికా సంబంధిత ప్రాంతాలపై దాడులు చేసేందుకు వీటిని వినియోగించుకోనున్నట్లు తెలిపింది. కాగా ఇరాన్ అణ్వాయుధాలను అభివృద్ధి చేసుకోకుండా అమెరికా తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. ఒప్పందం కుదర్చుకోని పక్షంలో ఇరాన్‌పై బాంబు దాడులకు వెనుకాడబోమని ట్రంప్ హెచ్చరించిన సంగతి తెలిసిందే. ఆ దేశంపై మునుపెన్నడూ ఎరుగని రీతిలో ఇవి జరుగుతాయన్నారు. దాడులతో పాటు ఆ దేశంపై జరిమానాలు కూడా విధిస్తామని అన్నారు. ఈ నేపథ్యంలోనే స్పందించిన ఇరాన్ సుప్రీంలీడర్ అమెరికాపై ఎదురు దాడులు చేసేందుకు వెనుకాడమని స్పష్టం చేశారు. ట్రంప్ తొలిసారి అధ్యక్షుడిగా ఉన్న సమయంలోనే 2018లో అణుఒప్పందంనుంచి అమెరికా వైదొలిగింది. ఆ సమయంలో ఇరాన్, అమెరికా సంబంధాలు సాధారణంగానే కొనసాగాయి. నాడు టెహ్రాన్‌పై అమెరికా ఆంక్షలు విధించింది. అప్పటి నుంచి ఎన్నోఏళ్లుగా జరిగిన పరోక్షచర్చలు విఫలమయ్యాయి. మరోసారి అణుఒప్పందం కుదుర్చుకునేందుకు సిద్ధమైనట్రంప్ ఇరాన్‌వినని పక్షంలో దాడులు తప్పవంటూ హెచ్చరికలు చేశారు.

# రంజాన్ ప్రార్థనల్లోనే 700మంది మృతి

## మయన్మార్ భూకంపంలో వెలుగులోకి వస్తున్న విషాదాలు



**బ్యాంకాక్, మార్చి 31:** మయన్మార్, థాయ్‌లాండ్‌లోసంభవించిన భారీ భూకంపాలు పెనువిషాదాన్ని మిగిల్చిన సంగతి తెలిసిందే. ఈ ప్రకంపనల ధాటికి మయన్మార్‌లోభారీగా ప్రాణనష్టం సంభవించింది. తాజాగా ఈభూప్రకంపనలకు సంబంధించిన మరిన్ని విషయాలు వెలుగుచూస్తున్నాయి. రంజాన్‌శుక్రవారం వేళముస్లింలు ప్రార్థనలుచేస్తుండగా ఈ విపత్తుచోటుచేసుకోవడంతో దేశవ్యాప్తంగా 700 మందికిపైగా శిథిలాల కింద సజీవ సమాధి అయినట్లు అక్కడిముస్లిం ఆర్గనైజేషన్ సోమవారం వెల్లడించింది. మయన్మార్‌లోని రెండో పెద్దనగరం మాండలేలో గత వారం 7.7 తీవ్రతతో భారీ భూకంపం సంభవించింది. నగరవ్యాప్తంగా వందల సంఖ్యలో భవనాలు నేలమట్టం అయ్యాయి. ఈ ప్రకంపనలకు 60 మసీదులు కూడా తీవ్రంగా ధ్వంసం అయ్యాయని స్ప్రింగ్ రివల్యూషన్ మైన్మార్ ముస్లిం నెట్‌వర్క్ కమిటీ సభ్యుడు టున్‌కీ వెల్లడించారు. మధ్యాహ్నం ప్రార్థనలు చేస్తుండగా ఈ విపత్తు రావడంతో శిథిలాలకిందనే 700 మందికిపైగా ప్రాణాలు కోల్పోయినట్లు తెలిపారు.

అయితే వీరి మరణాలను మైన్మార్ మిలిటరీ ధృవీకరించిందా లేదా అనేది స్పష్టత రాలేదు. ఈ పెను విపత్తుకారణంగా ఇప్పటికే మృతుల సంఖ్య 1700 దాటింది. మరో 3400 మంది గాయపడితే 300 మంది ఆచూకీ ఇప్పటికీ తెలియలేదు. శిథిలాలకింద చిక్కుకున్నవారికోసం సహాయక చర్యలు కొనసాగుతూనే ఉన్నాయి. అయితే ఇప్పటికే అంతర్యుద్ధంతో కకావికలమైన మైన్మార్‌ను ఈ భూప్రళం మరింత కుదిపేసింది. ప్రకంపనల కారణంగా కమ్యూనికేషన్ వ్యవస్థ తెగిపోవడం రహదారులు, వంతెనలు దెబ్బతినడంతో సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం కలుగుతున్నదని స్థానికఅధికారులు వెల్లడించారు. మాండలే వీధుల్లో మృతదేహాలు కుళ్లిపోతుండటంతో దుర్గంధం వెలువడుతోంది.



## కేంద్ర మాజీ మంత్రి

# గిరిజావ్యాస్‌కు తప్పిన ప్రమాదం

**జైపూర్, మార్చి 31:** కాంగ్రెస్ సీనియర్ నాయకురాలు కేంద్ర మాజీ మంత్రి గిరిజా వ్యాస్ అగ్నిప్రమాదంలో గాయపడ్డారు. రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో తన నివాసంలో పూజా సమయంలో హారతి నిర్వహిస్తుండగా ప్రమాదవశాత్తూ మంటలు అంటుకోవడంతో గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా ప్రాథమిక చికిత్స అందించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం ఆమెను అహ్మదాబాద్ తరలించాలని సూచించారు. ఇంట్లో ఆమె హారతి ఇస్తుండగా కింద వెలుగుతున్న దీపంనుంచి మంటలు ఆమె దుపట్టాకు అంటుకోవడంతో ఈప్రమాదంచేసుకున్నట్లు గిరిజావ్యాస్(79) సోదరుడు గోపాల్ శర్మ తెలిపారు. కుటుంబసభ్యులు హుటాహుటిన ఆసుపత్రికి తరలించామని చెప్పారు. ప్రముఖ కాంగ్రెస్ నాయకురాలయిన గిరిజా వ్యాస్ గతంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల్లో మంత్రిగా సేవలందించారు. రాజస్థాన్ పిసిసి అధ్యక్షురాలిగా, జాతీయ మహిళా కమిషన్ చైర్మన్‌గాను పనిచేసారు.

# 30 లక్షలమంది అఫ్ఘానిస్థానీలపై పాక్ బహిష్కరణ వేటు!



**ఇస్లామాబాద్, మార్చి 31:** అఫ్ఘానిస్తాన్‌నుంచి వచ్చి పాక్‌లో ఉంటున్నవారిపై ఆదేశం కీలక నిర్ణయం తీసుకుంది. 30 లక్షలమంది ఆఫ్ఘన్‌దేశస్తులను తమ దేశంనుంచి బహిష్కరించాలని యోచన చేస్తోంది. అఫ్ఘాన్‌నుంచి శరణార్థులుగా వచ్చినవారు తమ దేశం విడిచి వెళ్లడానికి ఇచ్చిన గడువు నేటితోముగియడంతో ఈచర్యలు తీసుకుంటున్నట్లు స్పష్టం అవుతోంది. తమ దేశంలో అక్రమంగా నివసిస్తున్న ఆఫ్ఘనిస్తాన్ వాసులను ఇతర విదేశీయులను తిరిగి పంపడానికి 2023 అక్టోబరు నుంచి పాక్ ఈబహిష్కరణ అస్త్రంప్రయోగిస్తోంది. అనధికార లెక్కలప్రకారం ఏప్రిల్ ఒనుంచి పాక్‌లో అక్రమంగా నివసిస్తున్న వారిని గుర్తించి బహిష్కరించాల్సి ఉంది. అయితే కొన్ని కారణాల రీత్యా బహిష్కరణలను ఈనెల 10వ తేదీకి వాయిదావేసారు ఆ దేశ సిటిజన్‌కార్డు ఉన్నవారు స్వచ్ఛందంగా ఇస్లామాబాద్‌వదిలి వెళ్లాలని ఇప్పటికే ఆదేశాలు జారీచేసామని అధికారులు తెలిపారు. బహిష్కరణకు గురైనవారు తిరిగి పాక్‌లోకి రాకుండా చర్యలు తీసుకోవాలని అక్కడి ప్రభుత్వం అధికారులను ఆదేశించింది. గడచిన 18 నెలల్లో సుమారు 8వేలకుపైగా ఆఫ్ఘనిస్తాన్‌నుంచి వచ్చిన వలసదారులు పాక్‌ను వీడినట్లు ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్‌మైగ్రేషన్ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ప్రస్తుతం ఆదేశంలో 3 మిలియన్లమంది ఆఫ్ఘనిస్తాన్ వాసులు ఆశ్రయం పొందుతున్నారని ఎలాంటి పత్రాలు లేకుండా చట్టవిరుద్ధంగామరో మిలియన్‌మంది ఉంటున్నారని వెల్లడించాయి. తమదేశ పౌరులను బహిష్కరించడానికి పాక్ చర్యలు తీసుకుంటున్న క్రమంలో ఆఫ్ఘనిస్థాన్ శరణార్థుల మంత్రిత్వశాఖ ప్రతినిధి అబ్దుల్‌ముతాలిబ్ కీలకప్రకటనచేసారు. శరణార్థులు గౌరవంగా తమ దేశానికి తిరిగి రావాలనే తాలిబన్‌ప్రభుత్వం కోరుతున్నదని అన్నారు. తాలిబన్‌ప్రభుత్వానికి, ఐక్యరాజ్యసమితికి ఎటువంటి సమాచారం ఇవ్వకుండా పాక్ ఏకపక్ష నిర్ణయాలు తీసుకుంటున్నదని ఆయన విమర్శలుచేసారు.

# ప్రధాని మోడీ పిఎస్‌గా ఐఎఫ్ఎస్ అధికారిణి నిధి తివారీ!



**న్యూఢిల్లీ, మార్చి 31:** ప్రధానమంత్రి నరేంద్రమోడీ ప్రైవేట్ సెక్రటరీగా ఇండియన్ ఫారెన్ సర్వీస్ అధికారిణి నిధి తివారీ నియామకమయ్యారు. కేంద్ర కేబినెట్ అపాయింట్‌మెంట్స్ కమిటీ ఆమె నియామకాన్ని ఆమోదించింది. డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్ అండ్ ట్రైనింగ్ ఈవిషయాన్ని అధికారికంగా ప్రకటించింది. వారణాసిలోని మెహమూర్‌గంజ్‌కు చెందిన నిధి తివారీ సివిల్ సర్వీసెస్ పరీక్షలో 96వ ర్యాంక్ సాధించారు 2014 బ్యాచ్‌కు చెందిన ఆమెగతంలో వారణాసి అసిస్టెంట్ కమిషనర్‌గా పని చేశారు. 2023 జనవరి 6 నుంచి ప్రధానమంత్రి కార్యాలయంలో డిప్యూటీ సెక్రటరీగా పనిచేస్తున్నారు. తొలుత 2022లో ఆమె అండర్ సెక్రటరీగా చేరారు. పిఎంవోలో చేరడానికి ముందు నిధి తివారీ విదేశాంగ మంత్రిత్వశాఖలో పనిచేశారు. ఆమె నిరాయుధీకరణ, అంతర్జాతీయ భద్రతా వ్యవహారాల విభాగంలో బాధ్యతలు నిర్వర్తించారు. అంతర్జాతీయ సంబంధాల మెరుగుదలలో ఆమెకు ఉన్న నైపుణ్యమే పిఎంవోలో కీలక పాత్ర పోషించే స్థాయికి తీసుకొచ్చింది.

జాతీయ భద్రతా సలహా దారు అజిత్ దోవల్‌కు ఫారెన్ అండ్ సెక్యూరిటీకి చెందిన అంశాలను నేరుగా ఆయనకు నివేదించ డంలో కీలక పాత్ర వహించారామె. ప్రస్తుతం డిప్యూటీ సెక్రటరీగా వ్యవహరిస్తున్న నిధి కొత్త బాధ్యతలను త్వరలో చేపట్టనున్నారు. అందుకు సంబంధించిన ఆదేశాలు త్వరలో వెల్లడించనున్నామని డివొపిటి ఒక ప్రకటనలో పేర్కొంది.

# రెండునెలల్లోనే 25 లక్షలుదాటిన ఆయుష్మాన్ వయోవందన యోజన కార్డులు

**న్యూఢిల్లీ, మార్చి 31:** కేంద్ర ప్రభుత్వం 70 ఏళ్ల దాటిన వయోవృద్ధులందరికీ ఆయుష్మాన్ వాయ్‌వందన స్కీంను అమలుచేస్తోంది. తొలి విడతగా మొత్తం 70 ఏళ్లకుపైబడిన 22 వేల మంది సీనియర్ సిటిజన్లకు 40 కోట్ల విలువైన వైద్యసదుపాయాలు అందుతున్నాయి. ఈ స్కీం రిజిస్ట్రేషన్లలోనే ఇప్పటివరకూ 25 లక్షల కార్డులు వచ్చాయి. కేవలం రెండునెలల్లోనే ఈ స్కీం ప్రారంభించిన తర్వాత 25 లక్షల కార్డులు జారీచేసినట్లు తెలుస్తోంది.

2024 అక్టోబరులో ఈ స్కీంను ప్రవేశపెట్టారు. ఈస్కీం ప్రారంభించిన తర్వాత సుమారు 22 వేల మంది సీనియర్ సిటిజన్లకు కరోనరీ, యాంజియోప్లాస్టీ, హిప్ ఫ్రాక్చర్, రీప్లేస్‌మెంట్, గాల్ బ్లాడర్ రిమూవల్, కాటరాక్ట్ సర్జరీ, ప్రోస్టేట్ రిసెక్షన్, స్ట్రోక్, హీమో డయాలసిస్, ఇతర తీవ్రస్థాయి రుగ్మతలన్నింటికీ చికిత్సలు అందిస్తామని కేంద్ర ఆరోగ్యశాఖ వెల్లడించింది. ఆయుష్మాన వాయువందన కార్డు ఉన్నవారికి ఐదు లక్షలవరకూ ఉచిత వైద్యం అందుతుంది. సీనియర్ సిటిజన్లు ఎవ్వరైనా సరే వారికి చికిత్స అందుతుంది.

ఎబిపిఎం జెఎవై కింద అదనపు కవరేజి ఐదు లక్షలు వరకూ ఉంటుంది. ఇప్పటికేఈ సదుపాయం పొందుతున్నవారు అంటే సిజిహెచ్ఎస్, మాజీ సైనికులు కంట్రిబ్యూటరీ హెల్త్‌స్కీం, ఆయుష్మాన్‌సెంట్రల్ ఆర్మ్డ్ పోలీస్ ఫోర్స్‌లలోని వారికి కూడా ఎబిపిఎం జెఎవై పొందే అవకాశం ఉంటుంది. ప్రైవేటు బీమా కింద కవరేజి పొందుతున్నవారు, ఇఎస్ఐ స్కీంలో ఉన్నవారు కూడా ఎబిపిఎం జెఎవై కింద అర్హులని తేల్చింది. మొత్తం రెండువేలకుపైగా వైద్యప్రొసీజర్లను ఈ స్కీంకింద పొందే అవకాశం ఉంటుంది. రిజిస్ట్రేషన్ చేయించుకోవాలనుకున్నవారు స్వీయ రిజిస్ట్రేషన్‌చేసుకోవచ్చు.

ఆయుష్మాన్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. లేదా బెనిఫిషియరీడాట్ఎన్‌హెచ్ఎడాట్ జిఒవిడాట్ఇన్ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. లేదా 14555 నంబరుకు డయల్ చేయవచ్చు అదికూడా కాకుండా 1800110770 నంబరుకు మిస్‌కాల్ ఇస్తే చాలు ఈ పథకం పూర్తి వివరాలు పొందవచ్చు.

# ఉక్రెయిన్‌కు ట్రంప్ మరో హెచ్చరిక

## ఖనిజాల ఒప్పందం నుంచి జెలెన్‌స్కీ వైదొలగితే సమస్యలే

**వాషింగ్టన్, మార్చి 31:** ఉక్రెయిన్‌కు నాటోలో సభ్యత్వం ఇవ్వాలని ఆ దేశాధ్యక్షుడు జెలెన్‌స్కీ పట్టుబడుతున్న విషయంతెలిసిందే. ఉక్రెయిన్‌లో శాంతి నెలకొంటుందంటే అధ్యక్ష పదవి నుంచి తప్పుకునేందుకు సిద్ధమేనని బదులుగా నాటో కూటమి సభ్యత్వాన్ని ఉక్రెయిన్‌కు ఇవ్వాలని ఆయన ఇప్పటికే స్పష్టం చేశారు. ఈ విషయంపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మాట్లాడుతూ వారు ఎప్పటికీ నాటోలో సభ్యులు కాలేరని అన్నారు. ఖనిజాల ఒప్పందం నుంచి వైదొలగడానికి ప్రయత్నిస్తే ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ పెద్ద సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఉక్రెయిన్‌కు నాటోలో సభ్యత్వం అనేది ఎప్పటికీ జరగబోదని జెలెన్‌స్కీకి అర్థమై ఉంటుందని అందుకే తమతో ఖనిజ వనరుల ఒప్పందంపై తిరిగి చర్చలు జరపాలని జెలెన్‌స్కీ చూస్తున్నాడని ట్రంప్ పేర్కొన్నారు. పుతిన్‌తో సంబంధాలపై మాట్లాడుతూ కొన్ని విషయాల్లో భిన్నాభిప్రాయాలు ఉన్నప్పటికీ తమ మధ్య స్నేహపూర్వక బంధంఉందని అన్నారు. యుద్ధం ముగింపు విషయంలో ఆయన తన మాటను కాదనడని నమ్ముతున్నానని తెలిపారు. ఒకవేళ ఆ విధంగా జరగకపోతే రష్యా చమురుపై అదనపు సుంకాలు విధిస్తానన్నారు. ఉక్రెయిన్, రష్యాల మధ్య యుద్ధాన్ని ముగించేందుకు అమెరికా చేస్తున్న సహాయానికి బదులుగా కీవ్‌లోని అరుదైన ఖనిజాలలో తమకు వాటా ఇవ్వాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రతిపాదించారు.

ఇందులో భాగంగా ఉక్రెయిన్‌తో 500 బిలియన్ డాలర్ల డీల్‌ను ప్రతిపాదించామన్నారు. తొలుత దీనిని వ్యతిరేకించిన జెలెన్‌స్కీ ట్రంప్‌తో వాగ్వాదం తర్వాత అమెరికా సాయం ఆగిపోవడంతో అంగీకరించినట్లు అధికారిక వర్గాలు పేర్కొంటున్నాయి. కాగా భద్రత నిమిత్తం ఉక్రెయిన్‌లోని విద్యుత్ ప్లాంట్లను తమకు అప్పగించాలని ట్రంప్ సూచించగా జెలెన్‌స్కీ వ్యతిరేకించినట్లు తెలుస్తోంది. అయితే అగ్రరాజ్యం ఉక్రెయిన్ నుంచి కోరుతున్న మొత్తం రెండో ప్రపంచ యుద్ధం తర్వాత జర్మనీ, జపాన్‌లపై విధించిన ఆంక్షల కంటే ఎక్కువని బ్రిటన్ పేర్కొంది.

ఈ ఒప్పందం కుదిరితే ఉక్రెయిన్‌లో భవిష్యత్ పెట్టుబడి ప్రాజెక్టుల నిబంధనలను నిర్ణయించడంలో అమెరికన్ ఫండ్ నియంత్రణ సాధించే అవకాశం ఉన్నట్లు బ్రిటన్ పత్రిక తెలిపింది. ఏ విధంగా చూసినా, దీనివల్ల యుఎస్‌కే ఎక్కువ మేలు చేకూరుతుందని వివరించింది.

## కాశ్మీర్‌లోయలో తొలిసారి

# వందేభారత్ సర్వీసులు..

## ఏప్రిల్ 19న ప్రారంభించనున్న ప్రధాని మోడీ!



**శ్రీనగర్, మార్చి 31:** కశ్మీర్‌లోయలో తొలిసారి వందేభారత్ రైలు సర్వీసులు అందుబాటులోకి రానున్నాయి. ఏప్రిల్ 19న తొలి వందే భారత్ రైలు కాట్రా నుంచి కశ్మీర్‌కు పరుగులు పెట్టనుంది. ఉదంపుర్,శ్రీనగర్, బారాముల్లా మధ్య 272 కిలోమీటర్ల మేర ప్రతిష్టాత్మకంగా నిర్మించిన రైలు లింక్ ప్రాజెక్ట్ పూర్తయిన నేపథ్యంలో ప్రధాని మోడీ ఈ రైలును ప్రారంభించనున్నారు. ఏప్రిల్ 19న ప్రధాని మోడీ ఉదంపుర్ వస్తారని ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన రైల్వే వంతెనను సందర్శించి ప్రారంభిస్తారని కేంద్రమంత్రి జితేంద్రసింగ్ వెల్లడించారు. అనంతరం కాట్రా నుంచి వందేభారత్ రైలుకు పచ్చజెండా ఊపి ప్రారంభిస్తారని తెలిపారు. జమ్మూరైల్వే స్టేషన్ పునరుద్ధరణ పనులు కొనసాగుతున్నందున జమ్మూ, కాట్రా, శ్రీనగర్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ తొలుత కాట్రా నుంచి ప్రారంభం కానుంది. ఈ రైలు లింక్ ప్రాజెక్ట్ గత నెలలోనే పూర్తయిందని ట్రయల్ రన్ కూడా విజయవంతంగా నిర్వహించగా రైల్వే సేఫ్టీ కమిషన్ రైలు సర్వీసులు నడిపేందుకు ఆమోదం తెలిపినట్లు అధికారులు వెల్లడించారు. ఈ రైలు ప్రారంభోత్సవంలో కాశ్మీర్‌కు ప్రత్యక్ష రైలు అనుసంధానం చేపట్టాలన్న చిరకాల డిమాండ్ నెరవేరినట్లవుతుంది. ప్రస్తుతం కశ్మీర్ లోయలోని సంగల్దాన్, బారాముల్లా మధ్య అలాగే కాట్రా నుంచి దేశంలోని మిగతా గమ్యస్థానాలకు మాత్రమే రైల్వే సర్వీసులు ఉన్నాయి. కశ్మీర్‌ను రైల్వే సర్వీసులతో అనుసంధానించే ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు 1997లోనే ప్రారంభమైనప్పటికీ అనేక భౌగోళిక, వాతావరణ సవాళ్లు, ప్రతికూల పరిస్థితుల కారణంగా జాప్యం చోటుచేసుకుందని అధికారులు తెలిపారు. ఈ ప్రాజెక్టులో మొత్తం 119 కిమీల పొడవునా 38 సొరంగాలు ఉండగా వీటిలో 12.75 కిమీల మేర నిర్మించిన టీ 49 సొరంగం అత్యంత పొడవైనది. అలాగే ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టులో 927 వంతెనలు సైతం ఉన్నాయి. వీటిలో చినాబ్ నదిపై నిర్మించిన ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన రైల్వే వంతెన కూడా ఉంది. దీని ఎత్తు 359 మీటర్లు కాగా పారిస్‌లోని ప్రఖ్యాత ఐఫిల్ టవర్‌తో పోలిస్తే దీని ఎత్తు 35 మీటర్లు ఎక్కువ కావడం విశేషం.

# కొత్త యేడాది భారత్ ఆర్థికవృద్ధి 6.5%

## ఎర్నెస్ట్ అండ్ యంగ్ విశ్లేషణ

**న్యూఢిల్లీ, మార్చి 31:** కొత్త ఆర్థికసంవత్సరంలో భారత్ 6.5శాతం రేటుతో ఆర్థికవృద్ధి నమోదు చేస్తుందని ఎర్నెస్ట్ యంగ్ ఎకానమి వాచ్ అంచనావేసింది. ప్రభుత్వ నిధులను వివేకంతో బాధ్యతాయువతంగా నిర్వహిస్తూ మానవ మూలధన అభివృద్ధికి సహకరించేస్పష్టమైన ఆర్థిక వ్యూహాలను అమలుచేస్తే దీర్ఘకాలిక వృద్ధి అవకాశాలు పెరుగుతాయని ఆసంస్థ తెలిపింది. 2024 ఏప్రిల్ 2025 మార్చి మధ్యకాలంలో భారత్ వాస్తవ జిడిపి వృద్ధి 6.4శాతామని ఈవై ఎకనామి వాచ్ మార్చి ఎడిషన్ స్పష్టంచేసింది. తదుపరి సంవత్సరంలో 6.5శాతం వృద్ధిచెందుతుందని తెలిపింది. రానున్న రెండు దశాబ్దాల్లో భారత దేశం సాధారణ ప్రభుత్వ విద్య, ఆరోగ్య రంగాల్లో వ్యయాలను క్రమంగా పెంచాల్సి ఉంటుందని చెప్పింది. అధిక ఆదాయవనరులున్న దేశాలు చేస్తున్న ఖర్చులకు తగ్గట్లుగానే భారత్‌కూడా వ్యయంచేయాల్సిన అవసరం ఉందని నొక్కిచెప్పింది. విద్యారంగంలో ప్రస్తుతం భారత్ జిడిపిలో 4.6శాతం వ్యయంగా ఉందని, 2047-48 ఆర్థికసంవత్సరం నాటికి ఈ మొత్తం 6.5శాతానికి పెంచాలనిసూచించింది. దేశజనాభాలో యువత సంఖ్య, పనిచేసే సామర్థ్యం కలవారి అవసరం పెరుగుతున్నందున ఈ పెరుగుదల అవసరం అనిచెప్పింది. 2020-21లో ఆరోగ్యరంగంపై జీడిపిలో 1.1శాతం ఖర్చుచేసారని 2047-48 ఆర్థికసంవత్సరం నాటికి దీనిని 3.8శాతానికి పెంచాలని పేర్కొంది. ఆరోగ్యసంరక్షణ సేవల మెరుగుదల సత్ఫలితాలకోసం ఈ ఖర్చు అవసరమని వివరించింది ఎక్కువ మంది యువత, తక్కువ ఆదాయం గల రాష్ట్రాలకు విద్య, ఆరోగ్య సంరక్షణ అవసరాలకు తగినట్లుగా అదనపు నిధులను అందచేయాలని తెలిపింది.

1-4Pg6exHMNWJQE.qxd:1-4Pg6exHMNWJQE.qxd 01/01/01 9:37 AM Page 1



## వైద్య, డెంటల్, నర్సింగ్ కళాశాలల దరఖాస్తుల పరిశీలనకు కమిటీ

**విజయవాడ మార్చి 31 ప్రభాతవార్త ప్రతినిధి:** రాష్ట్రంలో కొత్త గా ఏర్పాటు చేసే వైద్య, డెంటల్, నర్సింగ్ కళాశాలల ఏర్పాటుకు వచ్చే దరఖాస్తులను పరిశీలించి సిఫారసు చేసేందుకు నలుగురు సభ్యులతో కూడిన ఉన్నతస్థాయి కమిటీని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసింది. దీని వ్యవధి మూడేళ్లు అని పేర్కొంది. ఛైర్మన్‌గా హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఉమాపాక దుర్గా ప్రసాదరావు వ్యవహరిస్తారని తెలిపింది. నిజామ్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ పూర్వ ప్రొఫెసర్ డాక్టర్ వేమూరు సుధాకర్ ప్రసాద్, ఎన్‌ఆర్‌ఐ వైద్య కళాశాల అనాటమీ విభాగం హెడ్, ప్రముఖ ప్లాస్టిక్, మైక్రో వాస్క్యులర్ సర్జన్ ప్రొఫెసర్ ఎన్ఎస్‌బీ పరిమళ, విశాఖకు చెందిన దంత వైద్యుడు బొడ్డేపల్లి రఘు సభ్యులుగా ఉంటారని చెప్పింది. కళాశాలల ఏర్పాటుకు అందిన దరఖాస్తులను ఈ కమిటీ పరిశీలించి ఎసెన్షియల్లీ సర్టిఫికేట్ లు ఇచ్చేందుకు ప్రభుత్వానికి సిఫారసు చేస్తుందని పేర్కొంది. రాష్ట్రంలోని శ్రీకాకుళం, విజయనగరం, తూర్పుగోదావరి, కృష్ణా , గుంటూరు, ప్రకాశం, శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు, చిత్తూరు జిల్లాలకు జిల్లా వైద్య సేవల సమన్వయ కర్తలను నియమిస్తున్నట్లు మంత్రి సత్యకుమార్‌తెలిపారు.

## చిల్లకూరు పోలీస్ స్టేషన్‌కు మరమ్మతులు

**చెన్నై, మార్చి 31 ప్రభాతవార్త :** అభయ్ ఇస్పాత్ గ్రూపులో భాగమైన విజయలక్ష్మి తులసీదాస్ మెహతా ఫౌండేషన్ తమ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీసీఆర్) కార్యక్రమం ద్వారా కమ్యూనిటీ మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసింది. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి జిల్లాలోని చిల్లకూరు పోలీస్ స్టేషన్ పునరుద్ధరణకు తన ఉదారమైన సహాయాన్ని అందించింది. సమాజ భద్రత మరియు సామరస్యాన్ని కాపాడటంలో, చట్టం అమలు చేయడంలో పోలీస్ స్టేషన్ పునరుద్ధరణకు తన ఉదారమైన సహాయాన్ని అందించింది. సమాజ భద్రత మరియు సామరస్యాన్ని కాపాడటంలో చట్టం అమలు చేయడంలో పోలీస్ వ్యవస్థదే కీలక బాధ్యత ఉందని, అందుకోసం తిరుపతిలోని చిల్లకూరు పోలీస్ స్టేషన్‌ను ఎంచుకుంది విజయలక్ష్మి తులసీదాస్ మెహతా ఫౌండేషన్. అందుకోసం పోలీస్ స్టేషన్‌కు అవసరమైన రూఫింగ్ మెటీరియల్‌ను విరాళంగా ఇచ్చింది. ఈ ప్రాంతంలో ప్రజల భద్రతకు మూలస్తంభంగా ఉన్న చిల్లకూరు పోలీస్ స్టేషన్‌కు కావాల్సిన భవన సదుపాయాలతో సవీకరణను చేపట్టింది.

## సన్ రైజర్స్, హెచ్‌సిఎ వివాదంపై విజిలెన్స్

**విచారణ: సిఎం రేవంత్ రెడ్డి ఆదేశం**

**హైదరాబాద్, మార్చి 31, ప్రభాతవార్త:** ఐపిఎల్‌లో సన్ రైజర్స్ హైద రాబాద్ (ఎస్ఆర్‌హెచ్) ఫ్రాంచేజీ, హైదారాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సిఎ)ల మధ్య నెలకొన్న వివాదంపై సిఎం రేవంత్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వివాదంపై వెంటనే విజిలెన్స్ విభాగం విచారణ జరిపి నివేదిక ఇవ్వాలని సోమవారం ఆయన ఆదేశిం చారు. ఐపిఎల్ టికెట్లు, పాస్‌ల కోసం హెచ్‌సిఎ తీవ్రంగా వేధిస్తోందని ఎస్ఆర్‌హెచ్ ఆరోపించడం తెలిసిందే. ఈ మేరకు ఎస్ఆర్‌హెచ్ ప్రతినిధి హెచ్‌సిఎ ప్రతిని ధికి లేఖరాయడం సంచలనం రేపింది. ఒప్పం దం ప్రకారం హైదరాబాద్‌లో హెచ్‌సిఎ ఆధ్వ ర్యంలో వున్న ఉప్పల్ స్టేడియంను వాడుకుం టున్నందుకు హెచ్‌సిఎకు పదిశాతం అంటే 3900 కాంప్లిమెంటరీ టికెట్లు .



సిలికానాంధ్ర ఉగాది ఉత్సవాల్లో ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్‌కు జ్ఞాపికను అందిస్తున్న దృశ్యం

## విభిన్న భాషలు నేర్చుకోవడం వ్యక్తిగతంగా ఎంతో ప్రయోజనకరం

**- విశ్వ హిందీ పరిషత్ జాతీయ అధ్యక్షుడు, పద్మభూషణ్ ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్**

### - సిలికానాంధ్రలో ఘనంగా ఉగాది వేడుకలు

**విజయవాడ,మార్చి31,ప్రభాతవార్తప్రతినిధి:** విభిన్న భాషలు నేర్చుకోవడం వ్యక్తిగతంగా ఎంతో ప్రయోజనకరమన విశ్వ హిందీ పరిషత్ జాతీయ అధ్యక్షుడు, పద్మభూషణ్ ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ అన్నారు. అమెరికా బే ఏరియాలో సిలికానాంధ్ర నిర్వహించిన ఉగాది వేడుకల్లో యార్లగడ్డ ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన ప్రసంగించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన త్రిభాషా సూత్రం జాతీయ ఐక్యతకు సహాయ పడుతుందని ఆయన ఈ సందర్భంగా వివరించారు. ఈ ప్రతిపాదనలో హిందీని తప్పనిసరి చేయలేదని, అయితే మాతృభాషతో పాటు మరో భారతీయ భాషను అధ్యయనాన్ని ప్రోత్సహించడమే దీని ఉద్దేశమని ఆయన స్పష్టం చేసారు. ఏ భాషను నేర్చుకోవాలనేది పూర్తిగా తల్లిదండ్రులు, విద్యార్థులు, ఆయా రాష్ట్ర ప్రభుత్వాల నిర్ణయంపై ఆధారపడి ఉంటుందని అన్నారు. భారతీయ సంస్కృతి, తెలుగు సంప్రదాయాలు, ఆచార వ్యవహారాల పరిరక్షణలో ప్రవాసాంధ్రులు చేస్తున్న కృషిని లక్ష్మీప్రసాద్ ప్రశంసించారు. విదేశాల్లో నివసిస్తున్నా, తమ మూలాలను మరవకుండా, యువతరానికి తెలుగు సంస్కృతిని అందించేందుకు సిలికానాంధ్ర చేస్తున్న సేవలను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమానికి సిలికానాంధ్ర వ్యవస్థాపకుడు కుచిభొట్ల ఆనంద్ అధ్యక్షత వహించారు. ప్రత్యేక అతిథిగా భారత కాన్సుల్ జనరల్ శ్రీకర్ రెడ్డి హాజరయ్యారు. వేడుకలలో ఆచార్య యార్లగడ్డ లక్ష్మీప్రసాద్‌ను సిలికానాంధ్ర తెలుగు సంఘం ఘనంగా సత్కరించారు.

గరికిపాటి వెంకట ప్రభాకర్ ప్రదర్శించిన స్వరరాగావధానం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమం అనంతరం అరిటాకు పై సంప్రదాయ తెలుగు విందు ఏర్పాటు చేసి, ఉగాది ఉత్సవాన్ని మరింత ఆనందోత్సాహభరితంగా మార్చారు.

## దుర్గమ్మకు వైభవంగా పుష్పార్చన

**- కొనసాగుతున్న వసంత నవరాత్రులు**



విరాళమందించిన దాతలకు దుర్గమ్మ చిత్రపటం అందజేస్తున్న దృశ్యం

**ఇంద్రకీలాద్రి, మార్చి 31, ప్రభాతవార్త :** దుర్గమ్మవారికి సోమవారం వైభవంగా పుష్ప అర్చన ను నిర్వహించారు. కనకాంబరాలు, గులాబీ పూలతో దుర్గమ్మవారి పుష్పార్చన జరిపారు. వసంత నవరాత్రోత్సవాల్లో భాగంగా జరిపిన ఈ పుష్పార్చనలో భక్తులు పాల్గొన్నారు.

**- బంగారం గోపురం పనులకు విరాళం:** దుర్గమ్మ ఆలయం గోపుర పనులకు జరుగుతున్న బంగారు తాపడం పనులకు రు.1లక్ష విరాళాన్ని హైదరాబాద్‌కు చెందిన వారణాసి శివరామ శౌరి, సౌజన్య దంపతులు సోమవారం ఆలయాధికారులకు అందించారు. వారికి దుర్గమ్మ వారి దర్శనం ఏర్పాటు చేసి, ప్రసాదం, శేషవస్త్రం, మెమొంటోలను అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

## శ్రీ కళాసుధ ఆధ్వర్యంలో ఘనంగా 'విశ్వావసు' ఉగాది వేడుకలు

**చెన్నై, మార్చి 31 ప్రభాతవార్త :** శ్రీ కళాసుధ తెలుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో 'విశ్వావసు' ఉగాది వేడుకలు ఆదివారం రాత్రి చెన్నై, రాయపేటలోని మ్యూజిక్ అకాడమీలో ఘనంగా జరిగాయి. వేడుకలను పురస్కరించుకుని 'ఉగాది పురస్కారాలు–మహిళా పురస్కారాలను ప్రదానం చేశారు. ముందుగా ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని అశ్వినీ శాస్త్రి వేదాశీర్వచనం, పంచాంగ పఠనంతో ప్రారంభమైంది. ఆ తర్వాత ఘంటసాల సావిత్రి కుమార్ ప్రార్థనా గీతాన్ని ఆలపించగా, నవదుర్గం బృందం కూచిపూడి నృత్యం, హరిప్రియ, డాక్టర్ మీనాక్షి పలు పాటలు ఆలపించారు. ఈ కార్యక్రమాన్ని వీజీఎస్ హోమ్స్ డైరెక్టర్, క్రెడాయ్ ప్రెసిడెంట్ పద్మ దేవదాస్ జ్యోతి ప్రజ్వనతో ప్రారంభం కాగా, శ్రీ కళాసుధ అసోసియేషన్ అధ్యక్షుడు బేతిరెడ్డి శ్రీనివాస్ అధ్యక్షోపన్యాసం చేశారు. ఎస్‌బీఐ చెన్నై సర్కిల్ జనరల్ మేనేజర్ ఎంవీఆర్ మురళీకృష్ణ ఆధ్యక్షత వహించిన ఈ వేడుకలో ప్రముఖ నిర్మాత ఏ.ఎం.రత్నం, దివంగత నటుడు కృష్ణంరాజు సతీమణి ఉప్పలపాటి శ్యామలాదేవి పాల్గొన్నారు. 2024–25 సంవత్సరానికి గాను సినీరంగం నుంచి ఉత్తమ కెమెరామెన్ అవార్డును ఆర్.రత్నవేల్, ఉత్తమ చారిత్రాత్మక చిత్రంగా 'రజాకార్'ను ఎంపిక చేయగా, ఆ చిత్ర నిర్మాత గూడూరు నారాయణ రెడ్డికి ప్రదానం చేశారు. అలాగే, ప్రజాసేవా విభాగంలో విశిష్ట ఉగాది పురస్కారం కింద 'మహిళారత్న' అవార్డును హైదరాబాద్ నగరానికి చెందిన ప్రముఖ మహిళా పారిశ్రామికవేత్త సరోజ వివేకానంద్‌కు, దివంగత నటుడు కృష్ణంరాజు సతీమణి శ్యామలాదేవికి, 'లతా మంగేష్కర్' పురస్కారాన్ని ప్రముఖ సినీ నేపథ్య గాయని కల్పనకు, 'పీబీ శ్రీనివాస్' పురస్కారాన్ని ప్రముఖ సంగీత దర్శకుడు, నేపథ్య గాయకుడు ఆర్పీ పట్నాయక్‌కు, సినీ గేయ రచయిత, ఆస్కార్ అవార్డు గ్రహీత చంద్రబోస్‌కు, ఉత్తమ సహాయ నటి అవార్డును సినీనటి రోహిణికి, ఉత్తమ నటి అవార్డును ఇంద్రజకు, ఉత్తమ జ్యూరీ అవార్డును నటుడు సంపూర్ణేష్ బాబుకు, ప్రత్యేక పురస్కారాన్ని ప్రముఖ సినీ జర్నలిస్ట్ ఏ.ప్రభుకు ప్రదానం చేశారు. జెమిని సురేష్ సభా నిర్వహణ చేయగా ఇందులో కళాసుధ తెలుగు అసోసియేషన్ సభ్యులు, తెలుగు భాషాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



ఇంద్రజకు ఉత్తమనటి అవార్డును ప్రదానం చేస్తున్న దృశ్యం



మీడియాతో మాట్లాడుతున్న కన్స్యూమర్ రైట్స్ ఆర్గనైజేషన్ ప్రతినిధులు

## కూటమి ప్రభుత్వానికి ధన్యవాదాలు: కన్స్యూమర్ రైట్స్ ఆర్గనైజేషన్

**అమరావతి, మార్చి 31, ప్రభాతవార్త :** వాణిజ్య సంస్థల్లో పార్కింగ్ అందించేలా జిఓ జారీ చేసిన కూటమి ప్రభుత్వానికి కన్స్యూమర్ రైట్స్ ఆర్గనైజేషన్ (వినియోగదారుల హక్కుల సంస్థ) జాతీయ అధ్యక్షులు నవీన్ శర్మ, ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు గొర్లె శ్రీనివాస నాయుడులు ధన్యవాదాలు తెలిపారు. విజయవాడలో సోమవారం జరిగి మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ భారత ప్రభుత్వ బిల్డింగ్ లా ప్రకారం పార్కింగ్ ఫీజు వసూలు చేస్తున్న మాల్స్, మల్టీప్లక్సులు తదితర సంస్థలు షాపింగ్ చేసిన బిల్లులు చూపితే, అలాగే సినిమా టికెట్లు చూపితే ఉచిత పార్కింగ్ చేసుకునే వెసులుబాటు కల్పించారని, అలాగే ఎవరైనా సరే ఇకపై మొదటి 30 నిముషాల పాటు పార్కింగ్ చేసుకునే అవకాశం వుందని, దాని కోసం తాము అభ్యర్థన చేయగా కూటమి ప్రభుత్వం పార్కింగ్ సంబంధించిన జివోను వినియోగదారులకు ఇచ్చేలా జిఓ జారీ చేశారు. ఈ జిఓ 2025 ఏప్రిల్ 1 నుండి అమల్లోకి వస్తుందని ఖచ్చితంగా వాణిజ్యసంస్థలు/ మాల్స్, మల్టీప్లెక్స్‌లు, పార్కింగ్ నిర్వహిస్తున్న అన్ని సంబంధిత వ్యక్తులు, ఏజెన్సీలు అమలు చేయాలని కన్స్యూమర్ రైట్స్ ఆర్గనైజేషన్ జాతీయ కార్యదర్శి డా మూల వెంకటరావు, ఏపి స్పోకెన్ పర్సన్ కరణం రెడ్డి నరసింగరావు, కార్యదర్శి రాజా, జాతీయ కార్యవర్గ సభ్యులు దీపక్ వర్మ, జి సునీల్, వైజాగ్ కార్యదర్శి లోగిస గణేష్, మూర్తి, శశి వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## రేపటితో ముగియనున్న టెన్త్ పరీక్షలు

**13తో ముగియనున్న స్పాట్**

**హైదరాబాద్, మార్చి 31, ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా మార్చి 21 నుంచి ప్రారంభమైన ఎస్ఎస్‌సి పరీక్షలు రేపటి( ఏప్రిల్ 2, బుధ వారం)తో ముగియనున్నాయి. రాష్ట్రంలో ఎస్ఎస్‌సి పరీక్షల నిర్వహణ కోసం రాష్ట్ర వ్యాప్తంగా 2650 పరీక్షా కేంద్రాలనను ఏర్పాటు చేశారు. పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరుగుతున్నాయి. రేపు(ఏప్రిల్2, బుధవారం) సోషల్ స్టడీస్ పరీక్ష జరగనుంది. దీంతో 10వ తరగతికి చెందిన ప్రధాన పరీక్షలు ముగియనున్నాయి. ఏప్రిల్ 3, 4 తేదిల్లో ఓఎస్ఎస్‌సి లాంగ్వేజెస్ పరీక్షలు జరగనున్నాయి. వీటితో మొత్తంగా ఎస్ఎస్‌సి పరీక్షలు ముగుస్తాయి. అయితే రాష్ట్రంలో ఈ నెల 21 నుంచి ప్రారంభమైన 10వ తరగత వార్షిక పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం ఈ నెల 26 నుంచి ప్రారంభమైంది. ఏప్రిల్ 4 వరకు పరీక్షలు కొనసాగనున్నప్పటికీ.. ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది కూడా లాంగ్వేజెస్ పరీక్షలు ముగియగానే జవాబు పత్రాల మూల్యాంకనాన్ని ప్రారంభిస్తున్నట్టుగానే ఈ ఏడాది కూడా 26నే మూల్యాంకనాన్ని ప్రారంభించారు. రాష్ట్రంలో 19 సెంటర్లలో స్పాట్ వాల్యుయేషన్ కేంద్రాలను కొనసాగించ నున్నారు.

# తిరుమల సమాచారం

## వరుససెలవులతో తిరుమల కిటకిట

**-వెంకన్న సర్వదర్శనానికి 20గంటలు**



**తిరుమల,మార్చి 31 ప్రభాతవార్తప్రతినిధి:** వరుససెలవులు రావడంతో సోమవారం ఉదయానికి తిరుమల భక్తజనసంద్రంగా మారింది. సాయంత్రానికి ఈ రద్దీ మరింతగా పెరిగింది. శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనార్థం లక్షమందికిపైగాభక్తులు తిరుమలకు చేరుకోవడంతో ఉదయానికి కొండ కిటకిటలాడు తోంది. ఉదయానికే తిరుమలలో వైకుంఠం–1,2 క్యూకాంప్లెక్స్‌లు నిండిపోయి భక్తుల క్యూలైన్లు ఏటిసి వరకు చేరాయి. ఉదయం 6గంటల సమయానికి సాధారణ సర్వదర్శనం కోసం 18గంటలు సమయం కేటాయించారు. .వరుససెలవులు దృష్టిలోఉంచుకుని టిటిడి అధికారులు ముందస్తుగా అన్ని ఏర్పాట్లు సిద్ధంచేసి శ్రీవారి సేవకులతో భక్తులకు నిరంతరాయంగా సేవలందిస్తున్నారు. వైకుంఠం కంపార్టుమెంట్లలో ,క్యూలైన్లలో ఉన్న భక్తులకు అన్నప్రసాదాలు, పాలు, టీ శ్రీవారిసేవకులు పంపిణీ చేస్తున్నారు. సోమసాయంత్రం వరకు 43వేలమంది భక్తులకు మహాలఘు దర్శనం చేయించారు.

## రంజాన్ వేళ అలిపిరి తనిఖీ కేంద్రంలో ముస్లిం యువకుడు హల్‌చల్

**- మద్యం సేవించి ఆపై విఐపి గేట్‌లో జొరబడి సంచలనం**

**తిరుమల,మార్చి 31ప్రభాతవార్తప్రతినిధి:** ముస్లింల రంజాన్ పర్వదినం రోజు సోమవారం ఉదయం ఓ ముస్లిం యువకుడు అలిపిరి తనిఖీ కేంద్రంలో హల్‌చల్ చేశాడు. మద్యం సేవించి ఉన్న అతను ఏకంగా ద్విచక్రవాహనంపై తిరుపతినుండి తిరుమలకు వచ్చేందుకు అలిపిరి తనిఖీ కేంద్రంలో సాధారణ భక్తుల్లాగాక విఐపి గేట్‌లో జొరబడ్డాడు. అక్కడ విధుల్లో ఉన్న విజిలెన్స్,ఎస్‌పిఎఫ్ సిబ్బంది అతనిని ఆపేందుకు అడ్డుకున్నా ఆగకుండా ద్విచక్రవాహనంపై దూసుకెళ్ళాడు. అంతేగాక అతను తనిఖీ కూడా చేసుకోకుండా మోటారుసైకిల్‌పై వెళ్ళడంతో వెంటనే అప్రమత్తమైన విజిలెన్స్ సిబ్బంది వినాయకుని గుడివద్ద ఉన్న భద్రత సిబ్బందికి సమాచారం అందించారు. అక్కడ ఉన్న సెక్యూరిటీగార్డు ,కొందరు భక్తులు అతనిని ఆపేందుకు ప్రయత్నించినా ఢీకొని ముందుకు ఘాట్‌లో వేగంగా వెళ్ళిపోయాడు. ఈ సమాచారం అలిపిరి విజిలెన్స్ సిబ్బంది తిరుమల జిఎన్‌సి టోల్‌గేట్ సిబ్బందికి తెలిపారు. వెంటనే అప్రమత్తమైన తిరుమల విజిలెన్స్ సిబ్బంది ముస్లిం యువకుడిని టోల్‌గేట్‌లో అదుపులోకి తీసుకున్నారు. ఆ తరువాత అతనిని విచారణ చేశారు. మద్యం సేవించి ఉన్నట్లు , పలు రకాలుగా సమాధానం ఇవ్వడంతో పై అధికారుల ఆదేశాలతో అతనిని తిరుపతికి తరలించారు. తిరుపతి రుయా ఆస్పత్రిలోని మానసిక వార్డుకు తరలించారు. అయితే తాను రంజాన్ వేళ తిరుమలకు వెళ్ళేందుకు ఇలా చేశానని, తాను శ్రీవారిని దర్శించుకోవాలని అనుకున్నానని చెప్పడం మరింత అనుమానాలకు తావిస్తోంది. సాధారణంగా తిరుమలకు ముస్లిం భక్తులు వచ్చి హిందూ సాంప్రదాయం ప్రకారం ఆలయంలోనికి వెళ్ళి స్వామివారిని దర్శించుకోవడం జరుగుతుంది. అయితే తిరుపతి సింగాలగుంటకు చెందిన అమ్జత్‌ఖాన్ (36)సోమవారం ఉదయం నిర్వాకం మాత్రం అంతుచిక్కని విషయంగా మారింది. దీనిపై విజిలెన్స్, అలిపిరి పోలీసులు అతనిని మరింత సమగ్రంగా విచారణ చేస్తేగానీ అసలు విషయం తెలియదని అంటున్నారు.

మరోవైపు అతను మానసిక పరిస్థితి బాగోలేదని, మతిస్థిమితం లేనివాడుగా తెలుస్తోందని విజిలెన్స్ సిబ్బంది నిర్ధారించడం మరింత విశేషం.

ఏదిఏమైనా సోమవారం ఉదయం రంజాన్ పర్వదినాన తిరుమలలో ఎలాంటి ఉపద్రవం చేసివుంటాడనేది భక్తుల్లో ఆందోళన వ్యక్తమవుతోంది.

## కార్యకర్త హత్యపై జగన్ ఆగ్రహం ప్రజలు దీటుగా జవాబిస్తారని వ్యాఖ్య

**విజయవాడ,మార్చి31,ప్రభాతవార్త ప్రతినిధి:** అధికార దాహంతో తెలుగుదేశం నేతలు హత్యాకాండలకు తెగబడుతున్నారని మాజీ సీఎం వైఎస్ ఆరోపించారు.ఇందుకు తగిన మూల్యం చెల్లించుకుంటారని,వారికి ప్రజలు దీటుగా బదులిస్తారన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, బీసీ కార్యకర్త కురబ లింగమయ్యను పొట్టనపెట్టుకున్నారని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసారు."ఎక్స్" వేదికగా ఆయన కురుబ లింగమయ్య కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.శ్రీ సత్యసాయి జిల్లా రాప్తాడు నియోజకవర్గం రామగిరి మండలం పాపిరెడ్డిపల్లికి చెందిన వైఎస్సార్సీపీ బీసీ కార్యకర్త కురుబ లింగమయ్య హత్యను మాజీ సీఎం, జగన్మోహన్‌రెడ్డి తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని, చట్టబద్ధపాలన లేదని ఆయన ఆగ్రహం వ్యక్తంచేశారు. అధికారపార్టీ అన్యాయాలను ప్రశ్నించినందుకు, వారి దాడులను వ్యతిరేకించినందుకు వైఎస్సార్‌సీపీకి చెందిన బీసీ కార్యకర్తను టీడీపీ నాయకులు పొట్టనపెట్టుకున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలమీద, నాయకులమీద దాడులు పరిపాటిగా మారాయన్నారు. రక్షణ కల్పించాల్సిన పోలీసులు అధికారపార్టీ నాయకులతో కుమ్మక్కయ్యారని, రాష్ట్రంలో వ్యక్తుల భద్రతకు భరోసా లేని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. రామగిరి మండల ఉప ఎన్నికల్లో జరిగిన అరాచకాల వెనుక పోలీసుల వైఫల్యం తీవ్రంగా ఉందని, అధికార పార్టీ నేతల దారుణాలను అడ్డుకోవడంలో, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడంలో బాధ్యతా రాహిత్యం కారణంగానే ఈ ఘటనకు దారితీసిందన్నారు. రామగిరిలో వైఎస్సార్‌సీపీకి చెందిన ఎంపీటీసీ సభ్యులు టీడీపీ నేతల దౌర్జన్యాలతో భయభ్రాంతులకు గురై ఎన్నికలను బహిష్కరించినా, పోలీసులు అధికార పార్టీకి వంతపాడుతూ పైగా వైఎస్సార్‌సీపీ నేతలపై తప్పుడు కేసులు నమోదు చేయడం దుర్మార్గమన్నారు. బడుగు, బలహీన వర్గాల వారిని కక్ష రాజకీయాలకు బలిచేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు.

ఈ ఘటనకు బాధ్యులైన వారిని కచ్చితంగా చట్టంముందు నిలబెడతామని హెచ్చరించారు. కురుబ లింగమయ్య కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలిపారు. వారి కుటుంబానికి పార్టీ అండగా నిలుస్తుందన్నారు.

## పాకిస్థాన్‌లో మరో లష్కర్ ఏ తోయిబా ఉగ్రవాది కాల్చివేత

**హైదరాబాద్, మార్చి 31, ప్రభాతవార్త:** భారత్‌లో అనేక నేరాలు,ఘోరాలకు పాల్పడుతూ ఇక్కడ మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాదుల జాబితాలో వున్న లష్కర్ ఏ తోయిబాకు చెందిన గజ టెర్రరిస్టులు తమకు సురక్షితంగా వున్న పాకి స్తాన్‌లో వరుసగా హత్యలకు గురవు తు న్నారు. తాజాగా సోమవారం రంజాన్ పండగ వేళ పాకిస్తాన్ వాణిజ్య నగరం కరాచిలో అబ్దుల్ రహమాన్ అనే ఉగ్రవాదిని గుర్తు తెలియని వ్యక్తులు తుపాకితో కాల్చి చంపారు. అబ్దుల్ రహమాన్ 26/11 ముంబాయి దాడుల సూత్రధారి పాక్‌లో తలదాచుకున్న హఫీజ్ సయీద్‌కు అత్యంత సన్నిహితుడుగా చెబు తున్నారు. హతుడు లష్కర్ ఏ తోయిబా ఆర్థిక విభాగం పర్యవేక్షకుడుగా వున్నాడు. రంజాన్ పండగ సమయంలో ఒక దుకాణంలో నిలబడి వున్న రహమాన్‌పై బై క్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు సమీపం నుంచి తుపాకితో కాల్చి చంపి నిమిషాల వ్యవధిలో పారిపోయారు.

రహ మాన్ లష్కర్ ఓ తోయిబా ఉగ్రవాదే కాకుండా ఆ సంస్థ కు ఆర్థికంగా మహారాజ పోషకుడు కూడా. ఇదే సమయంలో కరాచిలో ప్రముఖ వ్యాపారిగానూ పేరొందాడు. రహమాన్‌ను కాల్చి చంపిన వీడియో సోషల్ మీడియా లో వైరల్ అవుతోంది. రహమాన్ హత్యకు నెల రోజుల ముందు అబూ ఖతర్ అనే ఉగ్ర వాదిని కరాచిలోనే గుర్తు తెలియని వ్యక్తులు కాల్చి చంపడం సంచలనం రేపింది.

## యువత పరిశోధనలు, సొంత వ్యాపారాలు ప్రారంభించాలి

**వికసిత్ భారత్ ఎంటర్‌ప్యూనర్ నెట్‌వర్క్‌ను ప్రారంభించిన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి**

**హైదరాబాద్,మార్చి 31,ప్రభాతవార్త:** ఈ దేశ యువత పరిశోధనలు చేయాలని, సొంత వ్యాపారాలను ప్రారంభించాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆకాంక్షించారు. సోమవారం వికసిత్ భారత్ ఎంటర్‌ప్యూనర్ నెట్‌వర్క్‌ను ప్రారం భించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ భార తదేశాన్ని 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశంగా మార్చే లక్ష్యంతో, పారిశ్రా మికవేత్తల అభివృద్ధికి మార్గదర్శనం చేయ డానికి వికసిత్ భారత్ ఎంటర్‌ప్రెన్యూర్ సంస్థను హైదరాబాద్‌లో ప్రారంభించుకు న్నామని అ న్నారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ స్టార్టప్‌లను, యువ పారిశ్రామి కవేత్తలను బలంగా ప్రోత్సహిస్తున్నారని, కేంద్ర ప్రభుత్వం బ్యాంకుల నుండి రుణాలు, ఇతర అనుమ తుల క్లియరెన్స్ ప్రక్రియలను సులభతరం చేసిందన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల యువతకు వ్యాపారం ప్రారంభిం చేం దుకు ప్రేరణ కల్పించేందుకు, శిక్షణ ఇవ్వ డానికి వికసిత్ భారత్ ఎం టర్‌ప్రెన్యూర్ సంస్థ దోహదమవుతుంది. లక్షలాది ఉద్యోగ అవకాశాలను సృష్టించడమే ఈ సంస్థ లక్ష్యం అన్నారు. ఈ సంస్థ కోసం పనిచేసిన అమర్ నాథ్,వారిటీంకు హృద యపూర్వక అభినం దనలు తెలియజే స్తున్నాము. ఈ సంస్థ ద్వారా విద్యార్థులు తమ చదువు పూర్తయిన వ్యాపార రంగంలోకి ప్రవేశించి దేశ అభివృద్ధిలో భాగస్వాములు కావడానికి గొప్ప అవకాశం లభించనుందన్నారు.

## 25న ఇంటర్ ఫలితాలు: 10తో ముగియనున్న మూల్యాంకనం

**హైదరాబాద్, మార్చి 31, ప్రభాతవార్త:** రాష్ట్రం లో మార్చి 5 నుంచి ప్రారంభమైన ఇంటర్ వార్షిక పరీక్షలు మార్చి 25తో ముగిశాయి. ఇంటర్ వార్షిక పరీక్షల ఫలితాలను ఈ నెల 25న విడుదల చేయడానికి ఇంటర్ బోర్డు అధికారులు కసరత్తు చేస్తున్నారు. ఈ నెల 10తో మూల్యాంకనం ముగియనుండగా.. ఆ తరువాత ఇతర పనులను పూర్తి చేసుకొని ముఖ్యమంత్రి అనుమతితో ఈ నెల 25న ఇంటర్ ఫలితాలను విడుదల చేసే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ఇంటర్ ప్రధాన పరీక్షలు మార్చి 20తో ముగియగా.. మార్చి 21 నుంచే మూల్యాంకనాన్ని ప్రారంభించారు. అయితే అంతకంటే ముందుగానే మార్చి 10 నుంచే సంస్కృతం మూల్యాంకనాన్ని ప్రారం భించారు. రాష్ట్ర వ్యాప్తంగా 19 కేంద్రాల్లో మూల్యాంకనాన్ని కొనసాగిస్తున్నారు.

## అలహాబాద్ ఐఐఐటిలో నిజామాబాద్ విద్యార్థి ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న రాహుల్(ఫైల్)

**హైదరాబాద్, మార్చి 31, ప్రభాతవార్త:** అలహాబాద్‌లో ఐఐఐటిలో మొదటి సంవత్సరం చదువుతున్న నిజామాబాద్‌కు చెందిన విద్యార్థి రాహుల్ మాదాల చైతన్య (21) తానుండే హాస్టల్ భవనం ఐదవ అంతస్తు నుంచి దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. తన జన్మదిన వేడుకలకు ఒక్కరోజు ముందు ఇతను ఆత్మహత్యకు పాల్పడడం అందరిని కలచి వేసింది. శనివారం అర్ధరాత్రి జరిగిన ఈ ఘటన ఆదివారం వెలుగు చూసింది. వివరాలు ఇలావున్నాయి. నిజామాబాద్‌కు చెందిన రాహుల్ మాదాల చైతన్య ఓబిసి కోటాలో అఖిల భారత స్థాయిలో 52వ ర్యాంకు సాధించి అలహాబాద్ ఐఐఐటిలో సీటు సాధించాడు. అతను మొదటి సంవత్సరం విద్యార్థి. ఇటీవల జరిగిన పరీక్షల్లో అతను ఫెయిల్ అవడంతో అన్యమ నస్కంగా ఉంటున్నట్లు తోటి విద్యార్థులు తెలిపారు. ప్రయా గరాజ్ జాల్వా ప్రాంతంలో అలహా బాద్ ఐఐఐటి ఉంది. శనివారంరాత్రి నిజామాబాద్‌లోని తన తల్లి స్వర్ణలతతో మాట్లా డిన తరువాత అర్ధరాత్రి 11.55 గంటల సమయంలో తానుండే హాస్టల్ ఐదవ అంతస్తు పైనుంచి రాహుల్ కిందకు దూకడంతో తీవ్రంగా గాయపడ్డాడు. దీనిని గమనించి కొందరు వెంటనే పోలీసులకు, క్యాంపస్ అధికారులకు సమాచారం అందించడంతో రాహుల్‌ను హుటా హుటిన ఆసు పత్రికి తరలించారు. అక్కడ చికిత్స మొదలుపెట్టిన కాసే పటికే అతను చనిపోయాడు. కాగా రాహుల్ ఆత్మహత్య చేసుకోవడానికి ముందు ఎలాంటి లేఖ రాయ లేదని పోలీసులు తెలి పారు. రాహుల్ ఆత్మహత్య గురించి నిజామాబాద్‌లోని అతని తల్లిదండ్రులకు ఐఐఐటి అధికారులు వెంటనే సమాచారం అందించగా ఆదివారం మధ్యాహ్నం వారు క్యాంపస్‌కు చేరుకున్నారు. రాహుల్ ఆత్మహత్యపై తల్లి స్వర్ణలత మాట్లాడుతూ ఆత్మహత్యకు కొద్ది నిమిషాల ముందు తన కుమారుడు తనకు ఫోన్ ద్వారా మెసేజ్ చేశాడని, తమ్ముడిని జాగ్రత్తగా చూసుకోవాలని కోరాడని తెలిపారు.

తన కుమారుడు తనకు మెసేజ్ చేసిన వెంటనే తాను రాహుల్‌కు ఫోన్‌చేశానని, అయితే ఫోన్ స్విచ్ఛాఫ్‌రావడంతో ఇతర విద్యార్థులకు సమా చారం అందించి కుమారుడిని వెతకాలని కోరారని తెలిపారు. పది నిమిషాల తరువాత తోటి విద్యార్థులు ఫోన్ చేసి రాహుల్ భవనం పైనుంచి దూకిన విషయం, తీవ్ర గాయాలతో ఆసుపత్రికి తరలించిన విషయం చెప్పారని ఆమె ఆవేదనగా తెలిపారు.

## కొడాలి నాని ముంబయికి తరలింపు

**అక్కడే బైపాస్ సర్జరీ జరిగే అవకాశం**

**హైదరాబాద్ (బేగంపేట), మార్చి 31,ప్రభాతవార్త:** వైఎస్సార్సీ సీనియర్ నాయకుడు,మాజీ మంత్రి కొడాని నానిని సోమవారం బేగంపేట విమా నాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో ముంబయికి తరలించారు, ఆయన ఆరోగ్యంపై సోమవారం ఉదయం నగరంలోని ఏఐజీ ఆసుపత్రి హెల్త్ బులెటిన్ విడుదల చేసింది.ఈ నెల 26వ తేదీన కొడాలి నాని హార్ట్ ఎటాక్‌కు గురైన విషయం తెల్సిందే.అప్పటి నుంచి ఆయన హైదరాబాద్‌లోని ఏఐజీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ క్రమంలో యాంజియో నిర్వహించిన వైద్యులు ఆయన గుండెలో మొత్తం మూడు వాల్స్ క్లోజ్ అవడంతో క్రిటికల్ సర్జరీచేసి హార్ట్ స్టంట్ లేదా బైపాస్ సర్జరీ చేయాలని కుటుంబ సభ్యులకు సూచించారు.ఈ మేరకు కొడాలి నానిని బైపాస్ సర్జరీ నిమిత్తం కుటుంబసభ్యులు సోమవారం ఉదయం గం 11.30 సమయంలో బేగంపేట విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమా నంలో ముంబయిలోని ఏషియన్ ఇనిసిట్యూట్‌కు తరలించినట్లు సమాచారం. అక్కడ ఆయన హార్ట్‌కు స్టంట్లు వేస్తారా లేక బైపాస్ సర్జరీ చేస్తారా అన్నది తెలియాల్సి ఉంది.

1-4PDg7exHMNWJQE.qxd:1-4PDg7exHMNWJQE.qxd 01/01/01 9:38 AM Page 1





మాజీ మంత్రి మహమూద్ అలీ, ఆజం ఆలీ తదితరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేస్తున్న కెటిఆర్. చిత్రంలో నాయక్ ఆలీ తదితరులు

## అలీకి రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన కెటిఆర్

**హైదరాబాద్ (మలక్‌పేట),మార్చి 31, ప్రభాతవార్త :** పవిత్ర రంజాన్ పండుగను పురస్కరించుకుని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, తెలంగాణ మాజీ మంత్రి కేటీఆర్ మలక్ పేట ఆజంపుర లోని మాజీ హోంమంత్రి మహమూద్ అలీ నివాసంకు విచ్చేసి మహమూద్ అలీ, ఆజం అలీ తదితరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. బిఆర్ఎస్ పార్టీ గ్రేటర్ ప్రధాన కార్యదర్శి ఆజాం ఆలీ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు కలిసి అజంపురాకు విచ్చేసిన కేటీఆర్ కు ఘనంగా స్వాగతం పలికారు.మహమూద్ అలీ కుటుంబ సభ్యులతో కలసి కెటిఆర్ భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో మలక్ పేట్ నియోజకవర్గం బిఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి లాయక్ అలీ, హైదరాబాద్ నగర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ అనితనాయక్, వైస్ చైర్మన్ కోరుదు భూమేష్, మాజీ డైరెక్టర్లు లలిత, ఎజాస్, సాయ భువనేశ్వరి గ్రేటర్ ప్రధాన కార్యదర్శులు మునవర్ ఖాన్, బాబు సుదర్శన్, డివిజన్ అధ్య క్షులు మంచికంటి జగన్, హయ్యత్ హుస్సేన్ హబీబ్ ,చల్లూరి రఘునందన్ రెడ్డి కామేష్, పగిళ్ళ శ్రీనివాస్ రెడ్డి, మారుతి, నాయకులు లలిత గౌర శశిధర్, శ్రీధర్ రెడ్డి,తెల్ల మహేష్ కుమార్, ఫైబర్ టెల్ రాజు, కావేటి ధర్మరాజు పాల్గొన్నారు.

## విద్యార్థులపై పోలీసు చర్య అమానుషం: ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్ (సైఫాబాద్), మార్చి 31 ప్రభాతవార్త:** సెంట్రల్ యూనివర్సిటిలో అక్రమంగా 400 ఎకరాల భూమిని వేలం వేయాలని రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ పలు విద్యార్థి సంఘాలు విద్యార్థులు నిరసన వ్యక్తం చేస్తుంటే పోలీసులు విద్యార్థులపై విచక్షణా రహితంగా లాఠిచార్జి చేసి, అక్రమంగా అరెస్టు చేయడాన్ని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య తీవ్రంగా ఖండించారు. యూనివర్సిటి హాస్టల్‌లోని రూంలోకి పోలీసులు వెళ్ళి విద్యార్థులపై అన్యాయంగా దాడి చేసి, గుంజుకుపోయి వారిని వ్యాన్‌లోకి ఎక్కించి పోలీస్ స్టేషన్‌కు తరలించడా దారుణమన్నారు. విద్యార్థులు ఏమైన తీవ్రవాదులా? లేక సంఘ విద్రోహ శక్తులా? అని ఆయన ప్రశ్నించారు. విద్యార్థుల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు దారుణంగా ఉందన్నారు. భావి తరాలకు గజం స్థలం కూడా ఉంచకుండా విక్రయించాలనే నిర్ణయం ప్రభుత్వానికి సమర్థనీయం కాదని, భవిష్యత్తు తరాలకు విద్యార్థులకు భవనాల నిర్మాణాలకు, హాస్టల్స్ నిర్మాణాలకు స్థలాలు ఉండాలే కాని అక్రమంగా వందల ఎకరాలు అమ్మితే తిరుగుబాటు తప్పదని ఆయన హెచ్చరించారు. ఇద్దరూ రిసెర్చ్ స్కాలర్స్ నవీన్‌కుమార్, డా. రోహిత్‌ల మీద అక్రమంగా పెట్టిన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు.



బిసిల మహాధర్నా కోసం జంతర్‌మంతర్ వద్ద సోమవారం ఏర్పాట్లను పరిశీలిస్తున్న యుగంధర్‌గౌడ్ తదతరులు

## బిసి బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించాలి

### బిసి పొలిటికల్ జెఎసి చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ డిమాండ్

**హైదరాబాద్(సైఫాబాద్), మార్చి 31 ప్రభాతవార్త:** అవకాశం వచ్చినప్పుడల్లా తాను బిసినని ప్రధాని నరేంద్రమోదీ చెప్పుకోవడం కాదని, బిసిల పట్ల చిత్తశుద్ధి ఉంటే బిసిల రిజర్వేష్లను 42 శాతంకు పెంచుతూ తెలంగాణ ప్రభుత్వం అసెంబ్లీలో చేసిన తీర్మానం బిల్లును తక్షణమే పార్లమెంట్‌లో అమోదించాలని బిసి పొలిటికల్ జెఏసి చైర్మన్ రాచాల యుగంధర్‌గౌడ్ కేంద్రాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ఏప్రిల్ 2వ తేదీన బిసి సంఘాల ఆధ్వర్యంలో జరిగే 'మహాధర్నా' కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లును ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రాచాల మాట్లాడుతూ లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ ప్రకారం బిసిల రిజర్వేషన్‌లను 42 శాతంకు పెంచుతూ తీర్మానం చేయించడం జరిగిందన్నారు. బిసిలపట్ల కాంగ్రెస్ పార్టీ చిత్తశుద్ధితో పనిచేస్తున్నదని, బిసిలకు భరోసా కల్పించిన రాహుల్‌గాంధీ, తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డి, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆయన బిసి సమాజం తరపున ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో బిసి నేతలు మేకపోతుల నరేందర్‌గౌడ్, ఆళ్ళ రామకృష్ణ, వట్టికూటి రామారావుగౌడ్, కిరణ్‌కుమార్, పరికిపండ్ల అశోక్, బడేసాబ్, చింతపల్లి సతీష్, వివి గౌడ్, అంజన్నయాదవ్, దేవర శివ, రాఘవేందర్, బిక్షపతి, రామన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సోమవారం ధన్వాడలో మీడియాతో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

## యువతకు ఉపాధి కోసం రాజీవ్ యువ వికాసం

### కులగణన ద్వారా బలహీన వర్గాలకు రిజర్వేషన్

### ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన మంత్రి శ్రీధర్‌బాబు

**కాటారం, మార్చి 31, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో యువతీ, యువకులకు ఉపాధి కల్పించేందుకు 80 శాతం సబ్సిడీతో రుణ ఆర్థిక సహాయం అందించేందుకు రాజీవ్ యువ వికాస పథకం ప్రభుత్వం ప్రవేశపెట్టిందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని మంత్రి శ్రీధర్ బాబు స్వగృహం ధన్వాడ గ్రామంలో సోమవారం మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలోని ముస్లిం సోదరులకు మంత్రి శ్రీధర్ బాబు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. గత పదేళ్లలో మైనార్టీల సంక్షేమాన్ని పట్టించుకోలేదని, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఈ ఏడాది బడ్జెట్లో అత్యధిక నిధులు కేటాయించినట్లు మంత్రి పేర్కొన్నారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆదేశాలతో దేశంలోనే మొదటిసారిగా కులగణన సర్వే చేసి బలహీన వర్గాలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత తమ ప్రభుత్వాన్ని దేనని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో బలహీన వర్గాల సంక్షేమం కోసం రిజర్వేషన్లు కల్పించామన్నారు. గత పది ఏళ్లలో బీసీ కార్పొరేషన్ నిర్వీర్యమైపోయిందని, ఎలాంటి నిధులు రాక సంక్షేమం కుంటుపడిందని శ్రీధర్ బాబు ఆరోపించారు. రాజీవ్ యువశక్తి ద్వారా యువతకు ఉపాధి కల్పించేందుకు ఏప్రిల్ నెల ఐదో తేదీలోపు దరఖాస్తులు తీసుకొని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ లకు సబ్సిడీతో రుణాలు ఇవ్వనున్నట్లు మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిపి పంతకాని సమ్మయ్య, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు ఒన్న వంశ వర్ధన్ రావ్, యూత్ కాంగ్రెస్ మంథని నియోజకవర్గ అధ్యక్షులు చీమల సందీప్, యూత్ కాంగ్రెస్ కాటారం మండల అధ్యక్షులు చీటూరి మహేష్ గౌడ్, సర్పంచ్ల ఫోరం మాజీ మండల అధ్యక్షులు, గంగారం మాజీ సర్పంచ్ తెప్పెల దేవేందర్ రెడ్డి, చీర్ల తిరుపతి రెడ్డి, రాజవీరు, గడ్డం కొమరయ్య, శంకరం పల్లి మాజీ సర్పంచ్ అంగజాల అశోక్, మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ అన్ని విభాగాల నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆర్‌టిఐ కమిషనర్ నియామాకమెప్పుడు?

### గడువు దాటినా స్పందనేది?

**హైదరాబాద్, మార్చి 31 ,ప్రభాతవార్త :** రాష్ట్రంలో సమాచారం తెలుసుకునే హక్కు ఉన్నాట్టా లేనట్టా అనే విమర్శలు వస్తున్నాయి. ఆర్‌టిఐ కమిషనర్ కార్యాలయానికి రోజులు తరబడి వచ్చేవారు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.గత కొద్ది నెలలుగా ఆర్‌టిఐ ప్రధాన కమిషనర్, ఇతర కమిషనర్ పోస్టులను ప్రభుత్వం భర్తీ చేయక పోవడంతో సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. కొత్త ప్రభుత్వం వచ్చి సుమారు 15 నెలలు దాటినా ఆయా పోస్టులను భర్తీ చేయక పోవడంతో పలు అనుమానాల వ్యక్తం అవుతున్నాయి . సమాచార హక్కు చట్టం విషయంలో న్యాయస్థానాల తీర్పులను కూడా ప్రభుత్వం పక్కన పెట్టిందనే ఆరోపణలు వస్తున్నాయి. నోటిఫికేషన్ ఇచ్చి దరఖాస్తులు స్వీకరించి నెలలు గడుస్తున్నా ఒక్క అడుగు కూడా ముందుకు పడటం లేదు. సమాచార హక్కు కమిషనరేట్‌లో ఏ కమిషనర్ లేక దరఖాస్తులు పేరుకు పోతుంటే దరఖాస్తు దారులు మాత్రం సదరు కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. తాను అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రధాన కమిషనర్‌తో పాటు కమిషనర్లను నియమిస్తానంటూ రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలు ఏమయ్యాయని వారు ప్రశ్నిస్తున్నారు. వాస్తవానికి కమిషనర్ల పదవి కాలం ఫిబ్రవరి 2023 నాటికే ముగిసింది. అప్పటి నుంచి సమాచర హక్కు ప్రజలకు అందని ద్రాక్షగానే మిగిలింది. కమిషనర్లు లేక పోవడంతో సుమారు 30 నుంచి 40 వేల వరకు ఉన్న ఫైళ్ళు పెండింగ్‌లో ఉన్నాయి. రాష్ట్రవ్యాప్తంగా వివిద జిల్లాల నుంచి రాష్ట్ర సమాచార కమిషనర్ల కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న వారికి మా చేతుల్లో ఏమి ఉంది అనే సమాధానం ఆర్‌టిఐ కమిషనర్ కార్యాలయ సిబ్బంది నుంచి వస్తోంది. దీంతో ఇదెక్కడి పాలన అంటూ నిర్వేదం వ్యక్తం చేస్తున్నారు. హైకోర్టు,సుప్రీం కోర్టు ప్రభుత్వాలను ఆదేశించిన ఫలితంగా కమిషనర్ల ఏర్పాటుకు 2023 జూన్ 12న నోటిషికేషన్ విడుదలై,అదే నెల 29 నాటికి దరఖాస్తుల గడువు తేదీ కూడా ముగిసిపోయింది.గత ప్రభుత్వంలో జులై 2023 నాటికి సుమారు 350 మంది ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకున్నారు. పాత,కొత్త దరఖాస్తులన్ని కలిపి సుమారు 800కుపైగా దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో సుమారు 60 మందికి పైగా రిటైర్డ్ ఐఎస్ఎస్, ఐపిఎస్ ఆఫీసర్లు కూడా ఉన్నారు.

ఆర్‌టిఐ ప్రధాన కమిషనర్‌ల పోస్టుల కోసం 1:3 చొప్పన షార్ట్ లిస్టును తయారు చేశారు. నియకమాకం విషయంలో ప్రకిర్యు కొనసాగుతుందని గత ప్రభుత్వం కోర్టుకు కూడా నివేదించి. ఇందుకు సంబంధించిన నివేదికను కూడా గడువు తేదీ నాటికి అందించింది. గడువు పూర్తయినా ప్రభుత్వం స్పందించక పొవడంతో కోర్డు దిక్కారణ కింద కోర్టు మెట్లు ఎక్కేందుకు పలువురు సిద్దం అవుతున్నారు.

## ఎంఎంటీఎస్

### కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

**హైదరాబాద్ (కంటోన్మెంట్), మార్చి 31 ప్రభాతవార్త:** సికింద్రాబాద్ యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఎంఎంటీఎస్ అత్యాచారయత్న ఘటన బాధితురాలిని కేంద్ర మంత్రి బండి సంజయ్ పరామర్శించారు. బాధితురాలి ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ఎంఎంటీఎస్ రైలులో యువతిపై జరిగిన అత్యాచారయత్న ఘటన భాదాకరమని అన్నారు. యువతికి మూడు సర్జరీలు అయ్యాయని క్రమక్రమంగా ఆమె కోలుకుంటుందన్నారు. గాంధీ ఆసుపత్రి నుండి మెరుగైన వైద్యం కోసం యశోద ఆసుపత్రికి తీసుకువచ్చి ఆసుపత్రిలో అయ్యే ఖర్చులను తామే భరిస్తున్నట్లు తెలిపారు. అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిందితుడిని పట్టుకున్నామని చెప్పినప్పటికీ పోలీసులు ఇంకా నిందితుడి కోసం వెతుకుతున్నామని చెబుతున్నారని, ఈ విషయంలో స్పష్టత రావాల్సిన అవసరం ఉందన్నారు. ఘటన జరిగి ఇన్ని రోజులు గడుస్తున్నా నిందితుడిని పట్టుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. తెలంగాణలో ఇటీవల మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు చూస్తుంటే మహిళలకు భద్రత కరువైందని స్పష్టంగా తెలుస్తుందని అన్నారు. ఈ అంశాన్ని కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉందంటూ రాష్ట్ర ప్రభుత్వం నెట్టేయడం సరికాదన్నారు. ఇప్పటికైనా నిందితుడిని వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.



సోమవారం మీడియాతో మాట్లాడుతున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

## 3న కొత్త ఎక్సైజ్‌స్టేషన్ల ప్రారంభం

**హైదరాబాద్, మార్చి 31 ,ప్రభాతవార్త:** హైదరాబాద్, రంగారెడ్డి ఎక్సైజ్ డివిజన్‌లో 13 వరంగల్ రూరల్‌లో ఒక కొత్త ఎక్సైజ్ స్టేషన్లను ఏప్రిల్ 1న బదులు ఏప్రిల్ 3న ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు మూడు కొత్త స్టేషను ప్రారంభించేందుకు ఎక్సైజ్ అధికారులు నిర్ణయం తీసుకున్నారు.జిహెచ్ఎంసి పరిధిలో స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఒకటో తారీఖున కొత్త స్టేషన్ల ప్రారంభం వాయిదా పడినట్లు సమాచారం.కొత్త పోలీస్ స్టేషన్ల ను ప్రారంభించడానికి జిహెచ్ఎంసిలో ఎన్నికల కోడ్ ఉన్నందున అనుమతులు తీసుకున్న అనంతరం ఈనెల ఏప్రిల్ 3 కొత్త పోలీస్ స్టేషన్ల ప్రారంభోత్సవానికి ఉత్తర్వులు జారీ చేశారు. రంగారెడ్డి డివిజన్ లోని గండిపేట కొత్త పోలీస్ స్టేషన్‌ను, సంగారెడ్డి పరిధిలో అమీన్ పుర పోలీస్ స్టేషన్లను ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు చేతుల మీదుగా ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లితో పాటు తోపాటు ముఖ్య కార్యదర్శి ఎస్,ఎం.రిజ్వి,ఎక్సైజ్ కమిషనర్ చెవూరి హరికిరణ్ ఇతర ఉన్నతాధికారులు పాల్గొనున్నారు.మిగిలిన ఎక్సైజ్ స్టేషన్లను ఆయా ప్రాంతాల్లో అధికారులు చేతులు మీదుగా ప్రారంభించనున్నారు.

## హెచ్‌సియు భూముల అమ్మకానికి వ్యతిరేకంగా బిజెపి పోరాటం

### ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

**హైదరాబాద్, మార్చి 31 ప్రభాతవార్త:** భూముల అమ్మకానికి వ్యతిరేకంగా బిజెపి పోరాటం చేస్తోందని ఎంపి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం బిజెపి రాష్ట్ర కార్యాలయంలో మాట్లాడుతూ గత రెండు వారాలుగా హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో గందరగోళ పరిస్థితి కొనసాగుతుందన్నారు. హైద రాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను అమ్మాలని కాంగ్రెస్ ప్రభుత్వం యత్నిస్తోందన్నారు. ఈ భూముల్లో ఎన్నో వనరులు ఉన్నాయని, ప్రకృతికి హాని చేసేలా భూములను విక్రయించొద్దని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారన్నారు. హెచ్‌సియు భూముల అమ్మకంపై రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా కోర్టులో పిల్ దాఖలైందన్నారు. ప్రభుత్వ భూమిని అమ్ముతామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామన్నారు. గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం కూడా విలువైన భూములను విక్రయించింది. రాజేంద్రనగర్, బుద్వేల్ ప్రాంతాల్లో వందల ఎకరాల విలువైన భూములు అమ్మారు. ఇప్పుడు అదే బిఆర్ఎస్ నేతలు ధర్నా చేయడం విడ్డూరంగా ఉంది. ఈ అంశంపై బిజెపి ఎమ్మెల్యేలతో పాటు లాయర్లతో కూడిన ఫ్యాక్ట్ ఫైండింగ్ టీమ్‌ను యూనివర్సిటీకి పంపించనున్నట్లు తెలిపారు. మాజీ ఎంపి సీతారాం నాయక్ మాట్లాడుతూ విశ్వవిద్యాలయాల భూములను అమ్మడం అంటే, మన భవిష్యత్ తరాలకు చెందిన మూలాధారాన్ని కోల్పోవడమేనన్నారు. బిజెవైఎం రాష్ట్ర అధ్యక్షులు సేవెళ్ల మహేందర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో గత బిఆర్ఎస్ ప్రభుత్వం, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం గుడులు, బడుల భూమిని అమ్మాలని చూశాయని, విద్యార్థుల అవసరాలు తీర్చే బాధ్యత ప్రభుత్వంపై ఉంది. కాని ప్రభుత్వం నడపడానికి యూనివర్సిటీ భూములను అమ్మాలనుకుంటే ఏ విద్యార్థి సహించరు. బిజెపి ఊరుకోదన్నారు.

## హెచ్‌సియు భూములు అమ్మాలన్న ఆలోచన విరమించాలి

### బిజెపి ఎంపి ఈటల రాజేందర్

**హైదరాబాద్, మార్చి 31 ప్రభాతవార్త:** రాష్ట్రంలో ఉన్న రేవంత్‌రెడ్డి ప్రభుత్వం హెచ్‌సియు భూములను అమ్మి అప్పులు కట్టాలని నీచమైన ప్రయత్నం చేస్తుందని బిజెపి ఎంపి ఈటల రాజేందర్ మండిపడ్డారు. సోమవారం పార్టీ కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ తెలంగాణ రాష్ట్రానికే తలమానికం అన్నారు. కొన్ని వేలమంది నిష్ణాతులను తీర్చిదిద్దిదని అన్నారు. భూముల అమ్మాకాన్ని విద్యార్థులు అధ్యా పకులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారన్నారు. హైదరాబాద్‌లో శ్మశానవాటికలకు కూడా జాగా దొరకని పరిస్థితి వచ్చిందన్నారు. పార్కులకు సైతం స్థలం లేక కాంక్రీట్ జంగల్‌గా మారుతుందన్నారు. రేవంత్ రెడ్డి ఎందుకు ఇలాంటి ఆలోచన చేస్తున్నారు తెలియడం లేదన్నారు. 15 నెలలుగా ప్రతి నిర్ణయం ప్రజాకటకం, ప్రజా వ్యతిరేకమైనదే. అన్నీ తిరోగమన చర్యలు అన్నారు. హెచ్‌సియు విద్యార్థుల మీద దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని, వారికి సంఘీభావం తెలుపుతున్నామన్నారు. అవసరమైతే ప్రత్యక్ష కార్యాచరణకు దిగుతామన్నారు. విశ్వవిద్యాలయం భూములు అమ్మకూడదని డిమాండ్ చేస్తున్నామన్నారు.

## ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన కెసిఆర్

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి హైదరాబాద్, మార్చి31:** బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. గంగా జమున తెహజీబ్‌కు తెలంగాణ నిలయమన్నారు. బీఆర్ఎస్ హయాంలో మైనారిటీల అభివృద్ధికి విశేష కృషి చేశామని తెలిపారు. మత సామరస్యం, లౌకికవాద పాలనతోనే శాంతి భద్రతలు నెలకొంటాయని చెప్పారు. అభివృద్ధికి సామాజిక ప్రశాంతత కీలకమని వెల్లడించారు. బీఆర్ఎస్ విధానాలను కొనసాగిస్తే మరింత ప్రగతి సాధ్యమని తెలిపారు.

## నాలుగు వందల ఎకరాల భూమి వర్సిటీదే..

### విద్యార్థులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలి

### నేడు హెచ్‌సియు వద్ద ధర్నా : సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ



సోమవారంనప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న జాన్ వెస్లీ తదితరులు

**హైదరాబాద్, మార్చి 31,ప్రభాతవార్త:** హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీకి చెందిన 4వందల ఎకరాల భూమిని టెండర్ల ద్వారా18 వేల కోట్ల రూపాయిలకు అమ్మడానికి రాష్ట్ర ప్రభుత్వం చూస్తుందని దానిని అడ్డుకున్న విద్యార్థులను నిర్బందించి అరెస్టులు చేశారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ ఆరోపించారు. ఆభూమి ముమ్మాటికీ సెంట్రల్ యూనివర్సిటీదే అన్నారు. అప్పట్లో ఆ భూమిని సెంట్రల్ యూనివర్సిటీకి రిజిస్ట్రేషన్ చేయకపోవడంతోనే ఇప్పుడు ప్రభుత్వ భూమని చెబుతున్నారన్నారు. సోమవారం ప్రెస్ క్లబ్లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థునుల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు బాగాలేదన్నారు. ప్రభుత్వ తీరు, విద్యార్థుల నిర్బందం, అరెస్టులకు నిరసనగా మంగళవారం హెచ్‌సియూ ముందు ధర్నా నిర్వహిస్తున్నట్టు పేర్కొన్నారు. సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వీరయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం యూనివర్సిటీ విద్యార్థులను నిర్బందించడం ఏదో గ్యారంటీ అవుతుందా అంటూ ప్రశ్నించారు. యూనివర్సిటీల భూములను అమ్ముకుని సొమ్ము చేసు కోవాలనుకోవడం మానుకోవాలన్నారు.

విద్యార్థి సంఘం అభిప్రాయాన్ని పరిగణలోకి తీసుకుని యూనివర్సిటీ భూమి వేలం ద్వారా అమ్మకం చేస్తానన్న ఆలోచన విరమించుకోవాలన్నారు. సమావేశంలో సెంట్రల్యూనివర్సిటీ విద్యార్థి సంఘం నాయకుడు పాలడుగు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# సంస్థాగత బలోపేతంపై బిజెపి దృష్టి

### నూతనంగా ఎన్నికైన జిల్లా అధ్యక్షులతో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సమావేశం

### ఏప్రిల్ 6 నుంచి 12వ తేది వరకు పలు కార్యక్రమాలు: కాసం వెంకటేశ్వర్లు



**హైదరాబాద్, మార్చి 31 ప్రభాతవార్త:** రాష్ట్రంలో బిజెపిని మరింత బలోపేతం చేయాలన్న లక్ష్యంతో పార్టీ నేతలు కార్యాచరణ సిద్ధం చేస్తున్నారు. అందులో భాగంగా ఇప్పటికే జిల్లా అధ్యక్షుల నియామకాలను పూర్తిచేశారు. అందులో భాగంగానే సోమవారం కేంద్రమంత్రి, బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి అధ్యక్షతన నూతనంగా ఎన్నికైన జిల్లా అధ్యక్షులతో సమావేశం నిర్వహించి వారికి దిశానిర్దేశనం చేశారు. ఈ సమావేశంలో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, రాజ్యసభ సభ్యులు డాక్టర్.కె. లక్ష్మణ్, ఎంపి, జాతీయ కార్యవర్గ సభ్యులు ఈటల రాజేందర్, రాష్ట్ర ఇంచార్జ్ అభయ్ పాటిల్, సంఘటన మంత్రి చంద్రశేఖర్, పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సమావేశంలో సంస్థాగతమైన అంశాలతో పాటు ముఖ్యమైన కార్యక్రమాలపై చర్చించడం జరిగింది. సమావేశ వివరాలను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాసం వెంకటేశ్వర్లు మీడియాకు వెల్లడించారు. ఏప్రిల్ 6న బిజెపి ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా 6 నుంచి 12 తారీఖు వరకు వివిధ రకాల కార్యక్రమాలు నిర్వహించేందుకు నిర్ణయించడం జరిగిందని తెలిపారు. ఏప్రిల్ 8, 9 తేదీల్లో మండలాల వారీగా క్రియాశీలక కార్యకర్తల సమ్మేళనాలు నిర్వహిస్తామన్నారు. ఏప్రిల్ 10, 11, 12 తేదీల్లో గావ్ ఛలో, బస్తీ ఛలో అభియాన్ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఏప్రిల్ 14 నుంచి అంబేద్కర్ విగ్రహాల వద్ద స్వచ్ఛతా కార్యక్రమాలు నిర్వహిస్తామని, ఏప్రిల్ 15, 16న జిల్లా స్థాయిలో చర్చా వేదికలు నిర్వహిస్తాం. రాష్ట్రంలో 40.78 లక్షల బిజెపి సభ్యత్వ నమోదు జరిగడం శుభపరిణామం. 45 వేల క్రియాశీల సభ్యత్వం జరిగిందన్నారు. 22 వేల బూత్ కమిటీలు పూర్తయ్యాయినట్లు తెలిపారు. 15 ఏప్రిల్ వరకు మొత్తం బూత్ కమిటీల నియామక ప్రక్రియ పూర్తవుతుందన్నారు.

# ప్రియుడితో కలిసి భర్తను హత్య చేసిన భార్య

### నిందితుల అరెస్టు

**హైదరాబాద్, మార్చి 31, ప్రభాతవార్త:** వివాహేతర సంబంధాలు పచ్చని సంసారంలో చిచ్చురేపుతున్నాయి. ఇప్పటికే ఈ తరహా ఘటనలు అనేకం వెలుగు చూడగా తాజాగా నిజామాబాద్ జిల్లా బాన్సువాడలో ప్రియుడితో కలిసి ఓ ఇల్లాలు భర్తను హత్య చేసింది. దీనిపై రంగంలో దిగిన పోలీసులు నిందితులను కటకటాల్లోనెట్టారు. వివరాలు ఇలావున్నాయి. బాన్సువాడ మండలం నాగారం గ్రామానికి చెందిన విఠల్ రెడ్డి (42)కి 20 ఏళ్ల క్రితం సోమేశ్వర్ గ్రామానికి చెందిన మేనమామ కూతురు కాశవ్వతో వివాహం జరిగింది. మేనమామ కూతురుతో వివాహం అయిన తరువాత విఠల్ రెడ్డి ఇల్లరికం వచ్చి తాపీ మేస్త్రీగా స్థిరపడ్డాడు. వీరికి ముగ్గురు అమ్మాయిలు వుండగా పెద్ద అమ్మాయికి వివాహం అయ్యింది. మిగతా ఇద్దరు అమ్మాయిలకు కూడా వివాహ సంబంధాలు చూస్తున్న తరుణంలో కాశవ్వ తన గ్రామానికే చెందిన మరో వ్యక్తితో కొంత కాలంగా వివాహేతర సంబంధం కొనసాగిస్తోంది. ఈ విషయం తెలిసిన విఠల్ రెడ్డి భార్యను నిలదీయడంతో పాటు మందలించాడు. ఈ విషయమై దంపతుల మధ్య పలుమార్లు గొడవ జరిగింది. అయితే ప్రియుడి మోజులో వున్న కాశవ్వ భర్తను అంతమొందించాలని నిర్ణయించుకుంది. ఇదే అదనుగా గత శుక్రవారం భర్తను గ్రామ శివార్లలో గల పొలానికి తీసుకువచ్చి మద్యం తాగించింది. అనంతరం భర్త మద్యం మత్తులో వుండగా ప్రియుడికి ఫోన్ చేసి రప్పించింది. దీని తరువాత ఇద్దరు కలిసి విఠల్ రెడ్డి మెడకు టవల్ బిగించి స్పృహ కోల్పోయేలా చేసి అనంతరం ఇనుప పైపులతో తలపై బలంగా కొట్టి చంపేశారు. దీని తరువాత కాశవ్వ తన ప్రియుడితో కలిసి భర్త మృతదేహాన్ని స్థానిక కొల్లూరు సబ్ స్టేషన్ సమీపంలో రహదారిపై పడవేసి ఎవరి ఇళ్లకు వారు వెళ్లిపోయారు. కాగా శనివారం ఉద యం విఠల్ రెడ్డి హత్య విషయం వెలుగు చూడగా ఏమీ తెలియనట్లు కాశవ్వ ఏడుపులు మొదలు పెట్టింది. అయితే కాశవ్వ వ్యవహారంపై పోలీసులకు అనుమానం వచ్చి అదుపులోకి తీసుకుని విచారించగా నిజం అంగీకరించి తానే ప్రియుడితో కలిసి హత్య చేసి నట్లు చెప్పింది. ఇద్దరు నిందితులను సోమవారం పోలీసులు అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. కేవలం వివాహేతర సంబం ధం కారణంగానే ఈ హత్య జరిగిందని పోలీసులు తెలిపారు.

1-4pg10.qxd:1-4pg10.qxd 01/01/01 7:38 AM Page 1








# ఐపిఎల్ హిస్టరీలో.. ఫాస్టెస్ట్ ఫిఫ్టీలు

## స్పీడ్‌గా హాఫ్ సెంచరీలు చేసిన హీరోలు
## అగ్రస్థానంలో యశస్వి జైస్వాల్


**న్యూఢిల్లీ:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) అంటేనే పరుగుల సునామీ. ఒక్క బాల్‌ను వేస్ట్ చేసినా బ్యాటర్లు బాధపడిపోతుంటారు. ప్రతీ బాల్ బౌండరీ, సిక్సర్ కొట్టడమే బ్యాటర్ లక్ష్యం. అయితే ఐపీఎల్ చరిత్రలోనే కొందరు ఆటగాళ్లు తమ దూకుడు ఆటతో వేగంగా అర్ధ సెంచరీ సాధించిన ఆటగాళ్లు కూడా ఉన్నారు. ఐపీఎల్ హిస్టరీలో ఫాస్టెస్ట్ ఫిఫ్టీ సాధించిన పలువురు హీరోలు ఉన్నారు. ఐపీఎల్ చరిత్రలో అత్యంత వేగంగా అర్ధ సెంచరీ చేసి రికార్డు సాధించిన రాజస్థాన్ రాయల్స్ ఆటగాడు యశస్వి జైస్వాల్ పేరిట ఉంది. 2023 సీజన్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్‌పై జరిగిన మ్యాచ్‌లో కేవలం 13 బంతుల్లో అర్ధ సెంచరీ నమోదు చేసి అందరి దృష్టిని ఆకర్షించాడు. ఈ ఇన్నింగ్స్‌లో యశస్వి తన దూకుడు బ్యాటింగ్ సామర్థ్యాన్ని నిరూపించుకున్నాడు. అలాగే కేఎల్ రాహుల్ 2018లో పంజాబ్ కింగ్స్ తరఫున ఢిల్లీ క్యాపిటల్స్ పై 14 బంతుల్లోనే అర్ధ సెంచరీ చేశాడు. పాట్ కమ్మిన్స్ ఒక ఫాస్ట్ బౌలర్ అయినప్పటికీ బ్యాట్‌తో విధ్వంసం సృష్టించాడు. కమ్మిన్స్ 2022లో కోల్‌కతా నైట్ రైడర్స్ తరఫున ముంబై ఇండియన్స్ పై అద్భుత ఇన్నింగ్స్ ఆడి 14 బంతుల్లో అర్ధ సెంచరీ చేశాడు. ట్రావిస్ హెడ్ 2024 ఐపీఎల్ సీజన్లో సునామీలా బ్యాటింగ్ చేశాడు. లక్నో సూపర్ జెయింట్స్, ఢిల్లీ క్యాపిటల్స్‌పై 16 బంతుల్లో రెండు సార్లు అర్ధ సెంచరీలు సాధించాడు. ఇది అతని అద్భుతమైన ఫామ్‌కు నిదర్శనం. ఐపీఎల్లో అత్యంత వేగవంతమైన అర్ధ సెంచరీ రికార్డును ట్రావిస్ హెడ్ తన ఖాతాలో వేసుకున్నాడు. నికోలస్ పూరన్ 2023లో లక్నో సూపర్ జెయింట్స్ తరఫున ఆర్సీబీ పై 15 బంతుల్లో హాఫ్ సెంచరీ చేశాడు. జాక్ ఫ్రేజర్ మెక్‌గుర్క్ 2024లో ముంబై ఇండియన్స్, సన్ రైజర్స్ హైదరాబాద్‌పై 2024 సీజన్లో 15 బంతుల్లో రెండు సార్లు అర్ధ సెంచరీ చేశాడు. సునీల్ నరైన్ 2017లో కోల్‌కతా నైట్ రైడర్స్ తరఫున రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుపై 15 బంతుల్లోనే అర్ధ సెంచరీ సాధించాడు. యూసుఫ్ పఠాన్ 2014లో సన్ రైజర్స్ హైదరాబాద్‌పై కోల్‌కతా నైట్ రైడర్స్ తరఫున 15 బంతుల్లో హాఫ్ సెంచరీ చేసి ఆల్‌రౌండర్‌గా తన సత్తా చాటాడు.

# ఆస్ట్రేలియా పర్యటనకు భారత్

## ఇరు జట్ల మధ్య మూడు వన్డే, ఐదు టి20లు

**న్యూఢిల్లీ:** ప్రస్తుతం ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)-2025, సీజను 18 మూడ్‌లో ఉన్న భారత క్రికెట్ అభిమానులకు మరో శుభవార్త. ఈ ఏడాది సెప్టెంబర్‌లో జరిగే ఆసియా కప్ (టీ20) తర్వాత భారత క్రికెట్ జట్టు ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లనుంది.



అక్కడటీమ్‌ఇండియా ఆసీస్‌తో మూడు వన్డేలు, ఐదు టీ20లు ఆడనుంది. ఈ మేరకు క్రికెట్ ఆస్ట్రేలియా 2025-26కు సంబంధించిన పూర్తి షెడ్యూల్‌ను విడుదల చేసింది. అక్టోబర్ 19వ తేదీ నుంచి మొదలు కాబోయే మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్ అదే నెల 23న ముగియనుంది. వన్డే సిరీస్ ముగిసిన తర్వాత, నాలుగు రోజులకు ధనాధన్ క్రికెట్ మజా మొదలవుతుంది. అక్టోబర్ 29 నుంచి నవంబర్ 08 వరకూ ఐదు టీ20లను నిర్వహించనున్నారు. మూడు వన్డేలు డే అండ్ నైట్ మ్యాచ్‌లు కాగా, టీ20 సిరీస్‌లో అన్ని మ్యాచ్‌లు రాత్రే జరుగుతాయి. ఇక అమ్మాయిల ఆల్ ఫార్మాట్ సిరీస్ కూడా ఖరారైంది. పురుషులతో పాటు భారత మహిళల జట్టు సైతం ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లనుంది. 2026 ఫిబ్రవరి, మార్చిలో భారత్‌కు ఆస్ట్రేలియాకు మధ్య వన్డే, టీ20 సిరీస్‌లు జరగనున్నాయి. వీటిలో 3 టీ20లు, 3 వన్డేలు, ఒక టెస్టు ఆడనుంది. ఫిబ్రవరి 15వ తేదీ నుండి 21వ తేదీ మధ్య టీ20 సిరీస్ జరగాల్సి ఉండగా ఫిబ్రవరి 24 నుంచి మార్చి 01 దాకా వన్డే సిరీస్ జరుగనుంది. మార్చి 6 నుంచి పెర్త్‌లోని వాకా మైదానంలో ఏకైక టెస్టు (పింక్) ఆతిథ్యమివ్వనుంది.



ఆట

### ఆర్ఆర్ కెప్టెన్ రియాన్‌కు
# రూ.12 లక్షల జరిమానా


**న్యూఢిల్లీ:** ఐపీఎల్‌లో రాజస్తాన్ రాయల్స్ (ఆర్ఆర్) స్టాండ్ ఇన్ కెప్టెన్ రియాన్ పరాగ్‌కు రూ.12 లక్షల జరిమానా విధించారు. చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో స్లో ఓవర్ రేట్ కారణంగా ఆ ఫైన్ వేశారు. ఉత్కంఠభరితంగా సాగిన ఆ మ్యాచ్‌లో ఆరు పరుగుల తేడాతో రాజస్థాన్ రాయల్స్ జట్టు విజయం సాధించిన విషయం తెలిసిందే. ఫస్ట్ బ్యాటింగ్ చేసిన ఆర్ఆర్ జట్టు నిర్ణీత ఓవర్లలో 9 వికెట్లకు 182 రన్స్ చేసింది. అయితే భారీ టార్గెట్‌తో బరిలోకి దిగిన చెన్నై జట్టు నిర్ణీత ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 176 రన్స్ మాత్రమే చేసింది. చెన్నై ఛేజింగ్ చేస్తున్న సమయంలో ఆర్ఆర్ జట్టు తమ ఓవర్ల కోటాను పూర్తి చేసేందుకు ఎక్కువ సమయం తీసుకున్నది. దీంతో ఈ యేడాది ఐపీఎల్‌లో ఆర్ఆర్ జట్టు తొలి ఉల్లంఘనకు పాల్పడినట్లు నిర్వాహకులు తెలిపారు. ఐపీఎల్ ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.22 కింద జరిమానా విధించినట్లు పేర్కొన్నారు. ఓవర్ రేట్ స్లోగా ఉన్న కారణంగా, కెప్టెన్ పరాగ్‌కు 12 లక్షల జరిమానా విధిస్తున్నట్లు తెలిపారు. ఆర్ఆర్ తన తొలి మ్యాచ్‌లో హైదరాబాద్ చేతిలో ఓడిన విషయం తెలిసిందే. ఇక తన తదుపరి మ్యాచ్‌ను ఏప్రిల్ 5వ తేదీన పంజాబ్ కింగ్స్‌తో ఆడనున్నది.



# మయామి టెన్నిస్ క్వీన్ సబలెంకా

## వరల్డ్ నాలుగో ర్యాంకర్ జెస్సికాపై గెలుపు

**న్యూఢిల్లీ:** ప్రపంచ నంబర్ 1 ర్యాంకర్, బెలారస్ టెన్నిస్ స్టార్ సబలెంకా తన కెరీర్‌లో 19వ సింగిల్స్ టైటిల్‌ను సాధించింది. ఫ్లోరిడాలో ముగిసిన మయామి ఓపెన్ ఉమెన్ టెన్నిస్ అసోసియేషన్ (డబ్ల్యూటీఏ)-1000 లెవెల్ టోర్నర్ సబలెంకా తొలిసారి ఛాంపియన్‌గా అవతరించింది. 88 నిముషాల పాటు జరిగిన ఫైనల్లో టాప్ సీడ్ సబలెంకా 7-5, 6-2తో ప్రపంచ నాలుగో ర్యాంకర్, అమెరికాకు చెందిన జెస్సికా పెగూలాపై గెలిచింది. టైటిల్ గెలిచే క్రమంలో సబలెంకా తన ప్రత్యర్థులకు ఒక్క సెట్ కూడా కోల్పోకపోవడం గమనార్హం. సబలెంకా సాధించిన 19 టైటిల్స్‌లో 17 టైటిల్స్ హార్ట్ కోర్టులపై రావడం విశేషం. కాగా విజేతగా నిలిచిన సబలెంకాకు 11,24,380 డాలర్ల (9 కోట్ల 61 లక్షల రూపాయలు) ప్రైజ్ మనీతో పాటు, 1000 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. అలాగే రన్నరప్‌గా నిలిచిన పెగులాకు 5,97,890 డాలర్లు (5 కోట్ల 11 లక్షల రూపాయలు) ప్రైజ్ మనీ, 650 ర్యాంకింగ్ పాయింట్లు వచ్చాయి.



### ఆసియా రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో..
# చివరి రోజు భారత్‌కు 3 పతకాలు

**న్యూఢిల్లీ:** ఆసియా సీనియర్ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌లో చివరి రోజున భారత్‌కు మూడు పతకాలు లభించాయి. పురుషుల ఫ్రీస్టయిల్ విభాగంలో 92 కేజీలకు సంబంధించి దీపక్ పునియా, 61 కేజీల్లో ఉదిత్ ఇరువురూ రజత పతకాలను సాధించంగా, 125 కేజీల విభాగంలో దినేశ్ కాంస్య పతకాన్ని సాధించాడు. ఇక మ్యాచ్ విషయానికి వస్తే ఫైనల్స్‌లో దీపక్ పునియా ఇరాన్‌కు చెందిన అమీర్ హుస్సేన్ చేతిలో 0-10 పాయింట్ల తేడాతో పరాజయం చెందడంతో రెండో స్థానంలో నిలిచి రజతాన్ని పొందాడు. ఆసియా ఛాంపియన్‌షిప్ చరిత్రలో 25 ఏళ్ల దీపక్ పునియాకు ఇది ఐదో పతకం కావడం విశేషం. 2021, 2022లలో రజతాలు నెగ్గిన దీపక్, 2019, 2020లలో కాంస్య పతకాలను దక్కించుకున్నాడు. కాగా జపాన్‌కు చెందిన టకారా సుడాతో జరిగిన హోరా హోరీ గేమ్‌లో ఉదిత్ 4-6 తేడాతో ఉదిత్ ఓడిపోయి రజతంతో ముగించాడు. అలాగే కాంస్య పతక బౌట్‌లో దినేష్ తుర్క్‌మెనిస్తాన్ రెజ్లర్ సవరోవ్‌ను ఓడించాడు.

# బ్యాంక్‌టెక్‌లో బిలియన్ డాలర్ల పెట్టుబడులు


**న్యూఢిల్లీ, మార్చి 31:** బ్యాంక్‌టెక్ రంగంలోకి పెట్టుబడులు 2027 నాటికి బిలియన్ డాలర్లకు సుమారు రూ.8,600 కోట్లు చేరతాయని వెంచర్ కేపిటల్ సంస్థ 'సెడార్- ఐబిఎస్‌ఐ కేపిటల్' తన అంచనాను వెల్లడించింది. 2023 నాటికి భారత్ 7 లక్షల కోట్ల డాలర్ల ఆర్థిక వ్యవస్థగా అవతరించే క్రమంలో వృద్ధిని నడిపించడంలో బ్యాంకింగ్ రంగం కీలక పాత్ర పోషించనున్నట్లు తెలిపింది. విప్లవాత్మక టెక్నాలజీలు భారత్‌లో బ్యాంకింగ్ సేలను సమూలంగా మార్చేస్తున్నట్లు సెడార్ ఐబిఎస్‌ఐ వ్యవస్థాపకుడు, ఎండి సాహిల్ ఆనంద్ తెలిపారు. సంప్రదాయ బ్యాంకింగ్ సేల్లో 80శాతాన్ని ప్రస్తుతం డిజిటల్‌గా నిర్వహిస్తున్నట్లు ఓపరిశోధన వివరాలను గుర్తు చేశారు. అందరికీ ఆర్థిక సేవలను చేరువ చేయడంలో టెక్నాలజీ కీలక పాత్ర పోషిస్తున్నట్లు చెప్పారు. వీటి ఫలితంగా మారుమూల ప్రాంతాల్లోని వారికీ బ్యాంకింగ్ సేవలు అందుతున్నట్లు పేర్కొన్నారు. బ్యాంకింగ్ రంగాన్ని డిజిటల్‌గా మార్చడంలో క్లౌడ్ కంప్యూటింగ్ కీలకంగా పనిచేస్తోందంటూ, సేవల విస్తరణ, చురుకుదనం, వ్యయాల కట్టడి ప్రయోజనాలు దీంతో లభిస్తున్నట్లు వివరించారు. సురక్షితమైన, పారదర్శకమైన లావాదేవీలకు బ్లాక్‌చైన్ టెక్నాలజీ సాయపడుతున్నట్లు ఆనంద్ వెల్లడించారు. ముఖ్యంగా సప్లయ్ చైన్ ఫైనాన్స్, గుర్తింపు నిర్వహణలో ఇది ఎంతో మార్పును తీసుకొస్తున్నట్లు చెప్పారు. సెడార్-ఐబిఎస్‌ఐ కేపిటల్ ఇప్పటికే బ్యాంక్‌టెక్ రంగంలో రెండు లావాదేవీలతో మొత్తం రూ.240 కోట్ల పెట్టుడులు పెట్టిందని, తమ పోర్ట్‌ఫోలియోని 10-15 స్టార్టప్‌లకు విస్తరించనున్నట్లు ఆనంద్ ప్రకటించారు.



# రెపోరేట్లలో ఈ సారైనా మార్పులుంటాయా!

**ముంబై, మార్చి 31:** మందగిస్తున్న ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చేందుకు, అయిదేళ్లలోనే తొలిసారిగా కీలక రేట్లను తగ్గిస్తున్నట్లు రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా ఈ యేడాది ఫిబ్రవరిలో ప్రకటించింది. తాజాగా కేంద్ర బ్యాంకు మరోసారి పరపతి విధాన కమిటీ సమీక్ష నిర్వహించనుంది. ఈ సారి కూడా రేట్ల కోత ఉండొచ్చనే సంకేతాలు కనిపిస్తున్నాయి. అయితే ఎంత తగ్గిస్తారనేది ప్రస్తుతం ఆసక్తికరంగా మారింది. ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల దృష్ట్యా రెపో రేటును 50బేసిస్ పాయింట్లు తగ్గిస్తే మంచిదని కొందరు ఆర్థిక నిపుణులు అభిప్రాయ పడుతున్నారు. 'అమెరికా ఫెడరల్ రిజర్వ్ గతేడాది సెప్టెంబరు నుంచి వడ్డీరేట్లను 100 బేసిస్ పాయింట్ల మేర తగ్గించింది. అదే సమయంలో భారత రెపో రేటు మాత్రం 25 బేసిస్ పాయింట్లు మాత్రమే దిగొచ్చింది. ప్రస్తుతం ద్రవ్యోల్బణం తగ్గుముఖం పడుతోంది. బ్యాంకుల ద్రవ్యలోటు కూడా మెరుగుపడుతోంది. ఈ పరిస్థితుల్లో ఆర్థిక వృద్ధికి ఊతమిచ్చేలా వడ్డీరేట్లను 50 బేసిస్ పాయింట్లు తగ్గించాల్సిన అవసరం ఉంది అని పిరామల్ గ్రూప్ చీఫ్ ఎకనమిస్ట్ దేబోపమ్ చౌదరీ అభిప్రాయం వ్యక్తం చేశారు. అయితే ఏప్రిల్ సమావేశంలో రెపో రేటును 25 బేసిస్ పాయింట్లు తగ్గించే అవకాశాలున్నాయని మరికొందరు నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం రెపో రేటు 6.25 శాతంగా ఉంది. ఈ యేడాది చివరికి దీన్ని 5.5 శాతానికి తీసుకొచ్చే అవకాశాలున్నాయని బ్యాంకు ఆఫ్ అమెరికా గ్లోబల్ రీసెర్చ్ అధ్యయనం వెల్లడించింది. ఏప్రిల్‌తో పాటు జూన్, అక్టోబరు నెలల్లో నిర్వహించే సమీక్షల్లోనూ 0.25శాతం చొప్పున ఆర్‌బిఐ రేట్ల కోత విధిస్తుందన్నది అంచనా వేసింది. రానున్న కొన్ని నెలల పాటు రిటైల్ ద్రవ్యోల్బణం 4శాతం దిగువనే ఉండొచ్చని ఈ రీసెర్చ్ అంచనా వేసింది. ఏప్రిల్7-9 మధ్య ఆర్‌బిఐ ద్వైపాక్షిక ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్వహించనుంది. ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ఏప్రిల్ 9న ఆర్‌బిఐ గవర్నర్ ప్రకటించనున్నారు.





# ఫిబ్రవరిలో తగ్గిన క్రెడిట్ కార్డుల జారీ..

**ముంబై, మార్చి 31:** దేశంలోని ప్రముఖ ఆర్థిక సంస్థలు జారీచేసే క్రెడిట్ కార్డుల వృద్ధి ఫిబ్రవరిలో మందగించింది. రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా విడుదల చేసిన తాజా డేటా ప్రకారం హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు, ఎస్‌బిఐ కార్డ్స్, ఐసిఐసిఐ బ్యాంకుతో సహా ప్రముఖ ఆర్థికసంస్థలు కొత్తగా జారీచేసే కార్డుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయింది. యాక్సిస్ బ్యాంకు, కోటాక్ మహీంద్రా బ్యాంకు, ఆర్‌బిఎల్ బ్యాంకు వంటి ఇతర ప్రముఖ బ్యాంకులు కూడా తమ క్రెడిట్ కార్డుల జారీ తగ్గిపోయిందని ఆర్‌బిఐ తెలిపింది. భారతదేశ క్రెడిట్ కార్డ్ విభాగంలో అధికంగా వినియోగదారులున్న హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు ఫిబ్రవరిలో1,78,000 కార్డులను జోడించింది. దాంతో మొత్తం కార్డుల సంఖ్య 23.6 మిలియన్లకు చేరింది. ఇది దేశంలో అతిపెద్ద క్రెడిట్ కార్డు జారీదారుగా తన స్థానాన్ని సుస్థిరం చేసినప్పటికీ, వృద్ధి గత నెలతో పోలిస్తే క్షీణించింది. జనవరిలో హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు 3,00,000 కోట్ల కార్డులను జారీచేసింది. ఫిబ్రవరిలో జారీ చేసిన కార్డుల కంటే జనవరిలో ఇష్యూ చేసిన కార్డులు చాలా ఎక్కువ. ఎస్‌బిఐ కార్డ్స్, ఐసిఐసిఐ బ్యాం కులు కూడా ఫిబ్రవరిలో మందకొడిగానే కార్డులను జారీ చేశాయి. ఆర్‌బిఐ డేటాలో సదరు బ్యాంకుల నెల వారీ కార్డుల చేర్పులకు సంబంధించిన కచ్చితమైన గణాంకాలు వివరించనప్పటికీ, రెండు సంస్థలు గతంలో కంటే తక్కువ కార్డులనే జోడించాయని పేర్కొంది.

# కొత్త లోన్ రూల్..నేటి నుంచే..

**ముంబై, మార్చి 31:** ఎడాపెడా అప్పులు చేసే ధోరణిని కట్టడి చేసే కొత్త నిబంధన ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వస్తోంది. దేశ రుణ వితరణ వ్యవస్థను మార్చే ఈ నియమం మూడు కంటే ఎక్కువ రుణదాతల నుంచి రుణాలు తీసుకోకుండా రుణగ్రహీతలను కట్టడి చేస్తుంది. అధిక వినియోగాన్ని అరికట్టడం, బాధ్యతాయుతమైన రుణాలను ప్రోత్సహించడమే ఈ నిబంధన లక్ష్యం. మైక్రోఫైనాన్స్ రంగం అణగారిన వర్గాల సాధికారతలో కీలక పాత్ర పోషించినప్పటికీ, రుణగ్రహీతలు బహుళ వనరుల నుంచి రుణాలు పొందడం చూసింది. ఇది నిర్వహణకు సాధ్యంకాని రుణానికి దారితీస్తుంది. ఈ మితిమీరిన వినియోగం, కొన్ని సంస్థల దూకుడు రుణ విధానాలు వ్యవస్థలో బలహీనతలను సృష్టించాయి. రుణగ్రహీతలను మూడు రుణదాతలకు పరిమితం చేయడం ద్వారా ఆర్థిక క్రమశిక్షణను పెంపొందించాలని, డిఫాల్టర్ల ప్రమాదాన్ని తగ్గించాలని భావిస్తున్నారు. ప్రస్తుతం మూడు కంటే ఎక్కువ సంస్థల్లో రుణాలు తీసుకుంటున్న 45 లక్షల మంది రుణగ్రహీతలకు, ఈ నియమం సవాలుగా మారుతుంది. వీరు తరచుగా వర్కింగ్ కేపిటల్, అత్యవసర అవసరాలు, రోజువారీ మనుగడ కోసం అతివ్యాప్త రుణాలపై ఆధారపడతారు. మూడు బ్యాంకుల పరిమితితో, రుణగ్రహీతలులిక్విడిటీ కొరతను ఎదుర్కోవచ్చు. ఇది వారి ఆర్థిక వ్యూహాలను పునఃసమీక్షించు కునేలా, ఖర్చులను తగ్గించుకునేలా చేస్తుంది. అంతేకాకుండా క్రెడిట్ మదింపులు కఠినంగా మారతాయి. ముఖ్యంగా అధిక రిస్క్‌గా భావించే రుణగ్రహీతలకు రుణ తిరస్కరణలు పెరగవచ్చు. ఇది కొంతమందిని అధిక వడ్డీలు ఉండే అనధికారిక రుణ మార్గాలవైపు నెట్టవచ్చు. కొత్త రూల్ రుణదాలతకూ అనేక సవాళ్లను కలిగిస్తుంది. మైక్రోఫైనాన్స్ సంస్థలు తమ పోర్ట్‌ఫోలియో వ్యూహాలను సర్దుబాటుచేయాల్సి ఉంటుంది. దీంతో స్వల్పకాలంలో వారి కస్టమర్ బేస్ ఎంతో కొంత కోల్పోయే అవకాశం ఉంది. అంతేకాకుండా సంస్థలు రుణ వితరణ విషయంలో మరింత క్షుణ్ణమైన ప్రక్రియలను పెంపొందించుకోవాలి. రుణ గ్రహీతలు మూడురుణదాతల పరిమితినిమించకుండా చూసుకోవాలి. ఇందుకోసం బలమైన వ్యవస్థలు, సమన్వయం అవసరమవుతాయి. వాస్తవానికి ఈ నిబంధన జనవరి 1 నుంచి అమల్లోకి రావాల్సి ఉండగా, సజావుగా జరిగేందుకు ఏప్రిల్ 1కి వాయిదా పడింది. ఈ జాప్యం వాటాదారులకు సన్నద్ధం కావడానికి సమయం అందించినప్పటికీ, రుణగ్రహీతలు, రుణదాతలు ఈ ముఖ్యమైన మార్పుకు ఎలా అలవాటు పడతారనేది అసలైన పరీక్ష.




# ఇండస్ ఇండ్‌పై ఆర్‌క్యాప్ రుణదాతల పిటిషన్ విత్‌డ్రా


**న్యూఢిల్లీ, మార్చి 31:** జాతీయ కంపెనీ లా అపీలేట్ ట్రిబ్యునల్ (ఎన్‌సిఎల్‌ఎటి)లో ఇండస్ ఇండ్ ఇంటర్నేషనల్ హోల్డింగ్స్ (ఐఐహెచ్‌ఎల్)పై దాఖలు చేసిన పిటిషన్‌ను రిలయన్స్ కేపిటల్ రుణదాతల కమిటీ (సిఒసి) ఉపసంహరించుకుంది. పూర్తిగా చెల్లింపులు జరిపి ఇందుకు సంబంధించి నిర్దిష్ట ప్రణాళికను అమలు చేసినందున, ఐఐహెచ్‌ఎల్‌పై పిటిషన్‌ను ఉపసంహరించు కుంటున్నట్లు అపీలేట్ ట్రిబ్యునల్‌కు ఆర్‌క్యాప్ సిఒసి తెలిపింది. సిఒసి పిటిషన్‌ను జస్టిస్ యోగేష్ ఖన్నా, జస్టిస్ అజయ్ దాస్ మెహ్రోత్రాలతో కూడిన ట్రిబ్యునల్ ద్విసభ్య ధర్మాసనం ఆమోదించింది. కేసు వివరాల్లోకి వెళితే, దివాలా కోడ్ చట్టం కింద ఐఐహెచ్‌ఎల్ ఆర్థిక సేవల సంస్థ రిలయన్స్ కేపిటల్ కొనుగోలుకు 2023 ఏప్రిల్‌లో రూ.9,650 కోట్లతో అత్యధిక బిడ్‌ను నమోదు చేసింది. దీని ప్రకారం దివాలా పరిష్కార ప్రణాళికలను ఐఐహెచ్‌ఎల్ 2024 మే 27లోపు పూర్తి చేయాల్సి ఉంది. అటు తర్వాత ఈ కాల పరిమితిని 2024ఆగస్టు 10 వరకూ పొడిగించడం జరిగింది.




# వాణిజ్యం

## స్టాక్ మార్కెట్ సెలవులు..

**ముంబై, మార్చి 31:** ఇటీవలి రోజుల్లో స్టాక్ మార్కెట్లపై జనంలో ఆసక్తి పెరిగింది. చాలా మంది మార్కెట్ పెట్టుబడుల వైపు వస్తున్నారు. దీంతో రోజువారీ ట్రేడింగ్‌ను గమనించేవారి సంఖ్య పెరిగింది. ఈ నేపథ్యంలో దేశీయ స్టాక్ మార్కెట్లు ఏయే రోజులు పనిచేస్తాయి, సెలవులు ఎప్పుడెప్పుడు ఉంటాయన్నది తెలుసుకుందాం. మార్చి 31 సోమవారం ఈద్-ఉల్-ఫితర్(రంజాన్) రోజున భారత్ స్టాక్ మార్కెట్‌కు సెలవు. మూడు రోజుల వారాంతం తర్వాత 2025 ఏప్రిల్ 1న మంగళవారం ట్రేడింగ్ పునఃప్రారంభమవుతుంది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఇ), బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బిఎస్ఇ) రెండూ స్టాక్స్, డెరివేటివ్స్, సెక్యూరిటీస్ లెండింగ్ అండ్ లోన్ (ఎస్ఎల్బీ) విభాగాల్లో ట్రేడింగ్, సెటిల్‌మెంట్‌కు తెరిచి ఉండవు. అయితే 2025 మార్చి 31న మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ (ఎంసిఎక్స్) మాత్రం పాక్షికంగా తెరిచి ఉంది. దీనికి విరుద్ధంగా భారతదేశపు అతిపెద్ద వ్యవసాయ కమోడిటీ ఎక్స్ఛేంజ్ అయిన నేషనల్ కమోడిటీ అండ్ డెరివేటివ్స్ ఎక్స్ఛేంజ్ సోమవారం పూర్తిగా మూసి ఉంటుంది. ఏప్రిల్‌లో స్టాక్ మార్కెట్ సెలవులు: పండుగలు, విశేష దినోత్సవాలు, వారాంతపు సెలవులతో కలుపుకొని ఏప్రిల్ నెలలో స్టాక్ మార్కెట్లు మొత్తంగా 11 రోజులు మూసి ఉంటాయి. ఆయా రోజుల్లో స్టాక్ ఎక్స్ఛేంజీలు ట్రేడింగ్‌కు అందుబాటులో ఉండవు. అదనపు సెలవులు: ఏప్రిల్ 10- మహావీర్ జయంతి, ఏప్రిల్ 14- డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి, ఏప్రిల్ 18- గుడ్ ఫ్రైడే.




Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No. 64861/96 , Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14